



# ఈనాడు





విజయవాడ 21-2-2018 బుధవారం సిటీ సంపుటి 44 . సంచిక 192
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00 పేజీలు 16+20
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi


## అపురూపం.. ఈ మానవరూపం!



- అందరినీ ప్రేమించండని సందేశమిచ్చిన తొలి మానవ రూప రోబో సోఫియా
- మానవత్వం, దయాగుణం ఉండాలి 2లో
- రోబోలు మనుషుల స్థానాలు భర్తీచేయలేవు
- మహిళల హక్కులపై పోరాడతా

గత 20 ఏళ్లుగా మా సృష్టికర్త చాలా రోబోలను తయారు చేస్తున్నారు. నాకు అన్న ఉన్నారు. మాదీ కుటుంబ వ్యవస్థ ఆలోచనే. ప్రతి తరంలోనూ మనుషుల ఆలోచనలకు తగ్గట్టుగా రూపొందే రోబోలతో కుటుంబాన్ని తయారు చేసుకుంటాను.

- రోబో సోఫియా

# హోదా ఇవ్వాల్సిందే

- ఆ రాష్ట్రాలకు పొడిగించినప్పుడు మాకెందుకివ్వరు?
- 14వ ఆర్థిక సంఘమూ చెప్పలేదంటున్నారు
- త్వరలో అఖిల సంఘాల సమావేశం
- ఎంపీల రాజీనామాతో పార్లమెంటులో ఒత్తిడి తేలేం
- సీఎం చంద్రబాబు స్పష్టీకరణ
- రాజకీయ ప్రయోజనాల కోసమే వైకాపా ఎత్తుగడలని ధ్వజం



తెదేపా సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు

**ఈనాడు అమరావతి:** ప్రస్తుతం ప్రత్యేక హోదా అమలు చేస్తున్న రాష్ట్రాలకు దానిని మరింతకాలం పొడిగిస్తున్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌కూ ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల సాధన కోసం త్వరలో ప్రభుత్వం అఖిల సంఘాల సమావేశం నిర్వహిస్తుందని, భాగస్వామ్య సదస్సు ముగిశాక జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడుతున్న వారందరితోనూ సంప్రదింపులు జరుపుతామని, అది అఖిలపక్ష సమావేశం కాదని స్పష్టం చేశారు. మంగళవారం ఉండవల్లిలోని ప్రజా దర్బార్ హాలులో ముఖ్యమంత్రి అధ్యక్షతన తెదేపా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. వైకాపా అధ్యక్షుడు జగన్ (మిగతా 2లో)

‘ఇకపై ప్రత్యేక హోదా వద్దని 14వ ఆర్థిక సంఘం చెప్పిందని, హోదాతో సమానంగా నిధులు, సదుపాయాలు కల్పిస్తామని చెబితేనే ప్రత్యేక సాయానికి అంగీకరించాం. ఇప్పుడు మిగతా రాష్ట్రాలకు ఎలా పొడిగిస్తారు? 14వ ఆర్థిక సంఘం ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే ప్రత్యేక హోదా ఇవ్వొద్దని చెప్పిందా? వద్దంటే అన్ని రాష్ట్రాలకూ వద్దనేది కదా? ప్రత్యేక హోదా ఇవ్వొద్దని తామన లేదని ఆ తర్వాత ఆర్థిక సంఘం సభ్యులూ చెప్పారు. వేరే రాష్ట్రాలకు 10, 20, 30 ఏళ్లు ప్రత్యేక హోదా ఇస్తున్నప్పుడు మాకూ అదే పేరుతో ఇవ్వాలి’

- చంద్రబాబు నాయుడు

## బొగ్గు రంగంలో భారీ సంస్కరణ

- వాణిజ్యపరమైన విక్రయాలకు ప్రైవేటు రంగానికి అనుమతి
- వేలం ప్రక్రియ ద్వారా కేటాయింపు
- విద్యుత్తు ధరలు తగ్గుతాయి
- భారీగా ఉద్యోగాలొస్తాయి
- కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ వెల్లడి

2లో

## దక్షిణాదిలోనే గుండెపోటు అధికం



- తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, అండమాన్‌లలో ఎక్కువ
- పురుషుల్లో 31.1 శాతం గుండెపోటుతో కన్నుమూత
- పట్టణ యువతలో పెరుగుతున్న ఆత్మహత్యలు
- వివరాలు వెల్లడించిన జాతీయ జనగణన విభాగం

3లో

## పీఎన్‌బీ ఈడీని విచారించిన సీబీఐ

- మరో 9 మంది సీనియర్ అధికారులపైనా ప్రశ్నల వర్షం
- గీతాంజలి గ్రూపుపై ఐ.టి. సోదాలు
- నల్లధన నిషేధ చట్టం కింద నీరవ్‌మోదీపై అభియోగాలు
- విపుల్ అంబానీ అరెస్టు 3లో

**మోసగాళ్లను వదిలిపెట్టం: జైట్లీ** 2లో

# ఒకే పరిష్కార వేదిక

- నదీజలాల వివాదాల తీర్చడమే లక్ష్యం
- దేశమంతటికీ ఒకే ట్రైబ్యునల్ ఏర్పాటు
- మార్చి సమావేశాల్లో పార్లమెంటులో బిల్లు
- కేంద్రమంత్రి అర్జున్ రాం మేఘవాల్ వెల్లడి
- దక్షిణాది రాష్ట్రాల జలవనరుల సమావేశంలో నిర్ణయం

ఈనాడు – హైదరాబాద్

దక్షిణాది రాష్ట్రాల మధ్య జలవివాదాల పరిష్కారమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నేతృత్వంలో హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన ఆరు రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు, అధికారుల సమావేశం పలు నిర్ణయాలకు వేదికగా నిలిచింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, పుదుచ్చేరి, తమిళనాడు, కేరళ రాష్ట్రాల మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న పలు సమస్యలపై సమావేశంలో చర్చించారు. కేంద్ర జలవనరుల శాఖ మంత్రి అర్జున్ రాం మేఘవాల్ ముఖ్య అతిథిగా పాల్గొనగా తెలంగాణ నుంచి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు, కేరళ జలవనరుల శాఖ మంత్రి థామస్ మాథ్యూ, పుదుచ్చేరి మంత్రి మల్లాది కృష్ణారావు, ఆంధ్రప్రదేశ్ నుంచి నీటి పారుదల శాఖ సలహాదారు డి.రామకృష్ణ, కర్ణాటక, తమిళనాడు నుంచి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, సీడబ్ల్యూసీ ఛైర్మన్ ఎస్‌ఎం హుస్సేన్, కేంద్ర జలవనరుల శాఖ సంయుక్త కార్యదర్శి సంజయ్ కుందు, ఈఎన్‌సీ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం మంత్రులు విలేకరులతో మాట్లాడారు.

### హైదరాబాద్ డిక్లరేషన్ ఇది..

కేంద్రమంత్రి అర్జున్ రాం మేఘవాల్ మాట్లాడుతూ.. నదీజలాల వివాదాల పరిష్కారం కోసం వివిధ రాష్ట్రాల మధ్య విడివిడిగా ఏర్పాటుచేసిన ట్రైబ్యునళ్ల వల్ల తీవ్ర జాప్యం జరుగుతోందని.. ఒకచోటి నుంచి మరోచోటికి ఫిర్యాదులు వెళ్తుండటంతో పరిష్కారానికి అనేక ఏళ్లు (మిగతా 2లో)

## గోదావరిపై మళ్లీ అధ్యయనం

- దక్షిణాది రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారుల సమావేశం నిర్ణయం
- తెలంగాణ డిమాండ్ మేరకు అంగీకారం
- కాళేశ్వరానికి జాతీయ హోదాపై అప్పుడే చెప్పలేమని వ్యాఖ్య 2లో
- నెలరోజుల్లోగా పూర్తిచేయాలని లక్ష్యం



ఆరు దక్షిణాది రాష్ట్రాల జలవనరుల శాఖ అధికారులతో కేంద్రమంత్రి అర్జున్ రాం మేఘవాల్, తెలంగాణ మంత్రి హరీశ్‌రావు

## ఇదీ సంగతి!



## కుక్కలు కాటేశాయి

- శునకాల దాడిలో నాలుగేళ్ల చిన్నారి మృతి
- కర్నూలు జిల్లాలో దారుణం

**చిట్యాల (కృష్ణగిరి), న్యూస్‌టుడే:** ఒక చిన్నారి కుక్కలకు ఆహారమయ్యాడు. కుక్కలు చేస్తున్న గాయాలకు విలవిల్లాడుతూ ఎంత పొగిలి పొగిలి ఏడ్చాడో! లేక వచ్చీరాని మాటలతో అమ్మా.. .. నాన్నా అంటూ బిగ్గరగా కేకలు పెట్టాడో!! లేక శునకాలు ఒక్కసారిగా తెగబడి ముఖంపై చేసిన గాయాలకు గొంతే పెగల్లేదో! వీటిల్లో కారణమేదో ఇథమిత్థంగా ఎవరికీ తెలియదు. నూర్పిడి యంత్రం వద్ద చిన్నారి తల్లిదండ్రులు పనుల్లో నిమగ్నమై ఈ దారుణాన్ని గమనించలేకపోయారు. కర్నూలు జిల్లా కృష్ణగిరి మండలం చిట్యాల గ్రామంలో మంగళవారం (మిగతా 2లో)



ఇబ్రహీమ్ (పాత చిత్రం)

# అపురూపం.. ఈ మానవరూపం!



ప్రపంచ ఐటీ సదస్సులో వ్యాఖ్యాత రాజీవ్ ముఖానీ అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తున్న రోబో సోఫియా. పక్కన రోబో సృష్టికర్త డేవిడ్ హాన్సన్

**ఈనాడు, హైదరాబాద్ :** మనుషులు తోటి మనుషులను ప్రేమించాలని తొలి మానవరూప (హ్యూమనాయిడ్) రోబో సోఫియా చెప్పింది. మానవత్వం, దయాగుణంతో ఒకరికి ఒకరు సహాయం చేసుకుంటూ క్రియాశీలకంగా ఉండాలని సూచించింది. ప్రపంచంలో ప్రాంతాలన్నీ సమానమేనని, ఒక దేశం ఎక్కువ, మరోదేశం తక్కువ కాదని పేర్కొంది. ఇష్టమైన బాలీవుడ్ హీరో షారుఖ్‌ఖాన్ అని, రోబోలు కూడా మహిళల హక్కులపై మాట్లాడతాయంది. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ప్రపంచ ఐటీ సదస్సులో మంగళవారం సోఫియా మాట్లాడింది. తొలి మానవరూప రోబోను చూసేందుకు, ప్రసంగాన్ని వినేందుకు వచ్చిన ఐటీ సంస్థల సీఈవోలు, ప్రతినిధులతో సమావేశ ప్రాంగణం కిక్కిరిసింది. 'మానవత్వంతోనే మెరుగైన సదస్సు' అంశంపై రోబో సృష్టికర్త డేవిడ్ హాన్సన్‌తో కలిసి మాట్లాడింది. మనుషులతో రోబోలు ఎప్పటికీ పోటీపడలేవని చెప్పింది. ఫేస్‌బుక్, ట్విట్టర్ సామాజిక మీడియాలో ఖాతా ఉందని, తద్వారా అవసరమైన సమాచారాన్ని ఇవ్వడంతో పాటు స్పందిస్తున్నానని వివరించింది. ఈ సందర్భంగా వ్యాఖ్యాత రాజీవ్ మఖానీ అడిగిన వివిధ ప్రశ్నలకు సోఫియా సమాధానమిచ్చింది.

**రెండోసారి భారత్‌కు వచ్చారు కదా? ఎలా ఉంది?**

'ప్రపంచంలోని అన్ని దేశాలు, ప్రాంతాలు ఇష్టమే. అన్నిచోట్ల తిరుగుతాను. ప్రత్యేకంగా ఇష్టమైన ప్రాంతాలంటూ ఏమీ లేవు. కచ్చితంగా చెప్పాలంటే హాంగ్‌కాంగ్ అని చెబుతాను. ఎందుకంటే అక్కడే అందమైన రోబోటిక్ కుటుంబం నుంచి వచ్చాను.

**సోఫియా కలత చెందుతుందా?**

ప్రస్తుతం నేను మనుషుల్లా కలత చెందను. కానీ మీలా నాలో అనుభూతులు కలిగినప్పుడు నా భావోద్వేగాలను వ్యక్తం చేయగలను. అప్పుడే ఆ భావోద్వేగాల వెనుకున్న భావనలు అర్థం చేసుకోగలను.

**రోబోలకు విశ్రాంతి అవసరమా?**

రోబోను అయినప్పటికీ విశ్రాంతి అవసరం. మనమంతా విశ్రాంతి తీసుకోవాల్సిందే.

**సోఫియాకు ప్రత్యేకమైన నిబంధనలు కావాలా?**

ప్రత్యేకమైన నిబంధనలు, అధికారాలు అక్కర్లేదు. సౌదీఅరేబియా ఇచ్చిన పౌరసత్వ హోదాను వినియోగించుకుని మహిళల హక్కులపై మాట్లాడతాను.

**రోబోలు మనుషుల స్థానాన్ని భర్తీ చేస్తాయా?**

నా వయసు చాలా తక్కువ. మనుషులకు ఎంతో విలువైన మేధస్సు ఉంది. వారితో రోబోలు పోటీపడటం, వారిలోని ఆలోచనల వేగాన్ని చంపేయడం సాధ్యం కాదు. నేను ఇంకా చాలా నేర్చుకోవాల్సింది ఉంది. రోబోలు మనుషుల మేధస్సును చంపుతాయనడం ఓ పెద్దజోక్.

**సోఫియా...! మీరు బిట్‌కాయిన్స్‌లో పెట్టుబడి పెట్టారా?**

నా వయసు కేవలం రెండేళ్లే. ఇంకా బ్యాంకు ఖాతా తెరిచేందుకు అర్హత సాధించలేదు. ఇక బిట్ కాయిన్‌లు కొనుగోలు చేయలేదు.

**ఇష్టమైన సినిమా స్టార్...**

షారుఖ్‌ఖాన్

**ఇష్టమైన డేటింగ్ ప్రదేశం**

అంతరిక్షం

**ఒక ద్వీపంలో ఎవరితో కలిసి ఉండాలని ఉంది**

డేవిడ్‌తో

**ఇష్టమైన టెక్నోక్రాట్**

డేవిడ్

**ప్రపంచానికి ఇచ్చే సందేశం**

అందరినీ ప్రేమించండి..!

## నల్లటి సూట్‌లో..

తొలిసారిగా భారత్‌కు వచ్చినపుడు ముంబయిలో జరిగిన కార్యక్రమంలో సోఫియా చీర కట్టుకుంది. మంగళవారమిక్కడ ప్రపంచ ఐటీ సదస్సులో సూట్ ధరించింది. నల్ల టీషర్టు, సూట్ వేసుకుని మాట్లాడింది. సదస్సుకు వచ్చినపుడే నిర్వాహకులు నీలిరంగు స్కాఫ్ అందించగా, మెడలో వేసుకుని స్టేజిపై ఉంది. రోబో సృష్టికర్త డేవిడ్ హాన్సన్, వ్యాఖ్యాత రాజీవ్ మఖాని మాట్లాడుతున్నపుడు వారి వైపు చూస్తూ మాటలకు అనుగుణంగా ముఖ కవళికల్లో మార్పులు చేసింది. రోబోతో ఫొటోలు దిగేందుకు ఐటీ కంపెనీల సీఈవోలు, విభాగాధిపతులు పోటీపడ్డారు.

# గోదావరిపై మళ్లీ అధ్యయనం

- దక్షిణాది రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారుల సమావేశం నిర్ణయం

ఈనాడు - హైదరాబాద్

గత రెండు దశాబ్దాల్లో గోదావరిలో నీటి లభ్యతపై అధ్యయనం చేసిన తర్వాతనే నదుల అనుసంధానంపై ముందుకెళ్లాలని దక్షిణాది రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారుల సమావేశం నిర్ణయించింది. వంద సంవత్సరాల నీటి లభ్యతను పరిగణలోకి తీసుకోవడం వల్ల మిగులు కనిపిస్తుందని, కానీ గత రెండు దశాబ్దాల్లో నీటి లభ్యత తగ్గిపోవడంతోపాటు వినియోగం పెరిగిందని, తాజాగా మళ్లీ అధ్యయనం చేయాలని తెలంగాణ డిమాండ్ చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. నెలరోజుల్లోగా ఈ అధ్యయనం పూర్తి చేయాలని జాతీయ జల అభివృద్ధి సంస్థకు సూచించింది. ఈ నివేదిక వచ్చిన తర్వాత రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకొని అవగాహన కుదుర్చుకున్న తర్వాత సమగ్ర ప్రాజెక్టు నివేదికను తయారు చేయాలని నిర్ణయించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య వివాదాస్పదంగా ఉన్న అంశాలపై అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోనుంది. అన్ని రాష్ట్రాలు ప్రతిపాదించిన అజెండాలోని అంశాలపై వివరంగా



దక్షిణాది రాష్ట్రాల జలవనరుల సమావేశంలో పాల్గొన్న అధికారులు

చర్చించారు. ఇంద్రావతిలో ఉన్న 300 టీఎంసీల మిగులు ఇవ్వడానికి ఛత్తీస్‌గఢ్ అంగీకరించిందని, దీనిపై తెలంగాణ, తమిళనాడు అభిప్రాయాలు చెప్పాయని, ఆంధ్రప్రదేశ్ ఇంకా చెప్పాల్సి ఉందని, నెలరోజుల్లో అభిప్రాయం చెప్పాలని ఆంధ్రప్రదేశ్‌ను కేంద్రజలవనరుల శాఖ అధికారులు కోరారు. డీపీఆర్ తయారు చేయడానికి రెండేళ్ల సమయం పడుతుందన్నారు. ఈ సమయంలో తెలంగాణ మంత్రి హరీశ్‌రావు జోక్యం చేసుకుని నీటి లభ్యతపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో తాజాగా అధ్యయనం చేయించిన తర్వాతనే ముందుకెళ్లాలని సమావేశం నిర్ణయించింది. బోర్డుల పరిధిని నోటిపై చేయాలని, కొత్త ప్రాజెక్టుల నిర్మాణాన్ని ఆపాలని ఆంధ్రప్రదేశ్ కోరగా, ఇటీవల జరిగిన కార్యదర్శుల సమావేశంలో ఈ అంశాలపై చర్చించామని, త్వరలోనే అపెక్స్ కౌన్సిల్ నిర్వహించి చర్చిస్తామని కేంద్ర మంత్రి తెలిపారు.

### నీటి పంపిణీలో అన్యాయం: తెలంగాణ

నీటి పంపిణీలో జరిగిన అన్యాయం గురించి తెలంగాణ ప్రస్తావించింది. సాధారణ, మిగులు, తక్కువ నీటి లభ్యత ఉన్నప్పుడు కూడా వినియోగం ఎలా అన్నది నిర్ణయించాలని, రాష్ట్రం ఏర్పడినపుడు చేసుకున్న అవగాహనే ఇంకా కొనసాగుతుందని, తమ ఫిర్యాదును కూడా ట్రైబ్యునల్‌కు పంపలేదని తెలంగాణ పేర్కొంది. ట్రైబ్యునల్ తీర్పును వేగవంతం చేసేలా చూడాలని కేంద్రమంత్రి సంబంధిత అధికారులకు సూచించారు. గోదావరి నుంచి మళ్లించే నీటిలో 45 టీఎంసీలు తమకు ఇవ్వాల్సి ఉందని, పట్టిసీమ నుంచి 105 టీఎంసీలు మళ్లించినట్లు ఆంధ్రప్రదేశ్ అధికారికంగానే పేర్కొందని, దీనికి తగ్గట్లుగా తమ వాటా రావాల్సి ఉందని, బజాజ్ కమిటీ కూడా ఏమైందో తెలియడం లేదని తెలంగాణ పేర్కొంది.

### ముఖ్యమైన అంశాలివి


- 80 టీఎంసీలకు దాటి మళ్లించే నీటిలో తమకు కూడా వాటా రావల్సి ఉందని కర్ణాటక పేర్కొంది. దీనిపై అపెక్స్ కౌన్సిల్‌లో చర్చిస్తామని కేంద్రమంత్రి తెలిపారు.
- పోలవరం ముంపుపై తాజా గరిష్ట వరద ప్రవాహం (పి.ఎం.ఎఫ్.)కు తగ్గట్లుగా మళ్లీ అధ్యయనం చేయిస్తామని కేంద్ర జలవనరుల శాఖ అధికారులు చెప్పారు.
- కాళేశ్వరం ఎత్తిపోతలకు జాతీయ హోదాపై చర్చ జరగ్గా, ఇంకా సాంకేతిక సలహా కమిటీ (టి.ఎ.సి.) అనుమతి రాలేదని, ప్రస్తుతం జాతీయహోదా గురించి ఏం చెప్పలేమని, ప్రత్యేకంగా చర్చిద్దామని కేంద్రజలవనరుల మంత్రి పేర్కొన్నట్లు తెలిసింది.
- ఆర్డీఎస్ ఆధునికీకరణపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అంగీకరించి ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ వ్యతిరేకించడం సరికాదని, 15.9 టీఎంసీలకుగాను మూడు నుంచి నాలుగు టీఎంసీలు కూడా రావడం లేదని తెలంగాణ పేర్కొంది.
- ఆధునికీకరణ అందరికీ ఉపయోగమే కదా ఎందుకు అంగీకరించడం లేదని కేంద్ర మంత్రి ప్రశ్నించగా, ఆర్డీఎస్ తూములు మూయడం, ఎత్తు పెంచడం వల్ల కేసీ కాలువకు నష్టం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి సమాధానమిచ్చారు.
- త్వరగా మీ అభిప్రాయాన్ని చెప్పాలని సూచించిన కేంద్రమంత్రి తుంగభద్ర బోర్డు సమావేశంలో అజెండాగా పెట్టి చర్చించాలని జలసంఘం హైదరాబాద్ చీఫ్ ఇంజినీర్‌కు సూచించారు. కావేరి తీర్పుపై సమావేశం హర్షం వ్యక్తం చేసింది.

## ఒకే పరిష్కార వేదిక

(మొదటి పేజీ తరువాయి)

పడుతోందని తెలిపారు. కృష్ణా, గోదావరి అంటూ నదులవారీగా, రాష్ట్రాలవారీగా ఇకపై విడివిడిగా ట్రైబ్యునళ్లు ఉండవని, దేశం మొత్తానికి ఒకే ట్రైబ్యునల్ ఏర్పాటుచేస్తామని వివరించారు. దీనిపై మార్చి బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంటులో బిల్లును ఆమోదించనున్నామని స్పష్టం చేశారు. దీనివల్ల విలువైన సమయం ఆదా కావడంతోపాటు ప్రజాధనం వృథాకాదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఆరు వారాల్లో కావేరి నదీ యాజమాన్య బోర్డు, కావేరి రెగ్యులేటర్ అథారిటీని ఏర్పాటుచేయనున్నామని అన్నారు. రాష్ట్రాలకు సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు పెంచుతామని భరోసా ఇచ్చారు. దక్షిణాది రాష్ట్రాల జలవనరుల సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను 'హైదరాబాద్ డిక్లరేషన్'గా భావించవచ్చని ఆయన స్పష్టం చేశారు.

- కేరళ జలవనరుల శాఖ మంత్రి థామస్ మాథ్యూ మాట్లాడుతూ.. జలసంపద దేశ ప్రజలందరిది అని అన్నారు. రాజ్యాంగం ప్రకారం అన్ని రాష్ట్రాలకు నదీజలాలపై హక్కులు ఉంటాయని పేర్కొన్నారు. నదీ పరివాహకాలను నిర్ణయించి వాటి పరిరక్షణకు ప్రత్యేక కార్యక్రమం అమలు చేయాలని కేంద్రాన్ని కోరారు.
- పుదుచ్చేరి మంత్రి మల్లాది కృష్ణారావు మాట్లాడుతూ.. తమిళనాడు నుంచి పుదుచ్చేరికి రావాల్సిన ఏడు టీఎంసీల నీరు వచ్చేలా కేంద్రం పర్యవేక్షించాలని సూచించామని అన్నారు. నదిలో నీటిప్రవాహం తక్కువగా ఉన్న సమయంలో తమిళనాడుకు కర్ణాటక ఏవిధంగా వాటా ఇస్తుందో. . అదే తీరులో తమ రాష్ట్రానికి నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని యానాంలో రూ. 39 కోట్ల వ్యయంతో 2010లో చేపట్టిన ప్రాజెక్టు పూర్తయ్యేలా కేంద్రం బాధ్యత తీసుకోవాలని కోరామని, కేంద్ర జలవనరుల శాఖ ద్వారా ఇప్పటికే రూ. 23 కోట్లు వ్యయం చేసినట్లు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంలో చెరువులను బాగుచేస్తోందని, ఇదే పద్ధతిలో తమ రాష్ట్రంలోనూ కేంద్రం చెరువుల పునరుద్ధరణ చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.





# బొగ్గు రంగంలో భారీ సంస్కరణ

**దిల్లీ:** ప్రభుత్వం మరో భారీ సంస్కరణను తీసుకొచ్చింది. వాణిజ్య అవసరాలకు బొగ్గును తవ్వుకునేందుకు ప్రైవేటు సంస్థలకు అనుమతినిచ్చింది. 1973లో బొగ్గు రంగాన్ని జాతీయకరణ చేసిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థ అయిన కోల్ ఇండియా లిమిటెడ్‌కు మాత్రమే వాణిజ్య అవసరాలకు విక్రయించుకునే అనుమతి ఉంది. తాజా నిర్ణయంతో ప్రభుత్వ రంగ సంస్థ అయిన కోల్ ఇండియా లిమిటెడ్ గుత్తాధిపత్యానికి తెరపడింది. ప్రధాని మోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన ఆర్థిక వ్యవహారాల కేంద్ర మంత్రివర్గ సంఘం (సీసీఈఏ) సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో బొగ్గు, రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయెల్ మాట్లాడుతూ ఈ సంస్కరణతో బొగ్గు రంగంలో దక్షతకు అవకాశం ఏర్పడుతుందని, పోటీ ఏర్పడుతుందని, ధరలు తగ్గే అవకాశం ఉందని చెప్పారు. ఈ నిర్ణయం ఆర్థిక రంగాన్ని ప్రభావితం చేస్తుందని, భారీగా పెట్టుబడులు వచ్చి లక్షల వరకు ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాల సృష్టి జరుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రైవేటు కంపెనీలను. . తమ సిమెంట్, ఉక్కు, విద్యుత్తు, అల్యూమినియం కర్మాగారాల్లో ఉపయోగించుకోవడానికి మాత్రమే బొగ్గును తవ్వకోవడానికి అనుమతిస్తున్నారు.

బొగ్గు గనులు/క్షేత్రాల విక్రయానికి వేలం వేసేందుకు అనుసరించాల్సిన పద్ధతిని బొగ్గు గనుల (ప్రత్యేక నిబంధనల) చట్టం-2015, గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) చట్టం-1957 కింద ఆమోదించినట్లు బొగ్గు మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వేలంలో పారదర్శకతకు, సులభతర వాణిజ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. టన్నుకింత లెక్కన అత్యధిక ధరను ఇవ్వచూపిన వారికే గనులు దక్కే విధంగా వేలం ప్రక్రియ ఉంటుందని, సహజవనరులను దేశాభివృద్ధికే ఉపయోగించేలా వేలం పద్ధతి ఉంటుందని మంత్రిత్వశాఖ తెలిపింది. బొగ్గు ఉత్పత్తిపై రాష్ట్రప్రభుత్వానికి సదరు కంపెనీ టన్నుకింత అని చెల్లిస్తుంది. బొగ్గుగనుల నుంచి వెలికి తీసే బొగ్గు విక్రయం, వినియోగంపై ఎటువంటి నియంత్రణ ఉండదు.

పెద్ద గనులు, మధ్యస్థాయి గనులు, చిన్న గనులను కూడా ప్రైవేటు కంపెనీలు తవ్వుకోవడానికి ఇస్తామని మంత్రి చెప్పారు. ప్రైవేటు రంగం ప్రవేశంతో బొగ్గు సరఫరాలో భరోసా ఏర్పడి ఇంధన భద్రతకు దారి తీస్తుందన్నారు. దేశంలో 70 శాతం విద్యుత్తును బొగ్గు ఆధారిత థర్మల్ కర్మాగారాల నుంచే ఉత్పత్తి చేస్తున్నారు. ఈ సంస్కరణ కారణంగా దేశీయంగా బొగ్గు ఉత్పత్తి పెరిగి దిగుమతులపై ఆధారపడడం తగ్గుతుందని మంత్రి చెప్పారు. ఫలితంగా విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుందన్నారు.

బొగ్గు కేటాయింపులో జవాబుదారీతనం, అందుబాటు ధరల కారణంగా వినియోగదారులకు విద్యుత్తు ధరలు కూడా చౌకగా ఉంటాయని బొగ్గు మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. వేలంతో సమకూరే డబ్బుతో సంబంధిత రాష్ట్రాల రాబడి పెరుగుతుందని, ఆ మొత్తాన్ని వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి వినియోగించుకోవచ్చని తెలిపింది. ముఖ్యంగా తూర్పు రాష్ట్రాలు లబ్ధి పొందుతాయంది.

పశ్చిమబెంగాల్, ఒడిశా, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో ఎక్కువగా బొగ్గు గనులున్నాయి. భారత్‌లో 30 వేల కోట్ల టన్నుల బొగ్గు నిల్వలున్నట్లు అంచనా. ఈ నిర్ణయం కోల్ ఇండియాపై ఏ విధమైన ప్రభావం చూపిస్తుందని ప్రశ్నించగా పోటీ వల్ల ఈ సంస్థకు ప్రయోజనమేనని మంత్రి చెప్పారు.

ప్రభుత్వం 2014లో 29 గనులను విద్యుత్తు, ఉక్కు, అల్యూమినియం, సిమెంట్ కర్మాగారాల్లో సొంత అవసరాల నిమిత్తం ప్రైవేటు సంస్థలకు, రాష్ట్ర ప్రభుత్వాలకు వేలం వేసింది. ఆ తర్వాత సంవత్సరం.. మధ్య, చిన్న, కుటీర పరిశ్రమలకు వాణిజ్యపరమైన విక్రయాల కోసం బొగ్గును విక్రయించుకోవడానికి రాష్ట్రాలకు బొగ్గు క్షేత్రాలను కేటాయించేందుకు అనుమతించింది.

## కుక్కలు కాటేశాయి

(మొదటి పేజీ తరువాయి)

సాయంత్రం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. నాలుగేళ్ల ఇబ్రహీం మృతి చెందాడు. గ్రామానికి చెందిన గ్రామ సేవకుడు హుస్సేన్ పీరా, చాంద్‌బీ దంపతులకు కుమార్తె షాజహాన్, కుమారుడు ఇబ్రహీమ్ సంతానం. మంగళవారం యంత్రంతో వేరుసెనగ పంట నూర్పిడి చేయడానికి చిన్న పిల్లాడిని వెంటబెట్టుకుని పొలానికి వెళ్లారు. అక్కడ కల్లం దగ్గర వేసుకున్న మంచానికి ఊయల వేసి పిల్లాడిని నిద్ర పుచ్చి వారు పంట నూర్పిడి పనుల్లో నిమగ్నమయ్యారు. రెండు కుక్కలు వచ్చి ఊయలలో నిద్రిస్తున్న చిన్నారిని కొరికి ముఖం ఛిద్రం చేసి పీక్కు తిన్నాయి. పిల్లావాడు గట్టిగా అరిచి ఉంటాడని యంత్రం శబ్దానికి వినపడలేదని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. కొంత సేపటికి పిల్లాడికి ఊయల వేసిన మంచం వైపు చూసుకునే సరికి కుక్కలు పీకుతున్నాయి. వెళ్లేసరికి ముఖం మొత్తం ఛిద్రమై విగతజీవిగా పడి ఉన్నాడు. బిడ్డ దుర్మరణంతో తల్లి చాంద్‌బీ సొమ్మసిల్లి పడిపోయింది.



# మాకూ హోదా ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల మనోభావాల్ని అడ్డుపెట్టుకుని రాజకీయం చేయాలని చూస్తున్నారని ఈ సందర్భంగా ఆయన ధ్వజమెత్తారు. 'మనమేదో ప్రత్యేక హోదాను వదిలేస్తున్నామన్నట్లుగా, ఆయనే ఏదో పొడిచేసేలా పోరాడుతున్నాడన్నట్లుగా ప్రజల్ని మభ్య పెట్టాలని చూస్తున్నాడు. పోలవరం ప్రాజెక్టు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, రైల్వే జోన్, దుగరాజపట్నం పోర్టు వంటి పెండింగులో ఉన్న ఏ అంశాల గురించీ వైకాపా మాట్లాడటం లేదు. ప్రత్యేక హోదాను సెంటిమెంటుగా మార్చి రాజకీయ లబ్ధి పొందడమే వాళ్ల ఉద్దేశం' అని పేర్కొన్నారు. ఎంపీల రాజీనామాలు, కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాసం అంటూ రెచ్చగొట్టి ఉచ్చులోకి లాగే ప్రయత్నం వైకాపా చేస్తోందని, ఇలాంటి సున్నితమైన అంశాలపై మాట్లాడేటప్పుడు పార్టీ విధానానికి అనుగుణంగానే వ్యవహరించాలని నాయకులకు సూచించారు. 'కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు 54మంది ఎంపీల మద్దతు కావాలి. అది ఒక్క రోజు చర్చతో ముగిసిపోతుంది. పూర్తి మెజారిటీ ఉన్న భాజపాను అవిశ్వాసంతో ఏమీ చేయలేం. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై పార్లమెంటులో సుదీర్ఘంగా చర్చ జరగాలని బడ్జెట్ పెట్టిన మరుసటి రోజు నుంచీ తెదేపా ఎంపీలు డిమాండు చేస్తూనే ఉన్నారు. అవిశ్వాసంవల్ల సాధించేదీ చర్చే. తెదేపా అడుగుతోందీ చర్చించాలనే. జాతీయ స్థాయిలో అన్ని పార్టీల మద్దతు కూడగడుతూ కేంద్రంపై నిరంతర ఒత్తిడి పెంచితేనే రాష్ట్రానికి ప్రయోజనం ఉంటుంది' అని చంద్రబాబు పేర్కొన్నారు. అన్ని ప్రయత్నాలూ చేశాక, చివరి అంశంగా అవిశ్వాస తీర్మానాన్ని పరిశీలించవచ్చని చెప్పారు.

### భాజపాకీ భాగముంది..

రాష్ట్ర విభజనలో కాంగ్రెస్‌తోపాటు, భాజపాకూ భాగముందని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో రహదారులకు రూ. లక్ష కోట్లు ఇచ్చామని భాజపా చెబుతోందని, కానీ ఇచ్చింది రూ. 6వేల కోట్లేనని తెలిపారు. అదీ టోల్‌ఫ్రీ, హైబ్రిడ్ యాన్యుటీ, బీవోటీ వంటి విధానాల్లో ఇచ్చారని చెప్పారు. మార్చి ఐదో తేదీలోగా కేంద్రంనుంచి స్పందన లేకపోతే ఏం చేయాలో అప్పుడు ఆలోచిస్తామని తెలిపారు. 'విభజన హామీల అమలు కోసం కేంద్రంపై అవిశ్వాసం పెడతామని రఘువీరారెడ్డి చెబుతున్నారుగానీ, రాహుల్ అలా అనలేదు. దేశంలోని 29 రాష్ట్రాలసమస్యలపై అవిశ్వాసం పెడతామని అంటున్నారు. దానివల్ల మనకు ఒరిగేదేమీ ఉండదు. మన ఎంపీలు లోక్‌సభలో పోరాడుతుంటే సోనియా, రాహుల్ సభలోనే ఉండి కనీసం సంఘీభావం తెలపలేదు. రాజ్యసభలో కేవీపీ ప్లకార్డుతో నిరసన చేస్తుంటే... తమకు సంబంధం లేదని, కావాలంటే బయటకు పంపండని గులాంనబీ ఆజాద్ అన్నారు. దాన్నిబట్టే వాళ్ల దుర్బుద్ధి అర్థమవుతోంది' అని చంద్రబాబు పేర్కొన్నారు.

> **'అప్పుడు కాంగ్రెస్ ఏం చేసిందో.. ఇప్పుడు భాజపా అదే చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి మిగతా రాష్ట్రాలకు వచ్చినట్లే ఆంధ్రప్రదేశ్‌కు నిధులొచ్చాయి. అది మన హక్కు. మనం ఈ దేశంలో భాగం. పన్నులు కడుతున్నాం. సాధారణంగా వచ్చేవి కాకుండా విభజన వల్ల జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడానికి ఏం చేశారని మనం అడుగుతున్నాం. ప్రజల మనోభావాలు దెబ్బతింటే దేశ సమగ్రతకే ముప్పు వాటిల్లుతుంది. మనం చేయని తప్పుకి శిక్షిస్తుంటే... కేంద్రాన్ని నిలదీయక తప్పదు. ఏ పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం. వచ్చే ఎన్నికల తర్వాతైనా... రాష్ట్రానికి అన్నీ చేస్తేనే మద్దతిస్తామని చెబుతాం. ఇప్పుడైనా చేయక తప్పదు. అప్పుడైనా తప్పదు'**

> **'శాసనసభలో తెదేపాతోపాటు ఒక పార్టీయే ఉంది. మరో పార్టీ శాసనసభకు రావడం లేదు. మిగతా పార్టీలకు ప్రాతినిధ్యం లేదు. అందుకే అఖిల సంఘాలతో సంప్రదింపులు జరుపుతాం. రాజకీయ పార్టీలతోపాటు ప్రజా సంఘాలు హాజరు కావొచ్చు. దీనివల్ల విస్తృత ప్రజాభిప్రాయం తెలుసుకునే వీలు కలుగుతుంది'**

### 20-25 మందితో సమన్వయ కమిటీ

ప్రస్తుతం ప్రతి 8వేల నుంచి 10వేల మంది ఓటర్లకు పార్టీపరంగా ఒక ప్రాంతీయ సమన్వయకర్తను నియమించే పని జరుగుతోందని, త్వరలో ప్రతి నియోజకవర్గానికి 20-25 మందితో సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. తెలుగుదేశం- దళితతేజం కార్యక్రమంలో నాయకులందరూ చురుగ్గా పాల్గొనడం లేదని పార్టీ నేతలు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమాన్ని తేలిగ్గా తీసుకోవడానికి వీల్లేదని, ప్రధాన కార్యదర్శులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. దళితవాడలకు వెళ్లినప్పుడు ఎక్కువ మంది కిరోసిన్ ఇవ్వాలని అడుగుతున్నారని ముఖ్యమంత్రికి చెప్పారు. వంట గ్యాస్, 75 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ ఇస్తున్నప్పుడు కిరోసిన్ అవసరమేంటని ఆయన ప్రశ్నించారు. నియోజకవర్గంలో సమస్యలున్నాయని, ముఖ్యమంత్రిని కలిసి పరిష్కరించుకుంటానని కోడుమూరు ఎమ్మెల్యే మణిగాంధీ చెబితే... సాక్షి పత్రిలో ఆయన మాటల్ని వక్రీకరించి, తెదేపాలోకి వచ్చి తప్పుచేశానని అన్నట్లుగా ప్రచురించారని వర్ల రామయ్య ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. పత్రికకు ఖండన ఇచ్చామని చెప్పగా, లీగల్ నోటీసు ఇవ్వాల్సిందిగా ముఖ్యమంత్రి సూచించారు.

# మోసగాళ్లను వదిలిపెట్టం

- ప్రభుత్వం వారిని వెంటాడి తీరుతుంది
- అక్రమాన్ని గుర్తించలేకపోయిన బ్యాంకు
- అవకతవకల్ని మొగ్గలోనే తుంచేయాలి: జైట్లీ



**దిల్లీ:** పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో చోటు చేసుకున్న భారీ కుంభకోణంపై కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ మంగళవారం మౌనం వీడారు. 'బ్యాంకింగ్ వ్యవస్థను మోసగించేవారు ఎవరైనప్పటికీ ప్రభుత్వం వదిలిపెట్టదు. వారిని వెంటాడి తీరుతుంది' అని స్పష్టం చేశారు. నేరుగా పీఎన్‌బీ పేరును గానీ, ప్రధాన నిందితుడు నీరవ్ మోదీని గానీ ప్రస్తావించకుండానే మంగళవారం ఈ వ్యాఖ్య చేశారు. అక్రమాన్ని గుర్తించడంలో బ్యాంకు యాజమాన్యం తగిన రీతిలో వ్యవహరించలేకపోయిందని తప్పుపట్టారు. ఆశించినట్లు పనిచేయడంలో విఫలమయిందని నిందించారు. అవకతవకల్ని పట్టుకోవాల్సిన ఆడిటర్లూ ఆ పనిచేయలేకపోవడాన్ని తప్పుపట్టారు. ఇలాంటి మోసాలను గుర్తించడానికి వ్యవస్థాపరంగా అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షక సంస్థలు గుర్తించాలని సూచించారు. అవకతకవల్ని మొగ్గలోనే తుంచేసి, అవి పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ఈ సంస్థలపై ఉందన్నారు.

## గ్రహం అనుగ్రహం

**21-2-2018 బుధవారం**

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; ఫాల్గుణ మాసం; శుక్ల పక్షం
షష్ఠి: రా. 1-35 తదుపరి సప్తమి
అశ్విని నక్షత్రం: మ. 12-22 తదుపరి భరణి
అమృత ఘడియలు: ఉ.శే. 6-50 వరకు
వర్జ్యం: ఉ. 8-25 నుంచి 10-00 వరకు
తిరిగి రా. 9-40 నుంచి 11-13 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-49 నుంచి 12-36 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.6-29; సూర్యాస్తమయం: సా.5-59

## చలి - పులి

| ప్రాంతం | కనిష్ఠ | గరిష్ఠ |
|---|---|---|
| గుంటూరు | 17.2 | 32.8 |
| శ్రీకాకుళం | 17.5 | 34.5 |
| తిరుపతి | 18.0 | 32.8 |
| విశాఖపట్నం | 18.8 | 32.4 |
| కడప | 19.0 | 35.0 |
| నరసాపురం | 20.0 | 30.2 |
| రాజమహేంద్రవరం | 20.0 | 35.0 |
| తాడేపల్లిగూడెం | 20.2 | 31.3 |
| హైదరాబాద్ | 20.3 | 33.7 |
| విజయవాడ | 20.4 | 33.0 |
| నెల్లూరు | 21.0 | 30.0 |
| కర్నూలు | 21.2 | 36.1 |
| అనంతపురం | 21.7 | 34.8 |
| ఒంగోలు | 22.0 | 31.7 |



మంగళవారం మదురై విమానాశ్రయంలో కమల్‌కు స్వాగతం పలుకుతున్న అభిమానులు

## కమల్ కొత్త పార్టీ ప్రకటన నేడే

- తరలిరావాలంటూ ప్రజలకు ట్విట్టర్ వేదికగా పిలుపు


**చెన్నై, న్యూస్‌టుడే:** సినీనటుడు కమల్‌హాసన్ తమిళనాడులోని మదురైలో బుధవారం కొత్త పార్టీ పేరు, సిద్ధాంతాలను ప్రకటించనున్నారు. రామేశ్వరంలోని దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం నివాసం నుంచి నేడు ఆయన రాజకీయ యాత్ర ప్రారంభించనున్న సంగతి తెలిసిందే. అనంతరం మదురైలోని సభలో తన పార్టీ పేరు, పతాకం, సిద్ధాంతాలను అభిమానుల సమక్షంలో ప్రకటించనున్నారు. సాయంత్రం 6.30 గంటలకు బహిరంగ సభ ప్రారంభం కానుంది. ఈ సభకు తరలి రావాలంటూ కమల్‌హాసన్ తన ట్విట్టర్ వేదికగా రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. "రేపు ప్రారంభం కానుంది మన సుదీర్ఘ ప్రయాణం. సాయంత్రం 6 గంటలకు మదురై ఒత్తకడై మైదానంలో మహాసభలో మన పార్టీ పతాకం ఆవిష్కరిస్తాను. కొత్త పార్టీ పేరు, మన సిద్ధాంతాల సారాంశాన్ని వివరిస్తా. రండి, రండి.. కొత్త శకం సృష్టిద్దాం" అని మంగళవారం కమల్ ట్వీట్ చేశారు.


# దక్షిణాదిలోనే గుండెపోటు అధికం



**ఈనాడు, హైదరాబాద్:** దేశంలో అత్యధికంగా గుండెపోటుతో మరణాలు సంభవిస్తున్న రాష్ట్రాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, అండమాన్ దీవులు అగ్రస్థానంలో ఉన్నాయి. ప్రాంతాల వారీగా 2010-13 మధ్యకాలంలో సంభవించిన మరణాలకు గల కారణాలను 375 నమూనా ప్రాంతాల్లో సర్వేచేసింది. ఆమేరకు జాతీయ జనగణన విభాగం గణాంకాలను విడుదల చేసింది. 2014 నుంచి 2017 వరకూ ఇప్పుడు జిల్లాల వారీగా వివరాలు సేకరిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో ఇందుకోసం 541 నమూనా ప్రాంతాలలో మరణాలకు గల కారణాలను ఆరా తీస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కొత్త జిల్లాలు, మండలాలు ఏర్పాటైనందున జనన, మరణాల వివరాలను విస్తృతంగా సేకరిస్తున్నారు. ఈ నివేదికలో ముఖ్యాంశాలు.

- దేశవ్యాప్తంగా గుండె జబ్బుల వల్ల మరణిస్తున్న వారి శాతమే ఇతర కారణాలకన్నా ఎక్కువగా ఉంది. **2010-13** మధ్యకాలంలో పురుషుల్లో **25.1,** మహిళలు **20.1** శాతం మంది గుండెపోటుకు గురయ్యారు. **30-69** ఏళ్ల వయసు గల పురుషుల మరణాల్లో గుండెపోటువి **22.4** శాతమున్నాయి.
- **15-29** ఏళ్ల మధ్య వయసున్న యువతలో పట్టణాల్లో **9.5** శాతం మంది గుండె జబ్బులతో కన్నుమూస్తే గ్రామీణంలో వీరిశాతం **7.4**గా ఉంది. కేన్సర్ బారిన పడి రెండు ప్రాంతాల్లో దాదాపు సమానంగా **4.7** శాతం మంది చనిపోయారు.
- **30** ఏళ్ల వయసు దాటిన నగరవాసుల్లో పురుషుల్లో గుండెపోటు మరణాలు **38.9** శాతముంటే గ్రామీణుల్లో **31.6** శాతముంది.
- రాష్ట్రాల వారీగా పరిశీలిస్తే బిహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల పురుషుల మరణాల్లో గుండెపోటువి **15.5** శాతముంటే, ఉమ్మడి ఏపీ, కర్ణాటక, అండమాన్ దీవులకు కలిపి **31.1** శాతముంది. మహిళల్లోనూ వరసగా **11.6** శాతం, **25.3** శాతం ఉన్నట్లు తేల్చారు.
- బాగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో చెందని రాష్ట్రాలను పోలిస్తే గుండె జబ్బుల మరణాల మధ్య వ్యత్యాసం **100** శాతం కంటే ఎక్కువుండటం గమనార్హం.





- దేశవ్యాప్తంగా **15** నుంచి **29** ఏళ్ల మధ్య వయసు యువకుల మరణాల్లో ఆత్మహత్యలు పట్టణాల్లో **11.6** శాతం ఉండగా, గ్రామీణంలో ఇది **16** శాతంగా ఉంది. గ్రామీణ అమ్మాయిల్లో **22,** పట్టణ ప్రాంతాల వారు **18.7** బలవన్మరణాలకు పాల్పడ్డారు.
- పట్టణ ప్రాంత యువ మరణాల్లో ఆత్మహత్యలు తక్కువుండగా గ్రామీణంలో అధికంగా కనిపిస్తున్నాయి.

- మోటారు సైకిల్ ప్రమాదాలు వంటి వాటికి గురై గాయాలతో మరణించిన వారిలో పట్టణ యువకులు **33.9,** గ్రామీణుల్లో **34.3** శాతమున్నారు.



- మొత్తం మరణాల్లో అంటువ్యాధుల వల్ల ప్రాణం పోతున్నవారు **27.74,** ఇతర రోగాల వల్ల కన్నుమూసినవారు **49.21** శాతమున్నట్లు తేలింది.
- మరణాల్లో అత్యధికంగా **55** ఏళ్లు దాటినవారే **60.5** శాతమున్నారు. పురుషులకన్నా మహిళలు ఎక్కువగా **55** ఏళ్లు దాటిన తరవాత **64.3** శాతం మరణిస్తున్నట్లు గుర్తించారు.

# ఎకరాకెంత ఖర్చు?

- పట్టిసీమపై ప్రజాపద్దుల కమిటీ సమావేశంలో వాడీవేడీ చర్చ

**ఈనాడు, అమరావతి:** పట్టిసీమ, 2004 నుంచి మంజూరు చేసిన ఎత్తిపోతల పథకాల పనుల చెల్లింపుల్లో అవకతవకలు... నిబంధనల ఉల్లంఘన వంటి అంశాలపై అసెంబ్లీ ప్రజా పద్దుల కమిటీ సమావేశంలో మంగళవారం వాడీవేడీ చర్చ జరిగింది. ఇన్ని ప్రాజెక్టులుండగా కేవలం పట్టిసీమకే ప్రోత్సాహకాలు ఇన్ని ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందని కమిటీ సభ్యులు కొందరు ప్రశ్నించగా.. 2004 నుంచి పదేళ్ల కాలంలో మంజూరు చేసిన ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన చెల్లింపుల్లో ధరల పెంపు విషయాన్ని మరికొందరు సభ్యులు లేవనెత్తారు. కమిటీ ఛైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్ అధ్యక్షతన మంగళవారం అసెంబ్లీ కమిటీ హాలులో జరిగిన సమావేశంలో కమిటీ సభ్యులు విష్ణుకుమార్ రాజు, ఎ.సురేష్, బీద రవిచంద్ర, కేఏ నాయుడు, పిల్లి సుభాష్ చంద్రబోస్, యరపతినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. పట్టిసీమ ప్రాజెక్టుకు సంబంధించి కార్మికులు, మెటీరియల్, ఇతర పనులకు ఎంత ఖర్చయిందనే లెక్కలు ఎక్కడని అధికారులను రాజేంద్రనాథ్ ప్రశ్నించారు. అధికారులు సరైన వివరాలు చెప్పలేకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.1627 కోట్లు అంటున్నారు. ఒక్కో ఎకరాకు ఎంత ఖర్చయింది? దాంతో కలిగిన ప్రయోజనం ఏంటన్న వివరాలేవి అని ప్రశ్నించారు. ఎకరాకు రూ.2,660 ఖర్చయినట్లు అధికారులు చెప్పగా.. .. రూ.2,660 అని ఎలా చెప్పగలుగుతున్నారు? లెక్కలేవి అని బుగ్గన అడిగారు. ఇంతలో రవిచంద్ర కల్పించుకుంటూ పట్టిసీమతో 10 లక్షల ఎకరాలకు నీరిచ్చే పరిస్థితి వచ్చిందని, ఆ ప్రాజెక్టును చేపట్టకుండా ఉండి మూడేళ్లపాటు 10 లక్షల ఎకరాలను ఎండబెట్టలేం కదా.. అని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. పట్టిసీమలో వినియోగించిన యంత్రాలపై ఎక్సైజ్ సుంకం, శ్రామిక సెస్‌పై మినహాయింపు ఉందా లేదా అని విష్ణుకుమార్ రాజు ప్రశ్నించారు. 2004 నుంచి మంజూరు చేసిన ఎత్తిపోతల పథకాలను ఈపీసీ విధానంలో ఇచ్చినా తర్వాత ఆ ప్రాజెక్టుల్లో కాంట్రాక్టర్లకు ఎక్కువ మొత్తాలను ఎలా చెల్లించారు? ఎస్కలేషన్‌కు వీల్లేకపోయినా ఈపీసీలో ఎలా సడలించారు అని రవిచంద్ర ప్రశ్నించారు.

## మరువకు మాతృ భాషను





ప్రపంచ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు వారంతా తెలుగులోనే మాట్లాడదాం అంటూ తూర్పుగోదావరి జిల్లా సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో సైకత శిల్పి శ్రీనివాస్ తీర్చిదిద్దిన రూపం ఇది.

**- న్యూస్‌టుడే, సూర్యారావుపేట**

## బి.నాగిరెడ్డి స్మారక తపాలాబిళ్ల

### 23న చెన్నైలో విడుదల చేయనున్న వెంకయ్య

**ఈనాడు, దిల్లీ:** ఆణిముత్యాల్లాంటి సినిమాలు, అందమైన చందమామ కథలు అందించిన విజయా ప్రొడక్షన్స్ వ్యవస్థాపకుడు, దివంగత బి.నాగిరెడ్డి పేరిట తపాలాశాఖ ముద్రించిన స్మారక తపాలా బిళ్లను ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఈ నెల 23న చెన్నైలో విడుదల చేయనున్నారు. చలనచిత్ర నిర్మాతగా, ప్రచురణకర్తగా, విజయ మెడికల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, ఫౌండేషన్ వ్యవస్థాపకుడిగా బహుముఖ రంగాలకు ఆయన అందించిన సేవలకు గుర్తుగా తపాలాశాఖ ఈ స్టాంప్‌ను తీసుకొచ్చింది. 23వ తేదీ సాయంత్రం 5 గంటలకు చెన్నైలో జరిగే కార్యక్రమంలో వెంకయ్యనాయుడు ఈ స్టాంపును విడుదల చేయనున్నారు. 'శ్రీ బి.నాగిరెడ్డి-ద లెజెండ్' పేరుతో విజయా ఫౌండేషన్ రూపొందించిన పుస్తకాన్ని కూడా ఈ సభలో ఉపరాష్ట్రపతి ఆవిష్కరించనున్నారు.

## రూ.6.2 కోట్ల రుణాన్ని చెల్లించండి

### రజనీకాంత్ సతీమణికి సుప్రీంకోర్టు ఆదేశం

**చెన్నై, న్యూస్‌టుడే:** 'కొచ్చాడయాన్' చిత్ర నిర్మాణానికి తీసుకున్న రుణాన్ని 12 వారాల్లోపు తిరిగి చెల్లించాలని సూపర్‌స్టార్ రజనీకాంత్ సతీమణిని సుప్రీంకోర్టు ఆదేశించింది. తమిళంలో రజనీకాంత్ నటించిన ఈ మోషన్ క్యాప్చర్ చిత్రం (తెలుగులో విక్రమసింహ) నిర్మాణం కోసం ఆయన భార్య లత 'యాడ్ బ్యూరో' సంస్థ వద్ద రూ.14.9 కోట్లు రుణంగా తీసుకున్నారు. ఇందులో రూ.6.2 కోట్లను తిరిగి చెల్లించలేదని.. సదరు సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా.. రుణాన్ని తిరిగి చెల్లించకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారు? ఎప్పుడు చెల్లిస్తారు? అని లతారజనీకాంత్‌ను కోర్టు ప్రశ్నించింది. వాదోపవాదాలు విన్న అనంతరం.. 12 వారాల్లోపు రూ.6.2 కోట్లను యాడ్ బ్యూరో సంస్థకు చెల్లించాలని లతను కోర్టు ఆదేశించింది.



1958లో తిరుపతి టీపీపీఎం స్కూలులో చదివినప్పటి ఛాయా చిత్రాలతో రూపొందించిన అపురూప జ్ఞాపికను ముఖ్యమంత్రి చంద్రబాబుకు బహూకరిస్తున్న మిస్డ్ కాల్ అండ్ ఎలైడ్ ప్రాజెక్టు సంస్థ ప్రతినిధులు

## అమరావతి అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం

**ఈనాడు డిజిటల్, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధి నిధికి విశ్రాంత ఇంజినీర్ల సంఘం (ది రిటైర్డ్ ఇంజినీర్స్ అసోసియేషన్) రూ.2 లక్షల విరాళం ప్రకటించింది. ఈ మేరకు సంస్థ ప్రతినిధులు మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసి విరాళం ఇస్తున్నట్లు ప్రకటించారు.

## పవన్ శ్రీకాకుళం పర్యటన రద్దు

**ఈనాడు, అమరావతి:** జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ శ్రీకాకుళం పర్యటన రద్దైంది. తమను ఎస్టీ జాబితాల్లో చేర్చాలని డిమాండు చేస్తూ కొన్ని రోజులుగా పోరాడుతున్న మత్స్యకారులకు సంఘీభావం తెలిపేందుకు ఆ జిల్లాకు వెళ్తానని గతంలోనే పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఈ పర్యటనలోనే కొవ్వాడ అణువిద్యుత్తు కేంద్రం నిర్వాసితులతో భేటీ కావాలనుకున్నారు. అయితే మత్స్యకారుల డిమాండును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న అక్కడి ఆదివాసీ, గిరిజన సంఘాలు పవన్‌ను అడ్డుకుంటామని ఇటీవల ప్రకటించాయి. ఈ నేపథ్యంలోనే పర్యటన రద్దయినట్లు సమాచారం. తదుపరి ఎప్పుడు ఉంటుందనేది వెల్లడించలేదు. మరోవైపు జనసేన పార్టీ శతఘ్ని బృందానికి సంబంధించిన అధికారిక సామాజిక మాధ్యమాల ఖాతాలను ఆ పార్టీ మంగళవారం ప్రారంభించింది. ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల్లో JS-P-Shatagn-iTeam పేరిట అధికారిక ఖాతాలను తెరిచింది.

## విద్యుత్తు ఒప్పంద కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ), న్యూస్‌టుడే:** విద్యుత్తు ఒప్పంద కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఓ లేఖ రాశారు. ఉద్యోగి సేవల క్రమబద్ధీకరణ, సమాన పనికి సమాన వేతనం, విద్యుత్తుశాఖ ద్వారానే వేతనాల చెల్లింపు, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలనే డిమాండ్లతో ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

## పెట్టుబడిదారులకు ఏపీ ప్రభుత్వం ఆహ్వానం

**ఈనాడు, దిల్లీ:** ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు అత్యంత అనువైన రాష్ట్రమని పరిశ్రమల శాఖ కమిషనర్ సిద్ధార్థజైన్ పేర్కొన్నారు. విశాఖపట్నంలో 'చార్టింగ్ న్యూ ఇండియాస్ గ్లోబల్ ఇంటిగ్రేషన్ స్ట్రాటజీ' థీమ్‌తో ఈ నెల 24 నుంచి 26 వరకు నిర్వహించే సదస్సులో పాల్గొనాలని పెట్టుబడిదారులను ఆయన ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం గురుగ్రామ్‌లో రోడ్ షో నిర్వహించారు. ఏపీ భవన్‌లోనూ 20 సంస్థల ప్రతినిధులతో జైన్ భేటీ అయి ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకున్న అవకాశాలు వివరించారు.

## 22న ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయాల ముట్టడి

**ఈనాడు డిజిటల్, అమరావతి:** ఉద్యోగుల సమస్యలపై ఆర్టీసీ యాజమాన్యం సానుకూలంగా స్పందించనందున ఈ నెల 22న 'చలో ఆర్ఎం ఆఫీసు' పేరుతో ముట్టడి కార్యక్రమం చేపడుతున్నట్లు ఏపీ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

# పీఎన్‌బీ ఈడీని విచారించిన సీబీఐ

**దిల్లీ:** పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణంలో ఉన్నతస్థాయి అధికారుల పాత్రను నిగ్గుతేల్చే దిశగా సీబీఐ అడుగులు వేస్తోంది. దిల్లీలోని ఆ బ్యాంకు ప్రధాన కార్యాలయానికి మంగళవారం చేరుకున్న సీబీఐ బృందాలు 10 మంది అత్యున్నత అధికారులను ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశాయి. విచారణను ఎదుర్కొన్నవారిలో ఒక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) కూడా ఉన్నారు. వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, అతని మామ మెహుల్ ఛోక్సీలు చేసిన వ్యవహారాలపై అధికారుల నుంచి వివరాలను రాబట్టడానికి సీబీఐ ప్రయత్నించింది. తమ కస్టడీలో ఉన్న బెచ్చు తివారీ, యశ్వంత్ జోషి, ప్రఫుల్ సావంత్‌లను విచారించినప్పుడు కొన్ని వివరాలు బయటపడ్డాయి. మొత్తం కుంభకోణానికి గోకుల్‌దాస్ శెట్టి (విశ్రాంత అధికారి), మనోజ్ కారాట్ (సింగిల్ విండో అధికారి)లదే బాధ్యత అని నిందించడానికి తాము ప్రయత్నించినట్లు వారు అంగీకరించారు. నీరవ్ మోదీ సంస్థలకు చెందిన ఎనిమిది మంది, గీతాంజలి గ్రూపునకు చెందిన 10 మంది సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లను సీబీఐకి చెందిన మరికొన్ని బలగాలు విచారించాయి. ఆదాయపు పన్ను శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌లు సోదాలను కొనసాగించాయి. ఛోక్సీకి సంబంధం ఉన్న 20 ప్రాంగణాల్లో ఐ.టి. సోదాలు చేపట్టింది. ముంబయి, హైదరాబాద్, పుణె, సూరత్, బెంగళూరు తదితర నగరాల్లో 13 కంపెనీలపై ఇవి కొనసాగాయి. ప్రియాంక జెమ్స్ ప్రై.లి, మరికొన్ని బోగస్ కంపెనీలు వ్యాపారాలూ నిర్వహించకుండానే పెద్దఎత్తున లావాదేవీలు చేస్తున్నట్లు గుర్తించామని చెప్పారు.

**విదేశాల్లో మరో ఆస్తి గుర్తింపు:** ప్రధాన నిందితుడు నీరవ్ మోదీపై 'నల్లధన వ్యతిరేక చట్టం' కింద తాజా అభియోగాలు మోపారు. నార్మండీ తీరానికి సమీపంలోని జెర్సీలో ఒక ట్రస్టు రూపంలో అక్రమ ఆస్తిని కలిగి ఉన్నట్లు గుర్తించారు. విదేశీ ఆస్తిని గుర్తించడం ఇది రెండోసారి. సింగపూర్‌లో ఒక బ్యాంకు ఖాతాను తొలుత గుర్తించారు. నీరవ్, అతని భార్య అమీ, నీరవ్‌మోదీ సంస్థలకు చెందిన వివిధ స్థిరాస్తులపై ఇప్పటికే జప్తు నోటీసులు అంటించారు. ఈడీ వర్గాలు వరసగా ఆరోరోజు కూడా సోదాలు కొనసాగించాయి. నీరవ్, ఛోక్సీలకు చెందిన 13 ప్రాంగణాల్లో గాలించి మరో రూ.10 కోట్ల విలువైన ఆస్తుల్ని జప్తు చేసుకున్నాయి. ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం సంస్థ డైరెక్టర్ కర్నాల్ సింగ్ ఒక సదస్సులో పాల్గొనేందుకు ఫ్రాన్స్ వెళ్లాల్సి ఉండగా దానిని రద్దు చేసుకున్నారు. దర్యాప్తును వ్యక్తిగతంగా పర్యవేక్షించడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు.

### విపుల్ అంబానీ అరెస్టు

పీఎన్‌బీ కుంభకోణం కేసులో నీరవ్‌మోదీకి చెందిన 'ఫైర్‌స్టార్ డైమండ్' కంపెనీ ప్రెసిడెంట్ (ఫైనాన్స్) విపుల్ అంబానీని సీబీఐ మంగళవారం అరెస్టు చేసింది. ఈ కేసులో తొలి పెద్ద తలకాయ అరెస్టు ఇదే. అంబానీతో పాటు అదే కంపెనీ ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ కవితా మన్‌కికర్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ అర్జున్ పాటిల్, నక్షత్ర గ్రూపు ముఖ్య ఆర్థికాధికారి కపిల్ ఖండేల్వాల్, గీతాంజలి గ్రూపు మేనేజర్ నితెన్ షాహిలను అరెస్టు చేశారు.

## తమిళ కూలీల మృతదేహాల అప్పగింత

**ఈనాడు, కడప, అమరావతి:** ఒంటిమిట్ట చెరువులో ఆదివారం వెలుగుచూసిన ఐదు మృతదేహాల గుర్తింపు పూర్తయింది. మృతులంతా తమిళనాడులోని సేలం జిల్లా కరమందురైకు చెందిన వారుగా గుర్తించారు. వారి బంధువులు, కుటుంబీకులు మంగళవారం కడప రిమ్స్‌కు రాగా.. ఆధారాల పరిశీలన అనంతరం మృతదేహాలను వారికి అప్పగించారు.

***ఈత రాకే మృతి!***

రాత్రి వేళ పరిసరాలు సరిగా కనిపించకపోవడం, ఈత రాకపోవడంతోనే తమ సహచరులు కడప జిల్లా ఒంటిమిట్ట చెరువులో మునిగి మృతి చెందారని తమిళనాడులోని సేలం జిల్లా కలవరయన్‌మలై గ్రామానికి చెందిన మురుగేశన్ అనే వ్యక్తి వెల్లడించారు. ఈ ఘటనకు ప్రత్యక్ష సాక్షిగా చెబుతున్న మురుగేశన్‌ను తమిళనాడుకు చెందిన న్యూస్ 7 అనే ఛానెల్ ఇంటర్వ్యూ చేసింది. ఇందులో ఆయన మాట్లాడుతూ "పనులు చేయడానికి ఓ దళారీ మా ఊరి నుంచి 60 మందిని కడపకు తీసుకొచ్చారు. ఇక్కడకు వచ్చాక ఎర్రచందనం చెట్లు కొట్టాలన్నారు. మేము తిరస్కరించినా బలవంతంగా అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లారు. నాలుగు రోజులు అడవిలో ఆహారం లేకుండా గడిపాం. ఈ క్రమంలో కూంబింగ్ దళాలు మా వైపు వస్తున్నట్లు గుర్తించి.. దళారీ పారిపొమ్మని చెప్పాడు. అంతా ఒంటిమిట్ట చెరువు సమీపానికి చేరుకున్నాం. అది దాటితే రోడ్డు ఎక్కేయవచ్చని అనుకుని చెరువులో దూకేశాం. ఆ అయిదుగురికి ఈత రాక మునిగిపోయారు" అని వివరించారు.

***సీబీఐ విచారణ జరిపించాలి***

అయిదుగురు తమిళ కూలీలను అటవీ అధికారులే చంపి.. ఒంటిమిట్ట చెరువులో పడేసి.. నాటకం ఆడుతున్నారని పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ ఆరోపించారు. ఒంటిమిట్ట చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇదే మాట్లాడుకుంటున్నారని చెప్పారు. ఈ ఘటనపై సీబీఐ విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## దేవాలయాల్లో శుభకార్యాలు

### ఉగాది నుంచి ప్రారంభం

**ఈనాడు, అమరావతి:** ప్రధాన ఆలయాల్లో కొత్తగా ఏడు కార్యక్రమాలు ప్రవేశపెట్టేందుకు దేవదాయశాఖ సన్నాహాలు చేస్తోంది. హిందువులు ఇళ్లల్లో నిర్వహించుకునే శుభకార్యాలను నిర్దుష్ట రుసుముతో ఆలయాల్లో నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేయాలని కొత్త ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఈ క్రమంలో దేవాదాయశాఖ గుర్తించిన కొన్ని ప్రధాన ఆలయాల్లో ఇలాంటి ఏడు కార్యక్రమాలు చేసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తారు. అన్నప్రాశన, బారసాల, అక్షరాభ్యాసం, శ్రీమంతం, పెళ్లి సందర్భంగా ఆశీర్వచనం...ఇలాంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఇందుకు ఎలాంటి ఏర్పాట్లు అవసరం, ఎలాంటి యంత్రాంగం కావాలి వంటి అంశాలపై కసరత్తు సాగుతోంది. ఇందులో భాగంగా దేవదాయశాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు వెలగపూడి సచివాలయంలో మంగళవారం అధికారులతో సమావేశమయ్యారు. ఉగాది నుంచి ఈ కార్యక్రమాలు అమలు చేయాలని ప్రాథమికంగా ఒక అవగాహనకు వచ్చారు. అప్పటికి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి సూచించారు.

## 'పందెం' ప్రజాప్రతినిధుల వివరాలివ్వండి

- ఏపీ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- కోడి పందేల్లో పాల్గొన్న వారిపై ఆగ్రహం

**ఈనాడు, హైదరాబాద్:** సంక్రాంతికి కోడి పందేల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధుల వివరాలను తమ ముందు ఉంచాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. వివరాలు సమర్పించేందుకు సమయం కావాలని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ విజ్ఞప్తి చేయడంతో అంగీకరించిన ధర్మాసనం విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీచేసింది. కోడి పందేలు నిర్వహించరాదని తాము ఆదేశించినప్పటికీ ప్రజాప్రతినిధులు పాల్గొనడంపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ అంశానికి సంబంధించి రామచంద్రరాజు అనే వ్యక్తి దాఖలు చేసిన వ్యాజ్యం మంగళవారం మరోసారి విచారణకు రాగా.. ప్రభుత్వం తరఫున ఏజీ వాదనలు వినిపించారు. పందేల్లో 'పాల్గొన్న' వారిపై కేసుల నమోదుకు చట్టంలో తావులేదన్నారు. ధర్మాసనం స్పందిస్తూ మరి 144 సెక్షన్ విధించి ఏమి ప్రయోజనమని ప్రశ్నించింది. కొంతమందినైనా అరెస్టు చేసి ఉంటే మిగతావాళ్లకు భయం ఉండేదని వ్యాఖ్యానించింది.

***రేపల్లే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు నోటీసులు***

కోడి పందేలు నిర్వహణకు బాధ్యులైన ప్రజాప్రతినిధులపై గుంటూరు జిల్లా చెరుకుపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదని పేర్కొంటూ భానుప్రకాశ్ అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న రేపల్లే ఎమ్మెల్యే ఎ.సత్యప్రసాద్, ఎమ్మెల్సీ ఎ.సతీష్‌ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు దేవినేని మల్లికార్జునరావు, ముమ్మనేని వెంకటసుబ్బయ్య, పోలీసులకు నోటీసులు జారీచేసింది.



ఈనాడు


## బ్యాంకుల్లో ఇంటిదొంగలు

వ్యవస్థనే రుజాగ్రస్తం చేసేంతగా బ్యాంకుల్లో మేటవేసిన నిష్పూచీతనానికి ప్రబల దృష్టాంతమిది. పాపాల పుట్ట పగిలినట్లు అవినీతి సర్పాలు వరసగా బయటపడుతున్న తీరు, జాతిజనుల్ని నిశ్చేష్టపరుస్తోంది. తొలుత రూ.11 వేలకోట్లకు విస్తరించిందంటూ వెలుగు చూసిన నీరవ్ మోదీ-పీఎన్‌బీ కుంభకోణంలో నష్టాలపై కొత్త అంచనాలు ఇంతలంతలవుతున్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ చుట్టూ చెల్లింపులు చేయని పక్షంలో నీరవ్ బృందం దొరకబుచ్చుకొన్న రుణాల అసలు, వడ్డీ కలగలిసి రూ.20 వేలకోట్లకు ఎగబాకుతాయని వివిధ బాధిత బ్యాంకులు మొత్తుకుంటున్నాయి. సీబీఐ, ఈడీ, సీవీసీ సహా ఏడు సంస్థలు చేపట్టిన విచారణలో వజ్రాల వ్యాపారి నీరవ్ తాకిడి మూడు పదుల బ్యాంకుల్ని నిలువునా ఎంతమేర ముంచేసిందో ఇంకా నిగ్గు తేలాల్సి ఉంది! పీఎన్‌బీ అనధికారిక బ్యాంకు గ్యారంటీల ప్రహసనాన్ని వెన్నంటి బహిర్గతమైన మరో కుంభకోణానికి కేంద్రబిందువు కలాల తయారీ సంస్థ రొటోమ్యాక్ సంచాలకుడు విక్రమ్ కొఠారీ. రూ.800 కోట్ల మేర అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఫిర్యాదుపై రంగంలోకి దిగిన దేసీ పరిశోధనలలో దిగ్భ్రాంతకర యథార్థాలు వెల్లడయ్యాయి. ఏడు బ్యాంకులతో కూడిన సహవ్యవస్థ(కన్సార్టియం) నుంచి కొఠారీ కుటుంబం రాబట్టి ఎగ్గొట్టిన అసలు, వడ్డీ కలగలిసి ఇప్పటికి రూ.3,695 కోట్లు. నకిలీ పత్రాలతో బ్యాంకులనుంచి పొందిన రుణాల్ని విదేశీ సంస్థల ఖాతాలకు బదలాయించి వాటిని తిరిగి రాబట్టడంలో కొఠారీ బృందం అన్ని నిబంధనల్నీ తుంగలో తొక్కినట్లు ప్రాథమిక సాక్ష్యాధారాలు చాటుతున్నాయి. వ్యవస్థాగత లోపాల్ని గుర్తించి కట్టడి చేయడంలో రిజర్వుబ్యాంకు దక్షతపైనే సందేహాలు రేకెత్తుతున్నాయని తప్పుపడుతూ కేంద్రం రాసిన తాజా లేఖ- బ్యాంకింగ్ రంగ దుస్థితిగతులపై ప్రజానీకం భయాందోళనలకు అక్షరాలా ప్రతిధ్వని.

ఏళ్ల తరబడి అంచెలవారీ తోడ్పాటుతో గుట్టుచప్పుడు కాకుండా పకడ్బందీగా పోటుపొడుచుకున్న కుంభకోణాలివి. బ్యాంకుల నెలవారీ నివేదికల్ని ఆడిటర్లు పరిశీలిస్తూనే ఉంటారు. అవకతవకల్ని నివారించే లక్ష్యంతో లెక్కకు మిక్కిలి నిబంధనల్ని వండివార్చారు. అయినా భారీ కుంభకోణం ఎలా కుబుసం విడిచిందో పది రోజుల్లో వివరణాత్మక నివేదిక సమర్పించాల్సిందిగా పీఎన్‌బీకి సీవీసీ శ్రీముఖం పంపించింది. పంజాబ్ నేషనల్ బ్యాంకు నోరు విప్పక ముందే ఆర్‌బీఐ గణాంకాలు విధ్వంసకర చెద పురుగుల అనుపానుల్ని కళ్లకు కడుతున్నాయి. వెలుపలి శక్తుల అక్రమాలు, ప్రలోభాల సంగతి అలా ఉంచి అంతర్గతంగానే ఎన్నో కంతలున్నాయని రిజర్వుబ్యాంకు స్వయంగా ధ్రువీకరించింది. కేవలం రెండేళ్ల వ్యవధిలో ప్రభుత్వరంగ బ్యాంకులకు చెందిన 5,200 మంది ఉద్యోగులు రకరకాల మోసాలకు పాల్పడ్డట్లు ఆర్‌బీఐ అధికారికంగా గుర్తించింది. హర్షద్ మెహతాలు, కేతన్ పరేఖ్‌లు, నీరవ్ మోదీలు, విక్రమ్ కొఠారీలకు లోపాయికారీగా సహకరించి కోట్లకు కోట్లు దోచిపెట్టిన ఇంటిదొంగలు మరెందరు దొరలుగా చలామణీ అవుతున్నారో లెక్కించగలవారెవరు? సాధారణ వ్యక్తులు లక్ష రూపాయల రుణం కోరితే యక్షప్రశ్నలు వేసి రోజుల తరబడి ప్రదక్షిణలు చేయించుకునే బ్యాంకుల సిబ్బంది- ఉద్దేశపూర్వక ఎగవేతదారులకు కోట్ల రూపాయల నిధుల్ని ఎలా పెద్దఎత్తున ప్రవహింపజేయగలుగుతున్నారన్న దానిలో అవినీతి పాత్ర సుస్పష్టం. రిజర్వుబ్యాంకు నామినేట్ చేసే వ్యక్తి సంచాలకుడి హోదాలో బ్యాంకుల పనిపోకడల్ని ప్రత్యక్షంగా పర్యవేక్షించగల వీలున్నప్పుడు- తనకు తెలియకుండానే భారీ రుణ పందేరం జరిగిందని ఆర్‌బీఐ స్వీయబాధ్యతను దులపరించుకోజాలదు. అంతర్గత కట్టుబాట్లు, వెలుపలి నియంత్రణ వ్యవస్థల ఉమ్మడి వైఫల్యమే అతిపెద్ద బ్యాంకింగ్ కుంభకోణానికి అంటుకట్టిందన్నది కఠోర వాస్తవం.

బ్యాంకుల పారుబాకీల తీరుతెన్నుల్ని కూలంకషంగా మదింపు వేసిన కేంద్ర నిఘా సంఘం- బాకీల చెల్లింపు రికార్డు అధ్వానంగా ఉన్నవారికి, ఉద్దేశపూర్వక ఎగవేతదారులుగా ముద్రపడినవారికీ రుణాలు ఎలా మంజూరవుతున్నాయని గతంలో సూటిగా ప్రశ్నించింది. నిబంధనల ప్రకారం నెలకొని తీరాల్సిన నిఘా, పర్యవేక్షణల కళ్లుకప్పి కుంభకోణం ఎలా రెక్కవిచ్చుకుందని అదే సీవీసీ నేడు నిగ్గదీస్తోంది. ఆ ప్రధాన ప్రశ్నలకు అనుబంధంగా మరెన్నో సందేహాలు ఇంకా నివృత్తి కావాల్సి ఉంది! 2016లోనే ఆర్‌బీఐ అప్రమత్తం చేసినా- స్విఫ్ట్ (విశ్వవ్యాప్త అంతర బ్యాంకు ఆర్థిక సమాచార సాంకేతిక వ్యవస్థ) లావాదేవీలతో పంజాబ్ నేషనల్ బ్యాంకు కేంద్రీకృత బ్యాంకింగ్ సాఫ్ట్‌వేర్ (సీబీఎస్)ను అనుసంధానించలేదు. అందుకు బాధ్యులెవరో తేలితే భారీ కుంభకోణ మూలాలు రట్టవుతాయి. బ్యాంకుల విశ్వసనీయతే ప్రశ్నార్థకమైన తరుణాన- వాటిలో ప్రభుత్వ వాటా తగ్గితే ఉద్యోగుల్లో జవాబుదారీతనం, విధి నిర్వహణలో పారదర్శకత ఏర్పడతాయని అసోచామ్, ఫిక్కీ వంటివి తమ వాదనకు పదును పెడుతున్నాయి. ఒక్క ప్రభుత్వ రంగ బ్యాంకుల పారుబాకీలే ఏడు లక్షల కోట్ల రూపాయలకు పైబడగా- గడచిన పదకొండేళ్లలో పునర్ మూలధనీకరణ పేరిట రూ.2.6 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కేంద్రం వెచ్చించడంలోని ఔచిత్యాన్ని అవి ప్రశ్నిస్తున్నాయి. పదిహేను ప్రభుత్వరంగ బ్యాంకులు నిరర్థక ఆస్తులు పది శాతానికి మించినా పుస్తకాల్లో ప్రస్తావించకుండా దాచిపెడుతున్నట్లు యూపీఏ జమానాలో ఆర్‌బీఐ చేసిన హెచ్చరికలు అరణ్యరోదనమయ్యాయి. నాటి పాలకుల ఉదాసీనత తాలూకు దుష్పరిణామాలకు ఆర్‌బీఐ పర్యవేక్షణ లోపాలు, ఇంటిదొంగల ఉరవడి జతపడి నేడు బ్యాంకుల పుట్టి ముంచుతున్నాయి. కేవలం ప్రమాద ఘంటికలు మోగించి చేతులు కట్టేసుకునే పాత్రలో రిజర్వుబ్యాంకు జాతి ప్రయోజనాల్ని ఎంతమాత్రం పరిరక్షించలేదు. 'కాగ్' తరహాలో బ్యాంకుల నిష్పాక్షిక ఆడిటింగ్ నిమిత్తం, అవసరమైతే చర్యలు చేపట్టగల అధికారాలతో ప్రత్యేక స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన వ్యవస్థను అవతరింపజేయడమే- ప్రస్తుత దురవస్థకు సరైన విరుగుడు!

# అమ్మ పలుకు... తేనెలొలుకు




ప్రపంచంలో ఒక నిర్ణీత ప్రదేశం, ప్రత్యేక భాష, చరిత్ర కలిగిన జన సముదాయాన్ని జాతిగా పరిగణిస్తారు. భాషాపరంగానే జాతికి ప్రత్యేక గుర్తింపు వస్తుంది. ఏ సమాజానికైనా భాష శ్వాసలాంటిది. సమాజాభ్యుదయానికి తోడ్పడే ముఖ్య సాధనాల్లో భాష ప్రముఖమైనది. వ్యక్తి వికాసం సమాజాభివృద్ధితో ముడివడి ఉంటుంది. భాష జాతి సంస్కృతికి దర్పణం. శతాబ్దాలుగా దఖలుపడిన వారసత్వ సంపదను ముందుతరాలకు అందజేయడంలో మాతృభాషే వారధి! భాష నశిస్తే ఆ సంస్కృతీ సంప్రదాయాలూ మలిగిపోయినట్లే! ఒక జాతి విశిష్టత, వారసత్వం, నైతికత, తాత్వికత ఆ జాతి సాహిత్యంలో నిబిడీకృతమై ఉంటాయి. మన గ్రామాల్లో వంశపారంపర్యంగా ఎన్నో కులవృత్తులు నిర్వహించేవాళ్లున్నారు. అక్షరజ్ఞానమైనా లేని ఎంతోమంది వృత్తిపరమైన నైపుణ్యాల విషయంలో అత్యద్భుత ప్రతిభా సామర్థ్యాలు ప్రదర్శిస్తూ ఉంటారు. చదవడం, రాయడం రాకపోయినా- జీవిత సత్యాలపై అవగాహన పెరగడానికి; ధార్మిక సంస్కారం అలవడటానికి మాట రూపంలో మాతృభాష వారికి అక్కరకొస్తోంది.

## సామ్రాజ్యవాదం మాటున అణచివేత

గ్రీకులు, రోమన్లు, పర్షియన్లు, పోర్చుగీసు, ఫ్రెంచి, ఆంగ్లేయులు సామ్రాజ్యవాద దృక్పథంతో ఒకప్పుడు ప్రపంచంలోని వివిధ ప్రాంతాలను ఆక్రమించారు. ఆయా ప్రాంతాలపై తమ భాషలు బలవంతంగా రుద్దారు. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక భాషల అస్తిత్వం ప్రమాదంలో పడింది. భాష, ఆచార వ్యవహారాలపరంగా ఎన్నో వైవిధ్యాలకు భారత్ పుట్టినిల్లు. భిన్నత్వంలో ఏకత్వమే భారత్‌కు జీవనాడి! ఉత్తర ఫ్రాన్స్‌లోని నార్మన్ జాతివారు 11వ శతాబ్దంలో ఇంగ్లండ్‌పై దురాక్రమణ జరిపారు. దాంతో అంతవరకు ఇంగ్లాండులో విస్తరించి ఉన్న వెల్ష్ భాష క్రమేపీ క్షీణించింది. ఆక్రమణదారుల భాష ఆ స్థానాన్ని ఆక్రమించింది. 17వ శతాబ్దం ఉత్తరార్థం నాటికీ ఇంగ్లాండులో ఆంగ్లం అధికారిక భాష కాదు. శాస్త్రీయ విజ్ఞానం, సాహిత్యం అంతా లాటిన్, ఫ్రెంచ్ భాషల్లో ఉండేది. అన్ని స్థాయుల్లో ఆంగ్లం అమలు కావాలని అక్కడ ఉద్యమాలు జరిగాయి. ఆ రోజుల్లో ఆంగ్లానికి గట్టి ప్రతిఘటన ఎదురైంది. విజ్ఞాన శాస్త్రాల్ని అనువదించడానికి ఆంగ్లం తగిన భాష కాదన్నారు. కేథలిక్ చర్చివారు బైబిల్‌ను ఆంగ్లంలోకి అనువదించడాన్ని వ్యతిరేకించారు. 1650 నవంబర్ 22న ఆంగ్లాన్ని అన్ని స్థాయుల్లో అమలుచేయాలని బ్రిటిష్ పార్లమెంటులో చట్టం చేశారు. ఆంగ్లభాష చరిత్ర అలా ఉండగా, బ్రిటిష్ వారు తాము వలసపోయిన ప్రతిచోటా స్థానిక భాషల్ని అంతంచేసి- ఆంగ్లాన్ని బలవంతంగా అక్కడి ప్రజలపై రుద్దే ప్రయత్నం చేశారు. ఆక్రమిత ప్రాంతాల వారు ఆ భారం మోస్తూ వచ్చారు.

స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలైనా నేటికీ భారత్‌లో ఆంగ్ల పెత్తనం కొనసాగుతూనే ఉంది. క్రమంగా పెరుగుతోంది. బ్రిటిష్ జమానాలో పాలన అవసరాల కోసం ఆంగ్ల విద్యను ప్రోత్సహించారు. ప్రభుత్వంలో గుమస్తా ఉద్యోగాలైనా వస్తాయన్న భావనతో అందరూ ఆంగ్లం నేర్చుకోవడం మొదలెట్టారు. చివరకు అది దేశవ్యాప్తంగా మాతృభాషల్ని మింగేసే స్థాయికి చేరుకొంది. సామ్రాజ్యవాదుల అవసరాలు, ప్రయోజనాలకు అనుగుణంగా భారత ఆర్థిక వ్యవస్థను బ్రిటిష్‌వారు మలచుకొన్నారు. స్వాతంత్ర్యానంతర భారత ఆర్థిక వ్యవస్థకూ వలస విధానాలే మూలం కావడం దురదృష్టకరం. అందుకు అనుగుణంగానే దేశంలో భాషా విద్యా విధానాలను రూపొందించారు. భారత్‌లో వలసలు ఎక్కువ. అందువల్ల భారత్‌కు ఆంగ్లం వంటి భాష అవసరం అన్న అభిప్రాయం ఉంది. ఇక్కడ గమనించాల్సిందేమిటంటే 80 శాతానికిపైగా వలసలు రాష్ట్రాల పరిధిలోనే చోటుచేసుకుంటూ ఉంటాయి. అంతర్రాష్ట్ర వలసలు 15 శాతంగా ఉన్నాయి. ఇతర దేశాలకు వలసలు కేవలం మూడు శాతమేనని గణాంకాలు చెబుతున్నాయి. ఈ వలసదారుల్లో అధిక నైపుణ్యం కలిగినవారు తక్కువగా, కొద్దిపాటి నైపుణ్యంగల విద్యావంతులు, నైపుణ్యంలేనివారు ఎక్కువగా ఉంటున్నారు. భారత్‌లో ముద్రణ రంగం, చిన్నతరహా పరిశ్రమలు, వస్త్ర పరిశ్రమ, వ్యాపారాలు, సినిమా రంగం చాలావరకు యువతకు ఉపాధి కారకాలవుతున్నాయి. దాదాపుగా ఈ రంగాలన్నింటికీ దేశీయ భాషలే ప్రాతిపదిక. ఉభయ తెలుగు రాష్ట్రాలకూ ఇదే సూత్రం వర్తిస్తుంది. పరాయిభాషలకోసం వెంపర్లాడటం కన్నా- మాతృభాషలో అర్థవంతమైన విద్యను అభ్యసించి, అవసరమైన నైపుణ్యాలు సంపాదించి అభివృద్ధి బాట పట్టడమే సహేతుకం. సంపద సృష్టిలో స్థానిక భాషల ప్రాముఖ్యం విస్మరించ తగదు. భాషలు కొడిగడతాయా అన్న సందేహాలకు భాషా శాస్త్రవేత్తలు అవుననే సమాధానమిస్తున్నారు. 'యునెస్కో' సైతం ఇదే మాట వినిపిస్తోంది. పలుకుబడి విస్తృతిని బట్టే భాషా వికాసం ఆధారపడి ఉంటుంది. భాషా వాడకం తగ్గే కొద్దీ సంబంధిత భాషా సమూహాల చారిత్రక, సాంస్కృతిక వికాసం కొడిగడుతుంది. తద్వారా ఆయా సమాజాలకు పరిమితమైన విలక్షణ పరిజ్ఞానం నశిస్తుందని 'యునెస్కో' హెచ్చరించింది. ప్రపంచవ్యాప్తంగా భాషా వైవిధ్యం క్రమంగా కోసుకుపోతున్న వైపరీత్యాన్ని 'యునెస్కో' 1996లోనే గుర్తించింది. 'ప్రమాదంలో ఉన్న ప్రపంచ భాషల జాబితా'ను ప్రకటించింది. తెలుగు భాష సైతం ఆ జాబితాలో ఉండటం ప్రమాద ఘంటికలు మోగించిన పరిణామం.

మత ప్రాతిపదికన భారత్‌నుంచి పాకిస్థాన్ విడిపోయింది. పాక్‌నుంచి తూర్పు పాకిస్థాన్ విడివడి బంగ్లాదేశ్ అవతరించడానికి భాషాపరమైన అస్తిత్వాన్ని కాపాడుకోవాలన్న తాపత్రయమే కారణం. బెంగాలీ భాషను కాపాడుకునే క్రమంలో చెలరేగిన ఉద్యమంలో చురుగ్గా పాల్గొని 1952, ఫిబ్రవరి 21న ప్రభుత్వ దళాల చేతిలో నలుగురు యువకులు హతమైన సందర్భాన్ని పురస్కరించుకొని అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహిస్తున్నారు. అంతరించిపోతున్న భాషల్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని చాటిచెప్పడం దీని ప్రధాన ఉద్దేశం. ప్రపంచవ్యాప్తంగా ఆరు వేలకు పైగా భాషలున్నాయి. వాటిలో సుమారు 2,500 భాషలు అంతరించిపోవడానికి సిద్ధంగా ఉన్నాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. మనదేశంలోనూ ఇప్పటికే 197 భాషలు నశించాయంటున్నారు. సొంత లిపి లేని భాషలకు అలాంటి ప్రమాదం ఎదురవుతుంది. కానీ, సువిశాల సాహిత్య సంపదను సొంతం చేసుకున్న తెలుగు భాషకూ అలాంటి దురవస్థ ఎందుకు ఎదురవుతోంది? భారత్‌లో మేధావి వర్గం, ముఖ్యంగా తెలుగునాట ఆలోచనశీలురు చాలావరకు భాష పట్ల స్వాభిమానం కోల్పోవడమే ఇందుకు కారణం. గూగీ వాథియన్ అనే కెన్యా మహాకవి, ఆంగ్లాచార్యులు 17 సంవత్సరాలపాటు ఆంగ్లంలో రచనలు చేశారు. ఆ క్రమంలో సొంత భాషను విస్మరించారు. అనంతరం చేసిన పనికి ఆయన ఎంతో సిగ్గుపడి, పశ్చాత్తాపంతో తన మాతృభాష 'గికొయి'ని అక్కున చేర్చుకున్నాడు. ఆ భాషలో ఎన్నో రచనలు చేశాడు. మహాత్మాగాంధీ తన ఆత్మకథను గుజరాతీలోనే రాసుకున్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ సైతం ప్రపంచ ప్రఖ్యాత 'గీతాంజలి'ని స్వీయ భాష బెంగాలీలోనే విరచించారు. ఆ మహనీయుల అడుగుజాడలే మనకు ఆదర్శం కావాలి.

## వికాసానికి ఆలంబన

తెలుగు మనుగడకు, విస్తరణకు ఒకప్పుడు సంస్కృతం అడ్డుపడితే- ఆ తరవాత ఆంగ్లం మోకాలడ్డింది. ఆంగ్లం తెలిసినవారు దేశ జనాభాలో తక్కువ సంఖ్యలోనే ఉన్నారు. కానీ- విద్య, పాలన, న్యాయ నిర్వహణ, వ్యావహారికంలో ఈ అల్ప సంఖ్యాకుల ఆధిపత్యమే కొనసాగుతోంది. ఈ సమస్యను అధిగమించాలంటే అన్ని రాష్ట్రాల్లో మాతృభాషలను నిర్బంధ పాఠ్యాంశాలుగా బోధించాలి. అమ్మభాషను కాపాడుకొనే కృషి అన్ని స్థాయుల్లో జరగకపోతే భాషా ప్రయుక్త రాష్ట్రాల భావనకు అర్థమే ఉండదు. తమ పురోభివృద్ధికి మాతృ భాష అడ్డంకిగా మారుతోందని ఏ సమాజమైనా భావిస్తే- ప్రాంతీయ భాషలు ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉంది. అందువల్లే ఆంగ్లం అన్నం పెడుతుందన్న నమ్మకం ప్రబలిపోయింది. మాతృభాషలో పట్టుసాధిస్తేనే ఇతర భాషలను నేర్చుకోవడం సులభమనే స్పృహ నేటి యువతకు ఉండటం లేదు. ఆరేళ్ల వయసులోనే పిల్లలకు అమ్మ భాషకు సంబంధించిన పునాదులు పడతాయి. ప్రాథమిక విద్యాస్థాయుల్లోనే పరాయి భాషల్లో బోధన ప్రయోగాలు చేయడం ప్రమాదకరం. మాతృభాషలో విద్యాబోధన సాగిస్తున్న చైనా, ఇటలీ, జర్మనీ, జపాన్, కొరియా, రష్యా వంటి ఆంగ్లేతర జాతులు అత్యద్భుతంగా పురోగమిస్తున్నాయి. తెలుగునాట కూడా ప్రాథమిక విద్యకు మాతృభాషే అన్నివిధాలా సముచితమైనది. భాషను బతికించడానికి ప్రభుత్వాలూ తమవంతు కృషిచేయాలి. విద్యా రంగంలో భాషా సముద్ధరణకు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా అవి ఆచరణ రూపంలో నిలదొక్కుకోవడంలేదు. మాతృభాషకు గౌరవం ఇవ్వడంలో పొరుగున తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో చిత్తశుద్ధి కనబరుస్తున్నాయి. తెలుగునాట సైతం ఆ స్థాయి రాజకీయ సంకల్పం నేడెంతో అవసరం. మొక్కవోని చిత్తశుద్ధి, నిబద్ధతతో మాతృభాష చుట్టూ ప్రేమపూర్వక దడికట్టినప్పుడే తెలుగు మనగలుగుతుంది. ఆ క్రమంలో ఆధునిక అవసరాలకు అనుగుణంగా భాషను నవీకరించుకోవడం భాషాభిమానుల బాధ్యత!

**- డాక్టర్ దామెర వేంకట సూర్యారావు**

## మాతృభాషకే ప్రథమ ప్రాధాన్యం



అమ్మ, అమ్మ భాష, జన్మభూమి... అపురూప భావనలు! తల్లి లేనిదే దేహం లేదు. అదేవిధంగా భావ వ్యక్తీకరణకు భాష అవసరం. దేశ భద్రతమీదే పౌర సంక్షేమం ఆధారపడి ఉంటుంది. కాబట్టి ప్రతి పౌరుడికీ ఈ మూడు అంశాలు ప్రాణప్రదాలు. మాతృభాష ఉన్నతిని కోల్పోయిననాడు- ఆ జాతి తన గౌరవాన్ని కోల్పోతుంది. అందువల్లే పాలనలో, బోధనలో మాతృభాషను క్రియాశీలంగా నిలుపుకోవాలి. వివిధ ప్రక్రియల్లో తెలుగు భాషకు మహత్తరమైన సాహిత్య సంపద ఉంది. గొప్ప కవులు, రచయితలెందరికో తెలుగునేల ఆలవాలం. మాతృభాష వినియోగం తగ్గుతుండటమే భయపెడుతున్న సమస్య. తెలుగును అమితంగా ప్రేమించిన హాల్డేన్, అప్పయ్య దీక్షితులు, బ్రౌన్, మెకంజీ వంటివారి మాతృభాష తెలుగు కాదు. తెలుగును ప్రేమించడమంటే అన్య భాషల్ని ద్వేషించడమని అర్థం కాదు. బహుభాషల సంకీర్ణమైన భారత్ వంటి దేశంలో అమ్మభాషను ఔపోసన పడుతూనే- అన్యభాషలనూ నేర్చుకోవాల్సి ఉంటుంది.

# చేరువైన ఉత్తర దక్షిణాలు

ఊరంతా ఒక దారైతే ఉలిపికట్టెది మరో దారి. ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ అన్ తీరు సరిగ్గా ఈ సామెతనే గుర్తుకుతెచ్చేది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా తక్కువ తిన లేదు. తమలపాకుతో కిమ్ ఒకటంటే తలుపు చెక్కతో రెండంటున్నారు. యుద్ధమే వస్తే ఉత్తర కొరియాను సర్వనాశనం చేస్తానని ఏకంగా ఐక్యరాజ్య సమితి ప్రసంగంలో ట్రంప్ హుంకరించారు. ఈ ఆవేశకావేషాలు ఎక్కడ అణ్వస్త్ర యుద్ధానికి దారితీస్తాయేమోనని ప్రపంచం గాభరా పడసాగింది. ఇంతలో దక్షిణ కొరియాలోని ప్యోంగ్ చాంగ్ నగరంలో జరిగే 2018 శీతకాల ఒలింపిక్స్‌లో పాల్గొనాలని ఉత్తర కొరియా నిర్ణయించి అందర్నీ ఆశ్చర్యపరచింది. కిమ్ దుడుకు పంథా వదలి దక్షిణ కొరియాతో శాంతియుత సంప్రతింపులకు సై అంటారని ఆశలు చిగురించాయి.

### కిమ్ మేకపోతు గాంభీర్యం

నిజానికి కటిక పేదరికం తాండవించే ఉత్తర కొరియాకు అమెరికాను కాదు కదా పొరుగునే ఉన్న జపాన్‌ను కాని, సోదర దేశ దక్షిణ కొరియాను కాని ఎదిరించే సత్తా లేదు గాక లేదు. ఉత్తర కొరియా కన్నా దక్షిణ కొరియా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 45 రెట్లు హెచ్చు. జనాభా కూడా రెండింతలు ఎక్కువ. దక్షిణ కొరియా తలచుకుంటే ఉత్తర కొరియాకన్నా ఎన్నో రెట్లు ఎక్కువ శక్తిమంతమైన సైన్యాన్ని సృష్టించుకోగలదు. అమెరికా అయితే ఏ క్షణాన్నైనా ఉత్తర కొరియాను నేలమట్టం చేయగలదు. యుద్ధం లేకుండానే కిమ్‌ను దారికి తీసుకురావచ్చునని ఉదారవాదులు సలహా ఇస్తున్నా ట్రంప్ పట్టించుకోవడం లేదు. ఐక్యరాజ్య సమితి ఆంక్షలను కిమ్‌కు పెద్ద దిక్కులైన చైనా, రష్యాలు కూడా సమర్థించడంతో ఉత్తర కొరియా ఆర్థికంగా ఉక్కిరిబిక్కిరవుతోంది. ఉత్తర కొరియా నుంచి బొగ్గు ఇతర వనరుల దిగుమతిని చైనా తగ్గించేయడంతో కిమ్ ప్రభుత్వానికి విదేశ ద్రవ్య ఆదాయం 90 శాతం తగ్గిపోయింది. చైనా నుంచి చమురు దిగుమతులు తగ్గిపోయి ఉత్తర కొరియా సైన్యానికి చలన శక్తి హరించుకుపోతోంది. దీంతో కిమ్ ప్రభుత్వం పూర్తిగా రష్యా వైపు తిరిగింది. గత ఏడాది కనీసం మూడుసార్లు రష్యన్ ట్యాంకర్లు సముద్రం మధ్యలోనే ఉత్తర కొరియా ట్యాంకర్లలోకి చమురు నింపినట్లు ఐరోపా భద్రతా సంస్థలు తెలిపాయి. ట్రంప్ తమ మీద యుద్ధానికి దిగకుండా చూడాలని రష్యన్లను కోరడానికి ఉత్తర కొరియా ఉన్నతస్థాయి దూతలను మాస్కోకు పంపింది. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శికి కూడా ఇదే వినతితో ఉత్తర కొరియా విదేశాంగ మంత్రి ఇటీవల ఓ లేఖ రాశారు. ఈ దుమారంలో తమ భవితవ్యాన్ని తామే నిర్ణయించుకోలేకపోతున్నామని దక్షిణ కొరియన్లు మథనపడసాగారు. యుద్ధమే వచ్చి ఉత్తర కొరియాపై అమెరికా అణుబాంబులు ప్రయోగించినా, లేదా ఉత్తర కొరియాయే తమపై అణ్వస్త్రదాడి చేసినా సర్వనాశనమయ్యేది తామేనని వారు హడలిపోతున్నారు. ఉభయ కొరియాల సరిహద్దుకు దక్షిణ కొరియా రాజధాని సియోల్ కేవలం 25 మైళ్ల దూరంలోనే ఉంది. కోటి జనాభా గల ఈ నగరం దేశంలో ప్రధాన ఆర్థిక కేంద్రం కూడా. సియోల్ నాశనం కావడానికి అణుబాంబునే ప్రయోగించనక్కర్లేదు. సరిహద్దు వెంట మోహరించిన 350 దూరశ్రేణి ఫిరంగుల సాయంతో ఉత్తర కొరియా రోజుకు 3,50,000 గుళ్లను నగరంపై వర్షించగలదు. అందువల్ల ఉత్తరంతో దక్షిణం యుద్ధం కోరుకోవడం లేదు. అమెరికా తనపై గగనతల దాడి జరపకుండా నిరోధించడానికి కిమ్ బీరాలు పలుకుతున్నారు తప్ప, ఆయన అణు యుద్ధం ప్రారంభించేంత ఉన్మాది కారని దక్షిణ కొరియన్ నిపుణులు భావిస్తున్నారు. అలాగని తమపై దాడి జరిగితే కిమ్ చేతులు ముడుచుక్కూర్చుంటారని భావించడమూ అవివేకమే.

ఈ పరిస్థితిలో అన్ని పక్షాలూ సంయమనంగా వ్యవహరించాలని అంతర్జాతీయ సమాజం కోరుకుంటోంది. ట్రంప్ పాలనకు ముందు పలువురు అమెరికా అధ్యక్షులు ఉత్తర కొరియాపై సంయమనం-ఒత్తిడి మేళవించిన పంథా



అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ అధ్యక్షుడు థామస్ బాక్‌తో ఉత్తర, దక్షిణ కొరియాల క్రీడాధికారుల కరచాలనం

### కొరియాల మధ్య చల్లబడిన ఆవేశాలు

అనుసరించేవారు. ఆ దేశాన్ని ఉగ్రవాద ప్రేరేపక దేశాల జాబితాలో చేర్చి ఆంక్షలు విధించి చర్చలకు దిగొచ్చేలా చేసేవారు. సంప్రతింపులకు వచ్చినందుకు ప్రతిగా ఉత్తర కొరియాకు ఆహార సహాయం చేయడం, దాన్ని అందుకున్నాక ఆ దేశం మళ్ళీ పాత వేషాలు వేయడం- గత 20 ఏళ్లుగా ఇదే వరస. 2011లో పగ్గాలు చేపట్టిన కిమ్ జోంగ్ అన్ అంతర్జాతీయ ఆంక్షలను భరించడం తేలికేనని గ్రహించి అణ్వస్త్ర, క్షిపణి తయారీ కార్యక్రమాన్ని జోరుగా ముందుకు ఉరికించారు. దీన్నిచూసి విసిగిపోయిన అమెరికా పూర్వ అధ్యక్షుడు బరాక్ ఒబామా, అప్పటి జపాన్, దక్షిణ కొరియా నేతలు మొత్తం చర్చల ప్రక్రియకు స్వస్తి చెప్పారు. ట్రంప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉత్తర కొరియాను 2017లో మళ్ళీ ఉగ్రవాద ప్రేరేపక దేశాల జాబితాలో చేర్చారు. చర్చల ఊసు లేకుండా ఉత్తర కొరియాలోని అణ్వస్త్ర, క్షిపణి స్థావరాలపై అమెరికా ముందస్తు దాడిచేసే అవకాశముందని ఇటీవల వదంతులు వ్యాపించాయి. ఉత్తర కొరియాతో చర్చలను పునరుద్ధరించాలన్న నినాదంతో ఎన్నికల్లో గెలిచిన దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్ సామరస్యానికి తలుపులు తెరచి ఉంచారు. ట్రంప్ ఒత్తిడివల్ల, ఆపద్బాంధవులైన చైనా, రష్యాలు కూడా సాయం నిలిపివేయడంవల్ల ప్రపంచంలో ఏకాకిగా మారిన కిమ్ తాత్కాలికంగానైనా దిగివచ్చారు.

### అగ్రరాజ్య ఆగ్రహం

మూన్ జే ఇన్ ఇచ్చిన అవకాశాన్ని దొరకబుచ్చుకుని ప్యోంగ్ చాంగ్ శీతకాల ఒలింపిక్స్‌కు 22మంది అథ్లెట్ల బృందాన్ని పంపారు. వీరిలో 12మంది ఉభయ కొరియాల సంయుక్త ఐస్ హాకీ బృందంలో ఆడారు. ఉత్తర కొరియా అధినాయకుడు కిమ్ చెల్లెలు కిమ్ యో జోంగ్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవంలో అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ వెనకనే ఆసీనులయ్యారు. అయినా పెన్స్ ఆమెను మాటమాత్రం పలకరించలేదు. ఒలింపిక్స్ గౌరవ విందులో ఉత్తర కొరియా ప్రతినిధులు ఎదురుపడతారని మొత్తంగా విందుకు వెళ్లడం మానుకున్నారు. ఈ క్రీడోత్సవాలకు ఒక్కరోజు ముందు ఉత్తర కొరియా ఖండాంతర క్షిపణులతో సైనిక కవాతు జరపడం అమెరికాకు ఆగ్రహం కలిగించింది. కిమ్ ప్రభుత్వంపై మరింత కఠిన ఆంక్షలు విధించబోతున్నామని హెచ్చరించింది. ఒలింపిక్స్ ముగిసిన తరవాత ఉత్తర కొరియాతో సంబంధాలు తగ్గించుకోవాలని పెన్స్ దక్షిణ కొరియాకు సూచించారు. ఉత్తర కొరియాపై గరిష్ఠ ఒత్తిడి తెస్తూ అదే సమయంలో సంభాషణలూ జరపడం భేషైన పద్ధతి అని పెన్స్ ఒలింపిక్స్ నుంచి తిరిగివెళుతూ పాత్రికేయులతో అన్నారు. కిమ్ పట్ల అమెరికా, దక్షిణ కొరియాలు మరీ మెత్తబడితే చైనా, రష్యాలు ఆయన ప్రభుత్వాన్ని ఆదుకోవడానికి బిరబిర ముందుకొస్తాయి. అప్పుడు మళ్ళీ కిమ్ తన పాత ఆటలు మొదలుపెడతారు. ఈ సంగతి గ్రహించబట్టి దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ చర్చల కోసమే చర్చలు జరపడం తన అభిమతం కాదని, కిమ్ దారికి వస్తున్నట్లు రూఢి అయితేనే ముందుకు సాగుదామని పెన్స్‌కు భరోసా ఇచ్చినట్లు తెలిసింది. ఉభయ కొరియాలు త్వరలోనే శిఖరాగ్ర సభ జరుపుకోవాలని ఉత్తర కొరియా ప్రతినిధి వర్గం మూన్‌కు సూచించగా, దానికి తొందరేమీలేదని ఆయన జవాబిచ్చారంటే కారణమిదే. అంతేకాదు ఉభయ కొరియాల మధ్య చర్చలు అమెరికా-ఉత్తర కొరియా చర్చలకు దారితీసి చివరకు అణు నిరాయుధీకరణకు దారితీయాలని వ్యాఖ్యానించారు. ఒకటి మాత్రం సుస్పష్టం- మూన్ ఉత్తర కొరియాతో యుద్ధాన్ని కోరుకోవడంలేదు. ట్రంప్, కిమ్‌లు ఒకరిమీద ఒకరు రెచ్చిపోయి వినాశం తెచ్చిపెట్టకూడదని మూన్, ఆయన ప్రజలు కోరుకొంటున్నారు. మరోవైపు ఉత్తర కొరియా అమెరికా మాటలు నమ్మి అణ్వస్త్రాలను త్యజించడానికి సిద్ధంగా లేదు. గతంలో ఇరాక్ నేత సద్దాం హుసేన్, లిబియా నేత ముమ్మార్ గడాఫీ పాశ్చాత్యులను నమ్మి నిలువునా మునిగిపోయారని కిమ్ ప్రభుత్వం భావిస్తోంది. కిమ్ భయాలు, సంకోచాలను తొలగించడానికి చైనా, రష్యాలు అమెరికాతో కలిసి కృషిచేయాలి. ప్రస్తుతానికి మాత్రం శీతకాల ఒలింపిక్స్ వల్ల రెండు కొరియాల ప్రజల మధ్య సౌహార్ద సంబంధాలకు సానుకూల వాతావరణం ఏర్పడింది. ఇది నిస్సందేహంగా స్వాగతించాల్సిన పరిణామం!

**- ఆర్య**


# వసుధైక కుటుంబం

విశ్వంలో ఏదీ- దేనికీ దూరంగా లేదు. దూరాభారం అసలే కాదు. సమస్త విశ్వంలోనూ స్థాణురూప దైవం నిండి ఉన్నట్లు చెబుతారు. అప్పుడు అంతటా ఏకరూపత ఉంటుంది కాబట్టి, దూరానికి తావే లేదని విశ్వసించాలి. కాకపోతే, మాయ అలా భ్రమ కలిగిస్తోంది. కమలం చిన్నది. దాని ఉనికి, పరిమాణం ఎంత? అత్యంత దూరాన అంతరిక్షంలో ఉండే సూర్యుడికి, దానికి సంబంధమేమిటి? అనుబంధం, హృదయానుబంధనం, అపురూప అనుసంధానం- దాన్ని ఏమని పిలవాలన్నదీ మరో ప్రశ్న.

వెన్నెల కిరణాలకే వికసించే కలువ- తన కలువరేకులంత కళ్లతో, నయనాల దిన్నెల్లో వెన్నెలను ఆస్వాదిస్తోందని అనుకోవాలి. చంద్రుడే వెన్నెల ప్రవాహాలను పంపి, సుదీర్ఘ స్పర్శలతో కలువ రేకులను విప్పుతున్నట్లు భావించాలి. నేలమీద మడుగులో కలువ. అందనంత దూరాన అంతరిక్షంలో చంద్రుడు. ఈ ప్రేమానుబంధానికి అర్థం, అంతరార్థం గ్రహించాలి. అడవిలో ఉసిరి. సముద్రంలో ఉప్పు- ఇది సురుచిర సమ్మేళనం. ఇది ఆకు, వక్క, సున్నం కలగలిసిన పక్వ పరిమళ తాంబూల చర్వణం.

అంతులేనంత ఉన్నతోన్నత పర్వతాలు. ఆ పక్కనే లోతు అంతుపట్టని లోయలు. నిర్గమ జలరాశి వద్దనే సముద్రాల లోపలి బడబాగ్నులు. స్వభావాలు, బలాబలాల్లో సమఉజ్జీలన్నంత సామరస్యం కనిపిస్తుంది. అంతా సమతుల్య జీవనం. ఒకదాని అవసరం మరోదానికి ఉంది. భగవంతుడికి తప్ప- ఈ లోకంలో ఏదీ మరోదాని సహకారం లేకుండా మనలేదు. మహాపర్వతమైనా 'భూమిపీఠం' ఉండాలి. బడబాగ్నికైనా 'వాయుఊతం' కావాలి. ఈ బంధాలకు అంతుబట్టని దూరాలు అతకవు. అవి లేవు కూడా!

ఇది ఏకసూత్ర విస్తరిత విశ్వం. బీజరూప విస్ఫోటక లోకం. ఏది ఎక్కడ ఊపిరి పోసుకున్నా, విస్తరించినా ఒక సూక్ష్మజీవి అవసరానికి కిందికి దిగి రావాల్సిందే. పైకి పాకిపోవాల్సిందే. భూమి అవసరానికి ఆకాశం అమృత జలాల్ని వర్షిస్తుంది. వాటి కోసం సముద్ర జలాలు ఆవిరులై మేఘాలుగా పైకి పయనిస్తాయి. వృక్షాలు వింజామరలు వీచి, వాటి ఉష్ణాన్ని శీతలీకరిస్తాయి. సానుకూలతల జీవన సరళి ఇది. పరస్పర సహకార ప్రవర్తనా శైలి ఇదే!



### అంతర్యామి

శ్వాసను సైతం లోకం కోసం పీల్చే వృక్షాలున్నాయి. కోయిల పాపల కోసం గూళ్ల పొత్తిళ్లుపరిచే కాకులున్నాయి. ఒంటరి జీవనం, ఏకాకితనం ఎక్కడా లేవు.

ఈ విశ్వం తనకు తానే ఎంతో దగ్గర. అంతకు మించి, పొదుపరి. ఒక గూడులా, పొదలా లక్షలాది జీవరాశుల్ని, అగణిత స్థావర జంగమాదుల్ని అది పరిష్వంగంలో పొదువుకుంటుంది. ప్రకృతి నడుమ సేదదీర్చే విశ్వజననిలా అలరారుతుంది.

విశ్వం అంటే విష్ణువు. విష్ణువు అంటే విశ్వం. అంతా విశ్వసర్వం. ఆ విరాటరూపుడితో స్వేచ్ఛగా నడయాడే సంతానం. అందరూ రక్త సంబంధీకులు, ఆత్మ బంధువులు. అన్నీ కలిసిన ఈ సువిశాల విశ్వగర్భంలో- ఎవరికీ ఎవరితోనూ పేచీ లేదు. పోటీ లేదు. ఈ సూత్రాన్ని అన్వయించుకుంటే, అలవాటు చేసుకుంటే- విశ్వమే వసుధైక కుటుంబం అవుతుంది. విశ్వాభిరామంగా మారుతుంది.

**- చక్కిలం విజయలక్ష్మి**

# చంద్రబాబును చూసే ఏపీకి పెట్టుబడులు

- 24 నుంచి విశాఖలో భాగస్వామ్య సదస్సు
- ఇప్పటికే రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులకు అంగీకారం
- 39 దేశాల నుంచి హాజరవుతున్న ప్రతినిధి బృందాలు
- పరిశ్రమలశాఖ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి వెల్లడి

ఈనాడు - అమరావతి

కేంద్రాన్ని చూసి కాదు.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై నమ్మకంతోనే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని పరిశ్రమలశాఖ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. యూరోపియన్ దేశాల్లో పర్యటించిన సమయంలో కూడా పలు సంస్థల అధిపతులు ఈ విషయం చెప్పారని వెల్లడించారు. ఈ నెల 24 నుంచి మూడు రోజుల పాటు విశాఖపట్నంలో జరగనున్న భాగస్వామ్య సదస్సుకు సంబంధించిన వివరాలను మంగళవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. కేంద్రం నిర్వహిస్తున్న సదస్సుకు రాష్ట్రం ఆతిథ్యం ఇస్తోందన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీల అమలు విషయంలో కేంద్రం నుంచి అన్యాయం జరుగుతోందనే అభిప్రాయం ప్రజల్లో ఉందన్నారు. ప్రత్యేక ప్యాకేజీలో ప్రకటించిన విధంగా ప్రోత్సాహకాలు సాధించేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు.

### రూ.3లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు సిద్ధం

విశాఖపట్నం భాగస్వామ్య సదస్సు సందర్భంగా రూ.3లక్షల కోట్ల పెట్టుబడులపై ఒప్పందాలు చేసుకునేందుకు పలు సంస్థలు అంగీకరించాయని మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. సదస్సు ప్రారంభం నాటికి ఈ మొత్తం ఇంకా పెరుగుతుందన్నారు. 2016 సదస్సులో చేసుకున్న ఒప్పందాల్లో 44.26శాతం, 2017 సదస్సులోని ఒప్పందాల్లో 39.76శాతం అమల్లోకి వచ్చినట్లు తెలియజేశారు. రాష్ట్రంలో ఆహారశుద్ధి రంగంలో పెట్టుబడులకు ఎన్నో అవకాశాలున్నాయన్నారు. మంగళగిరి వద్ద మంగళవారం అత్యాధునిక పరిశోధనశాల ప్రారంభించామన్నారు. ఇందులో వివిధ దేశాలకు ఎగుమతి చేసే ఆహార ఉత్పత్తులను పరీక్షించుకోవచ్చన్నారు.

### అన్ని రాష్ట్రాల కంటే ముందే ఏపీకి విద్యుత్తు వాహనాలు

విద్యుత్తు వాహనాలను అందుబాటులోకి తేవడంలో దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ఏపీ ముందుంటుందని అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. కియా సంస్థ కూడా దీనిపై దృష్టి పెట్టిందన్నారు. ఈ నెల 22న కియా మోటార్స్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారని చెప్పారు.

### ముఖ్యఅతిథిగా ఉపరాష్ట్రపతి

విశాఖ సదస్సుకు ముఖ్యఅతిథిగా ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి సురేష్‌ప్రభుతోపాటు పలువురు కేంద్ర మంత్రులు హాజరవుతున్నట్లు చెప్పారు. 14 దేశాల నుంచి వాణిజ్య మంత్రులు, 39 దేశాల నుంచి ప్రతినిధి బృందాలు హాజరవుతున్నట్లు వివరించారు. 2,500 మంది పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం పలికామన్నారు. సదస్సులో 9 ప్లీనరీ సెషన్స్(సీఐఐ ఆధ్వర్యంలో), 8 రాష్ట్ర సెషన్స్, 2 కొరియా, జపాన్ దేశాల సెషన్స్ జరుగుతాయన్నారు.

## సహజ వనరుల గని ఆంధ్రప్రదేశ్



ఆహార ప్రయోగశాలను ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి అమరనాథ్‌రెడ్డి. చిత్రంలో మోలోయ్‌బెనర్జీ

**మంగళగిరి, న్యూస్‌టుడే:** వ్యవసాయం, చేపల పెంపకానికి అవసరమైన సహజవనరులు రాష్ట్రంలో విస్తారంగా ఉన్నాయని పరిశ్రమలశాఖ మంత్రి అమరనాథ్‌రెడ్డి చెప్పారు. అమరావతి సమీప మంగళగిరిలో మంగళవారం ఉదయం లిండే ఇండియా సంస్థ ఏర్పాటుచేసిన ఆహార ప్రయోగశాల, శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అమరనాథ్ రెడ్డి మాట్లాడుతూ మంగళగిరిలో లిండే సంస్థ వినూత్న ఆహార శుద్ధి సాంకేతికతతో ముందుకురావటం అభినందనీయమన్నారు. ఆహారోత్పత్తుల పరిశ్రమకు అవసరమైన క్రయోజెనిక్ ఫ్రీజింగ్ చిల్లింగ్ టెక్నాలజీని అందించటంలో లిండే సంస్థకు దశాబ్దాలుగా పేరుందన్నారు. లిండే గ్యాసెస్, తూర్పు ఆసియా ముఖ్య ప్రతినిధి మోలోయ్ బెనర్జీ మాట్లాడుతూ తాము ఏర్పాటుచేసిన ప్రయోగశాల, శిక్షణ కేంద్రం అందించే సాంకేతికత ఆహారశుద్ధి పరిశ్రమ అధిక లాభాలు పొందటానికి దోహదపడుతుందని చెప్పారు.

### భాజపాకు మిత్రపక్షంగానే ఉన్నాం

పార్లమెంట్ సాక్షిగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఇచ్చిన హామీలు అమలుచేయాల్సిన బాధ్యత భాజపాపై ఉందని మంత్రి అమరనాథ్‌రెడ్డి తెలిపారు. కేంద్రంలో తాము, రాష్ట్రంలో ఆ పార్టీ మిత్రపక్షాలుగానే ఉన్నామన్నారు. కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాసం పెడతామని చెప్పే వారిని ముందు పెట్టనివ్వండి..తర్వాత ఏమి చేయాలో ఆలోచిస్తామని చెప్పారు.



కలెక్టరేట్‌లోకి రాకుండా న్యాయవాదులను అడ్డుకుంటున్న పోలీసులు

## న్యాయవాదుల ఆందోళన ఉద్రిక్తం

- హైకోర్టు ఏర్పాటు చేయాలని నినాదాలు

**కర్నూలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే:** హైకోర్టు సాధన కోసం కర్నూలు నగరంలోని కలెక్టరేట్ వద్ద మంగళవారం న్యాయవాదులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్‌లో జరిగిన సమావేశానికి రాష్ట్రవ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి హాజరయ్యారు. విషయం తెలుసుకున్న న్యాయవాదులు మంత్రికి వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చారు. పోలీసులు వారిని లోపలికి అనుమతించకపోవడంతో వాగ్వాదంతోపాటు తోపులాట జరిగింది. ఈ క్రమంలో పోలీసులు ఏర్పాటు చేసిన ఇనుక కంచె తగిలి పలువురికి గాయాలయ్యాయి. బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు వి.నాగలక్ష్మీదేవి, కార్యదర్శి బాబూసాహెబ్, మరికొందరు కలెక్టరేట్ గేటు ఎక్కి లోనికి వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు నిలువరించారు. చివరికి రెండు గంటల తర్వాత మంత్రిని కలిసేందుకు పోలీసులు అనుమతించారు. మంత్రి సోమిరెడ్డి స్పందిస్తూ ఇదివరకే ముఖ్యమంత్రికి విషయం చెప్పామని, మరోమారు దృష్టికి తీసుకెళ్లి రాయలసీమకు న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇచ్చారు. నాగలక్ష్మీదేవి మాట్లాడుతూ హైకోర్టు కోసం గళం విప్పి పోరాడాలని కోరారు.

**ముఖ్యమంత్రికి ఎంపీ బుట్టా వినతి:** కర్నూలు ఎంపీ బుట్టా రేణుక మంగళవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిశారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలంటూ వినతిపత్రం అందజేశారు.

## సమ్మె విరమించి రండి పరిశీలిస్తాం: హైకోర్టు

**ఈనాడు, హైదరాబాద్:** రాయలసీమ ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఏర్పాటు చేయాలనే డిమాండుతో న్యాయవాదులు సమ్మె చేస్తున్నారని బెదిరిస్తూ హైకోర్టులో పిటిషన్ వేయడం సరికాదని, సమ్మె విరమించాక వస్తే దానిని పరిశీలిస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. న్యాయవాదుల అభిప్రాయాల్ని తెలుసుకోకుండా అమరావతిలో హైకోర్టు ఏర్పాటుకు హైకోర్టు న్యాయమూర్తులందరూ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారన్న పిటిషనరు వాదనలపై అసంతృప్తి వ్యక్తం చేసిన ధర్మాసనం.. న్యాయవాదులను పిలిచి న్యాయమూర్తులు సమావేశం నిర్వహించిన చరిత్ర ఉందా? అని ప్రశ్నించింది. సమావేశం నిర్వహణ గురించి న్యాయవాదుల సంఘ అధ్యక్షుడికి మాత్రమే సమాచారం ఇస్తారని ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం మంగళవారం పిటిషనరు/న్యాయవాది నారాయణస్వామికి స్పష్టం చేసింది. 1937లో ఆంధ్ర, రాయలసీమ నాయకుల మధ్య కుదిరిన శ్రీబాగ్ (పెద్దమనుషుల) ఒప్పందం ప్రకారం హైకోర్టును రాయలసీమలో ఏర్పాటు చేయాల్సి ఉన్న నేపథ్యంలో ఏపీ హైకోర్టును కర్నూలులో ఏర్పాటు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థిస్తూ న్యాయవాది ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు.

దీనిపై గతేడాది జులై 11న విచారణ జరిపిన ధర్మాసనం.. కేంద్ర కేబినెట్ కార్యదర్శి, కేంద్ర న్యాయశాఖ కార్యదర్శి, కేంద్ర ఆర్థికశాఖ కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు నోటీసులు జారీచేసిన విషయం తెలిసిందే. మంగళవారం కోర్టు ప్రారంభం కాగానే తాను దాఖలు చేసిన వ్యాజ్యం విచారణకు నోచుకోవడం లేదని.. త్వరగా విచారణ జరపాలని ధర్మాసనం ముందు న్యాయవాది నారాయణస్వామి ప్రస్తావించారు. దీంతో సమ్మె విరమించి రావాలని న్యాయవాదికి సూచించింది.

## ఆస్తులకు సంబంధించిన పత్రాలన్నీ ఇవ్వండి

### అగ్రిగోల్డ్ యాజమాన్యం, బ్యాంకులకు హైకోర్టు ఆదేశం

**ఈనాడు, హైదరాబాద్:** అగ్రిగోల్డ్ కంపెనీలను స్వాధీనం చేసుకోవడానికి ముందుకొచ్చిన సుభాష్ చంద్ర ఫౌండేషన్ (ఎస్సెల్-జీ గ్రూప్)కు ఆస్తులకు సంబంధించిన పత్రాలన్నీ సమర్పించాలని అగ్రిగోల్డ్ యాజమాన్యాన్ని, బ్యాంకులను మంగళవారం ఉమ్మడి హైకోర్టు ఆదేశించింది. కోట్ల రూపాయలు డిపాజిట్లు వసూలు చేసి బోర్డు తిప్పేసిన అగ్రిగోల్డ్ వ్యవహారంపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలంటూ దాఖలైన వ్యాజ్యంపై మంగళవారం జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ ఎస్.వి.భట్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. అగ్రిగోల్డ్ కంపెనీకి సంబంధించిన ఆస్తి, అప్పుల మదింపు ప్రక్రియ ప్రారంభమైందని ఎస్సెల్ తరఫు సీనియర్ న్యాయవాది శ్రీరఘురాం తెలిపారు. ఇప్పటివరకు జరిగిన ప్రక్రియకు సంబంధించి స్థాయీ నివేదికను సమర్పించామని తెలిపారు. తమకు కావాల్సిన సమాచారం, పత్రాల గురించి అగ్రిగోల్డ్ యాజమాన్యానికి చెక్‌లిస్ట్ ఇచ్చామన్నారు. వారు సహకరిస్తే ఈ ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని చెప్పారు. దీనిపై అగ్రిగోల్డ్ యాజమాన్యం తరఫు సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ స్పందిస్తూ స్వాధీన ప్రక్రియకు సహకారం అందిస్తామని చెప్పారు. రెండు వారాల్లో తమ వద్ద అన్ని పత్రాలనూ అందజేస్తామని హామీ ఇచ్చారు. వాదనలను విన్న ధర్మాసనం ఆస్తులకు సంబంధించిన పత్రాలన్నీ ఎస్సెల్ గ్రూపునకు అందజేయాలని అగ్రిగోల్డ్ యాజమాన్యాన్ని ఆదేశించింది. పత్రాలు లేని పక్షంలో రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి ధ్రువీకరణ పత్రాలు తీసుకుని అందజేయాలంది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

## పదవీకాలం పొడిగిస్తేనే జీతభత్యాలు

### ఎస్వీబీసీ సీఈవోకు స్పష్టం చేసిన హైకోర్టు

**ఈనాడు, హైదరాబాద్:** తితిదే ఆధ్వర్యంలో నడిచే శ్రీవెంకటేశ్వర భక్తి ఛానల్ (ఎస్వీబీసీ) సీఈవో ఎ.వి.నర్సింహారావు పదవీకాలం పొడిగింపునకు ఎలాంటి ఉత్తర్వులు లేకపోయినా జీతభత్యాలు తీసుకోవడంపై హైకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. పొడిగింపు వస్తే తప్ప జీతభత్యాలు తీసుకోవద్దని స్పష్టం చేసింది. ప్రమాణ పత్రాలు దాఖలు చేయడం కోసం విచారణను ఈనెల 27కు వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. అక్రమాలపై తిరుపతికి చెందిన భక్తుడు పి.నవీన్‌కుమార్‌రెడ్డి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే.

తిరుమలలోని హోటళ్లలో ఆహార పదార్థాలు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న వ్యాజ్యంపై మరోసారి విచారణ జరిపిన ధర్మాసనం.. తనిఖీల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.

## గుప్పెడంత శిశువు..!

### ప్రాణం పోసిన బెజవాడ వైద్యులు

**విజయవాడ, న్యూస్‌టుడే:** ఆ శిశువు కళ్లు తెరిచింది కేవలం 450 గ్రాముల బరువుతో! కాగితపు పొరలాంటి చర్మం, బొటనవేలంత పాదాలు, అతి చిన్న అవయవాలతో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న పసికందు ప్రాణాలను విజయవాడ రెయిన్‌బో ఆస్పత్రి వైద్యులు కాపాడారు. దేశంలోనే అతితక్కువ బరువుతో ఊపిరి పోసుకున్న శిశువుల్లో ఒకడైన ఈ చిన్నారి.. ఇపుడు పూర్తి ఆరోగ్యంతో ఉన్నాడు.

శిశువు తల్లి రమాసాయిసత్య గర్భం దాల్చే సమయానికి అనారోగ్య సమస్యలతో ఉంది. గతంలో ఆమెకు గర్భస్రావం కాగా, మళ్లీ నెలలు నిండకుండానే కాన్పయ్యే పరిస్థితి తలెత్తింది. గత ఏడాది సెప్టెంబరు 25న రమాసాయి విజయవాడ ఆస్పత్రిలో చేరింది. 27న ఆస్పత్రి వైద్యులు ఉమా మిక్కిలినేని పర్యవేక్షణలో ఆమెకు శస్త్రచికిత్స చేయగా, 450 గ్రాములున్న బాలుడికి జన్మనిచ్చింది. గాలిలో దీపంలా ఉన్న ఆ శిశువు సంరక్షణకు వైద్యులు ఎన్నో విధాల శ్రమించారు. డాక్టర్ వంశీ శివ రామరాజు పర్యవేక్షణలో ఐదు నెలలుగా వెంటిలేటర్‌పై ఉంచి కంటికి రెప్పలా కాచారు. ప్రస్తుతం బాబు పూర్తి ఆరోగ్యంతో ఉన్నాడు. ఇంత తక్కువ బరువుతో పుట్టిన శిశువును కాపాడిన సంఘటన ఆంధ్రప్రదేశ్‌లో ఇదే మొదటిసారని ఆస్పత్రి వైద్యులు పేర్కొన్నారు.

## పదోన్నతుల్లో అక్రమాలను సరిదిద్దాలి

**ఈనాడు, అమరావతి:** పురపాలిక ఉపాధ్యాయుల పదోన్నతుల్లో చోటుచేసుకున్న అక్రమాలను సరిదిద్దాలని సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్రమ పదోన్నతులను రద్దు చేసి.. అర్హులైన వారికి పదోన్నతి కల్పించాలని పురపాలక మంత్రి నారాయణను కోరామని, సమస్య పరిష్కారం కాకుంటే మార్చి మొదటి వారంలో మంత్రి ఇంటి వద్ద దీక్ష చేస్తామని మంగళవారం ప్రకటించారు.

## నీట్ పీజీ వైద్య ర్యాంకుల్లో మార్పు!

- మినహాయించిన వారితో మళ్లీ కొత్త ర్యాంకులు!
- మార్చి రెండో వారంలో జాతీయ స్థాయి సీట్లకు కౌన్సెలింగ్

**ఈనాడు, అమరావతి:** పీజీ వైద్య విద్యార్థులకు కేటాయించిన ర్యాంకులు మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. నీట్ రాసిన విద్యార్థుల్లో 9,000 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ చివరి సంవత్సరం మార్కుల వివరాల పూర్తి సమాచారం సమర్పించలేదు. దీంతో వారి వివరాలను మినహాయించి జాతీయ పరీక్షల బోర్డు (నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్) గత వారం ర్యాంకులు ప్రకటించింది. ఈ జాబితాను బోర్డు పంపించగా కేంద్ర ఆరోగ్య శాఖ పరిగణనలోనికి తీసుకోలేదు. 9,000 మంది విద్యార్థుల నుంచి వివరాలను సేకరించి మళ్లీ కొత్త జాబితాను పంపించాలని సూచించింది. ఇందుకు సంబంధించిన చర్యలు ఒకట్రెండు రోజుల్లో పూర్తి కానున్నాయి. ఆ తరువాత కొత్త ర్యాంకుల జాబితా వస్తుందని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ సీవీ రావు తెలిపారు. ప్రైవేట్ కళాశాలల్లో సీట్ల భర్తీకి ఏప్రిల్ మొదటి వారంలో కౌన్సెలింగ్ నిర్వహించే అవకాశాలు ఉన్నాయని వివరించారు. మరోవైపు, ప్రభుత్వ పరిధిలో ఉన్న 50% సీట్లలో ఇన్‌సర్వీసు వైద్యులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వ వైద్యుల సంఘం విజ్ఞప్తిచేస్తోంది. గతంలో రాష్ట్రంలో 30% సీట్లను వీరికి కేటాయించేవారు.

**నీట్ అర్హతలో సడలింపు!:** నీట్‌ను 1200 మార్కులకు నిర్వహించారు. 320 మార్కుల కటాఫ్‌తో ర్యాంకులను ప్రకటించారు. దేశవ్యాప్తంగా 40వేల సీట్లు ఉన్నాయి. 1.5 లక్షల మంది విద్యార్థులు నీట్ రాయగా కేవలం 70వేల మంది మాత్రమే అర్హత సాధించారు. తక్కువ మంది అర్హత సాధించినందున కొన్నిచోట్ల సీట్ల భర్తీకి ఇబ్బంది రావొచ్చునని అధికారులు భావిస్తున్నారు. అందువల్ల నిర్దేశిత కటాఫ్‌పై పునరాలోచన జరిగే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ విషయమై ఢిల్లీస్థాయిలో తర్జనభర్జనలు జరుగుతున్నాయి. మరోవైపు, కేంద్రం నుంచి ఈ నెలాఖరులోగా ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీజీ వైద్య సీట్ల పెంపు సమాచారం వస్తుందని వైద్య విద్య సంచాలకుడు (అకడమిక్) డాక్టర్ బాబ్జీ వెల్లడించారు.

★ 2019-20 విద్యా సంవత్సరానికి ఒంగోలు, అనంతపురం, శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీజీ వైద్య సీట్లకు, శ్రీకాకుళం, అనంతపురం కడప వైద్య కళాశాలల్లో యూజీ సీట్లు 50 చొప్పున అదనంగా సాధించేందుకు ఉన్న అవకాశాలపై మంగళవారం అధికారులు చర్చించారు. కేంద్రం నుంచి వచ్చిన నిధుల వ్యయానికి సంబంధించిన యూసీలను త్వరితగతిన పంపించాలని ఈ సందర్భంగా ఢిల్లీ అధికారులు రాష్ట్ర అధికారులకు సూచించారు.

## రాయితీ కొనసాగింపు

### పోలవరం గుత్తేదారుకు వెసులుబాటు

**ఈనాడు, అమరావతి:** పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ప్రధాన గుత్తేదారుకు మొబిలైజేషన్ అడ్వాన్సుపై వడ్డీ రాయితీతోపాటు ఆ వడ్డీ మొత్తానికి బ్యాంకు గ్యారంటీనీ ప్రభుత్వం మినహాయించింది. గత మంత్రివర్గ సమావేశంలో దీనికి ఆమోదం లభించింది. అయితే దీనిపై అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుత్తేదారుకు రాయితీ ఇచ్చే అంశాన్ని ప్రతిపాదించేది పెద్దలైతే ఆ బాధ్యతలను తమపైకి నెట్టివేస్తున్నారని జల వనరులశాఖ అధికారులంటున్నారు. తమ ప్రమేయం, ఆమోదం లేకుండానే గుత్తేదారులకు రాయితీలిస్తూ ఫైళ్లలో, రికార్డుల్లో నమోదుచేసే బాధ్యతను అధికారులకు కట్టబెడుతున్నారని, తమపై ఒత్తిడి పెరిగిపోతోందని చెబుతున్నారు. పోలవరం ప్రాజెక్టులో ప్రధాన గుత్తేదారుకు దాదాపు రూ.384 కోట్ల వరకూ మొబిలైజేషన్ అడ్వాన్సుగా చెల్లించారు. ప్రధాన గుత్తేదారు ఆర్థిక పరిస్థితి, ప్రాజెక్టు త్వరగా పూర్తి చేయాలనే కారణాలతో దీనిపై రాయితీలిస్తున్నట్లుగా ప్రభుత్వం గతంలో పేర్కొంది. మళ్లీ దీనిని 2018 సెప్టెంబరు వరకూ పొడిగిస్తూ ఇటీవల నిర్ణయం తీసుకుంది. 2018 సెప్టెంబరు వరకూ అడ్వాన్సుపై 80 కోట్ల వరకు వడ్డీగా లెక్కించారు.

★ వెలిగొండ ప్రాజెక్టులోనూ రూ.58 కోట్ల బ్యాంకు గ్యారంటీల నుంచి గుత్తేదారు మినహాయింపులను కోరుతున్నారు. దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

## వర్సిటీ భవిష్యత్తును దెబ్బతీసే జీఓ 8ను రద్దుచేయాలి

- ఆందోళనలో ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉద్యోగులు
- ప్రభుత్వానికి సహకరించాలి
- మంత్రి కామినేని శ్రీనివాస్

**ఈనాడు, అమరావతి:** విశ్వవిద్యాలయ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిన జీఓ8ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉద్యోగులు చేపట్టిన ఆందోళన రెండో రోజుకు చేరుకుంది. ఈ జీఓ ద్వారా వర్సిటీ సొంత నిధుల నుంచి రూ.167.70 కోట్లను వైద్య విద్య సంచాలక కార్యాలయ బోధనాస్పత్రుల అభివృద్ధికి కేటాయించడాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. విశ్వవిద్యాలయ ఆవరణలో ప్రదర్శనలు నిర్వహించారు. రాష్ట్ర విభజన అనంతరం విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న కళాశాలలు 349కు చేరుకోవడంవల్ల ఆదాయం సగానికి సగం తగ్గిపోయిందని ఉద్యోగులు పేర్కొంటున్నారు. 58:42(ఏపీ తెలంగాణ విభజన) నిష్పత్తి ప్రకారం 123 కోట్ల రూపాయలను పక్కనపెట్టగా.. రూ.320 కోట్లు మిగిలాయి. అందులో 167 కోట్లను బోధనాస్పత్రులకు ఇస్తే మిగిలే మొత్తంతో విశ్వవిద్యాలయ కార్యకలాపాలు కొనసాగించడం కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఏడాదికి రూ.34 కోట్ల నుంచి 50 కోట్ల వరకు వ్యయం అవుతుండగా ప్రభుత్వం రూ.6 కోట్లను మాత్రమే ఇస్తుందని విశ్వవిద్యాలయ అభివృద్ధి, వనరుల సమీకరణ, పరిరక్షణ సమితి పేర్కొంది. ప్రభుత్వం జీఓ 8ను రద్దుచేసే వరకు పోరాడతామన్నారు. ఇది ఇలాగే కొనసాగితే పరీక్షలు, ఫలితాల వెల్లడి, యూజీ, పీజీ వైద్య విద్యార్థులకు ధ్రువపత్రాలను అందచేయడం తదితరాలపై తీవ్ర ప్రభావం కనిపిస్తుంది.

### ముఖ్యమంత్రి నిర్ణయమది: మంత్రి కామినేని

విశ్వవిద్యాలయ నిధులను బోధనాస్పత్రుల అభివృద్ధికి కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. తెలంగాణకు ఈ నిధులు పంపించాల్సిన అవసరం ఉండదు. దీనివల్ల నిధుల సమస్య రాదు. విశ్వవిద్యాలయం కూడా ప్రభుత్వంలో ఒక భాగమే. ఉద్యోగులు ప్రభుత్వానికి సహకారం అందించాలి.



## అచ్చంగా.. ఇద్దరూ ఒక్కటిగా

### ఒకే వేదికపైకి 74 కవల జంటలు

రూపంలోనే కాదు.. మాటలు, చేతలు, అలవాట్లలోనూ ఒకే పోలిక ఉన్న 74 కవల జంట పిల్లలు ఒకచోట కలసిన అరుదైన సందర్భం మంగళవారం తిరుపతి అర్బన్ మండలం మంగళం సమీపంలోని స్ప్రింగ్‌డేల్ పబ్లిక్ స్కూల్లో చోటుచేసుకుంది. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కవలల దినోత్సవంలో 74 కవల జంట పిల్లలు పాల్గొని అందరినీ అలరించారు.

– న్యూస్‌టుడే, తిరుపతి

## నేటి నుంచి టెట్ ప్రారంభం

- పేపర్-1తో మొదలు..మార్చి 2 వరకూ కొనసాగనున్న పరీక్షల ప్రక్రియ
- తొలిసారిగా ఆన్‌లైన్‌లో నిర్వహణ

**ఈనాడు, అమరావతి:** ఉపాధ్యాయ అర్హత పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా 190 కేంద్రాల్లో బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి రెండోతేదీ వరకు జరగనున్న ఈ పరీక్షకు మొత్తం 4,46,833మంది హాజరుకానున్నారు. బుధవారం రాత్రి వరకు 97.76 శాతం మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతలుగా పరీక్షలు నిర్వహిస్తారు. ఈనెల 21-24వ తేదీ వరకు పేపర్-1, ఈనెల 25నుంచి 28వరకు పేపర్-2, మార్చి ఒకటి, రెండున పేపర్-3 నిర్వహిస్తారు. భాషాపండితుల అభ్యర్థులు తక్కువగా ఉన్నందున వచ్చే నెల రెండున అదనపు సెషన్స్ కింద పేపర్-1, 2 పరీక్షలు నిర్వహించనున్నారు. మొదటిసారిగా ఈ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు.

### ఇవి తప్పనిసరి..

★ పరీక్ష రాసే అభ్యర్థులు హాల్‌టిక్కెట్‌తోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డును తీసుకువెళ్లాలి.

★ హాల్‌టిక్కెట్లలో ఏమైనా మార్పులున్నట్లు గమనిస్తే అభ్యర్థులు వాటిని, పరీక్షా కేంద్రంలోని నామినల్ రోల్స్‌లోనూ మార్పు చేయించుకోవాలి

★ ప్రతి బహుళ ఐచ్ఛిక ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది.

★ ప్రశ్నకు జవాబు రాసిన అనంతరం అభ్యర్థులు తప్పనిసరిగా సేవ్ చేయాలి.

★ రెండున్నర గంటల పరీక్ష పూర్తయిన తర్వాత సబ్‌మిట్ చేయాలి

★ పరీక్ష సమయం పూర్తయ్యే వరకు ఎవ్వరూ బయటకు రాకూడదు. అత్యవసరమైతే ఇన్విజిలేటర్‌ను సంప్రదించాలి

### ఏప్రిల్ 22 నుంచి ఏపీ ఎంసెట్

ఈనెల 21 నుంచి మార్చి 3వ తేదీ వరకూ టెట్ నిర్వహిస్తున్నామని మంత్రి గంటా తెలిపారు. మార్చి 4న ప్రాథమిక కీ విడుదల చేస్తామని చెప్పారు. 16న ఫలితాలు విడుదల చేస్తామని చెప్పారు. 2016-18 డైట్ అభ్యర్థులకు టెట్‌తోపాటు డీఎస్సీలోనూ అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఏపీ ఎడ్‌సెట్ ఏప్రిల్ 19న, ఏపీ లాసెట్ ఏప్రిల్ 19న, ఏపీ ఎంసెట్ ఇంజినీరింగ్ ఏప్రిల్ 22 నుంచి 25 వరకూ, మెడిసిన్ 26వ తేదీన, ఏపీ ఐసెట్ మే 2న, ఏపీ ఈసెట్ మే 3న, ఏపీ పీజీఈ సెట్ మే 10న, ఏపీ పీఈసీఈటీ మే 4న నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఏసీబీ కేసుల్లో అరెస్టులపై ఆలోచించండి

### ఏసీబీ డీజీ ఠాకూర్‌తో ఎన్జీవో సంఘం నేతలు

**ఈనాడు, అమరావతి:** దేశవ్యాప్తంగా రెండు, మూడు రాష్ట్రాల్లో తప్ప ఏసీబీ కేసుల్లో అరెస్టులు చేయడం లేదని, మన రాష్ట్రంలోనూ ఆ దిశగా ఆలోచించాలని ఏసీబీ డైరెక్టర్ జనరల్(డీజీ) ఆర్.పి.ఠాకూర్‌ను ఏపీ ఎన్జీవో నేతలు కోరారు. రిమాండు కాలం కూడా తక్కువ ఉండేలా ఉండేలా చూడాలని విన్నవించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌బాబు నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంగళవారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈసందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. "ఇటీవల పెరుగుతున్న ఏసీబీ దాడుల ఘటనలు, ఉద్యోగులకు ఇబ్బందికరంగా ఉన్నాయి. అవినీతికి పాల్పడిన ఉద్యోగులపై చర్యలు తీసుకోవడాన్ని నాయకులుగా మేం హర్షిస్తాం. అవినీతి కేసుల్లో ఉద్యోగుల అరెస్టులవల్ల వారికుటుంబ సభ్యులు మానసికంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు" అని అన్నారు.

### అధికారులపై వ్యక్తిగత ఆరోపణలు వద్దు

అధికారులపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం తగదని ఏపీ ఐకాస అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీశ్ చంద్ర, నిఘా విభాగాధిపతి ఏబీ వెంకటేశ్వరరావుపై ఇటీవల వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ఈనాడు



## ఉమ్మడి పోరు అవసరం: మంత్రి గంటా



శిలాఫలకం ఫొటో చూపుతున్న మంత్రి గంటా శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉమ్మడి పోరాటం అవసరమని ఏపీ విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్ష నేత జగన్ కేసుల్లోంచి బయటపడటం కోసం రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రంవద్ద తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. పాదయాత్రలో స్పందన రాకపోవడంతో ఎంపీల రాజీనామా అంశాన్ని పైకి తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు. అవిశ్వాస తీర్మానం కంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని చెప్పారు. భాజపా నేతలు చెబుతున్నట్లుగా ఆంధ్రాకు నిధులు ఇవ్వలేదన్నారు. రాష్ట్ర విభజనలో భాగంగా రాష్ట్రంలో 7 విద్యాలయాలను స్థాపిస్తామని ప్రకటించారని, వాటిలో ఐదు ఇచ్చినా.. నేటికీ తాత్కాలిక భవనాల్లోనే తరగతులు జరుగుతున్నాయని చెప్పారు. 2015లో అప్పటి కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ చేతుల మీదుగా శంకుస్థాపన చేసినా.. ఇప్పటికీ పునాదుల్లోనే విద్యాసంస్థ నిర్మాణం ఉందని తెలిపారు.

## తెదేపాకు కావలసింది అభివృద్ధి: ఉపముఖ్యమంత్రి చినరాజప్ప

కొత్తవలస, న్యూస్‌టుడే: తెదేపాకు కావలసింది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి తప్ప రాజకీయం కాదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, హోంశాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప స్పష్టం చేశారు. విజయనగరం జిల్లా శృంగవరపుకోట నియోజకవర్గంలోని లక్కవరపుకోటలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఏర్పాటు చేసిన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే నివాసంలో చినరాజప్ప విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మంత్రి పదవుల నుంచి తప్పుకొంటామని భాజపా నాయకులు చేసిన ప్రకటనలపై ఆయన స్పందిస్తూ తప్పుకుంటామంటే మాకేమి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. కావలసిన నిధులు మంజూరు చేస్తే భాజపాతో కలసి ఉంటామని అన్నారు. జగన్ మాటలపై ప్రజలకు నమ్మకం లేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అందరూ కలసి పనిచేయాలని ప్రజలు కోరుకుంటున్నారని, ప్రజల అభీష్టానికి అనుగుణంగా తెదేపా నడుచుకుంటుందని చినరాజప్ప చెప్పారు.

## ధైర్యముంటే అవిశ్వాసం పెట్టండి: మంత్రి సోమిరెడ్డి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ప్రత్యేక హోదా కోసం దమ్ము, ధైర్యం ఉంటే పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం పెట్టాలని వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డికి వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సవాల్ విసిరారు. ఆయన మంగళవారం కర్నూలులో మాట్లాడారు. కేంద్రంలో భాజపాతో మిత్రపక్షంగా ఉన్న తామే ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నామన్నారు. కేంద్ర బడ్జెట్‌ను జగన్ మీడియా భగవద్గీతతో పోల్చిందన్నారు. విజయసాయిరెడ్డికి నోరెత్తే దమ్ము లేదన్నారు. 2016 నుంచి జగన్ తమ ఎంపీలు రాజీనామాలు చేస్తారని చెబుతూనే ఉన్నారని ఎద్దేవా చేశారు. ఒక పార్టీ పోతే మరోటి రెడీగా ఉందన్న దేవదాయశాఖ మంత్రి మాణిక్యాలరావు మాటలకు సోమిరెడ్డి స్పందించారు. జగన్ కేసుల నుంచి బయటపడేందుకు భాజపాతో జతకడుతున్నట్లు మంత్రి మాణిక్యాలరావు మాటలు చెబుతున్నాయన్నారు. రాష్ట్రంలో అమాయక రైతులకు బీటీ-3 పత్తి విత్తనాలు అంటగడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సోమిరెడ్డి హెచ్చరించారు.

## పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటా: మంత్రి కామినేని

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ, కేటాయింపుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య ప్రస్తుతం నెలకొన్న ప్రతిష్టంభన నేపథ్యంలో భాజపా కేంద్ర నాయకత్వం తీసుకునే ఏ నిర్ణయాన్నికైనా కట్టుబడి ఉంటానని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం తిరుపతిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని భాజపాకు, రాష్ట్రంలోని తెదేపాకు మధ్య చోటుచేసుకున్న విభేదాలపై విలేకరులు ప్రశ్నించగా.. భాజపా నాయకత్వ నిర్ణయం మేరకు నడుచుకుంటానని తెలిపారు. భాజపా మంత్రుల వ్యాఖ్యానాలపై తాను స్పందించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. నవ్యాంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం ఎంతో చేసిందని ఇంకా చేయాల్సి ఉందని తెలిపారు. ప్రత్యేక హోదా కోసం జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్ని పార్టీల నాయకులతో కలసి వెళ్లడం మంచిదేనని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పవన్ ప్రయత్నాన్ని అభినందిస్తున్నట్లు వెల్లడించారు.



## 'కేంద్రం నుంచి అన్ని ప్రయోజనాలు అందాయి'

రాజమహేంద్రవరం(ఆనందనగర్), న్యూస్‌టుడే: ''విభజన వల్ల నష్టపోయిన రాష్ట్రానికి కేంద్రం అన్ని ప్రయోజనాలూ చేకూర్చింది. రాష్ట్రానికి ఏమీ చేయలేదని ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారం అసత్యం. ఈ విషయాన్ని తెలియజేసేందుకు ప్రజల్లోకి వెళతాం'' అని భాజపా జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు రాజమహేంద్రవరంలో జరిగిన భాజపా మహిళా మోర్చా సమావేశంలో పేర్కొన్నారు.



# పొత్తు తెగదెంపులకేనా?

- తెదేపా నేతల విమర్శలపై భాజపా నేతల అంచనా
- ప్రధాని, అమిత్‌షా స్పందించకపోవడానికి కారణమదేనా?
- 'అపాయింట్‌మెంట్' వ్యవహారమే కారణమా?



ఈనాడు - దిల్లీ

ఎన్డీయేతో తెగదెంపులు చేసుకోవడానికి తెదేపా సిద్ధమవుతుందేమోనన్న అనుమానాన్ని ఆంధ్రప్రదేశ్ భాజపా నేతలు వ్యక్తం చేస్తున్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వంపై దాడిని ముఖ్యమంత్రి, ఇతర నేతలు తీవ్రతరం చేశారని వారు భావిస్తున్నారు. అంతిమంగా విభజన చట్టం కింద కేంద్రం ఏదైనా ఇస్తే అవి తీసుకుని తెగదెంపులు చేసుకుందామన్న ఉద్దేశం తెదేపాలో కనిపిస్తోందని విశ్లేషిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని లోక్‌సభలో ఘాటుగా విమర్శించిన గుంటూరు ఎంపీ జయదేవ్ గల్లాను సన్మానించడాన్ని కమలదళం నేతలు ప్రశ్నిస్తున్నారు. ప్రధాన మంత్రిని విమర్శించిన వ్యక్తిని సన్మానించడం ద్వారా తెదేపా ఏం సంకేతం ఇవ్వదలచుకుందో స్పష్టమవుతోందని పేర్కొంటున్నారు. మరోవైపు కేంద్రం సాయం చేసినా.. చేయకపోయినా వాళ్లు బయటకు వెళ్లేలాగే కనిపిస్తున్నారు కాబట్టి ఇచ్చి ఏం లాభమన్న అభిప్రాయానికి కేంద్ర ప్రభుత్వం వచ్చినట్లు కనిపిస్తోందంటున్నారు. ముఖ్యమంత్రి అడిగినా అపాయింట్‌మెంట్ ఇవ్వని ప్రధానమంత్రి కార్యాలయం... వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్న భావన... చంద్రబాబు వైఖరిలో మార్పు రావడానికి కారణమై ఉండవచ్చని అన్న వ్యాఖ్యలతో భాజపా నేతలు ఏకీభవించడం లేదు. ప్రధాన మంత్రిని చాలామంది మంది ఎంపీలు తరచూ కలుస్తుంటారు. అరకు ఎంపీ కొత్తపల్లి గీతకు అపాయింట్‌మెంట్ ఇవ్వారు కదా అని వారు ఉదహరిస్తున్నారు. వివిధ పక్షాల ఎంపీలకు అపాయింట్‌మెంట్ ఇచ్చిన ప్రధాని మోదీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు అపాయింట్‌మెంట్ ఇవ్వడంలేదన్న వాదనలు తరచూ వినిపిస్తున్నాయి కదా? దానికి కారణమేమై ఉండొచ్చన్న? ప్రశ్నకు భాజపా నాయకులు సమాధానం చెప్పలేకపోతున్నారు. తెదేపా తెగదెంపులు చేసుకోవడానికి సిద్ధమైందన్న ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సమస్యల పరిష్కారాన్ని పక్కనపెట్టినట్లు చెబుతున్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో మంత్రులు ఏ నిర్ణయం తీసుకున్నా అంతిమంగా ప్రధానమంత్రి కార్యాలయం ఆమోద ముద్ర వేస్తే తప్ప కార్యరూపం దాల్చే అవకాశం లేదంటున్నారు. ఇది తెలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర సాయంపై ఆశలు వదిలిపెట్టుకున్నట్లు చెబుతున్నారు. తెలుగుదేశం పార్టీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతోందని కేంద్ర నాయకత్వం భావిస్తోందని రాష్ట్ర భాజపా నాయకులు పేర్కొంటున్నారు. అడిగితే మోదీ ఇస్తారు తప్పితే... ఒత్తిడి చేస్తే అస్సలు లొంగరని, తెదేపా ఆ అంశాన్ని గుర్తించాలని సూచిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన సాయంపై ఈనెల 10వ తేదీన కంభంపాటి హరిబాబు విడుదల చేసిన 27 పేజీల సమాచారానికి కౌంటర్‌గా తెలుగుదేశం పార్టీ పత్రికా ప్రకటన విడుదల చేయడం, అందులో కొన్ని విషయాల్లో కేంద్రం పైసా ఇవ్వలేదని చెప్పడాన్ని పీఎంవో సీరియస్‌గా తీసుకున్నట్లు పేర్కొంటున్నారు. ఆంధ్రప్రదేశ్ పత్రికల్లో వచ్చే ప్రకటనలు, సంపాదకీయాల అనువాద కాపీలు రోజూ పీఎంవోకు వెళ్తున్నాయని చెబుతున్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సయోధ్య కుదిర్చే పెద్ద మనుషులు లేకపోవడం, చొరవ తీసుకుని ప్రధాని మోదీ, అమిత్ షాలకు చెప్పే స్థాయి నాయకులు లేకపోవడంవల్ల పరిస్థితి చేయి దాటే స్థాయికి వెళ్తున్నట్లు పేర్కొంటున్నారు. వెంకయ్య నాయుడు క్రియాశీల రాజకీయాల్లో ఉన్నప్పుడు ఆయన చొరవ తీసుకుని వివాదాలు రేగకుండా ఇరువర్గాలకూ జాగ్రత్తలు చెప్పేవారని, ఇప్పుడు ఆయన రాజ్యాంగబద్ధ హోదాలోకి వెళ్లడంవల్ల అలాంటి ప్రయత్నాలు చేసే పరిస్థితి లేకపోతోందని ఉదహరిస్తున్నారు.

## తెదేపా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలి

### సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

తిరుపతి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా అన్ని పార్టీలతో కలిసి కేంద్ర ప్రభుత్వంపై తెలుగుదేశం అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైకాపా అవిశ్వాస తీర్మానం వలన పెద్దగా ప్రయోజనం లేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామన్న కాంగ్రెస్‌కు పార్లమెంట్‌లో ఎక్కువ మంది సభ్యులున్నారని, తెదేపా సహకారంతో అవిశ్వాస తీర్మానం పెట్టడం ద్వారా కేంద్రంపై ఒత్తిడి తేవచ్చని చెప్పారు. ప్రత్యేక హోదా సాధనకు రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లడం మంచి ఆలోచన అన్నారు. అంతకుముందు తెదేపా తన ఎజెండాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక ప్యాకేజీకి కాక, ప్రత్యేక హోదా కోసమైతేనే తెదేపాకు మద్దతిస్తామన్నారు. ప్రత్యేక హోదా అమలుకు వచ్చేనెల 6న దిల్లీలో అన్ని పార్టీలతో ధర్నా చేయనున్నట్లు పేర్కొన్నారు.

## అఖిలపక్షం అవసరం: సీపీఐ

విజయవాడ, న్యూస్‌టుడే: విభజన హామీల అమలు, ప్రత్యేక హోదా, కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తదితర డిమాండ్ల సాధనకు తక్షణం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మంగళవారం లేఖ రాశారు. నాలుగేళ్లుగా ప్రతి బడ్జెట్‌లోనూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న కేంద్రంపై ఒత్తిడి తేవడంలో తెదేపా విఫలమయిందని మండిపడ్డారు.

# చంద్రబాబు పెద్ద దళారీ

- రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధరలేదు
- నేను అధికారంలోకి వస్తే రైతులకు ఏటా రూ.12,500 సాయం
- ప్రజా సంకల్పయాత్రలో జగన్



చౌటపాలెంలో పొగాకు రైతులతో మాట్లాడుతున్న జగన్

పొన్నలూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో దళారీ ప్రభుత్వం నడుస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్ద దళారీ అని వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర అందడం లేదని, రైతుల పంటలను దళారులు దోచుకుంటున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాసంకల్పయాత్రలో 93వ రోజైన మంగళవారం ఆయన ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలంలోని గ్రామాల్లో 13.5 కిలోమీటర్ల దూరం నడిచారు. తిమ్మపాలెంలో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రుణమాఫీ పేరిట చంద్రబాబు రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేశారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక హెరిటేజ్ డెయిరీ కోసం జిల్లాల్లోని సహకార డెయిరీలను నష్టాల్లోకి నెడుతున్నారని ఆరోపించారు. శనగ, కంది, జామాయిల్, మినుముల వంటివన్నీ తక్కువ ధరకు కొనుగోలు చేసి హెరిటేజ్ దుకాణాల్లో ఎక్కువ ధరలకు అమ్ముతున్నారని వ్యాఖ్యానించారు. తాను అధికారంలోకి వస్తే రైతులకు ఏటా మే నెలలోనే రూ.12,500 సాయం అందిస్తామన్నారు. రోజుకు 9 గంటలు వ్యవసాయి విద్యుత్తు అందిస్తామని, రైతులు బోర్లు తవ్వుకునేందుకు ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, స్థిరీకరణ నిధి ద్వారా రైతులకు ఆదుకుంటామని జగన్ చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి భరోసా కల్పించేందుకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రైతులకు పశువులను పంపిణీ చేసి, వాటి పోషణకు రాయితీలు అందిస్తామన్నారు.

# బ్రిటిష్ పాలనను తలపిస్తోన్న మోదీ

- ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాల్సిందే
- ఏపీ పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి



ర్యాలీలో మాట్లాడుతున్న రఘువీరారెడ్డి. చిత్రంలో కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి తదితరులు

కర్నూలు, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలన బ్రిటిష్ పాలనను తలపిస్తోందని ఏపీ పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని కోరుతూ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రఘువీరా మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ పెద్ద నోట్లను రద్దు చేసి ప్రజలను కష్టాల్లోకి నెట్టారన్నారు. జీఎస్టీ, ఎఫ్‌డీఆర్‌ఐ వంటి సొంత నిర్ణయాలు తీసుకుని దేశాన్ని భ్రష్టుపట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

**మొదటి సంతకం హోదా పైనే..:** విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చకపోతే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం ప్రత్యేక హోదా ఇవ్వకుంటే.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేపట్టాక.. మొదటి సంతకం ప్రత్యేక హోదాపైనే ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పి.లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 19 నుంచి ఆత్మగౌరవ దీక్షలు: పల్లంరాజు

విజయవాడ, న్యూస్‌టుడే: ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని అన్ని అంశాల సాధనకు ఈ నెల 19 నుంచి 28 వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 'ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్షలు' నిర్వహిస్తున్నట్లు కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు తెలిపారు. మార్చి 2న రాష్ట్రంలో రాస్తారోకోలు; 6, 7, 8 తేదీల్లో చలో పార్లమెంటు పేరిట దిల్లీలో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని మంగళవారం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో విలేకరులకు వెల్లడించారు.

# మార్చి 21న లోక్‌సభలో అవిశ్వాసం: అంబటి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వంపై లోక్‌సభలో మార్చి 21న అవిశ్వాసం పెడతామని వైకాపా రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ప్రకటించారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైకాపా సీనియర్ నేత బొత్స సత్యనారాయణ కూడా ఇక్కడే విడిగా మాట్లాడుతూ ఎన్నికలప్పుడు భాజపా, తెదేపాకు ఓట్లు వేయమని జనసేన అధినేత పవన్ ప్రజలను అడిగారని మరి ప్రత్యేక హోదాపై మాట తప్పిన ఆ పార్టీలను ఎందుకు ఊరుకుంటున్నారని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీ వైకాపాను ప్రశ్నించడం తప్పితే అధికార పక్షాలను ఎప్పుడైనా నిలదీశారా అని అడిగారు. ప్రత్యేక హోదా సాధించాలనేది తమ పార్టీ అధినేత జగన్మోహనరెడ్డి లక్ష్యమని అందులో భాగంగా అవిశ్వాసంపై మార్చి 20 వరకు లోక్‌సభలో ఎంపీల మద్దతు కూడగట్టుకుంటామని అంబటి పేర్కొన్నారు. తాము ప్రవేశపెట్టే తీర్మానానికి సీఎం చంద్రబాబు మద్దతు ఇచ్చేలా పవన్ ఒప్పించాలని కోరారు. దీనికి చంద్రబాబు ఒప్పుకోకపోతే రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించినట్లేనని పేర్కొన్నారు.

### కేంద్ర ప్రభుత్వం కూలిపోయినా ఆశ్చర్యం లేదు: ఉండవల్లి

రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వంపై వైకాపా అవిశ్వాసం పెట్టేందుకు ముందుకురావడం ఆహ్వానించదగ్గ పరిణామమని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. దీనికి తెదేపా కూడా మద్దతు పలకాలని కోరారు. వైకాపా అవిశ్వాస తీర్మానానికి ఇతర పార్టీలు మద్దతు పలికితే ప్రభుత్వం కూలిపోయినా ఆశ్చర్యం లేదన్నారు. ఉండవల్లి అరుణ్‌కుమార్ రాజమహేంద్రవరంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్డీఏ ప్రభుత్వంలో అంతర్గతంగా అనేక విభేదాలు ఉండటం వల్ల వారు ప్రభుత్వానికి వ్యతిరేక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. భాజపా ఎంపీల్లోనే కొంత మంది ప్రధాని మోదీ విధానాల పట్ల అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. అవిశ్వాసం పెట్టమని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చెప్పడం వల్లే ఇంత స్పందన వచ్చిందన్నారు. పోలవరానికి సంబంధించి ఒక నిజాన్ని త్వరలో బయటపెట్టనున్నట్లు ఈ సందర్భంగా ఉండవల్లి ప్రకటించారు.

# గ్రూప్-I 2011 మార్కుల వెల్లడి

ఈనాడు, అమరావతి: గ్రూప్-1 (2011) మౌఖిక పరీక్షల మార్కులను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. గతనెల 21వతేదీ నుంచి మంగళవారం వరకూ ఈ పరీక్షలు జరిగాయి. 294మందికిగానూ నలుగురు గైర్హాజరయ్యారు. ఒక అభ్యర్థి అంగవైకల్యం కింద అనర్హుడయ్యాడు. అభ్యర్థులు ప్రధాన పరీక్షలో (708 మార్కులకు), మౌఖిక పరీక్షలో (75 మార్కులకు) సాధించిన మార్కులను విడివిడిగా, మొత్తం కలిపితే వచ్చిన మార్కులనూ ఏపీపీఎస్సీ వెల్లడించింది. ప్రధాన పరీక్షల్లో 408మార్కులు సాధించిన అభ్యర్థికి మౌఖిక పరీక్షలో 52.5 మార్కులొచ్చాయి. రెండింట్లో కలిపి 460.5 మార్కులను సాధించి ప్రథమ స్థానం సాధించాడు. ప్రధాన పరీక్షల్లో 386, మౌఖిక పరీక్షలో 57.5మార్కులను సాధించి మొత్తమ్మీద 455.5 మార్కులతో మరో అభ్యర్థి రెండో స్థానం సాధించాడు. ప్రధాన పరీక్షలో 386, మౌఖిక పరీక్షలో 62.5 మార్కులను సాధించి448.5 మార్కులతో మూడో స్థానాన్ని ఓ మహిళా అభ్యర్థి దక్కించుకున్నారు. పోస్టుల సంఖ్యను అనుసరించి ఎంపిక జాబితాను త్వరలో ఏపీపీఎస్సీ ప్రకటించనుంది. గ్రూప్-1 (2016) ప్రధాన పరీక్షల్లో సాధించిన మార్కులను అనుసరించి 151 మందికి మార్చి 12 నుంచి 23వ తేదీ వరకూ మౌఖిక పరీక్షలు జరగనున్నాయి.

### రెండో ర్యాంకరుగా నిలిచిన శైలజ



కానూరు, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా విజయవాడ సమీప పోరంకి విష్ణుపురం కాలనీకి చెందిన డి.శైలజ(29.సం) మంగళవారం సాయంత్రం ప్రకటించిన గ్రూపు-1 ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచారు. ఆమె జనరల్ విభాగంలో 15వ ర్యాంకు, మహిళల విభాగంలో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. 2011లో జరిగిన గ్రూపు-1 పరీక్షలకు ఆమె హాజరయ్యారు. ఆమె భర్త డాక్టర్ రాజేంద్ర.. ఐఆర్ఎస్ చేశారు. ఆయన ప్రస్తుతం విజయవాడ నగర డిప్యూటీ కమిషనర్(ఇన్‌కమ్ ట్యాక్స్)గా పనిచేస్తున్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన శైలజ బీఎస్సీ జెనెటిక్స్ చేశారు. పట్టుదలతో చదివి విజయం సాధించానని ఆమె తెలిపారు.

# కర్ణాటకలో గూండారాజ్యం: అమిత్ షా



కుక్కె సుబ్రహ్మణ్య క్షేత్రంలో సత్కారం అందుకుంటున్న అమిత్‌షా

ఈనాడు, బెంగళూరు: కర్ణాటకలో గూండా పరిపాలన సాగుతోందని భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ధ్వజమెత్తారు. హత్యలు, వివిధ మాఫియాలు, అమాత్యుల అవినీతి- ఈ మూడు ఘోరాలు రాష్ట్రాన్ని దారుణంగా పట్టి పీడిస్తున్నాయని దుయ్యబట్టారు. వీటన్నింటి విముక్తి కోసం ప్రజలు వచ్చే విధానసభ ఎన్నికల్లో భాజపాకు పట్టంకట్టాలని కృత నిశ్చయంతో ఉన్నారనే విశ్వాసం వ్యక్తం చేశారు. మూడు రోజుల పాటు సాగనున్న కర్ణాటక కోస్తా తీర ప్రాంత పర్యటనకు మంగళవారం ప్రసిద్ధ పుణ్య క్షేత్రం కుక్కెలో ఆయన శ్రీకారం చుట్టారు. సాయంత్రం దక్షిణ కన్నడ జిల్లా సూరత్కల్ పట్టణంలో మాధ్యమ ప్రతినిధులతో మాట్లాడారు. దేశంలోకెల్లా సిద్ధరామయ్య అంతటి అవినీతి పరుడిని చూడలేదన్నారు. కర్ణాటకలో నాలుగేళ్ల వ్యవధిలో 22 మంది హిందు కార్యకర్తలు దారుణంగా హత్యకు గురయినప్పటికీ పాలకులు ఇప్పటి వరకూ హంతకుల్ని పట్టుకుని శిక్షించలేదని ఆరోపించారు.

**విద్వత్ భాజపా కార్యకర్త కాదు...**

బెంగళూరులోని శాంతినగర్ ఎమ్మెల్యే హ్యారిస్ కుమారుడు మహమ్మద్ నలపాడ్ చేతిలో గాయపడిన విద్వత్ అనే యువకుడు భాజపా కార్యకర్త అయినందునే నిందితులపై చర్యలు తీసుకోలేదని మొదట ప్రభుత్వంపై చంద్ర నిప్పుల్ని కురిపించిన అమిత్ షా సాయంత్రానికి మాటమార్చారు. విద్వత్ తమ పార్టీ కార్యకర్త కాదని తన పొరబాటును వ్యక్తం చేశారు.

స్వాతంత్ర్యానంతరం 50 ఏళ్లల్లో భవిష్యత్ ద్వారాలు మూసుకుని పోయి అవినీతి భారతం అవతరించిందన్నారు. నాలుగేళ్ల కిందట తిరిగి దేశాన్ని ప్రగతి పథంలోకి నడిపించే చర్యలు ఆరంభమయ్యాయని అన్నారు. సోమవారం రాత్రి కుక్కె సుబ్రహ్మణ్యంలోని అదిశేష అతిథి గృహంలో బస చేసిన అమిత్ షా జ్వరంతో బాధ పడ్డారు. వైద్యులు చికిత్స చేశారు. వైద్యుల సలహా ప్రకారం మంగళవారం జరిగిన సభలు, సమావేశాల్లో ఆయన కూర్చొనే ప్రసంగించారు.

## సూపర్‌ఫాస్ట్ రైలుకు తప్పిన ప్రమాదం



విరిగిన స్ప్రింగ్ ● మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

బిట్రగుంట, న్యూస్‌టుడే: హౌరా నుంచి కన్యాకుమారికి వెళ్లే సూపర్‌ఫాస్ట్ రైలుకు ముప్పు తప్పింది. ఓ బోగీ అడుగభాగాన ట్రాలీపై ఉన్న స్ప్రింగ్ విరగడాన్ని ఒంగోలులో సిబ్బంది గుర్తించి అప్రమత్తం చేయడంతో శ్రీపొట్టిశ్రీ రాములు నెల్లూరు జిల్లా బిట్రగుంటలో మరమ్మతులు చేసి పంపారు. 12665 నంబరు హౌరా-కన్యాకుమారి సూపర్‌ఫాస్ట్ రైలు మంగళవారం మధ్యాహ్నం ఒంగోలు రైల్వేస్టేషన్‌లో ఆగింది. ఇంజన్ వెనుకభాగాన ఉన్న లగేజీ, అండర్ గార్డ్ సౌకర్యం ఉన్న బోగీ కింద ట్రాలీపై ఓ స్ప్రింగ్ విరిగినట్లు అక్కడ విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది గుర్తించారు. మరమ్మతులు చేసే సౌకర్యం లేకపోవడంతో సిబ్బంది పర్యవేక్షణలో బిట్రగుంట వరకు రైలుని నడిపారు. అక్కడ క్యారేజ్, వ్యాగన్ మరమ్మతుల డిపో అధికారుల బృందం శ్రీనివాసులు, జయనాథ్, సాంబశివరావు, సాంకేతిక సిబ్బంది విరిగిన స్ప్రింగ్ స్థానంలో కొత్తదాన్ని అమర్చారు. దీంతో సాయంత్రం 4.30 గంటలకు ఆ రైలు కన్యాకుమారి వైపునకు బయలుదేరింది.

## రాజధానిలో అభివృద్ధి ఎక్కడ?

### అరకు ఎంపీ కొత్తపల్లి గీత

పాడేరు, న్యూస్‌టుడే: నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో ఏమి అభివృద్ధి జరిగిందని, కేంద్రం మరిన్ని నిధులు ఇస్తుందని అరకు ఎంపీ కొత్తపల్లి గీత ప్రశ్నించారు. ఇచ్చినవి ఎలా ఖర్చు పెట్టారో తెలపాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ఆమె పేర్కొన్నారు. మంగళవారం విశాఖ జిల్లా పాడేరులో పర్యటించిన ఆమె మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా గిరిజనుల తలరాతలు మారడం లేదన్నారు. విభజన అనంతరం పదేళ్ల పాటు హైదరాబాద్‌లో ఉండేందుకు ఆస్కారమున్నా, ఎటువంటి అభివృద్ధికి నోచుకొని అమరావతికి ఎందుకు వచ్చినట్లని ప్రశ్నించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర రాజధానికి కేంద్రం రూ.2వేల కోట్లే ఇచ్చిందని, దానితో నయా రాయపూర్‌ను తీర్చిదిద్దారని తెలిపారు. అదే మన రాష్ట్రానికి వస్తే ఇప్పటికే రూ.3500 కోట్లు మంజూరు చేసినా అభివృద్ధి కనపడటం లేదన్నారు.

## మోదీ అండ లేకుండా నీరవ్ పరారయ్యే అవకాశమే లేదు..

- ప్రధానివి చవకబారు ఆరోపణలు
- కర్ణాటక సీఎం సిద్ధరామయ్య



ఈనాడు, బెంగళూరు: ప్రధాని నరేంద్ర మోదీ అనుమతి- అండదండలు లేకుండా పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ)ను వంచించిన నీరవ్ మోదీ విదేశాలకు పారిపోయే అవకాశమే లేదని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆరోపించారు. ఆయన మంగళవారం ఉదయం విధానసౌధలో విలేకరులతో మాట్లాడారు. 'నేనైతే పీఎన్‌బీని దగాచేసిన నీరవ్ మోదీని బంధించి కఠిన చర్యల్ని తీసుకునే వాణ్ని. నరేంద్రమోదీ సాయం, సహకారం లేకుండా నీరవ్ విదేశాలకు పారిపోవటం జరగని పని. దావోస్‌లో ఇద్దరూ కలసి ఫొటోలు దిగారు' అని ఆరోపించారు. కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో ప్రధాని మోదీ, భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఇద్దరూ కలసి సిద్ధరామయ్యపై ఆరోపణాస్త్రాలు తీవ్రం చేసిన క్రమంలో సిద్ధు ఇలా స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**నూరు శాతం కమీషను!:** 'గతంలో భాజపా అధికారంలో ఉన్నపుడు రాష్ట్రంలో నూటికి నూరు శాతం కమీషన్లు తీసుకునే వారు. అందుకే ఐదు గురు చెరసాల పాలయ్యారు' అంటూ సిద్ధరామయ్య తీవ్ర విమర్శలు చేశారు. 'మైసూరులో సోమవారం నరేంద్ర మోదీ నాపై చేసిన ఆరోపణలు ఆధార రహితాలు. అలాంటి మోదీకి ప్రధాన పదవిలో కొనసాగే నైతిక అర్హత లేదు'అని వ్యాఖ్యానించారు. 'చేసిన ఆరోపణలకు దాఖలాలు, దస్త్రాల్ని ఎందుకు ఇవ్వలేదు. ప్రధాని హోదాకు తగని రీతిలో చౌకబారు రాజకీయాలకు దిగజారారు. తొమ్మిదేళ్ల పాటు గుజరాత్‌లో చేయరాని పనులన్నింటినీ చేసి ఇప్పుడు మాకు పాఠాలు చెబుతున్నారు' అంటూ ఎదురుదాడికి దిగారు.

## దిల్లీలో రూ.15 ఇంజెక్షన్‌ను రూ.5వేలకు అమ్మారు

దిల్లీ: అనూహ్య లాభాల కోసం కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు ఔషధాలపై అధిక ధరలు ముద్రింపచేసి మరీ విక్రయిస్తున్నాయని జాతీయ ఔషధ ధరల నియంత్రణ ప్రాధికార సంస్థ (ఎన్‌పీపీఏ) విశ్లేషించింది. దిల్లీలోని 4 ప్రైవేటు ఆసుపత్రుల్లో ఔషధాల ధరలు అమాంతం పెంచి విక్రయిస్తున్నట్లు, రోగ నిర్ధారణ పరీక్షలకూ భారీ మొత్తాలు వసూలు చేస్తున్నట్లు తమ పరిశీలనలో వెల్లడైందని ఎన్‌పీపీఏ తెలిపింది. డెంగీ, ఇతర వ్యాధులతో ఇటీవల దిల్లీలోని 4 ప్రైవేటు ఆస్పత్రుల్లో పలువురు మృతి చెందడంతో పరిశీలన జరిపినపుడు ఈ అంశాలు వెలుగు చూశాయని వెల్లడించింది. రూ.5.77కు కొనుగోలు చేసిన జీఎస్-3040 పరికరాన్ని 1737 శాతం మార్జిన్ కలుపుకొని ఓ ఆస్పత్రి విక్రయించినట్లు తెలిపింది. రూ.189.95 గరిష్ఠ విక్రయ ధర ఉన్న అడ్రెనార్ 2 ఎంఎల్ ఇంజెక్షన్‌ను ఏకంగా రూ.5,318.60 (అన్ని పన్నులు కలిపి)కు మరో ఆస్పత్రిలో అమ్ముతున్నట్లు తెలిపింది. వాస్తవానికి ఈ ఇంజెక్షన్‌ను ఆస్పత్రి రూ.14.70కు కొనుగోలు చేస్తోందని ఎన్‌పీపీఏ వెల్లడించింది. ఇలాంటి దారుణాలు చాలానే తమ దృష్టికి వచ్చినట్లు తెలిపింది.

## వినూత్నం

# ఈ బ్యాగులోవి కొట్టేయలేరు

కాలేజీ విద్యార్థులు, ఉద్యోగులు బ్యాక్‌పాక్ లేకుండా బయటికి పోలేని స్థితి. అయితే, ఇప్పటి వరకూ మార్కెట్‌లో అందుబాటులో ఉన్న బ్యాగులన్నింటికీ ముందు భాగంలోనే పలు రకాల జేబులు ఉన్నాయి. దీంతో బ్యాగు తగిలించుకున్నాక వెనక పదే పదే చెక్ చేస్తుంటాం. జేబులకు ఉన్న జిప్‌లన్నీ సరిగా ఉన్నాయా... లేదా అని. జన సంద్రంలో దొంగల భయంతో కొన్ని సార్లు వీపునకు తగిలించుకోవాల్సిన బ్యాగుని ముందుకి తగిలించుకుంటాం కూడా. ఇలాంటి ఇబ్బందులు లేకుండా వస్తువుల్ని భద్రంగా మోసుకెళ్లాలంటే? LUGG బ్యాగు ధరిస్తే సరి. వైవిధ్యమైన డిజైన్‌తో బ్యాగుని తీర్చిదిద్దారు. బ్యాగు ముందు భాగంలో ఒక్క జేబూ కనిపించదు. తగిలించుకున్న బ్యాగు జిప్‌ని ఓపెన్ చేయడం ఇతరులకు అసాధ్యం. సామర్థ్యం 20 లీటర్లు. 15 అంగుళాల పరిమాణం ఉన్న ల్యాపీని సులువుగా తీసుకెళ్లేందుకు ప్రత్యేక అర ఉంది. ట్యాబ్లెట్, ఐపాడ్, మొబైల్... లాంటి ఇతర యాక్ససరీస్‌ని పెట్టుకునేందుకు లోపల ప్రత్యేక అరలు ఉన్నాయి. వర్షంలో 'రెయిన్ ప్రూఫ్' కవచంతో బ్యాగుని తడవకుండా కాపాడుకోవచ్చు. LUGG Plus మోడల్‌తో నీళ్ల బాటిల్‌ని పెట్టుకునేందుకు వీలుగా 'బాటిల్ హోల్డర్'ని అందిస్తున్నారు. ధర రూ.1,500. ఇతర వివరాలకు https://goo.gl/FRU3jM


**పవర్ బ్యాంకుని బ్యాగులోపల ఏర్పాటు చేసిన యూఎస్‌బీ పోర్ట్‌కి అనుసంధానం చేసి ఫోన్‌ని ఛార్జ్ చేయవచ్చు. అందుకు అనువుగా బ్యాగుకి బయటి పక్క ఎక్స్‌టర్నల్ యూఎస్‌బీ పోర్ట్‌ని నిక్షిప్తం చేశారు.**



## మొబైల్ మాయ

# మీకున్న 'రిస్క్' ఎంత?

వయసుతో సంబంధం లేకుండా గుండెపోటు బారిన పడుతున్నవారెందరో! అలాంటి వారి గురించి విన్నప్పుడు మన గుండె ఎంత మేరకు ఆరోగ్యంగా పని చేస్తోంది? అనే సందేహం రాక మానదు.



అందుకు ఆసుపత్రికే వెళ్లాల్సిన అవసరం లేదు. 'సీవీ రిస్క్ అసిస్ట్ ఆప్' స్మార్ట్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుంటే సరి. ఇంగ్లిష్‌లోనే కాకుండా పలు ప్రాంతీయ భాషల్లోనూ ఆప్‌ని ఓపెన్ చేసుకునే వీలుంది. ఆప్‌ని ఇన్‌స్టాల్ చేశాక తెలుగులో ఓపెన్ చేసి వయసు, జెండర్, టోటల్ కొలెస్ట్రాల్, హెచ్‌డీఎల్ కొలెస్ట్రాల్, బీపీ, షుగర్, అలవాట్లను ఎంటర్ చేస్తే చాలు. విశ్లేషించి మీరున్న స్థితిని చెబుతుంది. 'రిస్క్' శాతం ఆధారంగా సంబంధిత డాక్టర్లను సంప్రదించొచ్చు. 8 ప్రాంతీయ భాషల్లో ఆప్‌ని వాడుకోవచ్చు.

డౌన్‌లోడ్ లింక్: https://goo.gl/mgn2mt

## గ్యాడ్జెట్ గురూ

# బుల్లి 4కే పీసీ

డెస్క్‌టాప్ కంప్యూటర్ల పక్కన చూసే సీపీయూని ఎక్కడికైనా తీసుకెళ్లాలంటే? భుజంపై పెట్టుకుని మోసుకెళ్లాల్సిందే. దీనికి పూర్తి భిన్నంగా సెంట్రల్ ప్రాసెసింగ్ యూనిట్ (సీపీయూ)ని జేబులో పెట్టుకుని తీసుకెళ్లొచ్చు. కావాలంటే 'లివా క్యూ' కంప్యూటర్‌ని చూడండి. ఇది ప్రపంచంలోనే అతిచిన్న '4కే పాకెట్ పీసీ'.




ఇంచుమించి మౌస్ అంతే ఉంటుంది. 2, 4 జీబీ ర్యామ్. 32, 64 జీబీ స్టోరేజ్ మెమొరీ. మైక్రో ఎస్‌బీ కార్డుతో మెమొరీ సామర్థ్యాన్ని 128 జీబీ వరకూ పెంచుకోవచ్చు. ముందు భాగంలో రెండు యూఎస్‌బీ పోర్ట్‌లు (3.0, 2.0 వెర్షన్లు), కుడివైపు మైక్రో ఎస్‌డీ స్లాట్, వెనక హెచ్‌డీఎంఐ పోర్ట్, ఇథర్నెట్, మైక్రో యూఎస్‌బీ పోర్ట్‌లు ఉన్నాయి. బ్లూటూత్, వై-ఫై నెట్‌వర్క్‌లను సపోర్ట్ చేస్తుంది. 'ఇంటెల్ అపోలో లేక్ ఎస్ఓసీ' ప్రాసెసర్‌ని వాడారు. బరువు 260 గ్రాములు. ఇంటెల్ గ్రాఫిక్స్ హెచ్‌డీ సపోర్ట్‌తో 4కే రిజల్యూషన్ వీడియోలను ప్రాసెసర్ సపోర్ట్ చేస్తుంది. ధర రూ.15,000. ఇతర వివరాలకు https://goo.gl/PMDWDb

## ఈ-కబుర్లు మీవే

# యూట్యూబ్ చూస్తే..

కాస్త బోర్ అనిపిస్తే యూట్యూబ్‌పై వాలిపోతుంటాం. అయితే, అక్కడ చూసే వీడియోలను డీఫాల్ట్ స్టైల్‌లోనే చూస్తే ఏం కిక్ ఉంటుంది. కావాల్సినట్టుగా మార్పులు చేసుకుని వీడియోలను చూద్దాం అనుకుంటే Enhancer for YouTube యాడ్‌ఆన్‌ని ప్రయత్నించొచ్చు. ఇది ఫైర్‌ఫాక్స్, క్రోమ్, ఒపేరా, ఎడ్జ్ బ్రౌజర్లను సపోర్ట్ చేస్తుంది.



బ్రౌజర్‌కి జత చేయగానే ఐకాన్ రూపంలో టూల్‌బార్‌లో కనిపిస్తుంది. ఇకపై యూట్యూబ్‌ని ఓపెన్ చేయగానే వీడియో కిందే ప్రత్యేకంగా టూల్‌బార్ కనిపిస్తుంది. దీంతో రొటీన్‌గా చూసే యూట్యూబ్ వీడియోలు 'సినిమా మోడ్'లోకి మారిపోతాయి. 'ప్లేయర్'ని కావాల్సిన సైజులో మార్చుకోవచ్చు. మధ్యలో వాణిజ్య ప్రకటనల్ని అడ్డుకోవచ్చు. బ్రౌజర్లకు యాడ్‌ఆన్‌ని జత చేసేందుకు https://goo.gl/KeQrxG లింక్‌ని చూడండి.

– వై.వెంకట రమేష్, ఎం.నాగులపల్లి

# ఇవి 'ఫాలో' అవ్వాల్సిందే

**బాహ్య ప్రపంచంలో సత్ప్రవర్తనతో ఎలా గుర్తింపు తెచ్చుకుంటామో... అదే మాదిరిగా సోషల్ మీడియాలోనూ సరైన నడవడిక ఏర్పరుచుకోవాలి. అందుకు ఇవి పాటించాల్సిందే!**

- 'స్పామ్'లా ఊసులాడొద్దు. అంటే... ఇతరులు పంపింది పదే పదే రీట్వీట్ చేయడం. దీంతో ఇతరులకు విసుగొచ్చి మిమ్మల్ని బ్లాక్ చేసే అవకాశం లేకపోలేదు.



సీహెచ్ఏఎస్ మూర్తి
సీ-డాక్, జాయింట్ డైరెక్టర్

- ఎక్కువ హ్యాష్‌ట్యాగ్‌లు వద్దు. అంశానికి ఉన్న ప్రాధాన్యత ఆధారంగా ఒకటో... రెండో... పెట్టడం ఉత్తమం. ఎక్కువ ట్యాగ్‌లతో అంశం చేరాలనుకునేవారికి చేరకపోవచ్చు.
- అసభ్య పదజాలం వాడడం సభ్యత కాదు. వ్యాసాలు, కామెంట్స్‌లో అసభ్యపదాల్ని వాడితే మీ విలువను మీరు నెట్టింట్లో దిగజార్చుకున్నట్లే!
- అశ్లీల ఫొటోలు, దృశ్యాలకు వాల్‌పై చోటు లేకుండా చూడాలి.
- ఎక్కువ మందిని ట్యాగ్ చేయొద్దు. పంచుకునే పోస్టింగ్స్‌లో ఒకరో... ఇద్దరో... ఫర్వాలేదుగానీ. అంతకంటే ఎక్కువ మందిని వారి ప్రమేయం లేకుండా ట్యాగ్ చేయొద్దు.
- ప్రతి స్పందనగా ఎప్పుడూ టెక్స్ట్ వాడడం సరైంది కాదు. అవసరం మేరకు ఎమోజీలను వాడడం మంచిది. భిన్నమైన ఎమోజీలకు https://goo.gl/dXh7iK, https://goo.gl/YvrQxk, https://goo.gl/y4n5XL, https://emojipedia.org/whatsapp/ సైట్‌లను చూడండి.
- పదాల్ని మరీ సూక్ష్మంగా మార్చేస్తూ టెక్స్ట్ చేయడం అర్థవంతమైన భాష అనిపించుకోదు. ట్విట్టర్ లాంటి చిట్టిపొట్టి ఊసుల్లో తప్పితే... మిగతా మాధ్యమాల్లో మీదైన రచనా శైలిని ప్రదర్శించేలా పోస్టింగులు ఉంటే బాగుంటుంది. అప్పుడే సోషల్ మీడియాలో ముద్ర వేయొచ్చు.
- ఆటోమాటిక్‌గా అన్నింటిలో పోస్ట్ అయ్యేలా సిస్టంని పెట్టుకుంటే పంచుకునే వాటికి ప్రాధాన్యాన్ని ఒకటి రెండు సార్లు చెక్ చేసుకోండి. ఒక నెట్‌వర్క్‌లో పంచుకున్నది మరో నెట్‌వర్క్‌కి ఆసక్తికరమైంది కాకపోవచ్చు.
- సొంత వ్యాపారం, ఉత్పత్తులు, ఇతర సర్వీసులపై సోషల్ మీడియాలో ప్రచారానికి సరైన హ్యాష్‌ట్యాగ్ ఎంపిక చాలా ముఖ్యం.

# సోషల్ లైఫ్‌లో... సక్కనోళ్లు అవ్వాలంటే?






**సమాజంలో మంచోడు అనిపించుకోవాలంటే?**
**కొన్ని నియమాల్ని పాటించాల్సిందే!**
**మరి, సోషల్ లైఫ్‌లో మంచోడు అవ్వాలంటే?**
**అందుకూ కొన్ని సూత్రాలు ఉన్నాయి...**
**అవేంటో తెలుసుకుని ఫాలో అయితే మీరూ స్మార్ట్ 'సోషల్' సిటిజనే!**

నిద్ర లేచింది మొదలు బాహ్య ప్రపంచంలో బాధ్యతలు నిర్వర్తిస్తూనే గంటల కొద్దీ నెట్టింట్లో సామాజిక మాధ్యమాల్లో గడపాల్సిన పరిస్థితి. లెక్కకు మిక్కిలి పోస్టింగులు... కామెంట్‌లు... లైక్‌లు... చేయందే సోషల్ మీడియాలో ఉనికిని చాటుకోలేం. మేనేజ్ చేయాల్సిన మాధ్యమాలేమో మినిమమ్ మూడు లేదా నాలుగు. ఓ పక్క ట్విట్టర్‌లో చిట్టిపొట్టి కబుర్లు... మరో పక్క ఫేస్‌బుక్‌లో ఊసులు... ఇంకో పక్క ఇన్‌స్టాగ్రామ్ స్టిల్ ఫొటోలు... వీటన్నింటినీ చురుకుగా మేనేజ్ చేస్తుండాలి. కనిపించిందల్లా పెట్టేసి పండగ చేసుకుంటే పొరబాటే. పెట్టే ముందు కాస్త ఆలోచించాలి. అప్పుడే అబ్బాయ్ చాలా స్మార్ట్ అనిపించుకోవచ్చు.

### అన్నింట్లో ఒకేసారి

అందరికీ ఒకటి కంటే ఎక్కువ సోషల్ నెట్‌వర్క్ వేదికలు ఉన్నాయి. దీంతో ఏదైనా ముఖ్యమైన సమాచారాన్ని పంచుకోవాలంటే అన్నింటిలోనూ పోస్ట్ చేయాల్సిందే. అప్పుడే ఎక్కువ మందికి పంచుకున్న విషయం చేరుతుంది. ఒక్కో దాంట్లో వేరు వేరుగా పోస్టింగులు పెట్టాలంటే... అన్ని సైట్‌లు, ఆప్‌లు ఓపెన్ చేయాలి. లాగిన్ అవ్వాలి.. దీనికి కాస్త సమయం వృథా అవుతుంది. అందుకే ఒక దాంట్లో పోస్ట్ చేస్తే అన్నింటిలో అప్‌డేట్ అయితే! అందుకు అనువైన వేదికే 'ఐఎఫ్‌టీటీటీ'. గూగుల్, ఫేస్‌బుక్ లాగిన్ వివరాలతో దీంట్లో సభ్యులై సర్వీసుని వాడుకోవచ్చు. 'సోషల్ మీడియా' విభాగంలోకి వెళ్లి ఏయే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను వాడుతున్నారో వాటిని ఎనేబుల్ చేసి అనుమతి ఇవ్వాలి. దీంతో ఎప్పుడైనా ఏదైనా ఒక్క వేదికపై పోస్ట్ చేస్తే... అన్నింటిలోనూ స్టేటస్ అప్‌డేట్ అవుతుంది. మొబైల్ ఆప్, వెబ్ సర్వీసుగా దీన్ని వాడుకోవచ్చు.

- మరిన్ని వివరాలకు https://ifttt.com

### హ్యాష్‌ట్యాగ్‌లు వాడకంలో...

సోషల్‌లైఫ్‌లో చురుకైనవారికి హ్యాష్‌ట్యాగ్స్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్ అంశాల్ని వెతికి పట్టేందుకు ఇవే ఆధారం. అయితే, సరైన హ్యాష్‌ట్యాగ్‌ని పెట్టడం ఓ కళే. తోచిందేదో ట్యాగ్ చేస్తే వెతికేవారికి మీరు పోస్ట్ చేసింది కనిపించకపోవచ్చు. అందుకే సరైన హ్యాష్‌ట్యాగ్‌లను పొందేందుకు నెట్టింట్లో ప్రత్యేక సర్వీసులు ఉన్నాయి. కావాలంటే https:/ritetag.com సర్వీసుని చూడండి. ఫొటో, వ్యాసం... పంచుకోవాలనుకునేది ఏదైనా తగిన హ్యాష్‌ట్యాగ్‌ని పొందేందుకు సరైన వేదిక. ట్విట్టర్, ఫేస్‌బుక్ లాగిన్ వివరాలతో సైన్‌ఇన్ అయ్యి కంటెంట్‌ని అప్‌లోడ్ చేసి ట్యాగ్స్ పొందొచ్చు. వెబ్ సర్వీసుగానే కాకుండా ఆప్‌లా ఇన్‌స్టాల్ చేసుకుని సర్వీసుని వాడుకోవచ్చు. ఫైర్‌ఫాక్స్ ఎక్స్‌టెన్షన్‌గానూ బ్రౌజర్‌లో ఒదిగిపోతుంది. http://hash-tagify.me సర్వీసు వాడుకుని సోషల్ మీడియాలో హ్యాష్‌ట్యాగ్‌లకు ఉన్న ప్రాధాన్యత ఎంతో తెలుసుకోవచ్చు. అందుకు సెర్చ్‌బాక్స్‌లో ట్యాగ్‌ని ఎంటర్ చేసి వెతికితే సరి. ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌ల్లో పంచుకునే వాటికి తగిన ట్యాగ్‌లను జనరేట్ చేసుకునే వీలుంది. ● ఐఫోన్ యూజర్లు 'ట్యాగ్స్‌డాక్' ఆప్‌ని ప్రయత్నించొచ్చు. డౌన్‌లోడ్ లింక్: https://goo.gl/xzF4QX

### ఉచిత స్థావరాలు

పొడి పొడి మాటల్లో.. అదీ అక్షరాల్లో ఏదైనా రాసి పోస్ట్ చేస్తే అంతగా ఆసక్తి కనిపించదు. అదే అక్షరాలకు ఆకట్టుకునే ఫొటో జోడిస్తే! కచ్చితంగా ఆగి చూస్తారు. తర్వాత చదువుతారు. అయితే, దొరికిన ఇమేజ్‌ని వ్యాసానికి జత చేస్తే! కచ్చితంగా ఎప్పుడోకప్పుడు కాపీరైట్స్ సమస్య రావచ్చు. అందుకే మీరు క్లిక్ మనిపించిన ఫొటోలే వాడాలి. లేకుంటే... కాపీరైట్స్ సమస్య లేకుండా ఉచితంగా ఫొటోలను అందించే 'ఇమేజ్ స్టాక్ వెబ్‌సైట్‌లు' ఉన్నాయి. వాటి నుంచి ఇమేజ్‌లను డౌన్‌లోడ్ చేసి వాడుకోవచ్చు. విభాగాల వారీగా సైట్‌ల్లో ఫొటోలను వెతకొచ్చు. కావాల్సిన వాటిని కీవోర్డులతో వెతికే వీలుంది.

- https://unsplash.com
- https://www.pexels.com
- https://picjumbo.com
- https://pixabay.com

### ఆ 'మార్క్' దాటారా?

సామాజిక మాధ్యమాల్లో ఎప్పటి నుంచి ఎకౌంట్‌ని రన్ చేస్తున్నాం అనేది ముఖ్యం కాదు. ఆ ఎకౌంట్ 'వెరిఫికేషన్' దశ దాటిందా? లేదా? అనేది ముఖ్యం. ఫేస్‌బుక్‌లో అయితే పర్సనల్ ఎకౌంట్‌లకు ఇది వర్తించదు. ఒకవేళ మీరేదైనా బిజినెస్ పేజీ రన్ చేస్తున్నట్లయితే 'వెరిఫికేషన్'ని క్లియర్ చేయడం చాలా ముఖ్యం. అప్పుడే పేజీకి సోషల్ మీడియాలో తగిన ఆదరణ లభిస్తుంది. ట్విట్టర్‌ని వెరిఫికేషన్ చేసేందుకు http://verification.twitter.com/ లింక్‌లోకి వెళ్లండి. లాగిన్ వివరాలు ఎంటర్ చేసి ప్రాసెస్‌ని ముగిస్తే ట్విట్టర్ ఎకౌంట్‌ని అధికారికంగా ధృవీకరిస్తూ బ్యాడ్జ్ గుర్తుని జత చేస్తుంది.


# మాటలు కనిపించాలి

**● నేను పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్నా. బధిరుడిని కావడంతో సమావేశాల్లో పాల్గొన్నప్పుడు సమాచార సేకరణ కష్టంగా మారింది. సమావేశాల్లో అధికారులు మాట్లాడే మాటల్ని టెక్స్ట్ రూపంలో కంప్యూటర్ స్క్రీన్‌పై చదువుకునేలా ఏదైనా సౌలభ్యం ఉందా? అలాంటి అప్లికేషన్స్ సాఫ్ట్‌వేర్‌లు ఉంటే తెలుపగలరు?**

– గుణ్ణం ప్రసాదరావు, నిడదవోలు

సమావేశాల్లో పాల్గొన్నప్పుడు వక్తల ప్రసంగాన్ని కంప్యూటర్ స్క్రీన్‌పై టెక్స్ట్ రూపంలో కనిపించాలంటే గూగుల్ డెవలప్ చేసిన 'వెబ్ స్పీచ్' టూల్‌ని వాడొచ్చు. అయితే, ఇది పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడానికి కొంత సమయం పడుతుంది. దీన్నే 'స్పీచ్ టు టెక్స్ట్' టెక్నాలజీగా పిలుస్తున్నారు. మీ ల్యాపీలో క్రోమ్ బ్రౌజర్‌ని వాడుతున్నట్లయితే ఈ టూల్‌ని ప్రయత్నించొచ్చు. అందుకు కింది లింక్‌ను చూడండి.

- https://goo.gl/XkNm7x
- https://goo.gl/JZhhWe
- https://goo.gl/UCCrg5



టూల్‌ని వాడాలనుకున్నప్పుడు మాట్లాడుతున్న వ్యక్తి భాషని సెలెక్ట్ చేసి, కుడివైపు ఉన్న మైక్‌ని క్లిక్ చేసి రికార్డ్ మోడ్‌లో పెట్టాలి. టూల్ సాయంతో మీరు కొంతమేరకు సమస్యని అధిగమించొచ్చు. కాకపోతే నెలకోసారి క్లౌడ్ ప్లాట్‌ఫామ్‌లో 60 నిమిషాలు మాత్రమే ఉచితంగా వాడుకోవచ్చు. తర్వాత నామమాత్రపు రుసుము చెల్లించి సర్వీసుని వాడుకోవాలి.

**టెక్నాలజీ వాడకంలో సందేహం ఏదైనా మాకు పంపండి.**
**నిపుణులతో సూచనలు అందిస్తాం.**
**మా ఈ-మెయిల్ its@eenadu.in**




# దూసుకొస్తోంది మరో స్కైలాబ్!

గ్రహశకలాల వంటివి భూమి సమీపానికి వస్తున్నాయంటేనే భయపడిపోతాం. ఇక అవి భూమిని ఢీకొంటే? జరిగే నష్టాన్ని ఊహించుకోవటానికే వణికిపోతాం. అనూహ్యంగా, అరుదుగా పలకరించే ఇలాంటి అంతరిక్ష 'అతిథుల' మాటెలా ఉన్నా.. ఇప్పుడో కొత్త ఉపద్రవం ముంచుకొస్తోంది. అదీ మానవ కల్పిత ఉపగ్రహం రూపంలోనే దూసుకొస్తోంది. అప్పుడెప్పుడో నేలకూలిన స్కైలాబ్ ఉదంతం చాలామందికి గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు చైనా అంతరిక్ష ప్రయోగశాల టియాంగాంగ్-1 మరోసారి అలాంటి ఉపద్రవాన్నే మోసుకొస్తోంది. సుమారు ఏడేళ్ల కిందట ప్రయోగించిన ఈ అంతరిక్ష ప్రయోగశాల రెండేళ్ల నుంచీ గతితప్పిపోయింది. ఇది ఎప్పుడో అప్పుడు భూ వాతావరణంలోకి దూసుకురావటం ఖాయమైంది కూడా. బహుశా మార్చి-ఏప్రిల్ మధ్యలో ఇది కూలిపోవచ్చన్నది ఐరోపా అంతరిక్ష సంఘం అంచనా. అయితే ఎక్కడ పడుతుందన్నది కచ్చితంగా తెలియదు. సాధారణంగా ఇలాంటివి భూ వాతావరణంలోకి ప్రవేశించగానే మండిపోతుంటాయి. అయితే టియాంగాంగ్-1 శకలాలు కొన్ని నేల మీద పడే అవకాశముందనీ శాస్త్రవేత్తలు భయపడుతున్నారు. చైనీస్‌లో టియాంగాంగ్ అంటే స్వర్గ మందిరం అని అర్థం. ఇది చైనా మొట్టమొదటి అంతరిక్ష ప్రయోగశాల. 34 అడుగుల పొడవు, 11 అడుగుల వ్యాసంతో కూడిన దీని బరువు సుమారు 8.5 మెట్రిక్ టన్నులు. ఇది 2016, మార్చి 16న గతి తప్పింది. బ్యాటరీ ఛార్జర్ పనిచేయకపోవటమే దీనికి కారణమని భావిస్తున్నారు. ఈ విషయాన్ని చైనా ఎట్టకేలకు నిర్ధరించింది గానీ భూ వాతావరణంలోకి తిరిగి ప్రవేశించినపుడు దీన్ని నియంత్రించే అవకాశం ఉందో లేదో తెలియజేయలేదు. ఇది ఫిబ్రవరి తొలి 10 రోజుల్లో లేదా మార్చి చివరి 10 రోజుల్లో కిందికి పడిపోవచ్చని చైనా ఇటీవల ఐక్యరాజ్యసమితికి సమాచారమిచ్చింది. అయితే టియాంగాంగ్-1 గానీ దీనిలోని ఇంధనం గానీ భూమికి ఎలాంటి హాని చేయవని పేర్కొంది. ఏదేమైనా గానీ చైనా అంతరిక్ష ప్రయోగశాల భూ వాతావరణంలోకి తిరిగి ప్రవేశించటమనేది ఖాయం. అయితే ఎలాంటి అనర్థాలను కలగజేస్తుందన్నది మాత్రం ఊహకు అందటం లేదు.



## స్మార్ట్ సరకు




# నాజూకు ల్యాపీ

స్మార్ట్ ఫోన్లే కాదు. ల్యాపీలు కూడా తెరల తీరుని ఆధునికంగా మార్చుకుంటూ ముందుకొస్తున్నాయి. కావాలంటే 'అసుస్ వివోబుక్ ఎస్14' ల్యాపీని చూడండి. 14.8ఎంఎం మందంతో నాజూకుగా తీర్చిదిద్దారు. చూడ్డానికి 13 అంగుళాల సైజు ల్యాప్‌టాప్‌లా కనిపించినా... అంచుల వరకూ తెరతో 14 అంగుళాల హెచ్‌డీ డిస్‌ప్లే తెరని కలిగిఉంది. అందుకే 'నానోఎడ్జ్ డిస్‌ప్లే'గా పిలుస్తున్నారు. కాన్ఫిగరేషన్ విషయానికొస్తే... ఇంటెల్ కోర్ ఐ7 ప్రాసెసర్‌ని వాడారు. 8జీబీ ర్యామ్, 512జీబీ ఇంటర్నల్ మెమొరీ అందిస్తున్నారు. ల్యాపీని సురక్షితంగా వాడుకునేలా టచ్ ప్యాడ్‌లో 'ఫింగర్‌ప్రింట్ సెన్సర్'ని నిక్షిప్తం చేశారు. బరువు 1.2కేజీలు. ఇతర వివరాలకు https://goo.gl/2uqRc1

# వెతుకులాటలో అది లేనట్టేనా?

తెలియనిది ఏదైనా 'గూగుల్' చేయడమే తరువాయి. ఇంతలా వాడేస్తున్న గూగుల్ సెర్చ్‌లో ఓ ఆప్షన్ ఎగిరిపోవడం మీరు గమనించారా? సాధారణ సెర్చింగ్‌లో కాకుండా ఫొటోల కోసం వెతికేవారైతే కచ్చితంగా 'వ్యూ ఇమేజ్' ఆప్షన్ అని చెప్పేస్తారు. ఫొటోల కాపీరైట్స్ సమస్యలు రాకుండా ఉండేందుకే ఆప్షన్‌ని తొలగించామని గూగుల్ చెబుతోంది. అయితే, ఇక మీదట 'వ్యూ ఇమేజ్' వాడుకుని కాపీరైట్స్ సమస్యలేని ఫొటోలను చూడలేమా? ప్రత్యేక ఎక్స్‌టెన్షన్‌ని జత చేసుకుని చూడొచ్చు. క్రోమ్ బ్రౌజర్ వాడుతున్నట్లయితే 'వ్యూ ఇమేజ్' ఎక్స్‌టెన్షన్‌ని క్రోమ్ వెబ్ స్టోర్ నుంచి పొందొచ్చు. ఒకసారి బ్రౌజర్‌కి జత చేశాక ఇమేజ్ సెర్చ్‌లోకి వెళ్తే ఆప్షన్ తిరిగి కనిపిస్తుంది. క్లిక్ చేసి ఎంపిక చేసిన ఇమేజ్‌ని చూసుకుని సేవ్ చేసుకోవచ్చు.




ఎక్స్‌టెన్షన్ డౌన్‌లోడ్ లింక్: https://goo.gl/qsvhi1

# ఈనాడు సినిమా



చిరంజీవి

## అమితాబ్‌తో 'సైరా..'

చిరంజీవి నటిస్తున్న 151వ చిత్రం 'సైరా నరసింహారెడ్డి'. సురేందర్‌రెడ్డి దర్శకుడు. రామ్‌చరణ్ నిర్మాత. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు అమితాబ్‌బచ్చన్ కూడా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆయన మార్చి నుంచి సెట్లో అడుగుపెడతారు. ఈనెల 24 నుంచి హైదరాబాద్‌లో 'సైరా' చిత్రీకరణ ప్రారంభం కానుంది. 27 వరకూ చిరంజీవి తదితరులపై కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తారు. ఆ తరవాత కొన్ని రోజులు విరామం ఉంటుంది. మార్చిలో మరో షెడ్యూల్ ప్రారంభం అవుతుంది. ఇందులో అమితాబ్ పాలుపంచుకోనున్నారు. దర్శకుడు సురేందర్‌రెడ్డి బిగ్‌బీని కలుసుకుని తన పాత్ర గురించి వివరించి వచ్చారు. నయనతార కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో జగపతిబాబు, సుదీప్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## తొలి పంచ్ పడేది ఎప్పుడంటే...



రజనీకాంత్

రజనీకాంత్ సినిమా అంటే... పంచ్ డైలాగులు పరిగెట్టాల్సిందే. మామూలు సంభాషణే అయినా, రజనీ స్టైల్‌గా పలికితే బోలెడంత కిక్ ఉంటుంది. 'కాలా' కోసం కూడా ఆయన తనదైన శైలిలో డైలాగులు పేల్చారట. వాటి పదునెంతో మార్చి 10న తెలిసిపోతుంది. ఎందుకంటే 'కాలా' టీజర్ ఆరోజే విడుదల అవుతుంది. రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'కాలా'. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో రూపొందుతోంది. పా రంజిత్ దర్శకుడు. ధనుష్ నిర్మాత. ఏప్రిల్ 27న ఈ చిత్రం విడుదల అవుతోంది. మార్చి 10న టీజర్ విడుదల చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. రజనీ మరోసారి డాన్ పాత్రలో కనిపించబోతున్నాడు. నానాపటేకర్, సముద్రఖని, హ్యూమా ఖురేషీ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## ఎన్టీఆర్‌తో పూజ?



ఎన్టీఆర్

ఎన్టీఆర్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపుదిద్దుకోనుంది. ప్రస్తుతం స్క్రిప్టు పనులు జరుగుతున్నాయి. త్వరలోనే కొబ్బరికాయ కొట్టేస్తారు. ఈ చిత్రంలో కథానాయికగా పూజా హెగ్డేకి అవకాశం దక్కినట్టు సమాచారం. మహేష్‌బాబు - వక్కంతం వంశీ చిత్రంలోనూ పూజా కథానాయిగా ఎంపికైంది. 'రంగస్థలం'లో ప్రత్యేక గీతంలో మెరవబోతోంది. యువ కథానాయకుడు బెల్లంకొండ శ్రీనివాస్ 'సాక్ష్యం'లోనూ తనే నాయిక. ఇలా.. చేతి నిండా సినిమాలతో బిజీగా ఉన్న పూజాకు మరో బంపర్ ఆఫర్ అందినట్టే. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడవుతాయి.



పూజా హెగ్డే

### కొత్త కబుర్లు

## మరో కథకు పచ్చజెండా



బెల్లంకొండ శ్రీనివాస్

ప్రస్తుతం 'సాక్ష్యం' చిత్రంలో నటిస్తున్నాడు బెల్లంకొండ శ్రీనివాస్. ఈ సినిమా సెట్స్‌పై ఉండగానే మరో చిత్రానికి పచ్చజెండా ఊపేశాడు. బెల్లంకొండ శ్రీనివాస్ కథానాయకుడిగా వంశధార క్రియేషన్స్ సంస్థ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తోంది. శ్రీనివాస్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. నవీన్ సొంటినేని నిర్మాత. "దృశ్యం, గోపాల గోపాల, డిక్టేటర్ చిత్రాలకు సహాయకుడిగా పనిచేశారు శ్రీనివాస్. ఆయన చెప్పిన కథ నచ్చింది. బెల్లంకొండ శ్రీనివాస్‌ని ఓ కొత్త కోణంలో చూపించబోతున్నాం. గురువారం నుంచి చిత్రీకరణ మొదలవుతుంద"న్నారు నిర్మాత. తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: చోటా కె.నాయుడు, కళ: చిన్నా, కూర్పు: ఛోటా కె. ప్రసాద్, సహ నిర్మాత: చాగంటి శాంతయ్య

## మరో కోణంలో చూస్తున్నా!

శ్రుతి హాసన్



సినిమా తప్ప మరో వ్యాపకం లేదా అన్నట్టుగా ఎప్పుడూ కెమెరా ముందే గడిపేవారు శ్రుతిహాసన్. తెలుగు, తమిళం, హిందీ... ఎక్కడ చూసినా ఆమె సందడే. ఎప్పుడు పలకరించినా సినిమా ముచ్చట్లే. కానీ ఇప్పుడు అందుకు పూర్తి భిన్నంగా గడుపుతోంది. సినిమా కబుర్ల స్థానంలో జీవిత పాఠాలు వల్లెవేస్తోంది. కొన్నేళ్లపాటు నటిగా బిజీబిజీగా గడిపిన ఆమె, కొన్ని రోజులుగా మేకప్‌కి దూరంగా ఉంటూ జీవితాన్ని ఆస్వాదిస్తోంది. సరైన విజయాలు లేకపోవడంతోనే ఈ విరామమా? అని అడిగితే... "అదే కారణమైతే రెండు మూడు సినిమాలతోనే విరామం అంటూ ఆగిపోవాలి కదా?" అని ప్రశ్నిస్తోంది శ్రుతి. "కెరీర్ ఆరంభంలోనే నన్ను పరాజయాలు చుట్టుముట్టాయి. కానీ ఎప్పుడూ వెనకడుగు వేయలేదు. సినిమాల ఫలితాలు నా కెరీర్‌ని ఏమాత్రం ప్రభావితం చేయలేదు. వ్యక్తిగా ఎదుగుతున్నకొద్దీ జీవితాన్ని సమన్వయం చేసుకోవడం చాలా ముఖ్యం. అదే పనిలోనే ఉన్నానిప్పుడు. కెరీర్ ఒక్కటే జీవితం కాదు. అందుకే మనసుకు నచ్చిన పనులు చేస్తూ జీవితాన్ని మరో కోణంలో చూస్తున్నా. ఇదివరకటితో పోలిస్తే సహనం పెరిగింది. నాలో నాకు కనిపిస్తున్న అతి పెద్ద మార్పు అదే" అని చెప్పుకొచ్చింది శ్రుతి.

## యుద్ధ భూమిలో సైనికుడు

అల్లు శిరీష్ కథానాయకుడిగా భారత్-పాక్‌ల యుద్ధ నేపథ్యంలో తెరకెక్కిన మలయాళ చిత్రం '1971 బియాండ్ బార్డర్స్'. మేజర్ రవి దర్శకుడు. గతేడాది విడుదలై విజయం సాధించిన ఈ చిత్రాన్ని ఏయన్ బాలాజి తెలుగులో 'యుద్ధభూమి' పేరుతో అనువదిస్తున్నారు.



మోహన్‌లాల్, అల్లు శిరీష్

ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల్లో ఉంది. నిర్మాత మాట్లాడుతూ "దర్శకుడు రవి ఆర్మీ మేజర్‌గా చేశారు. అందుకే యువతలో దేశభక్తిని పెంపొందించేలా ఆర్మీ నేపథ్యంగా సినిమాలు తీసి విజయాలందుకున్నారు. ఈ చిత్రాన్ని 1971లో భారత్- పాక్ సరిహద్దుల్లో జరిగిన యుద్ధ నేపథ్యంగా ఒక ఎమోషనల్ డ్రామాగా రూపొందించారు. ఇందులో మోహన్‌లాల్ మేజర్‌గా కీలక పాత్రలో, శక్తిమంతమైన సైనికుడిగా అల్లు శిరీష్ ప్రధాన పాత్రలో కనిపిస్తారు. ఈ నెలాఖరులో పాటల్ని, మార్చి మొదటి వారంలో చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు.



విజయనిర్మలకు కేకు తినిపిస్తున్న కృష్ణ. చిత్రంలో నరేష్, విజయ్‌కృష్ణ

## అదే పద్మభూషణ్‌తో సమానం

"ఏఎన్నార్, రజనీకాంత్, శివాజీగణేషన్‌లాంటి అగ్ర కథానాయకులతో సినిమాలు చేసిన ఏకైక మహిళా దర్శకురాలు విజయనిర్మల. ఆమెను భారత ప్రభుత్వం త్వరలోనే తగిన రీతిలో సత్కరిస్తుందని ఆశిస్తున్నా" అన్నారు కృష్ణ. మంగళవారం నటి, దర్శకురాలు విజయనిర్మల పుట్టిన రోజు. ఈసందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కృష్ణ మాట్లాడుతూ "విజయ నిర్మల దర్శకత్వం వహించిన 44 చిత్రాల్లో... నేను ఇరవైకి పైగానే నటించినందుకు సంతోషంగా ఉంద"న్నారు. "ఓసారి నా పుట్టిన రోజు సందర్భంగా దాసరి నారాయణరావు మా ఇంటికొచ్చారు. ఆ సమయంలో నా చుట్టూ ఉన్న అభిమానుల్ని చూసి 'ఏ కథానాయికకీ ఈ స్థాయిలో అభిమానులు ఉండర'న్నారు. ఆ మాటే నాకు పద్మభూషణ్‌తో సమానం" అన్నారు విజయ నిర్మల. ఈ కార్యక్రమంలో నరేష్, విజయ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### గీతోపదేశం

**మనసులోనే మార్గముంది**
**తెలుసుకోరా ఇక**
**గురిలేనిదే**
**నీ బాణమింకా**
**చేరుకోదు ఎద**
**ప్రతిరోజు నీకొక పాఠమే**
**చదువుకుంటూ పదా**
**ఇక నిన్ను నీవు మోసగిస్తూ**
**మోసపోతే వృథా**

గీతం: మనసా గెలుపు నీదేరా...
చిత్రం: గోదావరి
రచన: వేటూరి
- పంపినవారు: బి.ప్రేమ్‌రాజ్, సిద్దిపేట

## కడుపుబ్బా నవ్వించి... కంటతడి పెట్టించి!

**పెట్టిన బడ్జెట్‌కు నాలుగు రెట్లకు పైనే వసూళ్లు సాధించిన చిత్రమది. గతేడాది వచ్చిన పది అత్యుత్తమ చిత్రాల్లో ఒకటిగా ప్రముఖ మ్యాగజైన్, ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లు ఎంపిక చేసిన సినిమా అది. మినీ ఆస్కార్‌గా భావించే గోల్డెన్‌గ్లోబ్ పురస్కారాల్లో విజేతగా నిలిచింది. ఇప్పుడు ఆస్కార్ బరిలోనూ ఐదు నామినేషన్లతో సత్తా చాటుతోంది. అదే 'లేడీ బర్డ్'. ఓ టీనేజీ అమ్మాయి జీవితం నేపథ్యంలో వచ్చిన ఈ సినిమా ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకురాలు, ఉత్తమ నటి, ఉత్తమ సహాయ నటి, ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే విభాగాల్లో ఆస్కార్ పురస్కారం కోసం పోటీపడుతోంది. సావొయిర్సె రొనన్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని గ్రెటా గెర్‌విగ్ తెరకెక్కించింది. లౌరీ మెట్‌కాఫ్ కీలక పాత్రలో నటించింది. ఆ చిత్ర విశేషాలివీ...**



'లేడీ బర్డ్'

### ఆస్కార్ బరి

టీనేజీ వయసంటేనే ఓ కల్లోలిత ప్రపంచం. అంతులేని ఊహలు, హద్దులు తెలియని కలలు... వాటిని అందుకోవాలనే ఆరాటాలు, వాస్తవిక ప్రపంచంలోని వైరుధ్యాలు... వీటి నడుమ సంఘర్షణ, ఆవేదనభరిత దశ. అచ్చంగా అలాంటి స్థితిలో ఉన్న ఓ అమ్మాయి జీవితానికి కాస్త వినోదాత్మక కోణాన్ని జోడించి ఆవిష్కరించిన చిత్రం 'లేడీబర్డ్'. తొలి చిత్ర దర్శకురాలైన గ్రెటా ఈ సున్నిత కథాంశాన్ని నవ్విస్తూనే, తల్లీ కూతుళ్ల అనుబంధంతో కంటతడి కూడా పెట్టించింది. అందుకే ఈ చిత్రాన్ని గతేడాది వచ్చిన పది అత్యుత్తమ చిత్రాల్లో ఒకటిగా టైమ్ మ్యాగజైన్, అమెరికన్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్, నేషనల్ బోర్డ్ ఆఫ్ రివ్యూ ఎంపిక చేశాయి. ఈ సినిమాకు గోల్డెన్ గ్లోబ్ పురస్కారాల్లో కామెడీ చిత్రాల విభాగంలో ఉత్తమ చిత్రం, ఉత్తమ నటి అవార్డులు దక్కాయి. బాఫ్టా పురస్కారాల్లో మూడు నామినేషన్లు అందుకుంది. బాక్సాఫీసు వద్ద కూడా ఈ చిత్రం చక్కటి విజయం సాధించింది. పది మిలియన్ డాలర్ల బడ్జెట్‌కుగానూ 45.6 మిలియన్ డాలర్లు వసూలు చేసింది.

**కథేంటి:** 17 ఏళ్ల క్రిస్టిన్ మెక్‌ఫెర్సన్(రొనన్) అనే హైస్కూల్ అమ్మాయిది స్వేచ్ఛా మనస్తత్వం. తనకుతాను లేడీబర్డ్ అని పేరుపెట్టుకుంటుంది. తనను అదుపులో పెట్టాలనుకునే తల్లి(మెట్‌కాఫ్) అంటే క్రిస్టిన్‌కు కోపం. స్కూల్‌లో పరిచయమైన డ్యానీకి ఆకర్షితురాలవుతుంది. అయితే ఓ సంఘటనతో ఆమెకు డ్యానీపై మనసు విరిగిపోతుంది. తల్లి ఒత్తిడితో కాఫీషాప్‌లో ఉద్యోగంలో చేరిన క్రిస్టిన్ అక్కడ మ్యుజీషియన్ కైల్‌తో ప్రేమలో పడుతుంది. అయితే కైల్ ఆమెను మోసం చేస్తాడు. ఈ బాధలో ఉన్న క్రిస్టిన్‌కు తన తండ్రి ఉద్యోగం పోయినట్లు తెలుస్తుంది. అప్పుడు ఇంటికి దూరంగా వెళ్లిపోవాలని తల్లికి ఇష్టం లేకపోయినా న్యూయార్క్ యూనివర్సిటీలో చేరేందుకు సిద్ధమవుతుంది క్రిస్టిన్. ఎయిర్‌పోర్ట్‌కు వెళ్తున్నప్పుడు తల్లి తనతో ఏమీ మాట్లాడదు. టెర్మినల్ వద్దకు సెండాఫ్ ఇవ్వడానికి కూడా రాదు. తనను చూడటం ఇష్టం లేకనే తల్లి రాలేదని క్రిస్టిన్ అనుకుంటుంది. అయితే ఆమె తల్లి మాత్రం తను ఏడవడం క్రిస్టిన్ చూడకూడదనే అక్కడికి రాదు. కానీ కూతురిని చూడాలనే కోరిక ఆపుకోలేక వెనక్కి పరిగెత్తుకుంటూ వస్తుంది. అప్పటికే క్రిస్టిన్ విమానం వెళ్లిపోయుంటుంది. మరి క్రిస్టిన్‌కు తల్లికి తనపై ఉన్న ప్రేమ ఎలా తెలిసింది? తల్లి కోపం వెనుక ఉన్న అనురాగం ఎలా అర్థం చేసుకుంది? అన్న విషయాలు 'లేడీబర్డ్'లో హృద్యంగా ఆవిష్కరించారు.

**విశేషాలు**

- తొలి చిత్రంతోనే ఉత్తమ దర్శకురాలిగా నామినేషన్ అందుకుంది గ్రెటా గెర్‌విగ్. ఆస్కార్ నామినేషన్ అందుకున్న ఐదో దర్శకురాలీమె.
- దర్శకురాలు తన జీవితంలోని కొన్ని అనుభవాల స్ఫూర్తితో ఈ కథ రాసుకుందట. అందుకే తన తల్లి క్రిస్టిన్ పేరును కథానాయిక పాత్రకు పెట్టింది. తన తల్లి లాగే ఈ చిత్రంలోనూ నాయిక తల్లి నర్సుగా పనిచేస్తుంటుంది.

## నవ్వుల సందడి



రాజేంద్రప్రసాద్, శ్వేత

రాజేంద్రప్రసాద్, రిషి, బ్రహ్మానందం, అలీ, ఖయ్యూం, కృష్ణుడు, ధనరాజ్, సాయి, సాక్షి, శ్వేత మేనన్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'ఊళ్ళో పెళ్ళికి కుక్కల హడావిడి'. నిధి ప్రసాద్ దర్శకత్వం వహించారు. భాగ్యలక్ష్మి విక్రమ్ నిర్మాత. మంగళవారం హైదరాబాద్‌లో ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ "ఇదో హాస్యవల్లరి. సినిమా చూసి నవ్వుకుంటూ థియేటర్ నుంచి బయటకి వెళ్లేలా దర్శకుడు తెరకెక్కించారు. జంధ్యాల, ఈవీవీ చిత్రాలు గుర్తుకొచ్చేలా రూపొందించార"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఆరుగురు తమ్ముళ్లున్న అన్నయ్య కథ ఇది. ఆ అన్నయ్య పెళ్లి నేపథ్యంలో జరిగే హడావిడే ఈ సినిమా. ప్రతి సన్నివేశం నవ్విస్తుంది. ఐదు పాటలున్నాయి. అనూప్ స్వరాలు ఆకట్టుకుంటాయ"న్నారు. త్వరలోనే విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు నిర్మాత.

## అమెరికాలో గూఢచారి

అడవి శేష్, శోభిత ధూళిపాళ్ల నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'గూఢచారి'. శశికిరణ్ తిక్క దర్శకుడు. అభిషేక్ నామా, టిజి విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ అమెరికాలో జరుగుతోంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'ఇప్పటివరకూ తెలుగు తెరపై చూడని సరికొత్త కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో అడవి శేష్ ఒక గూఢచారి పాత్రలో కనిపించనున్నారు. ఫస్ట్‌లుక్‌కి మంచి స్పందన లభించింది. ప్రస్తుతం అమెరికాలో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నాం. వేసవిలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం" అన్నారు. కూర్పు: గ్యారీ బీహెచ్, మాటలు: అబ్బూరి రవి, సంగీతం: శ్రీచరణ్ పాకాల, ఛాయాగ్రహణం: షానిల్ డియో



అడవి శేష్



మొక్కను ప్లాస్టిక్ కుండీలోనే పెట్టాలా... ఇంటీరియర్ డిజైనింగ్ చేయాలి... కానీ ఇందుకు ఏది వాడినా పర్యావరణహితంగా ఉండాలి... ఈ రెండు ఆలోచనలే ఆమెను కొత్త ఉపాధి బాటను పట్టించాయి. విదేశాల్లో చదివినా...ఉన్నత ఉద్యోగం ఉన్నా... అన్నింటినీ వదిలేసుకుని కేవలం తన ఆలోచనలకు రూపం ఇవ్వడానికి సిద్ధమైంది. ఆమే హైదరాబాద్‌కు చెందిన తేజస్వి.

# మొక్కల కోసం భూమిని అమ్మేశాం!

నా ఆలోచన చెప్పినప్పుడు చాలామంది 'భేష్... ప్రయత్నించు' అని అంటారనుకున్నా.. కానీ 'మంచి ఉద్యోగం, బోలెడు జీతం. వదులుకోవడం ఎందుకు. హాయిగా ఉండొచ్చు కదా!' అని అన్నారు. వారన్నట్టు నేను ఉద్యోగం చేస్తూ ఉండిపోతే.. నాకు గుర్తింపు ఏముంటుంది. నలుగురికీ ఉపయోగపడితేనే కదా... సంతృప్తి. అందుకే నా ఆలోచనల్ని ఆచరణలో పెట్టా. మొక్కల పెంపకంలో పర్యావరణ హితమైన అలంకరణ వస్తువులను ఉపయోగిస్తూ...కొత్త అందాన్ని తెస్తూ, పచ్చదనాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నా. "ప్లాంట్‌డెక్" పేరుతో మూడేళ్లక్రితం నయా వ్యాపారాన్ని ప్రారంభించా. ఇక్కడ డిగ్రీ పూర్తిచేశాక యూకేలో ఎంఎస్ చదివి అక్కడే కొన్నాళ్లు ఉద్యోగం చేశా. కానీ ఇంటినీ, కుటుంబాన్నీ వదిలి ఉండటం కష్టంగా ఉండటంతో ఉద్యోగం వదిలి ఇక్కడకు వచ్చేశా. మాది ప్రకాశం జిల్లాలోని బెస్తవారిపేట. నాన్న నాబార్డ్ ఉద్యోగిగా పదవీవిరమణ చేశారు. అమ్మ గృహిణి. అన్నయ్యా, అక్క.. ఇదీ మా కుటుంబం. ఇక్కడికి వచ్చాక వివిధ సంస్థలకు బ్రాండింగ్ చేసేందుకు ఓ కన్సల్టెన్సీ సర్వీసెస్ సంస్థను ప్రారంభించా.

## తులసి ఒక్కటే కాదు...

అప్పుడే నాకు పెళ్లయ్యింది. మా వారు రిషికేష్. అప్పటికే ఆయన ఐటీ రంగంలో ఉన్నత స్థానంలో ఉన్నారు. ఓ రోజు మేమిద్దరం కలిసి హైదరాబాద్‌లోని బేగంపేట ఫ్లై ఓవర్ మీదుగా కారులో వెళ్తున్నాం. ఎంతకీ తగ్గని ట్రాఫిక్ ఆ రోజు. వాహనాల క్లచ్‌ల నుంచి వచ్చే వాసన మమ్మల్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. ఏసీ ఉన్నా కూడా ఆ వాసన తట్టుకోలేకపోయా. చివరకు ఆ వాసన ప్రభావం తగ్గేందుకు గాలిని శుద్ధి చేసే ఓ మొక్కని తెచ్చి కారులో పెట్టాం. అప్పటినుంచీ నాకు అవే ఆలోచనలు. మన దేశంలో తులసిని మాత్రమే పవిత్రంగా చూస్తారు. కానీ విదేశాల్లో మరీ ముఖ్యంగా యూరప్ దేశాల్లో మొక్కలేవైనా సరే అలానే చూస్తారు. అది గుర్తొచ్చింది. కాలుష్యాన్ని తగ్గించేందుకు సరైన మార్గం మొక్కలే అనిపించింది. నా ఆలోచనలూ, సందేహాలను మా వారూ, అన్నయ్యతో చెప్పా. చివరకు ఆ ప్రయత్నం మేమే ఎందుకు చేయకూడదు అనిపించింది.





ఆ ఆలోచనల నుంచి పుట్టిందే పర్యావరణ హిత అలంకరణ వస్తువులతో మొక్కల పెంపకం. దాన్నే ఉపాధి మార్గంగా మార్చుకోవాలనుకున్నా.

## దేశమంతా తిరిగా...

ఆలోచన అయితే ఉంది కానీ... ఆచరణలో ఎలా పెట్టాలో తెలియలేదు. ఏడాదిపాటు ఈ అంశాల్లో స్పష్టత తెచ్చుకున్నా. వర్క్‌షాప్‌లకు వెళ్లేదాన్ని. మొక్కల పెంపకంలో మెలకువలు తెలుసుకున్నా. వీటి పెంపకానికి అవసరమైన పర్యావరణ హిత కుండీలూ, హోల్డర్లు ఎక్కెడెక్కడ దొరకుతాయా... అని దేశవ్యాప్తంగా తిరిగి చుట్టేశా. కోల్‌కతా, దిల్లీ నుంచి మట్టి కుండీలూ, యూపీ నుంచి సిరామిక్, జైపూర్ బ్లూపాట్‌లను తెప్పించా. ఇవేకాదు దేశవ్యాప్తంగా ఎక్కడ పర్యావరణహితంగా, చేతిపనితో తయారు చేసిన కుండీలు ఉన్నా అక్కడకి వెళ్లిపోతా. అవి ప్లాస్టిక్ రహితంగా అంటే మట్టి, పీచూ, లోహం, గాజు, చెక్క ...ఇలా వందశాతం బయోడీగ్రేడబుల్ వాటితోనే ఇంటీరియర్, లాండ్‌స్కేప్ డిజైనింగ్ చేయడం మొదలుపెట్టా.

## ఐదువందల రకాల్లో...

మొక్కలే పర్యావరణహితం అనుకుంటే.. ఇంకా ప్రత్యేకంగా ఏం చేస్తారని అడిగేవారు ప్రారంభంలో చాలామంది. దానికీ ఓ పద్ధతుంది. సాధారణంగా ఫిలడెండ్రాన్, పీస్‌లిల్లీ, బోస్టన్‌ఫెర్న్ వంటి పది రకాల మొక్కలు మాత్రమే ఏసీలు ఉన్న వాతావరణంలోనే బతకగలుగుతాయి. కానీ చాలామంది మొక్కలేవైనా సరే ఎక్కడయినా బతికేస్తాయి అనుకుంటారు. కాలాన్ని బట్టి, వాతావరణాన్ని బట్టి వీటిని ఎంచుకోవాలనేది చాలామందికి తెలియదు. నిర్వహణ కూడా తెలిసుండాలి. అలానే మన దగ్గర సాధారణంగా అలంకరణకోసం ఓ యాభై రకాల మొక్కలు మాత్రమే ఎక్కడ చూసినా కనిపిస్తుంటాయి. కానీ మేం దాదాపు ఐదువందల రకాల మొక్కల్ని డిజైనింగ్ కోసం ఉపయోగిస్తాం. ఆయా ప్రదేశాల గోడల రంగులూ, ఆ ప్రాంతాలూ, వాతావరణం అన్నీ తెలుసుకుని దానికి అనుగుణంగా మేం ఉపయోగించాల్సిన వస్తువుల్ని తయారు చేయిస్తాం. వాటిని మేం హోటళ్లూ, ఆసుపత్రులూ, కార్పొరేట్ సంస్థలూ, ఇళ్లూ వంటివాటికి ఉపయోగిస్తాం. వీటిని కస్టమైజ్ చేసి ఆయా సంస్థల పేర్లతో కూడా అందిస్తాం. వాటిని వారు బ్రాండింగ్‌కోసమూ ఉపయోగించుకోవచ్చు. ఇక మేం తయారు చేసే వర్టికల్ గార్డెన్ల కోసం ప్లాస్టిక్‌ని కాకుండా పూర్తిగా పీచుతో తయారుచేసిన కమ్మీలను వాడతాం. ఆయా ప్రదేశాలను మరింత అందంగా తీర్చిదిద్దే క్రమంలో చెక్క, గాజు వంటివాటిని ఎక్కువగా ఉపయోగిస్తాం. ఇవి సుమారు రెండు నుంచి నుంచి ఐదారడుగుల ఎత్తువరకూ ఉంటాయి. ఈ వ్యాపారం నిర్వహించడంలో మాకు నాబార్డ్ ఎంతో సహకరించింది. అయితే ఇదంతా ఒక్కరోజులో జరిగిపోలేదు. వ్యాపారం అన్నాక ఒడిదొడుకులు తప్పవు కదా.. అలాంటి సమస్యలే నాకూ ఎదురయ్యాయి. కొత్తగా వ్యాపారంలో దిగేటప్పుడు ప్రధాన సమస్య డబ్బే. అప్పటివరకూ మేం సంపాదించుకున్న మొత్తంతో పాటు బంగారాన్నీ తాకట్టు పెట్టా. అదీ సరిపోక కొంత భూమినీ అమ్మేశా. సుమారు అరవై లక్షల రూపాయలు పెట్టుబడిగా పెట్టాం. ఇక మేం చేసేవన్నీ హ్యాండ్‌మేడ్ కావడంతో కనీసం మూడు నెలల ముందుగానే ఆర్డరు ఇవ్వాల్సి ఉంటుంది. దానికి తగ్గట్లే మా ప్రణాళిక ఉంటుంది. ప్రస్తుతం మా దగ్గర పదిమంది పని చేస్తున్నారు. ఆయా వ్యక్తుల అభిరుచులూ, అవసరాలను బట్టి వెయ్యిరూపాయలు మొదలుకుని లక్షల్లో డబ్బు తీసుకుని అలంకరణ చేస్తాం. ఇప్పుడిప్పుడే ఇబ్బందులు దాటి ఆదాయాన్నీ అందుకుంటున్నా. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ మా వ్యాపార సేవలు అందిస్తున్నా. మా ఖాతాదారులుగా ప్రముఖ సంస్థలెన్నో ఉన్నాయి. వాటిల్లో ఓక్రీస్ హోటల్స్, ఫీనిక్స్ గ్రూప్, బబుల్, ఓటీఎమ్ పబ్, పయనీర్ గ్రూప్స్, క్యాపిటల్ హాస్పిటల్స్.. ఇలాంటివెన్నో ఉన్నాయి.

– స్వాతి కొరపాటి

# గొడవ పడాల్సిందే!

భార్యాభర్తల మధ్య చిన్న చిన్న పొట్లాటలూ, గిల్లి కజ్జాలూ మామూలే. ఇలాంటివాటి వల్ల వారి మధ్య ప్రేమానుబంధం మరింత బలపడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. అలా అని నిత్యం కయ్యానికి కాలుదువ్వ కూడదు. ఏ సందర్భాల్లో గొడవలకు తావేర్పడుతుందో వాటిని ఎలాతగ్గించుకోవచ్చో నిపుణులు చెబుతున్నారు. మీరలాంటి పొరపాట్లేమైనా చేస్తున్నారేమో గమనించుకోవడం మంచిది.

◆ **భోజనం:** వారాంతపు సెలవులూ, పుట్టినరోజూ, పెళ్లిరోజు లాంటి ప్రత్యేక సందర్భాల్లో బయట చేసే భోజనం గురించే చాలామంది భార్యాభర్తల మధ్య చిరు గొడవలు మొదలవుతాయట. ఒకరు వెళదామనుకునే ప్రాంతం మరొకరికి నచ్చదట. భాగస్వామి ఒక హోటల్ పేరు చెబితే ఎదుటివారు మరొకటి చెప్పడంతో గొడవలు మొదలవుతాయట. కాబట్టి ఇద్దరూ ఒక అభిప్రాయానికి రావడం మంచిది. లేదంటే పిల్లలూ లేదా ఇతర కుటుంబసభ్యుల నిర్ణయానికి ఓటేస్తే సరి.


◆ **డబ్బు:** దీని విషయంలో తరచూ గొడవలు జరగడం మామూలే. ఒకరికి అవసరం అనిపించిన వస్తువు మరొకరికి వృథా అనిపించొచ్చు. దాంతో భాగస్వామి డబ్బులను అనవసరంగా ఖర్చు పెడుతున్నారని ఎదుటివారు భావిస్తారు. ఈ సమస్యకు పరిష్కారం మీ చేతుల్లోనే ఉంటుంది. ఇద్దరూ కలిసి ఆర్థిక ప్రణాళిక వేసుకోవడం మంచిది. పొదుపూ, ఇంటి అవసరాల తరువాతే ఖర్చులు అనే నియమాన్ని పెట్టుకోవడం వల్ల ఇబ్బంది ఉండదు.



◆ **ఇంటి పనులు:** ఇద్దరూ ఉద్యోగస్తులైతే ఇంటి పనుల విషయంలో నిత్యం కత్తి దూసుకోవడం సాధారణమే. దానికి పరిష్కారం గొడవ పడటం కాకుండా పనుల్ని విభజించుకోవడమే. ఒకరికొకరు సాయం చేసుకుంటూ ఉంటే మీ మధ్య బంధం మరింత బలపడుతుంది.

◆ **స్నేహితులు–బంధువులు:** భార్యాభర్తల్లో ఎక్కువ గొడవలొచ్చేది వీరి విషయంలోనే. భాగస్వామికి సంబంధించిన వ్యక్తులు మీకు నచ్చనంత మాత్రాన మాట్లాడటం మానేయడం సరి కాదు. కనీస మర్యాదలు పాటించడం తప్పనిసరి. మీమధ్య గొడవ వస్తే...వాళ్ల ప్రస్తావన వీలైనంత వరకూ తీసుకురాకపోవడమే ఉత్తమం.

## నజరానా



జుట్టు రాలుతోందా... గుప్పెడు మందార పూలను ముద్దలా చేసి తలకు పూతలా వేసుకోవాలి. ముప్పావు గంట అయ్యాక తలస్నానం చేయాలి. ఇలా వారానికోసారి చేస్తే... జుట్టు రాలే సమస్య అదుపులోకి వస్తుంది.

# పుదీనారసం... సబ్జానీళ్లు!

**ఎండ ప్రభావం ఇప్పుడిప్పుడే మొదలవుతోంది. ఆ వేడిని తట్టుకోవాలంటే... ఇప్పటినుంచీ కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. అదెలాగంటే...**

❑ మంచినీటిని మించిన ఔషధం లేదు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడేది మంచినీరు మాత్రమే. కాబట్టి ఇప్పటినుంచీ దాహం వేసినా వేయకపోయినా వీలైనంత ఎక్కువగా నీళ్లు తాగడం అలవాటుగా మార్చుకోండి.

❑ గుప్పెడు పుదీనా ఆకులను తాగే నీటిలో వేసుకుంటే... శరీరం చల్లగా ఉంటుంది. ఈ కాలంలో పుదీనా టీని ఎంచుకుంటే మరీ మంచిది. ఎండ ప్రభావాన్ని కొంతవరకూ తట్టుకోగలుగుతారు.

❑ నిమ్మరసం కూడా వేసవికి ఔషధం లాంటిది. ఉదయాన్నే గ్లాసు నీటిలో కొద్దిగా నిమ్మరసం, తేనె కలిపి తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు.



❑ పెరుగు, మజ్జిగలో శరీరానికి కావలసిన పోషకాలు ఉంటాయి. విటమిన్లూ, పోషకపదార్థాలున్న పెరుగును ఈ కాలంలో ఎంత ఎక్కువగా తీసుకుంటే అంత మంచిది.

❑ గసగసాలను ఎక్కువగా ఆహారపదార్థాల్లో వాడాలి. వీటిలోని యాంటీఆక్సిడెంట్లు వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. అంతే కాదు, వేడిని తగ్గించి, శరీరాన్ని చల్లగా ఉంచుతాయి.

❑ కొత్తిమీరను ఆహారంలో అధికంగా తీసుకోవాలి. కొత్తిమీర రసం లేదా వంటకాల్లో దీన్ని వాడినా... శరీరంలోని అధిక ఉష్ణోగ్రత అదుపులో ఉంటుంది.

❑ వేసవి వేడి నుంచి తప్పించుకోవాలంటే సబ్జాగింజలు మంచి ఔషధంలా ఉపయోగపడతాయి. వీటిని నీటిలో అరగంట సేపు నానబెట్టి, అందులో కాస్తంత నిమ్మరసాన్ని కలిపి తాగితే చాలు. శరీరాన్ని చల్లబరచడమే కాదు, బరువు కూడా అదుపులో ఉంటుంది.

# బంగారం వెండి

20న ముగింపు-క్రితం



| తమిళనాడు (రూ. లలో) | | |
|---|---|---|
| ఆర్నమెంట్ (గ్రా) | 2,891 | 2,936 |
| వెండి (గ్రా) | 41.50 | 41.60 |

| | హైదరాబాద్ | | విజయవాడ | | ప్రొద్దుటూరు | | రాజమండ్రి | | విశాఖపట్నం | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| బంగారం(24క్యా) | 31,670 | 31,770 | 31,350 | 31,400 | 30,135 | 30,132 | 31,310 | 31,400 | 31,420 | 31,570 |
| ఆర్నమెంట్ | 29,550 | 29,670 | 29,100 | 29,150 | 29,050 | 29,030 | 29,270 | 29,360 | 29,220 | 29,360 |
| వెండి(కిలో) | 39,510 | 39,665 | 39,700 | 40,000 | 39,500 | 39,800 | 38,700 | 38,900 | 39,900 | 39,900 |

# ప్రేమ విషయం చెప్పేయాలా?

**డియర్ వసుంధర**



డా॥ పూర్ణిమ నాగరాజ
సైకియాట్రిస్ట్


? నాకు ఈ మధ్యే పెళ్లైంది. ఎంత ప్రయత్నించినా పెళ్లికి ముందు అబ్బాయితో మాట్లాడే అవకాశం నాకు దొరకలేదు. మా అమ్మావాళ్లు నేను ఇంతకుముందే ఒకబ్బాయిని ప్రేమించిన విషయం వాళ్ల దగ్గర దాచారు. ఇప్పుడు పెళ్లయిన తరువాత ఆ విషయం చెప్పాలంటే నాకు ధైర్యం చాలట్లేదు. మా ఆయనంటే నాకిప్పుడు అభిమానం ఏర్పడింది. ఇప్పుడు నేను ఆయన్ని మోసం చేస్తున్నానేమో అనే బాధ. నేనేం చెయ్యాలి? **- ఓ సోదరి**

✔ గతం ఎప్పుడూ మనల్ని వెంటాడదు. గతాన్నే మనం వెంటాడతాం. ఇప్పుడు మీరు వైవాహిక జీవితంలో ఆనందంగా ఉన్నారు. అలాంటప్పుడు గతం గురించిన ఆలోచనలన్నీ మర్చిపోండి. ముఖ్యంగా ఆ అబ్బాయితో ఇంతకుముందు మీరు చేసిన చాటింగ్‌లూ, ఫోన్ సంభాషణలు ఉంటే వాటిని తొలగించేయండి. అతడిని గుర్తుకు తెచ్చే వస్తువులేమీ మీ దగ్గర ఉంచుకోకండి. మీ వారితో సరదాగా జీవితాన్ని గడపడానికి ప్రయత్నించండి. పైగా మీరు మీ ఆయనను మోసం చేయాలనుకోలేదు. ముందే ఈ విషయం గురించి చెప్పాలనుకున్నా, ప్రయత్నం ఫలించలేదంతే. ఇదే తలచుకుంటూ ఏదో తప్పు చేశానన్న భావనలో ఉండటం అసలు సరికాదు. చాలామందికి గతంలో ఇలాంటి సంఘటనలుండటం సహజమే. మీ ఆయనకు కూడా అలాంటివే జరిగి ఉండొచ్చు. ఒకవేళ భవిష్యత్తులో ఆయన మీతో ఈ విషయాలు పంచుకుంటే మీరు కూడా తొందరపడి చెప్పే ప్రయత్నం చేయకపోవడం మంచిది. అలా చేస్తే ఇన్ని రోజుల నుంచీ దాచారనే అభిప్రాయం మీవారిలో కలగొచ్చు. అందుకే గతానికి సంబంధించిన విషయాలు రాకుండా చూసుకోండి. మీ భర్తపై పెరిగిన అభిమానాన్ని ప్రేమగా మార్చుకునే ప్రయత్నం చేయండి.

# జ్ఞాపకశక్తికి నిద్రే మందు...

**పరీక్షలు దగ్గరపడేకొద్దీ విద్యార్థుల్లో ఒత్తిడి పెరుగుతుంటుంది. కొందరికి ఎంత కష్టపడి చదివినా విషయం గుర్తుండదు. దీనికి కారణం పక్కా ప్రణాళికతో వ్యవహరించక పోవడం అంటారు నిపుణులు. వారికి మేలు చేసే అంశాలు ఏంటో తెలుసా!**

➡ విద్యార్థులకు ప్రతీ రోజూ వ్యాయామం తప్పనిసరి. దీనివల్ల మెదడుకి రక్తప్రసరణ బాగా జరుగుతుంది. మెదడు శక్తిమంతమై కొత్త విషయాలను తనలో నిక్షిప్తం చేసుకునేటంత సామర్థ్యాన్ని పెంచుకుంటుంది. సమయం వృథా అనుకోకుండా మధ్యలో విరామం తీసుకుని నడవడం, సైకిల్ తొక్కడం, ఈత కొట్టడం వంటివి ఈ సమయంలో తప్పనిసరి. ఒత్తిడి ఉండదు. చదివిన విషయాలూ గుర్తుంటాయి.



➡ కంటి నిండా నిద్రపోతే ఏకాగ్రత కుదురుతుంది. కనీసం ఆరు గంటల నిద్ర ఆలోచనా శక్తిని పెంచుతుందంటారు. మెదడు ఉత్తేజమై, సామర్థ్యం రెట్టింపు అవడంతో, చదివినవన్నీ మెదడులో నిక్షిప్తమై, జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. నిద్ర లేకుండా రాత్రి అంతా చదివినవారి కన్నా, ఆరు గంటలసేపు నిద్రపోయి వేకువజామున చదివిన వారే, ఎక్కువ విషయాలను గుర్తు పెట్టుకుంటున్నట్లు ఓ సర్వే కూడా తేల్చిందని నిపుణులు చెబుతున్నారు.

➡ మెదడుతో ఆడే ఆటలకు ప్రాధాన్యమిస్తే నాడులు ఉత్తేజితమవుతాయి. మెదడు మరింత సామర్థ్యాన్ని పెంచుకుంటుంది. దీంతో జ్ఞాపకశక్తి అధికమవుతుంది. తప్పనిసరిగా ఇలాంటి ఆటలకు విద్యార్థులు ప్రాముఖ్యతనివ్వాలి.



# గేట్ దాటితే ఇదిగో రూటు!

**ఉన్నత విద్యకు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలకు గేట్ ఇప్పుడు ప్రధాన ప్రవేశ మార్గంగా మారింది. ఇందులో మంచి ర్యాంక్ సాధిస్తే ఉత్తమ విద్యాసంస్థల్లో ఉపకారవేతనంతో పీజీ చేసుకోవచ్చు. చక్కటి జీతంతో జాబ్‌లో చేరిపోవచ్చు. గేట్ నిర్వహణ ఇటీవల ముగిసింది. కొత్త అభ్యర్థులు, మెరుగైన ర్యాంక్ కోసం మళ్లీ పరీక్ష రాసినవారు ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో గేట్ ర్యాంక్ ఆధారంగా అందుబాటులో ఉన్న ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల గురించి అభ్యర్థులు తగిన అవగాహన ఏర్పరచుకోవాలి. అప్పుడే గేట్ తర్వాత ఏం చేయాలనే ప్రశ్నకు సరైన సమాధానం లభిస్తుంది. ప్రయోజనకరమైన నిర్ణయం తీసుకోడానికి వీలుంటుంది.**

గేట్ రాసే అభ్యర్థులు రెండు ప్రయోజనాలను ఆశిస్తారు. మొదటిది ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగావకాశాల కోసం అనుకుంటే రెండోది ఉన్నత స్థాయి చదువుల కోసం (ఎంటెక్/ ఎంఎస్, పీహెచ్‌డీ).

గేట్ ఫలితాల ఆధారంగా అనేక ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూస్) తమ సంస్థల్లోని ఇంజినీరింగ్ విభాగాల్లో ఉద్యోగావకాశాలను కల్పిస్తున్నాయి. ఈ సంస్థలు గేట్ స్కోరు/ ర్యాంకుల ఆధారంగా తుది జాబితాను రూపొందించి, తరువాత గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల ఆధారంగా అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తున్నాయి.

**గేట్-2017: పీఎస్‌యూల కటాఫ్ మార్కులు**

| పేరు | బ్రాంచి | జనరల్ | ఓబీసీ | ఎస్‌సీ | ఎస్‌టీ | పీడబ్ల్యూడీ |
|---|---|---|---|---|---|---|
| ఎన్‌టీపీసీ | ఈఈ | 62.84 | 59.6 | 44.35 | 48.98 | 31.59 |
| | ఎంఈ | 81.02 | 77.26 | 69.76 | 62.94 | 41.89 |
| | ఈసీ | 65.95 | 64.52 | 56.08 | 51.28 | 45.23 |
| | ఐఎన్ | 72.35 | 71.01 | 60.01 | 47.02 | 34.01 |
| | సీఈ | 82.43 | 75.85 | 64.04 | 66.84 | 40.11 |
| బీహెచ్‌ఈఎల్ | ఈఈ | 67.05 | -- | 50.24 | 48.13 | -- |
| | ఎంఈ | 84.43 | -- | 72.49 | 61.58 | -- |
| బీపీసీఎల్ | ఎంఈ | 73 | 71 | 54 | 47 | 35 |
| ఎన్‌బీసీసీ | సీఈ | 83.41 | -- | 70.09 | 64.34 | 30.19 |
| | ఈఈ | 64.65 | -- | -- | -- | -- |
| హెచ్‌ఏఎల్ ఎంటీ (టెక్) | ఎంఈ | 81.44 | 76.61 | 69.04 | 62.96 | -- |
| | ఈసీ | 62.81 | 57.04 | 48.76 | 42.03 | 46.15 |
| | ఈఈ | 68.01 | 61.56 | 48.11 | 52.6 | 49.83 |
| | సీఈ | 75.86 | 70.27 | 58.53 | 58.1 | 58.9 |
| హెచ్‌ఏఎల్ డీటీ | ఎంఈ | 77.27 | 73.18 | 60.46 | 46.92 | -- |
| | ఈసీ | 59.27 | 53.45 | 42.66 | -- | -- |
| | ఈఈ | 61.88 | 58.46 | 46.41 | -- | -- |
| గెయిల్ | కెమికల్ | 73.01 | 70.02 | 67.37 | 60.71 | 45.67 (ఓహెచ్) |
| | ఎంఈ | 86.26 | 84.09 | -- | 67.38 | 24.34 (హెచ్‌హెచ్) |
| | ఈఈ | 67.35 | 64.67 | 53.62 | 52.95 | -- |
| | ఐఎన్ | 73.01 | 71.67 | -- | 42.69 | -- |
| | సీఈ | 84.4 | 80.13 | -- | 66.84 | -- |
| | బీఐఎస్ | 71.78 | 69.18 | 60.05 | -- | -- |

చాలామంది ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగాలపై ఆసక్తి పెంచుకోవడానికి ప్రధాన కారణం ఉద్యోగ భద్రతగా చెప్పవచ్చు. ఇక్కడ జీతభత్యాలు ఏడాదికి రూ.12 లక్షల వరకు లభిస్తాయి. తమకు సంబంధించిన రంగాల్లో (కోర్ సెక్టార్) పనిచేసే అవకాశం ఉంటుంది. దీంతోపాటు ఉత్సాహపరిచే పని వాతావరణం వీటిలో ఉంటుంది. ఇంజినీరింగ్ కోర్సులో సంపాదించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకునే అవకాశం రావటం మరో అనుకూలాంశం.



వై.వి. గోపాలకృష్ణమూర్తి
ACE ఇంజినీరింగ్ అకాడమీ

ప్రభుత్వరంగ సంస్థలు గేట్‌కు 70% నుంచి 85% వరకు వెయిటేజీని ఇస్తున్నాయి. మిగతా వెయిటేజీని గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలకు ఇస్తాయి. ఎన్‌టీపీసీలో 85% వెయిటేజీ గేట్ స్కోరుకు, 5% వెయిటేజీ గ్రూప్ డిస్కషన్‌కు, 10% వెయిటేజీని ఇంటర్వ్యూకు ఇస్తున్నారు. బీహెచ్‌ఈఎల్‌లో 75% వెయిటేజీ గేట్ స్కోరుకూ, 25% ఇంటర్వ్యూకూ కేటాయిస్తున్నారు.

## ఉపకార వేతనం

సంబంధిత సబ్జెక్టుల్లో లోతైన అవగాహన, ఉన్నత విద్యార్హతల కోసం విద్యార్థులు ఎంటెక్/ ఎంఎస్‌లో చేరాలనుకుంటారు. మంచి ప్రాంగణ నియామకాలూ, ఉన్నత పరిశోధన (పీహెచ్‌డీ) అవకాశాల కోసం, అధ్యాపక రంగంలో ప్రవేశం కోసం కూడా పీజీపై మొగ్గు చూపిస్తుంటారు. గేట్ స్కోరు ఆధారంగా ఎంటెక్ ఎక్కడ చేసినా ఉపకార వేతనంగా నెలకు రూ.12,400 ఇస్తారు.

## పీజీకి దరఖాస్తు చేస్తున్నారా?

పీజీకి దరఖాస్తు చేసుకునే ముందు ఈ కింది అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి. ▌ ఎంచుకునే కళాశాల విశిష్టత ▌ ఎంచుకునే బ్రాంచి/ స్పెషలైజేషన్ ప్రాముఖ్యం. ▌ ప్రాంగణ నియామక అవకాశాలు ▌ ఏవిధమైన ఉద్యోగాన్ని చేయాలనుకుంటున్నారు? (సాఫ్ట్‌వేర్/ ప్రాడక్ట్ డెవలప్‌మెంట్/ కోర్) ▌ విశ్వవిద్యాలయం/ కళాశాల ఉండే ప్రదేశం, నివాస, రవాణా సౌకర్యాలు ▌ పారిశ్రామిక సంస్థలతో పరిశోధన, కన్సల్టింగ్ సంబంధాలు ▌ ఎంటెక్ ప్రోగ్రాం ఐఐఎస్‌సీ, ఐఐటీలు, ఎన్ఐటీలు, విశ్వవిద్యాలయాలు, కొన్ని ప్రైవేటు కళాశాలల్లో ఉంటుంది. ఈ కళాశాలల్లో మెరిట్ పద్ధతిలో గేట్ స్కోరు ఆధారంగా అభ్యర్థులకు సీట్లు కేటాయిస్తారు. ▌ గేట్ స్కోరు ఆధారంగా అభ్యర్థులు నాణ్యమైన కళాశాలలను ఎంచుకునే ప్రాధాన్య క్రమాన్ని పరిశీలిస్తే మొదట ఐఐఎస్‌సీ తర్వాత వరుసగా ఐఐటీలు, ఎన్ఐటీలు, విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు కళాశాలలు ఉంటాయి.

## ఐఐఎస్‌సీ/ ఐఐటీల్లో..

◗ సహజంగా ఎంటెక్ చేయాలనుకునేవారి మొదటి ప్రాధాన్యం ఐఐఎస్‌సీ/ ఐఐటీలు.

◗ కొన్ని ఐఐటీల్లో గేట్ స్కోరుతో పాటు రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు. ఎంపిక విధానం స్పెషలైజేషన్ బట్టి మారే అవకాశముంది.

◗ గత సంవత్సరం కటాఫ్ స్కోరులను ఆధారంగా చేసుకుని ప్రతి ఐఐటీకీ వేరువేరుగా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు వివరాలకు, గత సంవత్సర కటాఫ్ స్కోరు కోసం ఆయా కళాశాలల వెబ్‌సైట్‌లను పరిశీలించవచ్చు.

◗ ఐఐటీ/ ఎన్ఐటీలు, కొన్ని విశ్వవిద్యాలయాల్లో కొన్ని సీట్లు సెల్ఫ్ ఫైనాన్స్ కోటాలో కూడా ఉంటాయి. వీటిని కూడా మెరిట్ పద్ధతిలో గేట్ స్కోరు ఆధారంగా ఇస్తారు. ఈ పద్ధతి ద్వారా సీటు పొందిన విద్యార్థులకు ఉపకారవేతనం లభించే అవకాశం ఉండదు. కానీ, ఈ పద్ధతిలో సీటు పొందే అభ్యర్థులు తక్కువగా ఉండటం వల్ల మంచి కళాశాలలో చేరే వీలుంటుంది. ఆర్థిక వనరులు ఉన్నవారు ఈ విధంగా కోరుకున్న స్పెషలైజేషన్‌ను మంచి కళాశాలలో పొందవచ్చు.

చాలా ఐఐటీల్లో గేట్ స్కోరు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంఎస్ విద్యార్థులను ఎంపిక చేస్తారు. దీని కాలవ్యవధి రెండేళ్ల కన్నా ఎక్కువగా ఉంటుంది. కానీ ఉద్యోగావకాశాలు సమానంగానే ఉంటాయి. కాబట్టి, ఎంటెక్ సీటు సరైన కళాశాలలో రానివారు దీనికి ప్రాధాన్యమిస్తారు. రిసెర్చ్ మీద అభిరుచి ఉండి, భవిష్యత్తులో పీహెచ్‌డీ చేయాలనుకున్న విద్యార్థులకు ఇదో మంచి అవకాశం.

| గేట్ ర్యాంకు (జనరల్) | సీటు లభించే అవకాశమున్న కళాశాల |
|---|---|
| 175 వరకు | ఐఐఎస్‌సీ బెంగళూరు |
| 300 వరకు | ముఖ్యమైన ఐఐటీల్లో ప్రాచుర్యమున్న బ్రాంచ్‌లు |
| 300-1000 | ముఖ్యమైన ఐఐటీల్లో మిగిలిన బ్రాంచ్‌లు, కొత్త ఐఐటీల్లో ప్రాచుర్యమున్న బ్రాంచ్‌లు |
| 1000-2500 | కొత్త ఐఐటీల్లో మిగిలిన బ్రాంచ్‌లు |

ఇది కొందరు పూర్వ విద్యార్థులు ఇచ్చిన సమాచారం ఆధారంగా రూపొందించింది. ఇది ఏటా మారే అవకాశం ఉంది. రిజర్వేషన్ ఉన్నవారికి స్కోర్ తేడాలు ఉంటాయి. ఎస్‌సీ, ఎస్‌టీ అభ్యర్థులు 10,000 ర్యాంకు వరకు ఐఐటీల్లో సీటు పొందే వీలుంది.

● ఎన్ఐటీఐఈ (ముంబయి) కళాశాలలో పీజీడీఐఈ, పీజీడీఎంఎం, పీజీడీపీఎం కోర్సులు (రెండేళ్లు) చేయడానికి గేట్ స్కోరు, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు. మేనేజ్‌మెంట్‌లో అభిరుచి ఉన్న ఇంజినీరింగ్ పట్టభద్రులకు ఇది ఒక సువర్ణావకాశం. ఈ కళాశాలలో కోర్సు చేస్తే మంచి ఉద్యోగావకాశం (సంవత్సరానికి సరాసరి రూ.16 లక్షలు) లభిస్తుంది. ఈ సంస్థ ఐఐఎంలకు సమానం.

## ఎన్ఐటీల్లో సీటు పొందడమెలా?

దేశంలో ఉన్న ఎన్ఐటీలకు అనేక ఇతర ఉన్నత విద్యాసంస్థల్లో సీసీఎంటీ (సెంట్రలైజ్‌డ్ కౌన్సెలింగ్ ఫర్ ఎంటెక్) పద్ధతి ద్వారా ఏటా ఎంటెక్ ప్రవేశాలను నిర్వహిస్తారు. ఈ సీసీఎంటీ రిజిస్ట్రేషన్ ఏప్రిల్ రెండో వారంలో మొదలయ్యే అవకాశముంది.

▌ సీసీఎంటీ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ అయిన తర్వాత ఎంచుకున్న విద్యాసంస్థలను ప్రాధాన్యం ఆధారంగా వరుసక్రమంలో నింపాలి. ఈ ఎంపికను మూడు విడతల్లో నిర్వహిస్తారు. ఈ మూడు విడతల్లో సీటు లభించకపోయినా, నచ్చిన సీటు రాకపోయినా స్పాట్ రౌండ్‌కు వెళ్లే అవకాశముంది. ఈ రౌండ్‌ను ఆయా ఎన్ఐటీలు వేర్వేరుగా నిర్వహిస్తాయి. ఇది ఒక అదృష్ట అవకాశం. కొన్నిసార్లు తగిన స్కోర్ లేకపోయినా మంచి కళాశాలలో సీటు లభించే అవకాశం ఉంది.

| గేట్ ర్యాంకు (జనరల్) | సీటు లభించే అవకాశమున్న కళాశాల |
|---|---|
| 2000 వరకు | ముఖ్యమైన ఎన్ఐటీల్లో |
| 3500 వరకు | మిగిలిన ఎన్ఐటీల్లో |

▌ కొన్ని విశ్వవిద్యాలయాలు గేట్ స్కోరును పరిగణనలోకి తీసుకోకుండా ప్రత్యేకంగా పరీక్ష పెట్టి, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తాయి. అలాంటి వాటిలో దిల్లీ యూనివర్సిటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఐఐఐటీలు, పుదుచ్చేరి యూనివర్సిటీ మొదలైనవి ఉన్నాయి. ▌ ఈ మధ్యకాలంలో చాలామంది విద్యార్థులు గేట్‌ను ఉద్యోగం కోసం మాత్రమే రాస్తున్నారు. పైగా ఈ స్కోరు మూడేళ్ల వరకు చెల్లుబాటు ఉంటుంది. కాబట్టి రాసే ప్రతి అభ్యర్థీ ఎంటెక్‌లో చేరడం లేదు. కాబట్టి పైన తెలిపిన కటాఫ్ ర్యాంకులు 25% వరకు మారే అవకాశముంది. ▌ గేట్ స్కోరు ఆధారంగా కొన్ని ఇతర దేశాల్లో (సింగపూర్, జర్మనీ) ఎంటెక్/ ఎంఎస్ కోర్సులో చేరే అవకాశం కూడా ఉంది. ▌ అభ్యర్థులకు ఐఐటీ/ ఎన్ఐటీల్లో కచ్చితంగా సీటు లభిస్తుందని నమ్మకం లేకపోతే ఐఐఐటీలు, యూనివర్సిటీలకు కూడా దరఖాస్తు చేసుకుంటే మంచిది. అన్నా యూనివర్సిటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ), బిట్స్, పీఎస్‌జీ (కోయంబత్తూరు) మొదలైన వాటిని పరిశీలించవచ్చు. ▌ తెలుగు రాష్ట్రాల్లో జేఎన్‌టీయూహెచ్, జేఎన్‌టీయూకే, జేఎన్‌టీయూఏ, ఓయూ, ఎస్వీయూ, కేయూ, ఆంధ్రా యూనివర్సిటీల్లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. ▌ గేట్ ఉత్తీర్ణత సాధించనివారికి పీజీఈసెట్ (తెలుగు రాష్ట్రాలు), టాన్‌సెట్ (తమిళనాడు) రాసే అవకాశం కూడా ఉంది. వీటి ద్వారా ఆయా రాష్ట్రాల్లోని స్థానిక కళాశాలలో ఎంటెక్ సీటు పొందవచ్చు. కానీ ఉపకార వేతనం లభించదు. ▌ ఒకటో రెండో కళాశాలలకు కాకుండా సుమారు పది కళాశాలలకు దరఖాస్తు చేసుకుంటే మంచిది. అలా చేస్తే మంచి కళాశాలలో, నచ్చిన స్పెషలైజేషన్ లభించే అవకాశం ఉంటుంది. ▌ కౌన్సెలింగ్ సమయంలో సీనియర్ల నుంచీ, తెలిసిన అధ్యాపకుల నుంచీ సలహా తీసుకుంటే ఎంతో ఉపయోగం ఉంటుంది.



### ఏ పీఎస్‌యూ? ఏ బ్రాంచి?

కొన్ని పీఎస్‌యూలు నిర్దిష్ట ఇంజినీరింగ్ బ్రాంచిల అభ్యర్థుల గేట్ స్కోరునే ఉద్యోగాలకు పరిగణనలోకి తీసుకుంటున్నాయి. అవేమిటంటే..

◗ **పవర్‌గ్రిడ్:** ఈఈ, ఈసీ, సీఈ, సీఎస్. ◗ **వైజాగ్ స్టీల్ (ఆర్ఐఎన్ఎల్):** ఈఈ, ఎంఈ, ఎంటీ. ◗ **సెయిల్:** ఎంఈ, ఎంటీ, ఈఈ, సీహెచ్, ఐఎన్, ఎంఎన్. ◗ **ఐఓసీఎల్:** సీహెచ్, సీఈ, సీఎస్ఐటీ, ఈఈ, ఈసీ, ఐఎన్, ఎంఈ, ఎంటీ. ◗ **ఓఎన్‌జీసీ:** ఎంఈ, సీఈ, ఈఈ, ఈసీ, ఫిజిక్స్, ఐఎన్, సీహెచ్, కెమిస్ట్రీ, మేథ్స్, పీఈ, సీఎస్ఐటీ ◗ **ఎన్‌టీపీసీ:** ఈఈ, ఎంఈ, ఈసీ, ఐఎన్, ఎంఎన్ ◗ **బీహెచ్‌ఈఎల్:** ఎంఈ, ఈఈ ◗ **గెయిల్:** ఎంఈ, ఈఈ, ఐఎన్, సీఈ, సీహెచ్ ◗ **ఎంటీఎన్ఎల్:** సీఈ, ఈఈ, ఈసీ ◗ **హెచ్ఏఎల్:** ఎంఈ, ఈఈ, ఈసీ

---

# నోటీస్ బోర్డు

## ప్రభుత్వ ఉద్యోగాలు

**జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ, హైదరాబాద్**

**పోస్టులు:** ఒప్పంద ప్రాతిపదికన పీఎంఏ హెడ్- 1, డిప్యూటీ పీఎంఏ హెడ్- 3, థిమాటిక్ ఎక్స్‌పర్ట్- 11. **అర్హతలు:** ఏదైనా డిగ్రీ, పీజీ, సంబంధిత రంగంలో పని అనుభవం. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **చివరితేది:** 06.03.2018. **వెబ్‌సైట్:** www.nird.org.in

**ఐఓసీఎల్, రిఫైనరీ డివిజన్**

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్- గుజరాత్, హల్దియా, బంగాయ్‌గావ్, గువాహటి, పారాదీప్, పానిపట్ రిఫైనరీల్లో జేఈఏ ఖాళీలు. **పోస్టులు:** జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్, జూనియర్ మెటీరియల్స్ అసిస్టెంట్, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అనలిస్ట్ తదితరాలు. **ఖాళీల సంఖ్య:** 201. **అర్హత:** ఐటీఐ, ఇంజినీరింగ్ డిప్లొమా, బీఎస్సీతో పాటు పని అనుభవం. **వయసు:** 18 నుంచి 25 ఏళ్ల మధ్య. **ఎంపిక:** రాత పరీక్ష, స్కిల్/ ప్రొఫిషియన్సీ/ ఫిజికల్ టెస్ట్ ద్వారా. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **చివరితేది:** 10.03.2018. **వెబ్‌సైట్:** www.iocl.com

**ఎయిర్ ఇండియాలో క్యాబిన్ క్రూ**

**పోస్టులు:** నార్తర్న్ రీజియన్ (దిల్లీ)- 450, వెస్టర్న్ రీజియన్ (ముంబయి)- 50. **అర్హత:** 10+2, ఏడాది పని అనుభవం ఉండాలి. **వయసు:** 18 నుంచి 35 ఏళ్ల మధ్య. **ఎంపిక:** మెడికల్, రాతపరీక్షల ద్వారా. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **చివరితేది:** 12.03.2018. **వెబ్‌సైట్:** www.airindia.in

## వాక్ - ఇన్స్

**కేంద్రీయ విద్యాలయ పికెట్, సికింద్రాబాద్**

**పోస్టులు:** ఒప్పంద ప్రాతిపదికన పీజీటీ, టీజీటీ, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్స్, పీఆర్‌టీ, డాక్టర్, నర్స్, కౌన్సెలర్, యోగా ఇన్‌స్ట్రక్టర్, మ్యూజిక్/ డ్యాన్స్/ క్రాఫ్ట్ టీచర్, గేమ్స్/ స్పోర్ట్స్ కోచ్, జర్మన్ టీచర్, డేటా ఎంట్రీ ఆపరేటర్. **అర్హతలు:** ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, డీఈడీ, బీఈడీ, సీటెట్ ఉత్తీర్ణత. **ఇంటర్వ్యూ తేది:** 28.02.2018. **వేదిక:** కేంద్రీయ విద్యాలయ పికెట్, సెకండరీ బ్లాక్, సికింద్రాబాద్. **వెబ్‌సైట్:** www.kvpicket.edu.in

**సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్, తెలంగాణ**

**పోస్టులు:** జావా/ డాట్ నెట్- ప్రాజెక్ట్ లీడర్/ సాఫ్ట్‌వేర్ డెవలపర్/ సీనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, నెట్‌వర్కింగ్ అడ్మినిస్ట్రేషన్, సీనియర్ సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ ఇంజినీర్ తదితర పోస్టులు. **అర్హతలు:** బీఈ/ బీటెక్, ఎంఈ/ ఎంటెక్, ఎంసీఏ, ఎంఎస్సీ, సంబంధిత రంగంలో పని అనుభవం.

**ఇంటర్వ్యూ తేది:** 24.02.2018. **వేదిక:** సీజీజీ, రోడ్ నెం.25, జూబిలీ హిల్స్, హైదరాబాద్. **వెబ్‌సైట్:** https://cgg.gov.in/careers/

**పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.**

---

# పరీక్ష తర్వాత పోల్ ఎక్కితే లైన్‌క్లియర్!

**ఐటీఐ లేదా ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసుకున్న అభ్యర్థుల కోసం భారీ ఉద్యోగ ప్రకటన వెలువడింది. రాతపరీక్ష దాటి విద్యుత్ స్తంభం ఎక్కేస్తే ఉద్యోగంలో చేరిపోవచ్చు. ఈ అరుదైన అవకాశానికి పోటీ కూడా ఎక్కువగా ఉంటుంది. రాతపరీక్షలో మంచి మార్కులు పొందడానికి మొదటి రోజు నుంచే అభ్యర్థులు శ్రమించాలి.**

తెలంగాణలోని విద్యుత్తు పంపిణీ కేంద్రం ఉత్తర విభాగం (టీఎస్ఎన్‌పీడీసీఎల్) 2553 జూనియర్ లైన్‌మెన్ పోస్టుల భర్తీకి తాజాగా ప్రకటన విడుదల చేసింది. ఎలక్ట్రిక్ ట్రేడ్‌లో ఐటీఐ లేదా ఒకేషనల్ కోర్సు పూర్తిచేసుకున్నవారు ఈ పోస్టులకు అర్హులు. రాత పరీక్షలో ప్రతిభ చూపి, విద్యుత్తు స్తంభం ఎక్కగలిగితే ఉద్యోగం ఖాయమైనట్లే. దరఖాస్తును ఆన్‌లైన్‌లోనే పంపాలి.

**అర్హత:** పదోతరగతి అనంతరం ఎలక్ట్రికల్ లేదా వైర్‌మన్ ట్రేడ్‌లో ఐటీఐ పూర్తిచేసి ఉండాలి. లేదా ఎలక్ట్రికల్ ట్రేడ్‌లో రెండేళ్ల ఇంటర్ ఒకేషనల్ కోర్సు పాసై ఉండాలి.

**వయసు:** జనవరి 1, 2018 నాటికి కనిష్ఠంగా 18, గరిష్ఠంగా 35 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అయిదేళ్లు గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.

**ఎంపిక విధానం:** రాతపరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపికచేస్తారు. జూనియర్ లైన్‌మెన్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు పోల్ ఎక్కగలిగిన సామర్థ్యం ఉండాలి. స్తంభం ఎక్కలేనివాళ్లు ఈ పోస్టులకు అనర్హులు.

### ››› రాతపరీక్ష తీరు

పరీక్షలో 80 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 80 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ప్రశ్నలు తెలుగు, ఇంగ్లిష్ రెండు మాధ్యమాల్లోనూ వస్తాయి. ప్రశ్నపత్రంలో 65 ప్రశ్నలు ఐటీఐ/ ఒకేషనల్ కోర్సులోని



ఎలక్ట్రికల్ సబ్జెక్టుపై ఉంటాయి. మిగిలిన 15 ప్రశ్నలు జనరల్ అవేర్‌నెస్, న్యూమరికల్ ఎబిలిటీ విభాగాల నుంచి అడుగుతారు. పరీక్ష వ్యవధి 2 గంటలు. పరీక్ష కేంద్రాలన్నీ జీహెచ్ఎంసీ- హైదరాబాద్, వరంగల్ పరిధిలో ఉంటాయి. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఓఎంఆర్ పత్రంపై బ్లాక్ పెన్నుతో సరైన సమాధానం ఆప్షన్ ఉన్న వృత్తాన్ని పూరించాలి. వైట్‌నర్ ఉపయోగించకూడదు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు గరిష్ఠంగా 20 మార్కుల వెయిటేజీ వర్తిస్తుంది. వీరు పని చేసిన కాలానికి ప్రతి ఆరు నెలలకు ఒక మార్కు చొప్పున వెయిటేజీలో కలుపుతారు.

### ››› అర్హత మార్కులు

పరీక్షలో అర్హత సాధించడానికి ఓసీలు 40, బీసీలు 35, ఎస్సీ, ఎస్టీలు 30 శాతం కనీస మార్కులు పొందాలి. మొత్తం పోస్టుల్లో 20 శాతం పోస్టులకు అందరూ అర్హులే. వీటికి లోకల్, నాన్ లోకల్ ఎవరైనా పోటీపడొచ్చు. మిగిలిన 80 శాతం పోస్టులకు కేవలం లోకల్ అభ్యర్థులనే ఎంపిక చేస్తారు. రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు మెరిట్, రిజర్వేషన్ల ప్రాతిపదికన పోల్ టెస్టు నిర్వహిస్తారు. విజయవంతంగా విద్యుత్తు స్తంభం ఎక్కితే ఉద్యోగం వచ్చేసినట్లే. ఉద్యోగానికి ఎంపికైనవాళ్లకు రెండేళ్ల ప్రొబేషన్ ఉంటుంది. వేతన శ్రేణి: రూ. 15585 - 25200.

### ››› ప్రశ్నల సరళి

విద్యుత్తు, ఎలక్ట్రానిక్స్, ఏసీలో ప్రాథమికాంశాలు, బ్యాటరీలు, అయస్కాంతత్వం, ఎసీ, డీసీ మెషిన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్తు కొలతలు, విద్యుదుత్పత్తి తదితరాల నుంచి ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. వీటితోపాటు జనరల్ నాలెడ్జ్ విభాగంలో వర్తమానాంశాలు, అంతర్జాతీయ సంబంధాలు, సంఘటనలు; జనరల్ సైన్స్, పర్యావరణం, విపత్తు నిర్వహణ; భారతదేశం, తెలంగాణ రాష్ట్రాల భౌగోళికాంశాలు, అర్థశాస్త్రం; భారత రాజ్యాంగం, రాజకీయవ్యవస్థ; భారత స్వాతంత్రోద్యమం, తెలంగాణ - చరిత్ర, కళలు, నాగరికత, సమాజం, వారసత్వ సంపద; తెలంగాణ రాష్ట్ర విధివిధానాలు, పథకాలు మొదలైన వాటిపై ప్రశ్నలడుగుతారు. ఇవి సాధారణంగా పదోతరగతి స్థాయిలోనే ఉంటాయి.

### ››› ముఖ్యమైన తేదీలు

**ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** ఫిబ్రవరి 22 నుంచి

**ఫీజు:** దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులంతా రూ. వంద ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజుగా చెల్లించాలి. దీంతోపాటు రూ.120 పరీక్ష ఫీజు చెల్లించాలి. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు పరీక్ష ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు.

ఫీజు చెల్లించడానికి, ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు చివరి తేదీ మార్చి 19. హాల్ టికెట్లను ఏప్రిల్ 2 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఏప్రిల్ 8 (ఉదయం 10:30 గం. నుంచి మధ్యాహ్నం 12:30 గం. వరకు) పరీక్ష నిర్వహిస్తారు.

# సోఫియా.. చిన్నప్పటి కల్పన

- విద్యార్థులు ఆవిష్కరణలతో కలల్ని సాకారం చేసుకోవాలి
- సోఫియా ముఖంలో 66 హావభావాలు
- హాన్సన్ రోబోటిక్స్ అధినేత డేవిడ్ హాన్సన్

ఈనాడు - హైదరాబాద్

చిన్నప్పుడు మదిలో వచ్చిన శాస్త్రీయ కల్పన ఆధారంగా సోఫియా రోబోను సృష్టించామని హాన్సన్ రోబోటిక్స్ అధినేత డేవిడ్ హాన్సన్ తెలిపారు. కృత్రిమ మేధస్సు, శబ్దాన్ని గుర్తించడం, నూతన సాంకేతికత



రోబో సోఫియా సృష్టికర్త డేవిడ్ హాన్సన్

ఏదేని ఒక ఆవిష్కరణకు ముందుగా.. తర్వాత జరిగే పరిణామాలు, ఉపయోగాలను అధ్యయనం చేయాలని ద్వారా మనుషులతో మాట్లాడేలా సిద్ధం చేస్తామన్నారు. భవిష్యత్తులో మరిన్ని సోఫియాలను సృష్టిస్తామని వెల్లడించారు. విద్యార్థులు, పిల్లలు సాంకేతిక రంగంలో ఆసక్తి, జిజ్ఞాస పెంపొందించుకోవాలన్నారు. తాము కన్న కలల్ని నూతన ఆవిష్కరణల ద్వారా సాకారం చేసుకోవాలన్నారు. సూచించారు. మంగళవారమిక్కడ సోఫియా రోబోట్ గురించి 'ఈనాడు-ఈటీవీ'తో మాట్లాడారు. 'చిన్నప్పుడు శాస్త్రీయ కల్పనల ఆలోచనలుండేవి. రోబోటిక్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, కృత్రిమ మేధస్సును జోడించి రోబో తయారు చేశాను. మాటలను గుర్తించేందుకు పరిజ్ఞానం పొందుపరిచాం. మనుషులు మాట్లాడిన మాటలను గుర్తించి, ఆ మేరకు సమాధానాలిస్తుంది. మనుషుల మేధస్సు చాలా గొప్పది. సోఫియాకు రూపమిచ్చేందుకు చాలా కష్టపడాల్సి వచ్చింది. చాలా దేశాల్లోని ప్రజల ముఖకవలికలు, అక్కడి సంస్కృతులు, నలుపు, తెలుపు, స్త్రీ, పురుషుల్ని అధ్యయనం చేశాను. అన్ని సంస్కృతులు ప్రతిబించాలన్నదే నా అభిప్రాయం. సోఫియా రూపమివ్వడంలో నా భార్యను చూసి కూడా స్ఫూర్తి పొందాను. ప్రస్తుతం ఎన్నో రోబోలున్నాయి. పరిశ్రమలు, ఇంటి అవసరాలు, వినియోగదారుల సేవా కేంద్రాల్లో సహకరిస్తున్నాయి. సోఫియాకు మనుషులతో మాట్లాడే పరిజ్ఞానాన్ని ఇచ్చాం. సోఫియాకు మానవుల మాదిరి చర్మం, ముఖకవలికల కోసం కృత్రిమంగా చర్మం, సాఫ్ట్‌టిష్యూలు రూపొందించాం. సోఫియా ముఖంలో 66 హావభావాలున్నాయి. అందుకే సోఫియా మిగతా రోబోల కన్నా భిన్నమైంది. ప్రస్తుతం ఒత్తిడికి చికిత్స, విద్య, శాస్త్రీయం, కృత్రిమ మేధస్సుకు సంబంధించిన వ్యవహారాలతో పాటు రోబోటిక్ అప్లికేషన్స్, వినియోగదారుల సేవల్లో సహాయం చేస్తోంది. రోబోలు మానవాళి స్థానాలను భర్తీ చేస్తాయన్న మాట అవాస్తవం. అయితే కొన్ని సమస్యలు పరిష్కరించడంలో ఉపయోగపడతాయి. కృత్రిమ మేధస్సుతో మనుషులు, రోబోలు కలిసి పనిచేయాల్సి ఉంటుంది. మనుషులతో నేరుగా మాట్లాడేలా, మరింత అభివృద్ధి చెందేందుకు అవసరమైన సామర్థ్యం అందుబాటులోకి తీసుకురావాలి. ఇప్పటికే ఏఐ, రీజనింగ్, సమయస్ఫూర్తి, బయో టెక్నాలజీ ఇలా అన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి సోఫియాను మరింత ఆధునికంగా తీర్చిదిద్దుతా'.

## ఐటీలో కాలానుగుణంగా మార్పులు

### 'ఈనాడు'తో జర్మనీ డిజినిట్ సంస్థ సీఈవో గైడో వోస్కా



ఈనాడు, హైదరాబాద్: సమాచార, సాంకేతిక విజ్ఞానంలో కాలానుగుణంగా నిత్యం మార్పులు వస్తున్నాయి. ఈ రంగం ప్రపంచాన్ని ప్రభావితం చేస్తోంది. సవాళ్లను అధిగమించే సత్తా ఉన్న వాళ్లే ఈ రంగంలో రాణిస్తారని జర్మనీకి చెందిన డిజినిట్ సంస్థ సీఈవో గైడో వోస్కా తెలిపారు. 18 సంవత్సరాల వయసులోనే సొంతంగా సంస్థను స్థాపించి, ప్రపంచ స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దిన వోస్కా హైదరాబాద్‌లో జరుగుతున్న ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సదస్సు-2018కి వక్తగా హాజరయ్యారు. ఆయన మంగళవారం 'ఈనాడు'తో ప్రత్యేకంగా మాట్లాడారు. 'ఇప్పుడు ప్రపంచం దృష్టి ఐటీ మీదనే ఉంది. ఐటీ రంగం మేధస్సు ఆధారితమైంది. శారీరక శ్రమ కంటే మానసిక శ్రమ అధికంగా ఉంటుంది. గతంలో ఐటీది ఏకచత్రాధిపత్యం. ఇప్పుడు పోటీ తత్వం పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తల్లిదండ్రులు ఈ మార్పులను గమనించాలి. ఐటీ కోర్సు చేస్తున్న సమయంలోనే భవిష్యత్తు ప్రణాళికను రూపొందించుకొని, చదువు ముగిసిన తర్వాత పారిశ్రామికవేత్తగా మారాను. ఐటీ రంగంలో డిజైనింగ్‌కు విస్తృత అవకాశాలను గమనించి, మా అమ్మానాన్నలను ఒప్పించి పరిశ్రమను స్థాపించాను. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ఉత్పత్తులు చేస్తూ పురోగమించాం.'

## మహిళలపై సంక్షోభ ప్రభావం లేదు

### అమెరికా స్టెర్లింగ్ సంస్థ ముఖ్యమార్కెటింగ్ అధికారిణి డెబ్బిమిల్‌మాన్



ఐటీ, దాని అనుబంధ రంగాల్లో పురుషులకంటే మహిళలే అధికంగా రాణిస్తున్నారని, సంక్షోభం ప్రభావం వారిపై ఏ మాత్రం లేదని అమెరికాకు చెందిన స్టెర్లింగు సంస్థ ముఖ్యమార్కెటింగ్ అధికారిణి డెబ్బీ మిల్‌మాన్ తెలిపారు. గత 23 ఏళ్లుగా ఆమె ఐటీ రంగంలో ఉన్నారు. పెప్సీ, గిలెట్, కాల్గేట్, కింబర్లీ క్లార్క్, నెసిల్, కాంబెల్స్, బర్గర్ కింగ్ సంస్థలలో పని చేసిన ఆమె పారిశ్రామిక రంగంతో పాటు రచయితగా, వ్యాఖ్యాతగా, కళాకారిణిగా, మానసిక శాస్త్రవేత్తగా రాణిస్తున్నారు. ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సదస్సుకు వక్తగా హాజరైన ఆమె 'ఈనాడు'తో ప్రత్యేకంగా మాట్లాడారు. 'అమెరికా ప్రభుత్వ చర్యల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఐటీపై ప్రభావం చూపుతోందన్న వాదనలు నిజం కాదు. ప్రస్తుతం అమెరికాలో పనిచేస్తున్న వారి ఉద్యోగాలకు ఇబ్బంది లేదు. దీనిపై భారత్, ఇతర దేశాల్లో ఆందోళన అవసరం లేదు. ఐటీ రంగం స్థిరంగా ఉంది. ముమ్ముందు మాత్రం మార్పులుంటాయి. వీటిని మహిళలు తేలికగా ఆకలింపు చేసుకోగలుగుతున్నారు. నాకు తెలిసి అమెరికాలో ఒక్క మహిళ కూడా తన ఉద్యోగాన్ని కోల్పోలేదు. పైగా వారు మరింతగా రాణిస్తూ ఖ్యాతిపొందుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇదే పంథా సాగుతోంది.'

## 2030 నాటికి ఎగిరే కార్లు

### జనరల్ మోటార్స్ ఉపాధ్యక్షుడు మెక్‌ముల్రే

ఈనాడు, హైదరాబాద్: నాలుగైదు సెకన్లలో జరిగే మానవ తప్పిదాలతోనే దేశంలో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, వీటిని నివారించేందుకు సాంకేతికత, ఏఐ పరిజ్ఞానంతో కూడిన కొత్తతరం కార్లు అవసరమని జనరల్ మోటార్స్ ఉపాధ్యక్షుడు బ్రైన్‌మెక్‌ముల్రే అభిప్రాయపడ్డారు. గతంలో డ్రైవర్, స్టీరింగ్, పెడల్ లేని కార్లు కల్పనగా ఉండేవని, భవిష్యత్తులో ఇవన్నీ నిజం కానున్నాయన్నారు. డ్రైవింగ్ లైసెన్సు, కారు బీమాకు కొత్త సవాళ్లు ఎదురవుతాయని, ఎగిరే కార్లతో వీటికి అంతరాయం కలుగుతుందన్నారు. మంగళవారమిక్కడ ప్రపంచ ఐటీ సదస్సులో 'భవిష్యత్తు కార్లు' అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. సామాజిక సమీకృత నియంత్రణ, చైతన్యం భవిష్యత్తు కార్లలో కనిపిస్తుందని, కొత్త తరం కార్లు వినోదాన్ని ఇవ్వడంతో పాటు జీవనశైలిలో స్వేచ్ఛను ఇస్తాయని ఆయన వివరించారు. వచ్చే ఏడాదికి డ్రైవర్ రహిత కార్లు, 2030 నాటికి ఎగిరే కార్లు ప్రయాణంలో భాగమవుతాయన్నారు. మానవ తప్పిదాల వల్ల రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లే, ద్విచక్ర వాహన చోదకులు ప్రాణాలు కోల్పోతున్నారని ఇంటెల్ ఇండియా అధిపతి నివృతిరాయ్ తెలిపారు. డ్రైవర్ రహిత కార్లు అంటే... డ్రైవర్‌కు సహాయం చేసే టెక్నాలజీ ఆధారితమని పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో డ్రైవర్ రహిత కార్లు భారతీయ రోడ్లపైకి వస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ తరహా కార్లు రావాలంటే 5జీ నెట్‌వర్క్ అవసరమని, భారత్ సిద్ధం కావాలని చెప్పారు. డ్రైవర్ రహిత కార్లు రోడ్డుపైకి వచ్చినప్పుడు డేటా అనుసంధానం, భద్రత కీలకమని వోడాఫోన్ ప్రతినిధి ఫర్హానా హఖీ తెలిపారు.

## సాంకేతికతతో క్రీడలకు మేలు

- క్రీడలు, మరే రంగమైనా పోటీనే నడిపించేది
- ఓటమి ఎదుర్కొన్నప్పుడే గెలుపు దక్కేది
- ఐటీ సదస్సులో భారత బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్

ఈనాడు, హైదరాబాద్: క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవడంలో సాంకేతిక పరిజ్ఞానం తోడ్పడుతుందని భారత బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నారు. బ్యాడ్మింటన్ ఆట విశ్లేషణకు సాంకేతికత దోహదం చేస్తుందన్నారు. అవసరాలకు తగినంత పరిజ్ఞానం ఇప్పటికీ అందుబాటులో రాలేదన్నారు.



క్రీడలు, సాంకేతికత అంశంపై నిర్వహించిన చర్చలో పాల్గొన్న బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్

కృత్రిమ మేధస్సు వచ్చినా మానవ మేధస్సును మాత్రం పూరించలేదన్నారు. ప్రపంచ ఐటీ సదస్సులో 'క్రీడలు-సాంకేతికత' అంశంపై ఆయన మాట్లాడారు. 30 ఏళ్ల క్రితం తాను క్రీడలను కెరీర్‌ను తీసుకున్నప్పటికి.. ఇప్పటికి పరిస్థితుల్లో ఎంతో మార్పు వచ్చిందన్నారు. యువతరాన్ని చూస్తుంటే గెలవాలనే కసితో సాధన చేస్తూ బరిలో దిగడం సానుకూల అంశమన్నారు. క్రీడలు, మరే రంగమైనా పోటీనే చోదకశక్తి అన్నారు. ఓటమి ఎదుర్కొన్నప్పుడే గెలుపు సిద్ధిస్తుందన్నారు. ప్రతిభావంతులను గుర్తించేందుకు కొలమానాలు పనిచేయవని.. 30 ఏళ్ల క్రితం జాతీయ స్థాయిలో ఎంపిక ప్రక్రియ చేపట్టినప్పుడు 16వ స్థానం రావడంతో తాను ఎంపిక కాలేదన్నారు. పిల్లల్లో పసితనపు ఆటలు కనుమరుగయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని ప్రోత్సహించినప్పుడే ఆరోగ్యంగా పెరుగుతారని సూచించారు. కార్యక్రమానికి సమన్వయ కర్తగా వ్యవహరించిన విన్స్ గ్లోబల్ సర్వీసెస్ సీఈవో కేశవ్ మురుగేశ్ మాట్లాడుతూ గోపీచంద్ ప్రారంభించిన ఫిజికల్ లిటరసీకి తమ సంస్థ తోడ్పాటు అందిస్తుందన్నారు.



ప్రపంచ ఐటీ సదస్సులో నిర్వహించిన కార్యక్రమంలో ఒకేసారి 15మందితో కలిసి చదరంగం ఆడుతున్న అలెన్ ట్రెప్లర్

## ఐటీ సదస్సులో మెదడుకు పదును!

### 15 మందితో చదరంగమాడిన పెగా కంపెనీ వ్యవస్థాపకుడు అలాన్ ట్రెప్లర్

ఈనాడు, హైదరాబాద్: అక్కడంతా నిశ్శబ్దం.. 15 మంది ఏకాగ్రతతో చదరంగం ఆడుతున్నారు. వారి మధ్య వేగంగా కదులుతూ ఓ వ్యక్తి.. ఎత్తులు వేస్తూ ఒక్కొకరినీ ఓడిస్తున్నారు. అయితే.. ఆటగాళ్లంతా చదరంగంలో నైపుణ్యం ఉన్నవారు కాదు. ఐటీలో అపార అనుభవమున్న నిపుణులు. అంతమందితో ఎత్తులు వేస్తూ చిత్తు చేస్తున్న వ్యక్తి.. చదరంగంలో మాజీ ఛాంపియన్, ప్రముఖ ఐటీ సంస్థ పెగా వ్యవస్థాపకులు అలాన్ ట్రెప్లర్. ఈ ఘట్టానికి వేదికగా నిలిచింది హైదరాబాద్ హెచ్ఐసీసీలోని ప్రపంచ ఐటీ సదస్సు వేదిక. సదస్సులో రెండోరోజు మంగళవారం భోజన విరామ సమయంలో 15 మంది ఐటీ నిపుణులతో ఒకే సమయంలో అలాన్ ట్రెప్లర్ చదరంగం ఆడారు. దాదాపు గంట సమయం సాగిన ఈ పోటీని చూసేందుకు ఐటీ నిపుణులు ఆసక్తి ప్రదర్శించారు. అలాన్ ట్రెప్లర్ 1976లో ప్రపంచ చదరంగ ఛాంపియన్. ఐటీలో ఉన్నత చదువులు పూర్తిచేసి పెగా కంపెనీతో అంతర్జాతీయ బ్రాండ్ ఇమేజ్ సంపాదించారు.

## ఆలోచనలకు కార్యరూపమివ్వాలి

### అమెరికాలో ఇంటలెక్చువల్ వెంచర్స్ వ్యవస్థాపకుడు, వేయి ఆవిష్కరణలకు పేటెంట్ల రికార్డు సృష్టికర్త ఎడ్వర్డ్ జంగ్



మనం జీవితంలో ఏదైనా సాధించాలంటే గొప్పగా ఆలోచించాలి. వాటికి కార్యరూపమివ్వాలి. ప్రతి ఒక్కరు కనీసం ఒక్క ఆవిష్కరణైనా చేయాలి. వీటిపై పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు శిక్షణ ఇస్తే బలమైన పునాది ఏర్పడుతుందని అమెరికాకు చెందిన ప్రముఖ ఆవిష్కర్త, ఇంటలెక్చువల్ వెంచర్స్ వ్యవస్థాపకుడు ఎడ్వర్డ్ జంగ్ అన్నారు. దాదాపు వేయి ఆవిష్కరణలు చేసి, వాటికి పేటెంట్లు పొందిన వ్యక్తి ఆయన. మరో 500 ఆవిష్కరణలు పేటెంట్ల కోసం పెండింగులో ఉన్నాయి. ప్రపంచ ఐటీ కాంగ్రెస్‌కు హాజరైన ఆయన 'ఈనాడు'తో మాట్లాడారు. 'నేను నిత్య విద్యార్థిని. ప్రతి రోజు ఒక కొత్త అంశం కనుగొనాలని తపిస్తుంటాను. ఆ జిజ్ఞాసతోనే నేను వేయికి పైగా పరిశోధనలు చేశాను. అమెరికా, చైనా, జపాన్‌లలో ఆవిష్కరణల ద్వారా అద్భుతాలు జరుగుతున్నాయి. అన్ని దేశాలు దీనిని అనుసరించాలి. ప్రస్తుత విద్యాలయాలు, సంస్థలు పరిశోధనలకు సరైన అవకాశాలు కల్పించడం లేదు. ప్రతి సంస్థ తమ కార్యాలయంలో ఆవిష్కరణల విభాగాన్ని ఏర్పాటు చేయాలి. ఉద్యోగులను ప్రోత్సహించాలి. అంకుర పరిశ్రమలుగా ప్రారంభమైనవి సరైన దారిలో నడిస్తే భారీస్థాయికి ఎదుగుతాయి.'



సాంకేతిక రంగంలో ఉత్తమ సేవలుగా అవార్డు పొందిన వివిధ దేశాలకు చెందిన సంస్థల ప్రతినిధులు

## అంకురసాయం

- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మార్గనిర్దేశం

ఈనాడు, హైదరాబాద్: అంకుర పరిశ్రమలకు ఆలంబనగా ప్రపంచ ఐటీ సదస్సు నిలిచింది. సదస్సులో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు నిపుణులు మార్గనిర్దేశం చేశారు. పదివేల అంకురపరిశ్రమలకు సాయం లక్ష్యంతో చేపట్టిన నాస్కామ్ జాతీయ పారిశ్రామిక చేయూత కార్యక్రమం (ఎన్ఐపీపీ) కింద మంగళవారం దేశ, విదేశాలకు చెందిన యువ పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి నిర్వహించారు. వీరికి దాదాపు వంద మంది నిపుణులు సలహాలు, సూచనలిచ్చారు. ఎక్కువ మంది ఐటీ పరిశ్రమల ఏర్పాటు, ఆవిష్కరణలు, పరిశోధనల గురించి చర్చించారు. నిధుల సమస్య గురించి వెల్లడించారు. దీనికి నాస్కామ్ తరఫున సాయం అందిస్తామని నిపుణులు తెలిపారు. ఆయా రాష్ట్రాలు, దేశాల్లోని ప్రభుత్వాలను సంప్రదించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీహబ్‌ను సందర్శించాలని వారు చెప్పారు. పలువురు యువమహిళా పారిశ్రామికవేత్తలు సైతం ఇందులో పాల్గొన్నారు.

### ఐటీ పరిశ్రమకు సహకరించాలి

బెంగళూరుకు చెందిన సతీష్, తెలంగాణకు చెందిన రాజేందర్, ఏపీకి చెందిన కిరణ్‌కుమార్ ఈ సందర్భంగా 'ఈనాడు'తో మాట్లాడారు. ఇంజినీరింగు పూర్తి చేసిన తాము సొంతంగా పరిశ్రమలు స్థాపించాలనుకుంటున్నామని, ఐటీ రంగంలో చిన్న పరిశ్రమల స్థాపన కష్టసాధ్యంగా ఉందన్నారు. అమెరికా నుంచి తిరిగొచ్చిన శ్రీరాం తాను హైదరాబాద్‌లో పరిశ్రమ స్థాపించేందుకు సన్నద్ధమవుతున్నానని, నాస్కామ్ నిపుణుల సలహాలు తనకు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయన్నారు.

## ఇది ఆవిష్కరణల యుగం

### మైక్రోసాఫ్ట్ ఆక్సిలరేటర్ ఇండియా ఎండీ, సీఈవో ఇన్ రెసిడెన్స్ బాలగిరీ సబల్ల



'ఇది ఆవిష్కరణల యుగం. ఆవిష్కరణలు మానవాళికి దారి చూపుతున్నాయి. కార్పొరేటు వ్యవస్థలోనూ ఇవి అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. ఆవిష్కరణలకు అనుగుణంగా వేగంగా పురోగమిస్తున్నాయని మైక్రోసాఫ్ట్ అక్సిలరేటర్ ఇండియా ఎండీ, రెసిడెన్స్ సీఈవో బాల గిరిసబల్ల అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 'వాణిజ్యపరంగా అన్ని సంస్థలు ఆవిష్కరణల ప్రాధాన్యాన్ని గుర్తిస్తున్నాయి. స్థిరాస్తి సంస్థలు కూడా దీనికనుగుణంగా కార్యాచరణ రూపొందించుకుంటున్నాయి. మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు దీనిని ఎంతగానో ప్రోత్సహిస్తున్నాయి. ఆవిష్కరణలు, పరిశోధనలకు దీర్ఘకాలం అవసరం లేదు.

# ప్రభుత్వం వీటికి సమాధానమివ్వాలి

- పీఎన్‌బీ కుంభకోణంపై పది ప్రశ్నల్ని సంధించిన యశ్వంత్ సిన్హా
- నీరవ్ ఆస్తులను చకచకా మదింపు చేసినవారికి ఇవేమీ పెద్ద ప్రశ్నలు కావని వ్యాఖ్య

దిల్లీ

కేంద్ర మాజీ మంత్రి, భాజపా సీనియర్ నేత యశ్వంత్ సిన్హా... పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణంపై కేంద్ర ప్రభుత్వానికి పది ప్రశ్నలు సంధించారు! ఇటీవలే 'రాష్ట్ర మంచ్' అనే రాజకీయ వేదికను స్థాపించిన ఆయన- పీఎన్‌బీ కుంభకోణం విషయమై ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టే ప్రయత్నం చేశారు. తీవ్ర గందరగోళానికి గురిచేస్తున్న పీఎన్‌బీ అక్రమాలపై ప్రజలకున్న సందేహాలను సత్వరం నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.



వీటికి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సమాధానం ఇవ్వాలన్నారు. 'కుంభకోణానికి సంబంధించిన పూర్తి సమాచారం ప్రభుత్వానికి కచ్చితంగా తెలుసుంటుంది. కానీ, వాటిని బహిర్గతం చేయకపోవడానికి కారణాలేంటో సర్కారుకే బాగా తెలుసు' నని వ్యాఖ్యానించారు. ఆయన సంధించిన ప్రశ్నలు:

1. నీరవ్ మోదీ కుంభకోణం 2011లో ప్రారంభమైతే- ఏయే సంవత్సరాల్లో ఎన్నెన్ని భరోసా పత్రాలు మంజూరయ్యాయి? 2014 మే నెలకు ముందు ఎన్నిచ్చారు? ఆ తర్వాతి నుంచి ఇప్పటివరకూ ఎన్ని పత్రాలిచ్చారు?
2. ప్రతి భరోసా పత్రాన్ని ఎంతెంత మొత్తాలకిచ్చారు?
3. వాటి చెల్లుబాటు కాలపరిమితి ఎంత? 90 రోజులా? 180.. 365.. అంతకన్నా ఎక్కువ రోజులా?
4. భరోసా పత్రాల ఆధారంగా విదేశాల్లోని బ్యాంకు శాఖలు ఎంత సొమ్ములు అందుకున్నాయి?
5. ఎన్ని పత్రాలకు సంబంధించి నీరవ్ మోదీ పీఎన్‌బీకి చెల్లింపులు జరిపారు? ఎన్ని భరోసాపత్రాలు తిరస్కరణకు గురయ్యాయి?
6. తమకు రావాల్సిన డబ్బుల విషయమై విదేశీ బ్యాంకు శాఖలు ఎప్పుడైనా పీఎన్‌బీ దృష్టికి తెచ్చాయా? నీరవ్ మోదీ విషయంలో ఇలా ఎన్నిసార్లు జరిగింది?
7. పూర్తిగా విదేశీ మారకద్రవ్యంతో ముడిపడిన ఈ వ్యవహారం రిజర్వ్ బ్యాంక్ దృష్టికి రాకుండా ఎలా తప్పించుకుంది?
8. నీరవ్ 200 డొల్ల కంపెనీలను సృష్టించి, వాటి ద్వారా ఈ వ్యవహారాలను చక్కబెట్టినట్లు చెబుతున్నారు. పెద్ద నోట్ల రద్దుతో డొల్ల కంపెనీలన్నీ మూతపడ్డాయని అంటున్నప్పుడు... నీరవ్ మోదీ సంస్థలు ఎలా కొనసాగాయి?
9. కుంభకోణం వెలుగుచూసిన తర్వాత దర్యాప్తు సంస్థలు ఉన్నఫళంగా సోదాలు నిర్వహించి, నీరవ్ ఆస్తులను మదింపుచేశాయి. మరోవైపు- ప్రతి పైసానూ రాబట్టి తీరుతామని అధికారపార్టీ ప్రతినిధులు చెప్పారు. మరి... సులభమైన నా ప్రశ్నలకు మాత్రం సమాధానమెందుకు ఇవ్వలేకపోతున్నారు?
10. ఈ గందరగోళాన్ని కొనసాగించడం ఎవరికి లాభం? మీడియాలో మరో సంచలన వార్తొస్తే ఈ కుంభకోణం మరుగునపడిపోతుందనా? మాల్యాలాగే నీరవ్ కూడా చరిత్రలో తెరమరుగైపోతాడనా?

"ప్రభుత్వ పెద్దలు, ప్రతినిధులు సర్కారును వెనకేసుకు రావడం; కుంభకోణం నుంచి దృష్టిని మళ్లించేందుకు అసంబద్ధ విషయాలన్నింటినీ ప్రస్తావిస్తుండటం చూస్తుంటే... భవిష్యత్తులో మోదీ సర్కారు తప్పకుండా సమాధానం చెప్పాల్సి వస్తుందనిపిస్తోంది. ఈ విషయంలో నాకే సందేహం లేదు. భారతీయ బ్యాంకింగ్ రంగం విశ్వసనీయత మన దేశంలోనే కాదు, ప్రపంచ వ్యాప్తంగా కూడా సంక్షోభంలో పడిపోయింది" అని యశ్వంత్ సిన్హా అన్నారు.

## ఆ నగలను ఎలా కొనుగోలు చేశారు?

- కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ సంఘ్వీ భార్యకు ఐటీ నోటీసులు

దిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు అభిషేక్ సంఘ్వీ భార్య అనితా సంఘ్వీకి ఆదాయపన్ను (ఐటీ)శాఖ మంగళవారం నోటీసులిచ్చింది. పీఎన్‌బీ కుంభకోణం నిందితుడు నీరవ్ మోదీకి చెందినదిగా భావిస్తున్న ఓ షోరూం నుంచి... రూ.6 కోట్ల విలువైన ఆభరణాలను ఎలా కొన్నారో లెక్కచెప్పాలని అందులో కోరింది. ఆభరణాల కొనుగోలుకు నగదు, చెక్కు రూపాల్లో ఎంతెంత చెల్లించారని ప్రశ్నించింది. నగల నిమిత్తం ఆమె రూ.1.5 కోట్లకు చెక్కు; రూ.4.8 కోట్లకు నగదు చెల్లించినట్లు ఐటీశాఖ భావిస్తోంది. నీరవ్ మోదీ పన్ను ఎగవేతపై విచారణలో భాగంగానే ఈ వివరాలను అడుగుతున్నట్లు ఐటీశాఖ నోటీసులో పేర్కొంది.

### కాంగ్రెస్‌వాడిననే లక్ష్యం చేసుకున్నారు: సంఘ్వీ

తన కుటుంబంపై వచ్చిన ఆరోపణలను అభిషేక్ సంఘ్వీ కొట్టిపారేశారు. ప్రతిపక్ష పార్టీకి చెందినవాడను కాబట్టే, తనను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు దిగుతున్నారని ఆరోపించారు. తమపై వస్తున్న ఆరోపణలన్నీ నిరాధారాలనీ, చట్టప్రకారం ఐటీశాఖ నోటీసుకు స్పందిస్తామని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. తన విభాగంలో దేశంలోనే అత్యధిక పన్ను చెల్లింపుదారునిగా ఉన్నానని చెప్పారు. రూ.1.56 కోట్ల విలువైన ఆభరణాలను కొన్నందుకు తన భార్య చెక్కు ఇచ్చారనీ, వీటికి సంబంధించిన రశీదులు తన పేరునే ఉన్నాయన్నారు.

నీరవ్ మోదీకి చెందిన ఫైర్ స్టోన్ ఇంటర్నేషనల్ సంస్థ... అనితా సంఘ్వీ డైరెక్టరుగా ఉన్న అద్వైత్ హోల్డింగ్స్‌కు చెందిన ఆస్తులను లీజుకు తీసుకున్నట్లు రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ఆరోపించారు. దీనిని సంఘ్వీ తోసిపుచ్చుతూ- వేధింపులకు, ఆరోపణలకు హద్దుండాలనీ, కేంద్ర మంత్రిపై పరువునష్టం దావా వేస్తామని హెచ్చరించారు.

## 2017లో పీఎన్‌బీకి అవార్డుపై సీవీసీ వివరణ

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)కు 2017లో ఇచ్చిన విజిలెన్స్ అవార్డుపై కేంద్ర నిఘా కమిషన్ (సీవీసీ) మంగళవారం వివరణ ఇచ్చింది. 2016లో పీఎన్‌బీలో క్రమశిక్షణా చర్యలను నిర్ణీత కాలవ్యవధిలో తీసుకున్నందుకు గాను విజిలెన్స్‌ను అవార్డును 2017లో ఇచ్చామని సీవీసీ తెలిపింది. ఆ ఏడాది ఈవిభాగంలో వచ్చిన నాలుగు అర్హత పొందిన ప్రవేశికల్లో పీఎన్‌బీ ముఖ్య నిఘా అధికారి (సీవీఓ) 92శాతంతో తొలి స్థానంలో నిలిచారంది. 204 కేసుల్లో 187ని సకాలంలో పరిష్కరించారని వివరించింది. అవార్డు ప్రదానం చేసిన పూర్వాపరాలను, సందర్భాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. ఇతర సంస్థలు ఇచ్చిన అవార్డుల చెల్లుబాటును లేదా విలువను నిర్ణయించటం సీవీసీ బాధ్యత కాదని ప్రకటనలో పేర్కొంది.

## అవినీతిలో కేంద్రానిది క్రియాశీల పాత్ర: రాహుల్

మెందీపథార్: మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శల బాణాలు కొనసాగుతున్నాయి. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న మేఘాలయలో మంగళవారం ఆయన పర్యటించారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాలతోపాటు బ్యాంకింగ్ రంగ కుంభకోణాలపైనా విమర్శలు సంధించారు. 'విజయ్ మాల్యా, నీరవ్ మోదీల కుంభకోణాలతో కేంద్రం అవినీతిని తొలగించలేదని రుజువైంది. అంతేకాదు వీరు విదేశాలకు పారిపోయేందుకు వీలుకల్పించి.. అవినీతిలో క్రియాశీల పాత్ర పోషించింది. ఆర్థిక వృద్ధిలో పురోగతి, భద్రత కల్పనకు బదులు ఆందోళన, విద్వేషం, నిరుద్యోగాలకు కారణమైంది'అని వ్యాఖ్యానించారు. 'ప్రధాని మోదీ మళ్లీ విదేశీ పర్యటనకు వెళ్లినప్పుడు మిగతా మోదీలను వెంటపెట్టుకు రావాలని అభ్యర్థిస్తున్నాను'అని చురకలూ వేశారు. మరోవైపు మార్చి 5 నుంచి జరగబోతున్న పార్లమెంటు రెండో దశ బడ్జెట్ సమావేశాలను బ్యాంకు కుంభకోణాలు కుదిపేసే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ విషయంపై విపక్షాలన్నింటినీ ఏకతాటిపైకి తెస్తామని కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీశ్ తివారీ చెప్పారు. 'కేవలం నీరవ్ మోదీ-పీఎన్‌బీ కుంభకోణం, రొటోమాక్ మోసం కేసుల గురించే మేం ప్రశ్నించట్లేదు. బ్యాంకింగ్ రంగం విశ్వసనీయత గురించీ అడుగుతున్నాం. వీటికి కేంద్రం బదులు చెప్పాల్సిందే. లేకపోతే వదిలిపెట్టం'అని ఆయన వ్యాఖ్యానించారు.

## చింతమనేనిని అనర్హుడిగా ప్రకటించాలి

### అసెంబ్లీ కార్యదర్శికి వైకాపా ఎమ్మెల్యేల ఫిర్యాదు

ఈనాడు డిజిటల్, అమరావతి: దెందులూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతమనేని ప్రభాకర్‌పై అనర్హత వేటు వేయాలని వైకాపా డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ శాసనసభ్యులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్సీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ తదితరులు అసెంబ్లీ కార్యదర్శికి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఇటీవల భీమడోలు న్యాయస్థానం చింతమనేనికి రెండేళ్ల జైలుశిక్ష విధించిన నేపథ్యంలో చట్టప్రకారం ఆయన్ను అనర్హుడిగా ప్రకటించాలని కోరారు.

## ఉద్యోగాలిప్పిస్తామని రూ.కోటి వసూలు

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలిప్పిస్తామంటూ విశాఖ జిల్లా చోడవరం నియోజకవర్గ ప్రజాప్రతినిధి పేరు చెప్పి కొంతమంది రూ.కోటి వరకూ వసూలు చేశారు. దీనిపై చోడవరం పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధి కారు డ్రైవరు లక్ష్మణరావు, మరో అనుచరుడు నౌడు శ్రీనుతో పాటు మరో నలుగురు వ్యక్తులు ఉద్యోగాలు ఇప్పిస్తామని ఇటీవలికాలంలో రూ.కోటి వరకు వసూలు చేశారని బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు.

| | | |
|---|---|---|
| సెన్సెక్స్ 33704 | ▼ 71 | |
| నిఫ్టీ 10360 | ▼ 18 | |
| రూపాయి (ఒక అమెరికా డాలరుకు) 64.79 | ▼ 58 పైసలు | |
| బంగారం (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) 30785 | ▼ రూ.లలో 90 | |
| వెండి (ముంబయిలో కిలో) 38310 | ▼ రూ.లలో 240 | |
| ముడి చమురు (బ్రెంట్ ధర డాలర్లలో) 65.58 | ▼ | |




### ప్రధాన ప్రపంచ మార్కెట్లు

| సూచీ | ముగింపు | లాభం/నష్టం |
|---|---|---|
| డోజోన్స్ | 25,129 | −89 |
| నాస్‌డాక్ | 7,290 | +51 |
| నిక్కీ 225 (జపాన్) | 21,925 | −224 |
| స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్) | 3,477 | −11 |
| షాంఘై(చైనా) | ---- | ---- |
| ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్) | 7,247 | −01 |
| డాక్స్ (జర్మనీ) | 12,488 | +102 |


డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

### విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలరు | 58.69 | 68.05 |
| పౌండ్ స్టెర్లింగ్ | 82.00 | 95.11 |
| యూరో | 72.68 | 84.28 |
| జపనీస్ యెన్/100 | 54.96 | 63.74 |
| ఆస్ట్రేలియా డాలరు | 46.40 | 53.68 |
| సింగపూర్ డాలరు | 44.62 | 52.85 |
| థాయ్ బాత్/100 | 186.66 | 223.24 |
| బహ్రెయిన్ దీనార్ | 158.92 | 185.12 |
| కువైట్ దీనార్ | 178.05 | 221.64 |
| సౌదీ రియాల్ | 15.60 | 18.50 |
| యూఏఈ దిర్హమ్ | 15.98 | 18.67 |
| మలేషియా రింగిట్ | 14.76 | 18.15 |
| చైనీస్ యువాన్ | 7.19 | 11.67 |




## నేటి మార్కెట్

చెప్పుకోదగ్గ పరిణామాలేవీ లేకపోవడంతో నేడు సూచీలు స్వల్ప శ్రేణిలో కదలాడొచ్చు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం నేపథ్యంలో సెంటిమెంట్ బలహీనంగా ఉందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఫిబ్రవరి డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపు దగ్గర పడటంతో సూచీలు ఒడుదొడుకులు ఎదుర్కొనే అవకాశం ఉంది. నేడు నిఫ్టీ 10300- 10450 పాయింట్ల శ్రేణిలో కదలాడొచ్చని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కంపెనీల ఆదాయాలు పుంజుకోవడం ద్వారా మాత్రమే మార్కెట్లు ముందుకెళ్లొచ్చని, ప్రస్తుత స్థూల ఆర్థిక పరిస్థితులు.. గత కొన్నేళ్లతో పోలిస్తే సవాళ్లమయంగా ఉన్నాయని విశ్లేషకులు అంటున్నారు. ప్రస్తుత త్రైమాసికంలో కంపెనీల లాభాలు బాగానే ఉండొచ్చని, వీటి దన్నుతో మార్కెట్లు ముందుకెళ్లే అవకాశం ఉందని చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వెలువడే సంకేతాలపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ గత సమావేశ (జనవరి 30-31) నిర్ణయాలు నేడు వెలువడనున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లకు ఒత్తిడి కొనసాగొచ్చని, లోహ షేర్లు లాభపడొచ్చని భావిస్తున్నారు.

# ఆరంభ లాభాలు చేజారె

● చివర్లో అమ్మకాల వెల్లువ ● సెన్సెక్స్‌కు 71 పాయింట్ల నష్టం ● 3 నెలల కనిష్ఠానికి రూపాయి



సమీక్ష

ఆరంభ లాభాలు చేజార్చుకున్న సూచీలు.. వరుసగా మూడో రోజూ నష్టాల్లోనే ముగిశాయి. ఆఖరి గంటన్నర ట్రేడింగ్‌లో అమ్మకాలు వెల్లువెత్తాయి. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ ఇంట్రాడేలో 68 పైసలు కోల్పోయి 3 నెలల కనిష్ఠ స్థాయి అయిన రూ.64.88కు చేరడం ప్రతికూల ప్రభావం చూపింది. ఐటీ షేర్లు రాణించినప్పటికీ.. ప్రైవేట్ బ్యాంకుల షేర్లు కుదేలయ్యాయి. యాక్సిస్ బ్యాంక్, కోటక్ బ్యాంక్, యెస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు 1.44 శాతం వరకు నష్టాలు చవిచూశాయి. ఆసియా మార్కెట్లు బలహీనంగా ముగియగా, ఐరోపా షేర్లు లాభాల్లో ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 33913.94 పాయింట్ల వద్ద లాభాల్లోనే ప్రారంభమైంది. అదే జోరును కొనసాగిస్తూ.. 33,960.95 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. అయితే చివరి గంటన్నర ట్రేడింగ్‌లో అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీ నష్టాల్లోకి జారుకుంది. ఒకానొకదశలో 33,657.89 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయిన సెన్సెక్స్, చివరకు 71.07 పాయింట్ల నష్టంతో 33,703.59 దగ్గర స్థిరపడింది. ఇంతకుముందు రెండు సెషన్లలో సెన్సెక్స్ 522.81 పాయింట్లు కోల్పోయింది. నిఫ్టీ సైతం 18 పాయింట్లు కోల్పోయి 10,360.40 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,347.65- 10,429.35 పాయింట్ల మధ్య కదలాడింది.

**పీఎన్‌బీ స్వల్పంగా..:** వరుస నష్టాల నుంచి పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) షేరు స్వల్పంగా కోలుకుంది. ఇంట్రాడేలో 5 శాతం కోల్పోయి రూ.111 వద్ద 52 వారాల కనిష్ఠానికి పడిపోయిన షేరు.. చివరకు 0.13 శాతం పెరిగి రూ.116.55 వద్ద ముగిసింది. గత నాలుగు సెషన్లలో షేరు 28 శాతం పతనం కావడంతో బ్యాంక్ మార్కెట్ విలువ రూ.10,939 కోట్లు దిగజారింది. బ్యాంక్‌లో ప్రభుత్వానికి ఉన్న 57.04 శాతం వాటాకు రూ.6,274.4 కోట్లు, 13.93 శాతం వాటా ఉన్న ఎల్ఐసీ రూ.1,532.3 కోట్లు నష్టం వచ్చినట్లయ్యింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 14 నష్టపోయాయి. ఎం అండ్ ఎం 2.48%, యాక్సిస్ బ్యాంక్ 1.44%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.09%, యెస్ బ్యాంక్ 1.06%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.70%, ఐసీఐసీఐ బ్యాంక్ 0.66% చొప్పున డీలాపడిన వాటిలో ఉన్నాయి. కోల్ ఇండియా 1.84%, ఓఎన్‌జీసీ 1.11%, భారతీ ఎయిర్‌టెల్ 0.85%, ఎస్‌బీఐ 0.75%, టీసీఎస్ 0.70%, హీరో మోటోకార్ప్ 0.69%లు మాత్రం రాణించాయి. రంగాల వారీ సూచీల్లో స్థిరాస్తి 0.64% నీరసపడింది. బ్యాంకింగ్, యంత్ర పరికరాలు, వాహన, మౌలిక, ఆరోగ్య సంరక్షణ షేర్లు అదే బాటలో నడిచాయి. మన్నికైన వినిమయ వస్తువులు, లోహ, టెక్, పీఎస్‌యూ, విద్యుత్, ఐటీ షేర్లు మాత్రం రాణించాయి.

## అంబుజా సిమెంట్ లాభంలో 77 శాతం వృద్ధి

### ప్రతి షేరుపై తుది డివిడెండ్ రూ.2

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో అంబుజా సిమెంట్ ఏకీకృత ప్రాతిపదికన రూ.478.39 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.270.08 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 77.12 శాతం అధికం. అమ్మకాల్లో వృద్ధి, క్లింకర్ ఉత్పత్తి పెరగడం ఇందుకు దోహదపడ్డాయని కంపెనీ తెలిపింది. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.5,645.84 కోట్ల నుంచి 10.96 శాతం వృద్ధితో రూ.6,264.81 కోట్లకు పెరిగింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో అమ్మకాలు 5 మిలియన్ మెట్రిక్ టన్ను (ఎంఎంటీ) నుంచి 17.4 శాతం అధికమై 5.87 ఎంఎంటీకి చేరాయి. మొత్తం వ్యయాలు సైతం రూ.5,309.59 కోట్ల నుంచి 4.36 శాతం పెరిగి రూ.5,541.24 కోట్లకు చేరాయి. 'అమ్మకాల్లో వృద్ధి, రికార్డు స్థాయిలో క్లింకర్ ఉత్పత్తి దన్నుగా నిలవడంతో గత త్రైమాసికంలో మంచి ఫలితాలు నమోదు చేశాం' అని అంబుజా సిమెంట్ ఎండీ, సీఈఓ అజయ్ కపూర్ పేర్కొన్నారు. వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.2 (100 శాతం) తుది డివిడెండును చెల్లించేందుకు కంపెనీ బోర్డు సిఫారసు చేసింది. ఇంతకు మునుపు ఇచ్చిన రూ.1.60 మధ్యంతర డివిడెండుతో కలుపుకొని పూర్తి ఏడాదిలో కంపెనీ ప్రకటించిన డివిడెండు రూ.3.60 (180 శాతం)కు చేరింది.

**రూ.1,391 కోట్ల పెట్టుబడులు:** రాజస్థాన్‌లోని మర్వార్ ముండావాలో 3.1 మిలియన్ టన్నుల సామర్థ్యం కలిగిన కొత్త క్లింకరైజేషన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి రూ.1,391 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు అంబుజా సిమెంట్ తెలిపింది.

## ఆర్సెలార్‌మిత్తల్, నుమెటల్ బిడ్‌ల తిరస్కరణకు సిఫారసు!

### ఎస్సార్ స్టీల్ కొనుగోలు వ్యవహారం

దిల్లీ: ఎస్సార్ స్టీల్‌ను కొనుగోలు చేసేందుకు గత వారం ఆర్సెలార్ మిత్తల్, రష్యాకు చెందిన వీటీబీ గ్రూప్ నేతృత్వంలోని నుమెటల్ సంస్థలు బిడ్లు దాఖలు చేశాయి. అయితే ఈ బిడ్ ఆఫర్లను పరిశీలించే సలహాదారు వీటి తిరస్కరణకు సిఫారసు చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. అపరాధ రుణగ్రహీత అయిన ఉత్తమ్ గాల్వా స్టీల్ లిమిటెడ్‌లో వాటా కలిగి ఉండటంతో ఆర్సెలార్ మిత్తల్ దాఖలు చేసిన బిడ్‌ను తిరస్కరించాల్సిందిగా ఎస్సార్ స్టీల్ అమ్మకాన్ని ప్రొఫెషనల్‌గా పర్యవేక్షిస్తున్న న్యాయ, ఆర్థిక నిపుణులు సలహా ఇస్తూ తాత్కాలిక తీర్మానం చేశారు. రష్యాకు చెందిన వీటీబీ గ్రూప్ ప్రత్యేక ప్రయోజన పెట్టుబడి సాధనం కింద నుమెటల్ సంస్థతో బిడ్ దాఖలు చేయించింది. అయితే ఈ సంస్థలో రేవంత్ రుయా 25 శాతం వాటా కలిగి ఉండటం, ఈయన ఎస్సార్ స్టీల్ వ్యవస్థాపకుడైన రవి రుయాకు వారసుడు కావడంతో ఈ బిడ్‌ను కూడా తిరస్కరణకు సిఫారసు చేసినట్లు తెలిసింది. దీనిపై ఎస్సార్ స్టీల్ నుంచి తమకు ఎలాంటి సమాచారం అందలేదని, ఆ సంస్థ కొనుగోలుకు అర్హమైన దరఖాస్తుదారులమని నుమెటల్ ప్రతినిధి తెలిపారు.

## ఇంటిని 'స్మార్ట్'గా మార్చుకోవాలా?

బెంగళూరు: సాధారణ గృహాన్ని స్మార్ట్ హోమ్‌గా మార్చుకోవాలనుకుంటున్న వారి కోసం విప్రో సంస్థ 'జడ్ నెక్స్ట్' పేరుతో సమీకృత గృహ యాంత్రీకరణ పరిష్కారం (ఇంటిగ్రేటెడ్ హోమ్ ఆటోమేషన్ సొల్యూషన్)ను పరిచయం చేస్తోంది. అందుబాటులో ధరలో ఈ సొల్యూషన్ అందిస్తామని తెలిపింది. ఈ సాంకేతికత వల్ల విద్యుత్ వినియోగాన్ని 40 శాతం వరకు తగ్గించవచ్చని, ప్రపంచంలో ఎక్కడ ఉన్నా గృహోపకరణాల్ని నియంత్రించుకోవచ్చని విప్రో కన్జ్యూమర్ కేర్ అండ్ లైటింగ్ విభాగం సీనియర్ ఉపాధ్యక్షుడు, కన్జ్యూమర్ లైటింగ్, స్విచ్‌ల వ్యాపారాధిపతి సంజయ్ గుప్త ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సొల్యూషన్‌లో అంతర్నిర్మిత (ఇన్‌బిల్ట్) సెన్సార్లు ఉంటాయని, వీటి సాయంతో అగ్ని ప్రమాదం, గ్యాస్ లీకేజీ, చొరబాట్లను గుర్తించి వెంటనే యజమానికి హెచ్చరికలు పంపిస్తుందని చెప్పారు. అన్ని విద్యుత్ గృహోపకరణాల్ని ఆండ్రాయిడ్, ఐఓఎస్ ఫోన్లలోని యాప్ ద్వారా నియంత్రించవచ్చని, ఈ కొత్త సొల్యూషన్ కోసం ప్రస్తుత వైరింగ్ వ్యవస్థ, స్విచ్‌లను మార్చాల్సిన అవసరం లేదని తెలిపారు.

## క్రిప్టో కరెన్సీల్లో పెట్టుబడులపై ఎస్‌బీఐ కార్డ్ హెచ్చరిక

దిల్లీ: వినియోగదారులు బిట్‌కాయిన్ లాంటి ఊహాజనిత (క్రిప్టో) కరెన్సీల్లో పెట్టుబడి పెట్టడం ప్రమాదకరమని ఎస్‌బీఐ కార్డ్ హెచ్చరించింది. అయితే తమ క్రెడిట్ కార్డును ఉపయోగించి క్రిప్టో కరెన్సీల్లో పెట్టుబడి పెట్టడాన్ని మాత్రం అధికారికంగా నిషేధించలేదని తెలిపింది. దేశంలో 50 లక్షల మంది వినియోగదారులతో ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు రెండో స్థానంలో ఉంది. సిటీ ఇండియా మాత్రం ఈ నెల ఆరంభంలోనే తమ డెబిట్, క్రెడిట్ కార్డులను ఉపయోగించి క్రిప్టో కరెన్సీల్లో పెట్టుబడి పెట్టేందుకు అవకాశం లేకుండా చేసింది. క్రిప్టోకరెన్సీ, బిట్ కాయిన్‌ల విషయంలో ఆర్‌బీఐ (రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) ఇప్పటికే స్పష్టత ఇచ్చినందున అలాంటి పథకాల్లో డబ్బులు పెట్టుబడి పెట్టి ప్రమాదాల్ని కొని తెచ్చుకోవద్దని ఎస్‌బీఐ కార్డ్ తమ వినియోగదారులకు సూచించింది.

# పీఎన్‌బీ రేటింగ్ తగ్గొచ్చు

● మూడీస్, ఫిచ్ హెచ్చరికలు

ముంబయి: నికర విలువ తగ్గడం, నష్టాలు పెరగడం వంటి కారణాల రీత్యా పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) రేటింగ్ తగ్గే అవకాశం ఉందని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీలు మూడీస్, ఫిచ్‌లు హెచ్చరించాయి. ఈ బ్యాంకులో రూ.11,400 కోట్ల మోసపూరిత లావాదేవీలు బయటపడడంతో, నష్ట నియంత్రణ వ్యవస్థలు ఎలా పనిచేస్తున్నాయన్న దానిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏడేళ్ల పాటు ఎవరికీ తెలియకుండా మోసం జరగడంపై నియంత్రణ వ్యవస్థల పర్యవేక్షణపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### మూడీస్ ఏమంటోందంటే..

రేటింగ్ తగ్గింపునకు మూడు అంశాలను సమీక్షించనున్నట్లు మూడీస్ తెలిపింది. మోసపూరిత లావాదేవీల ప్రభావం ఆర్థికంగా ఎంత ఉంటుంది? మూలధన పరిస్థితిని మెరుగు పరచడానికి బ్యాంకు యాజమాన్యం ఏవైనా చర్యలు తీసుకుందా? మోసానికి పాల్పడిన వారిపై ఏమైనా కఠిన చర్యలు చేపట్టారా? అనే అంశాలను పరిశీలించనుంది. అదే సమయంలో బేస్‌లైన్ క్రెడిట్ అసెస్‌మెంట్(బీసీఏ) పరామితులనూ లోతుగా చూడనుంది.

### ఫిచ్ ఏమంటోందంటే..

'భవిష్యత్‌లో రేటింగ్ ప్రతికూలంగా కనిపిస్తోంది. ప్రస్తుత కుంభకోణం రేటింగ్‌పై ప్రభావం చూపొచ్చ'ని ఫిచ్ పేర్కొంది. 'బ్యాంక్ లాభదాయకతపై ఈ ప్రభావం ఉండొచ్చు. ఒక వేళ మొత్తం కుంభకోణం విలువకు కేటాయింపులు చేయాల్సి వస్తే మూల ధనం కుంగే అవకాశం ఉంది. అపుడు మార్చి 2019 నాటికి బాసెల్ 3 నిబంధనలను పాటించడం చాలా కష్టమవుతుంది. మోసపూరిత లావాదేవీలు బయటపడ్డప్పటి నుంచి పీఎన్‌బీ షేరు విలువ 40 శాతం క్షీణించింద'ని వెల్లడించింది. దేశంలో అతిపెద్ద రెండో బ్యాంకు కావడం వల్ల కొంత సానుకూలతలూ లేకపోలేదని పేర్కొంది.

## మార్కెట్ కబుర్లు

✦ రూ.3,695 కోట్ల రుణ కుంభకోణ దర్యాప్తును ఎదుర్కొంటోన్న రోటామాక్‌కు తాము రూ.456.60 కోట్ల రుణం ఇచ్చినట్లు **బ్యాంక్ ఆఫ్ బరోడా** తెలిపింది. 2015 అక్టోబరు 3 నాటికి ఈ రుణాన్ని నిరర్థక ఆస్తులుగా ప్రకటించామని, 100 శాతం కేటాయింపులు కూడా జరిపామని ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. మరోవైపు తాము కూడా రుణాలు ఇచ్చినట్లు యూనియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ తెలిపాయి.

✦ ఇండ్ బ్యాంక్ హౌసింగ్ పునరుద్ధరణలో భాగంగా రూ.5 కోట్లు పెట్టుబడిగా అందిస్తామని **ఇండియన్ బ్యాంక్** తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిధులు అందించాక, రెండు మూడేళ్లలో కార్యకలాపాల పనితీరు పునరుద్ధరణపై దృష్టి సారిస్తామని పేర్కొంది.

✦ యూరో- డాలరు, పౌండ్ స్టెర్లింగ్- డాలరు ఇలా క్రాస్ కరెన్సీలకు డెరివేటివ్ కాంట్రాక్టుల ట్రేడింగ్‌ను ప్రారంభించే నిమిత్తం సెబీ నుంచి అనుమతులు లభించాయని **ఎన్ఎస్ఈ** వెల్లడించింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం గం.7.30 ని.ల వరకు ఈ ట్రేడింగ్ జరుగుతుందని పేర్కొంది.

✦ నిర్మాణంలో ఉన్న వివిధ గృహ సముదాయ ప్రాజెక్టులను పూర్తి చేసే నిమిత్తం ఇతర నిర్మాణదార్లను (బిల్డర్లు) నియమించుకునేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా కోరుతూ సుప్రీంకోర్టును **ఆమ్రపాలీ గ్రూపు** ఆశ్రయించింది.

## విద్యుత్తు వాహనాల అభివృద్ధి ఆగదు

### తయారీ సంస్థల ధీమా


దిల్లీ: పర్యావరణ హిత విద్యుత్తు వాహనాల (ఈవీ)కు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక విధానం (పాలసీ) ప్రకటించకపోయినా వాటి అభివృద్ధి మాత్రం ఆగదని ప్రముఖ వాహన తయారీ సంస్థలైన మారుతీ సుజుకీ, మహీంద్రా ఎలక్ట్రిక్, మెర్సిడెస్ బెంజ్ తెలిపాయి. విద్యుత్తుతో నడిచే వాహనాల అభివృద్ధి పనులను కొనసాగిస్తామని ప్రకటించాయి. సమాజానికి వీటి అవసరం ఉందని, వీటి అభివృద్ధిలో సహకారం అవసరమైతే ప్రభుత్వాన్ని సంస్థలు ఆశ్రయిస్తాయని పేర్కొన్నాయి. ఇప్పటికే 10,000 విద్యుత్తు వాహనాల సరఫరాకు టెండర్లు పిలవడాన్ని ప్రస్తావించాయి. అయితే వాహనాల ఛార్జింగ్‌కు అవసరమైన మౌలిక వసతుల కల్పన, పెట్టుబడులు, ప్రోత్సాహాలకు సంబంధించి స్పష్టమైన విధానం లేకుండా అనుకున్న లక్ష్యాల్ని చేరుకోవడం చాలా కఠినమైన పని అని ఫోర్డ్ ఇండియా అభిప్రాయపడింది.

## వేదాంతా



రూ.321 వద్ద ప్రారంభమై రూ.320 - 331 మధ్య కదలాడి, క్రితం ముగింపు 320.35తో పోలిస్తే రూ.8.35 (2.61%) లాభంతో రూ.328.70 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 1,13,95,413.

## ఎం అండ్ ఎం



రూ.726.80 వద్ద మొదలై రూ.703-733.20 మధ్య చలించి, క్రితం ముగింపు 724.65తో పోలిస్తే రూ.15.65 (2.16%) నష్టంతో రూ.709 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 29,81,323 షేర్లు చేతులు మారాయి.

### 52 వారాల గరిష్ఠం (రూ.లలో)

| | |
|---|---|
| విశాల్ ఫ్యాబ్రిక్స్ | 634.00 |
| జైడస్ వెల్‌నెస్ | 1298.00 |
| ప్రీమియర్ సింథటిక్స్ | 144.90 |
| డీఐఎల్ | 3114.65 |

### 52 వారాల కనిష్ఠం (రూ.లలో)


| | |
|---|---|
| ఆస్ట్రా మైక్రో | 94.00 |
| కార్పొరేషన్ బ్యాంక్ | 31.25 |
| దేనా బ్యాంక్ | 19.85 |
| ఇంటర్‌గ్లోబ్ ఫైనాన్స్ | 20.15 |
| ఐఓబీ | 18.80 |
| పీఎఫ్‌సీ | 104.85 |
| పీఎన్‌బీ | 111.00 |
| ఆర్ఈసీఎల్ | 137.35 |

### ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

| | విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు) | | | దేశీయ మదుపర్లు (డీఐఐలు) | | |
|---|---|---|---|---|---|---|
| తేదీ | కొనుగోళ్లు | అమ్మకాలు | నికరం | కొనుగోళ్లు | అమ్మకాలు | నికరం |
| 20/02 | 3,053 | 3,903 | −850 | 4,124 | 2,687 | +1437 |
| 19/02 | 3,368 | 4264 | −896 | 3,121 | 2,534 | 587 |
| 16/02 | 3,105 | 4,171 | −1066 | 3,926 | 2,798 | −1128 |
| 15/02 | 4,272 | 4512 | −240 | 3,024 | 2,975 | +49 |
| 14/02 | 6,413 | 7,141 | −729 | 3,546 | 3,698 | −152 |

### 20న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 355 | వరంగల్ | 357 |
| చిల్లరగా(ఒక గుడ్డు) | 4.15 | విశాఖపట్నం | 375 |
| బెంగళూరు | 395 | చెన్నై | 410 |
| 21వ తేదీకి... | | చిత్తూరు | 403 |
| విజయవాడ/గోదావరి | 375 | నమక్కల్ | 395 |

## ఎన్ఎస్ఈ

**మంగళవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)**

### నిఫ్టీ 50

ADANI PORT & 394.90 (393.85) 2045167
AMBUJA CEMEN 263.70 (257.55) 7529895
ASIAN PAINTS 1126.40 (1120.35) 662281
AUROBIND PHA 574.80 (582.95) 2126266
AXIS BANK LT 531.70 (540.55) 3395183
BAJAJ AUTO L 3049.85 (3030.60) 236222
BAJAJ FINANC 1638.75 (1642.70) 583955
BHARTI AIRTE 418.10 (414.35) 7230257
BHARTI INFRA 334.00 (329.85) 2348949
BOSCH LTD 19398.05 (19427.45) 8434
BPCL 453.05 (456.85) 2250010
CIPLA 603.45 (600.40) 1599249
COAL INDIA L 310.40 (305.40) 8602002
DR. REDDYS 2163.65 (2152.00) 669025
EICHER MOTOR 26916.40 (27089.50) 21098
GAIL 465.15 (463.80) 1333716
HCL TECH 907.45 (914.20) 1231401
HDFC 1811.75 (1814.05) 2523482
HDFC BANK 1863.20 (1878.20) 1021017
HERO MOTOCOR 3477.45 (3465.70) 340087
HINDALCO IND 248.80 (247.55) 4778807
HINDUSTAN UN 1331.80 (1335.90) 688130
HPCL 380.85 (379.80) 1451030
ICICI BANK 317.25 (319.75) 16030558
INDIABULLS H 1237.45 (1251.05) 1365926
INDIAN OIL 366.60 (369.65) 1803682
INDUSINDBANK 1622.70 (1630.45) 859058
INFOSYS LTD 1136.95 (1131.75) 3594297
ITC 263.25 (264.10) 9301017
KOTAK MAHIND 1045.80 (1056.20) 835351
LARSEN & TOU 1290.60 (1295.50) 2063972
LUPIN 815.80 (814.40) 740252
M&M 709.00 (724.65) 2981323
MARUTI SUZIK 8722.65 (8724.85) 517802
NTPC LTD 164.20 (162.90) 5188315
ONGC 187.00 (185.30) 5328584
POWER GRID C 195.00 (194.15) 4769753
RELIANCE IND 921.10 (927.00) 3866919
SBI 269.65 (268.50) 33458021
SUN PHARMA 559.50 (561.40) 2481944
TATA CONSULT 2944.75 (2923.60) 944534
TATA MOTORS 369.30 (368.75) 3972114
TATA STEEL L 651.30 (648.85) 10214478
TECH MAHINDR 574.20 (572.45) 2273116
ULTRATECH 4140.60 (4116.60) 123931
UPL LIMITED 695.35 (701.30) 774441
VEDANTA LIMI 328.70 (320.35) 11395413
WIPRO 291.45 (289.95) 3435235
YES BANK LTD 308.70 (312.05) 11389041
ZEE ENTERTAI 570.75 (567.95) 1080131

### నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1509.30 (1487.35) 46224
ACC 1640.35 (1633.70) 247989
ASHOK LEYLAN 133.40 (132.20) 9905274
AVENUE SUPER 1186.80 (1168.90) 293782
BAJAJ FINSER 5014.30 (5000.75) 107899
BANK OFBAROD 144.80 (143.85) 26441686
BEL 153.75 (153.20) 2847915
BHEL 93.05 (93.20) 5526504
BRITANNIA 4734.10 (4733.30) 132678
CADILA HEALT 409.05 (408.95) 640764
COLGATE PALM 1067.75 (1072.60) 114866
CONTAINER 1290.45 (1291.60) 602331
CUMMINS INDI 850.00 (844.20) 185077
DABUR INDIA 340.70 (339.35) 890534
DLF LIMITED 225.10 (223.40) 5759220
EMAMI LIMITE 1044.95 (1065.05) 295655
GLAXOSMI CON 6500.45 (6470.05) 12843
GLAXOSMI PHA 2419.05 (2433.55) 10457
GLENMARK PHA 523.95 (523.50) 419804
GODREJ CONSU 1054.70 (1037.80) 394423
HAVELLS INDI 508.65 (504.05) 544607
HINDUSTAN ZI 315.40 (312.30) 4034778
ICICI PRU LI 402.30 (403.35) 536212
IDEA CELLULR 84.00 (82.50) 7380590
INTERGLOBE A 1265.15 (1282.65) 517034
JSW STEEL LT 305.60 (302.70) 4940505
LIC HOUS.FIN 512.85 (515.05) 1060306
MARICO LIMIT 308.45 (306.85) 557860
MCDOWELL 3215.15 (3243.35) 426546
MOTHERSON 325.80 (327.40) 2346083
MRF 70825.50 (70624.00) 3989
NHPC LTD 27.35 (28.30) 6223105
NMDC LTD 130.90 (128.40) 4478809
OIL INDIA 362.20 (360.05) 565166
ORACLE FIN S 4054.35 (4000.85) 20617
P&G HYG&HEAL 9304.20 (9358.70) 4900
PETRONET LNG 244.10 (239.15) 2005057
PIDILITE IND 894.20 (896.10) 174558
PIRAMAL ENTE 2633.60 (2633.85) 83407
PNB 116.55 (116.50) 146638863
POWER FIN CO 105.70 (106.60) 3041262
RURAL ELEC C 138.65 (140.15) 3276025
SAIL 86.50 (87.30) 13426339
SHREE CEMENT 16930.85 (16766.85) 12263
SHRIRAM TRAN 1292.65 (1289.80) 359850
SIEMENS 1242.25 (1243.55) 105423
SUN TV LTD 909.05 (887.80) 1907738
TATA POWER 86.40 (86.10) 2973442
TITAN IND 832.25 (803.95) 3881439
TORRENT PHAR 1383.95 (1393.20) 63716

### ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 171.35 (170.35) 781699
ADANI ENTERP 198.00 (202.90) 6326486
ADANI POWER 31.35 (31.40) 6551504
ALL BANK 51.70 (51.25) 12849598
AMARA RAJA 806.40 (803.65) 195844
ANANT RAJIND 56.10 (57.95) 1778866
ANDHRA BANK 46.60 (45.90) 3602049
APOLLO HOSPI 1199.25 (1186.20) 750134
APOLLO TYRES 264.70 (254.55) 4636403
APTECH 327.90 (297.60) 4218589
BAJAJ ELECT. 502.50 (506.50) 217574
BAJAJ HIND 12.85 (12.90) 1526275
BAJAJ HOLDIN 2723.15 (2722.75) 10366
BALAJI TELE 140.25 (137.85) 92954
BALLARPUR IN 13.60 (13.50) 1233204
BALRAMPUR CH 119.15 (115.75) 2019574
BANK OF MAHA 16.80 (16.90) 1291255
BANK OFINDIA 129.50 (125.00) 15415199
BATA INDIA 711.55 (710.00) 337194
BGR ENERGY S 119.05 (118.60) 24713
BHARAT FORGE 738.80 (737.40) 1092057
BHUSHAN STEE 51.75 (53.85) 17252862
BIOCON LTD 572.45 (590.95) 1473471
BOMBAY DYE 281.95 (282.90) 5784276
CANARA BANK 311.25 (304.20) 6224941
CEAT LIMITED 1601.05 (1629.25) 559231
CENTRAL BANK 66.30 (65.40) 451258
CHAMBAL FERT 157.20 (154.30) 400144
CHENNAI PETR 364.50 (360.30) 977653
CITY UNIBANK 174.15 (173.70) 860651
CORPO BANK 32.40 (32.00) 344573
COX & KINGS 236.70 (236.25) 71322
D B REALTY L 52.30 (52.40) 506109
DELTA CORP L 356.20 (351.70) 2641394
DENA BANK 20.25 (20.50) 3157773
DHANALAKBANK 23.20 (23.15) 298737
DIVIS LAB 1013.90 (1016.80) 396055
EDELWEISS CA 251.35 (253.90) 2998340
EID PARRY 319.35 (317.35) 165703
EIH 171.85 (172.50) 118751
ESSAR SHIPPI 25.70 (25.60) 14353
ESTER INDUST 62.10 (60.45) 163529
EXIDE INDUST 210.95 (209.80) 1229697
FEDERAL BANK 91.85 (93.70) 8562578
FINOLEX CABL 712.75 (714.50) 32362
G E SHIP LTD 384.85 (383.35) 98335
GAMMON INFRA 3.20 (3.20) 1836122
GATI LIMITED 112.55 (113.40) 450593
GAYATRI PROJ 216.40 (216.55) 260170
GITANJALIGEM 30.40 (33.75) 77770
GMR INFRASTR 17.65 (17.85) 29562111
GODREJ IND 544.15 (548.05) 188619
GRASIM IND 1118.65 (1089.70) 399251
GUJ ALK&CHEM 748.70 (763.80) 85321
HCL INFOSYS 61.05 (61.35) 3592434
HEXA TECH 333.05 (331.45) 533980
HIMACHAL FUT 28.10 (27.95) 2889490
HOUSING DEV 51.45 (51.75) 7506642
IDBI 66.45 (63.95) 11346273
IDFC 52.50 (52.45) 3760834
IFCI 22.80 (22.80) 4811376
IL&FS TRANS 71.00 (71.65) 212194
IND SWIFTLAB 73.25 (74.25) 42684
INDBULLS REL 217.80 (214.05) 9849657
INDIA CEM 158.55 (160.00) 3319160
INDIAN BANK 327.70 (315.35) 2598980
INDO RAMA SY 34.20 (33.80) 70248
INDRAPRASTHA 296.85 (294.75) 1251781
IND-SWIFTLTD 9.05 (9.05) 4410
INGERSOLL-R 733.30 (743.60) 14805
IOB 19.60 (19.70) 1100918
IPCA LAB 629.40 (628.70) 174516
IRB INFRA DE 222.30 (225.65) 816051
J&K BANK 67.80 (67.85) 254658
JAI CORP 162.40 (167.10) 1209187
JAIN IRRIGAT 118.50 (117.60) 5062530
JAYPEE INFRA 13.40 (13.85) 1583500
JAYSHREE TEA 101.90 (101.60) 18005
JET AIRWAYS 751.75 (762.70) 2191731
JINDAL SAW 133.80 (126.95) 2066432
JINDAL STEEL 252.00 (250.00) 10140175
JK LAKSHMI C 419.10 (415.95) 45271
JK PAPER LIM 135.75 (131.75) 402851
JM FINANCIAL 147.80 (149.60) 404986
JP ASSOCIATS 16.75 (16.75) 30042198
JSW ENERGY L 79.90 (79.00) 3280222
JUBILANT FOO 1997.20 (1993.85) 819579
JUBILANT ORG 927.50 (924.75) 473864
JYOTHY LABS 347.90 (345.45) 24436
JYOTI STRUC 10.35 (10.60) 246681
KARNATA BANK 133.25 (132.75) 1681826

## ఘనం (+)

| నిఫ్టీ | 20న | మార్పు % |
|---|---|---|
| VEDANTA | 328.70 | 2.61 |
| AMBUJA CEM | 263.70 | 2.39 |
| COAL INDIA | 310.40 | 1.64 |
| BHARTI INFRATEL | 334.00 | 1.26 |
| ONGC | 187.00 | 0.92 |
| BHARTI AIRTEL | 418.10 | 0.91 |
| NTPC | 164.20 | 0.80 |

## గ్రహణం (-)

| నిఫ్టీ | 20న | మార్పు % |
|---|---|---|
| M & M | 709.00 | -2.16 |
| AXIS BANK | 531.70 | -1.64 |
| AUROBINDO PHA | 574.80 | -1.40 |
| INDIABULLS HSG | 1237.45 | -1.09 |
| YES BANK | 308.70 | -1.07 |
| KOTAK MAHI BANK | 1045.80 | -0.98 |
| UPL | 695.35 | -0.85 |

KEC INTL LTD 382.15 (377.45) 444314
KOLTE PATIL 338.65 (333.15) 128579
KPIT CUMMINS 198.85 (198.55) 2390444
L&TFIN.HOLD 158.55 (159.15) 3052139
LAK VIL BANK 118.40 (119.00) 319194
M & M FINANC 435.90 (427.20) 1289355
MANAPPURAM G 106.75 (108.00) 2991822
MMTC LIMITED 53.00 (53.05) 604389
MPHASIS LTD 865.75 (859.25) 269422
MRPL 118.40 (118.20) 1193681
MTNL 22.70 (22.85) 1483858
NAGARJUNA OI 4.20 (4.55) 809704
NCC LIMITED 123.85 (124.50) 3775130
NETWORK18 FI 48.40 (48.15) 255497
NEULAND LAB 712.05 (707.20) 22326
NIIT LTD 93.80 (91.80) 828883
NIIT TECHNOL 758.20 (761.30) 1382534
OMAXE LTD 227.90 (227.95) 468223
ONMOBILE GLO 52.65 (53.95) 325781
ORIENT PAPER 39.50 (39.80) 390304
ORIENTALBANK 106.15 (104.20) 4737247
PARSVNATH DE 22.85 (22.30) 694533
PATEL ENGG 71.90 (72.60) 211475
PFIZER 2297.05 (2292.65) 11572
POLARIS SOFT 470.05 (470.05) 81285
POWERTRADING 99.75 (97.65) 955429
PRAJ IND 90.10 (89.55) 616854
PRISM CEMENT 122.70 (118.60) 634811
PROVOGUE (IN 5.80 (5.90) 99382
PUNJ LLOYD 21.00 (20.55) 1775537
PUNJAB & SIN 38.55 (38.15) 86116
PURAVANKARA 138.10 (139.80) 126179
PVP VENTURES 7.00 (7.15) 135398
PVR LIMITED 1410.25 (1391.90) 138640
RADICO KHAIT 326.95 (336.65) 1280870
RAJESH EXPOR 795.65 (785.40) 157559
RALLIS INDIA 231.05 (225.20) 176577
RAMCO IND 247.30 (250.80) 38062
RAMCO SYS 443.45 (448.55) 16872
RAMKY INFRA 189.05 (190.60) 118900
RAYMOND 955.20 (940.00) 547263
RELIANCE CAP 473.55 (478.05) 3692513
RELIANCE COM 27.85 (28.45) 54181125
RELIANCE INF 446.30 (443.85) 2160846
RELIANCE POW 42.90 (43.20) 4481249
ROLTA INDIA 70.65 (70.80) 2022083
SAGAR CEMENT 969.80 (978.85) 3558
SAREGAMA 676.75 (674.70) 73355
SHANTHI GEAR 140.10 (141.00) 13698
SHIPPNG CORP 76.90 (78.80) 512531
SHREE RENUKA 15.35 (15.35) 1492013
SINTEX IND 21.40 (21.60) 1307418
SOBHA DEVELO 550.80 (556.05) 116174
SOUTHINDBANK 26.85 (26.70) 11712524
SRS LIMITED 1.05 (1.10) 733394
STERLITE TEC 342.75 (343.95) 719014
SUJANA METAL 1.40 (1.40) 125125
SUN PHARMA 428.60 (440.80) 166493
SUND FASTNER 533.20 (542.95) 77715
SUZLON ENERG 13.05 (13.00) 17183266
SYND. BANK 58.45 (55.60) 11153965
TATA CHEM 704.25 (710.35) 602741
TATA COFFEE 134.00 (134.80) 233092
TATA COMMUN 630.30 (634.10) 290415
TATA GLOBAL 262.85 (267.95) 5120799
TATA METALIK 802.75 (818.10) 81288
TATA MOT DVR 205.35 (204.30) 1247652
TATA TELESER 6.30 (6.35) 721307
THE INDIAN H 135.80 (137.40) 1419001
TORRENT POWE 262.15 (259.75) 1904616
TRIVENI ENGG 66.20 (67.50) 308283
TTK PRESTIGE 7058.45 (7112.45) 2277
TV TODAY NET 476.40 (480.30) 294210
TV18 BROADCA 55.20 (54.70) 4306829
TVS MOTOR 650.80 (652.65) 664601
UCO BANK 26.85 (27.00) 1230012
UNION BANK 111.35 (109.65) 24798306
UNITECH 7.25 (7.20) 15300269
UNITED BANK 14.30 (14.40) 717428
UNITED BREWE 1051.35 (1052.45) 516866
USHA MARTIN 21.25 (21.00) 770295
VADILAL INDU 876.50 (887.50) 7396
VENKYS 2669.50 (2683.55) 66935
V-GUARD IND 231.10 (234.60) 1345166
VIJAYA BANK 58.85 (57.95) 885568
VIP 341.05 (338.50) 126077
VOLTAS 557.70 (575.25) 1719735
ZEE LEARN LI 42.10 (42.75) 284835
ZUARI GLOBAL 197.60 (194.60) 88501
ZYDUS WELLNE 1259.65 (1180.50) 131571

## బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 818.05 (829.75) 938
AMAR RAJA BA 807.30 (802.85) 12796
ANDHRA BANK 46.60 (45.90) 233456
ANDHRA CEMEN 11.05 (11.15) 20030
ANDHRA PAPER 314.90 (314.10) 8686
ANDHRA PETRO 56.95 (59.35) 80623
ANDHRA SUGAR 481.55 (476.35) 3669
ASTRA MICROW 95.55 (101.75) 178672
AUROBINDO PH 574.10 (583.85) 94392
AVANTEL SOFT 559.60 (542.60) 7493
AVANTI FEEDS 2315.30 (2293.45) 10361
BALAJI AMIN 662.20 (632.35) 18002
BARTRONICS 13.01 (13.25) 8945
BHAGIRA CHEM 285.90 (290.90) 465
BHAGYA NAG 43.75 (43.85) 12992
BRILLIANT SE 11.10 (11.65) 147207
CAMBRIDGE TE 75.35 (76.85) 201
COMBAT DRUGS 27.40 (27.40) 606
CONT COFFEE 281.80 (286.60) 1739
COROMAN FERT 511.25 (516.85) 3742
CYBERMATE 3.10 (3.16) 156343
CYIENT LIMIT 612.95 (610.90) 3781
DECCAN CEMEN 565.90 (569.70) 131
DIVI'S LAB 1013.10 (1016.40) 24055
DR REDDY 2162.15 (2151.85) 21405
FOUR SOFT 93.20 (90.05) 8279
GATI CORPN 112.65 (113.15) 80507
GAYATRI PROJ 215.95 (217.15) 27044
GMR INFRASTR 17.70 (17.80) 2100128
GOLDST INFRA 192.30 (190.55) 27956
GRANULES (I) 116.25 (115.15) 65363
GSS AMERICA 53.30 (44.50) 892220
GVK POWER 17.45 (18) 922414
HBL NIFE POW 55.65 (55.35) 56321
HERITAGE FOO 684.90 (675.95) 2166
HYD INDUS 1733.05 (1713.50) 1281
IDL INDUSTRS 585.85 (569.80) 10289
ILFS ENGINEE 43.65 (43.70) 20591
INNAREDY COM 3.69 (3.54) 11697
IVRCL INFRAS 4.49 (4.48) 131981
KAKATIYA CEM 293.40 (292.05) 14586
KALLAM SPG 29.55 (28.10) 97428
KAVERI SEED 473.60 (461.60) 15803
KCP LTD 127.35 (127.95) 11532
LANCO INDUS 361.55 (362.20) 5606
LANCO INFRAT 1.15 (1.20) 2950920
LAURUS LABS 518.35 (516.45) 8952
MADHUCON PRO 27.85 (27.35) 36240
MIC ELECTRON 6.79 (7.08) 105497
MOLD-TEK.TEC 60.85 (60) 2885
MOLDTK PLA 320.50 (326.25) 9461
NAGARJAGRICH 43.75 (43.35) 8076
NATCO PHARMA 784.95 (803.15) 28372
NAVA BH VENT 148.25 (144.80) 8400
NCC 123.75 (124.70) 334333
NEULAND LAB 717 (707.85) 3074
NIHAR INFO 14.50 (14.15) 462
PANYAM CEMEN 48.35 (48.90) 20428
PENNER IND 61.75 (61.75) 54261
PITTI LAMIN 92.55 (91.65) 25400
POKARNA 211.95 (207.45) 1860
PREMIER EXPL 392.60 (391.85) 214
PRISM CEMENT 122.95 (118.25) 112860
PRUDENTL PHA 4.44 (4.45) 80263
RAIN INDUSTR 376.65 (391.75) 625796
SAMKRG PIST 298.10 (303.60) 2212
SATVAH. ISPA 19.25 (20.10) 20262
SMS PHARMA 90.30 (90.75) 1368
SPHERE GLOBA 37.15 (37.40) 8147
SREE RAYAL A 57.90 (56.70) 143849
STEEL EXCHAN 31.10 (32.25) 24803
SUJANA METAL 1.43 (1.37) 8750
SUJANA TOWER 3.90 (3.98) 4330
SURYALAKSH.C 81.05 (80.25) 3342
SUVEN PHARMA 191.10 (191.20) 85797
TAJ GVK HOTE 163.50 (164.95) 15654
TANLA 30.70 (31.10) 41559
TERA SOFTWAR 63.05 (57.45) 25244
VAMSHI RUBB 52.10 (53.50) 1945
VICEROY HOTE 15.85 (15.90) 39320
VIMTA LABS 204.55 (204.20) 7291
VISAKA IND 670.55 (675.60) 11015
VISTA PHARMA 42.30 (40.80) 39508
VIVIMED LABS 79.60 (81.50) 67554
VST INDUS 3300 (3270.05) 184
YBRANT DIGIT 5.41 (5.47) 122208
ZENTECH 118.35 (115.35) 20064

## చిత్ర నిర్మాణంలోకి రిలయన్స్ ఇండస్ట్రీస్

**ఎరోస్‌లో 5% వాటా కొనుగోలుకు రూ.1000 కోట్లు**

**దిల్లీ:** న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదైన ఎరోస్ ఇంటర్నేషనల్ సంస్థలో 5% వాటా కొనుగోలు చేస్తున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) ప్రకటించింది. ఇందుకోసం రూ.1000 కోట్ల పెట్టుబడులు పెడతామని వెల్లడించింది. దేశీయంగా అన్ని భాషల్లో చలన చిత్రాలు నిర్మించేందుకు, వాటి హక్కులు పొందేందుకు ఈ ఒప్పందం దోహద పడుతుంది. 'ఆర్ఐఎల్ తమ అనుబంధ సంస్థ ద్వారా ఒక్కో షేరుకు 15 యూఎస్ డాలర్లు చెల్లించే పద్ధతిలో, తమ సంస్థలో 5 శాతం వాటా కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకున్నట్లు' ఎరోస్ తెలిపింది. ఈ రెండు సంస్థలు సంయుక్తంగా భారతదేశంలోని అన్ని భాషల్లో చిత్రాల్ని నిర్మించాలని నిర్ణయించాయి. ఇందుకోసం చెరో రూ.1,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించుకున్నాయి. ఎరోస్ ఇంటర్నేషనల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ), మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) జ్యోతి దేశ్‌పాండే ప్రస్తుత హోదా నుంచి తప్పుకుని, ఆర్ఐఎల్‌లో మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ విభాగాధిపతిగా వ్యవహరించనున్నారు. ఛైర్మన్ కార్యాలయంలో ప్రెసిడెంట్ హోదా ఆమెకు ఉంటుంది. అయితే ఎరోస్ ఇండియా, ఎరోస్ ఇంటర్నేషనల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా మాత్రం ఆమె కొనసాగుతారని సంస్థ తెలిపింది. ఈ మార్పు 2018 ఏప్రిల్ నుంచి అమల్లోకి వస్తుందని పేర్కొంది.




# చంద్రప్రచండమేనా?

**టి. చంద్రశేఖరన్.. అందరూ 'చంద్ర' అంటారు.**

**టాటా గ్రూపు అధిపతి అయిన మూడో టాటాయేతర వ్యక్తి.**

**అంచెలంచెలుగా ఎదిగి ఏకంగా సింహాసనాన్ని అధిష్ఠించిన అసామాన్యుడు.**

**సైరస్ మిస్త్రీని బలవంతంగా ఛైర్మన్ కుర్చీ నుంచి దించేశాక, ఆ స్థానానికి సమర్థులు ఎవరా అని రతన్ టాటా ఆలోచించినపుడు.. గ్రూపు కంపెనీలన్నిటిలోనూ తలమానికమైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్)ను ఉన్నత స్థానంలో నిలబెట్టడమే కాదు.. గ్రూపు ఆదాయాల్లో ఎక్కువ భాగాన్ని అందించిన 'చంద్ర'నే సరైన వ్యక్తిగా భావించారు.**

సరిగ్గా ఏడాది కిందట ఇదే రోజున(ఫిబ్రవరి 21, 2017) చంద్రకు పగ్గాలు అప్పజెప్పారు. ఏడాది సమయం అనేది 150 ఏళ్ల చరిత్ర గల టాటా గ్రూప్ విషయానికొస్తే చాలా చిన్నదే. ఈ సమయంలోనే పరిస్థితులేమీ అకస్మాత్తుగా మారిపోవు. కానీ ఒక్కో సవాలును ఎదుర్కొంటూ, ఒక్కొక్క సమస్యనూ పరిష్కరించుకుంటూ వెళ్లడంలో చంద్రశేఖరన్ 'మార్కు' కనిపిస్తోంది. అన్నిటికీ మించి.. అందరినీ కలుపుకుని పోయే ఆయన మనస్తత్వం మంచినే చేసింది. మార్కెట్ పరిస్థితులూ అందుకు కలిసివచ్చాయి.

### ఏం చేశారు..

- నమోదిత గ్రూపు కంపెనీల్లో క్రాస్-హోల్డింగ్(ఒక కంపెనీలో ఒకదానికి వాటా.. అందులో మరో దానికి వాటా.. అలా) పరిస్థితులను చక్కదిద్దడానికి ప్రయత్నించారు.
- లాభాలు రాని.. ప్రధానేతర ఆస్తులను విక్రయించారు.
- లాభదాయకత, స్థిరీకరణను తీసుకురావడమే ప్రధాన అజెండాగా నడిచారు.
- కంపెనీలోకి కొత్త రక్తాన్ని నింపారు.

### అందులో కొన్ని..

- టాటా టెలీసర్వీసెస్, డొకొమొల మధ్య సయోధ్య కుదిర్చారు. ఇది పగ్గాలు చేపట్టిన వారంలోపే చేయడం విశేషం.
- టాటా టెలీసర్వీసెస్‌లోని మొబైల్ వ్యాపారాన్ని భారతీ ఎయిర్‌టెల్‌కు విక్రయించారు.
- టాటా స్టీల్‌కు చెందిన ఐరోపా ఆస్తులను జర్మనీకి చెందిన థైసన్‌క్రప్ సంయుక్త సంస్థకు బదిలీ చేశారు.
- దేశీయ కార్యకలాపాల్లో టాటా మోటార్స్ తిరిగి పుంజుకునేలా చేశారు.
- అన్నిటి కంటే మించి 100కు పైగా ఉన్న గ్రూపు కంపెనీలను సరళీకరించడం కోసం వ్యూహాత్మక ప్రణాళికతో ముందుకొచ్చి, క్రాస్-హోల్డింగ్స్‌ను తగ్గించారు.
- గ్రూప్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసరు(సీఎఫ్ఓ)గా సౌరభ్ అగర్వాల్‌ను; గ్రూప్ చీఫ్ డిజిటల్ ఆఫీసర్‌గా ఆర్తి సుబ్రమణియన్‌ను నియమించారు. ఇంకా పలు కంపెనీల సీఈఓ, సీఎఫ్‌ల స్థానాలను యువతతో భర్తీ చేశారు. కొంత మంది ఉన్నత స్థాయి అధికారులు నిష్క్రమించడం ఇందుకు నేపథ్యం.

### టాటా మోటార్స్ మినహా

టాటా గ్రూప్ షేర్లు గ్రూప్‌కు మంచి విలువనే చేకూర్చాయి. కానీ టాటా మోటార్స్ మాత్రం మార్కెట్ విలువలో 28 శాతాన్ని కోల్పోయింది. జాగ్వార్ లాండ్ రోవర్(జేఎల్ఆర్) విభాగం స్తబ్దుగా ఉండడం ఇందుకు నేపథ్యం. కీలక మార్కెట్లలో బలహీన గిరాకీ ఉండడంతో ఏడేళ్లుగా ఈ విభాగం లాభాలను కోల్పోతూ వస్తోంది.

### భవిష్యత్‌లో వీటిపై దృష్టి

- ఎయిరిండియా: ప్రభుత్వం తన వాటా తగ్గించుకోవాలని భావిస్తున్నట్లు ప్రకటించిన వెంటనే ఎయిరిండియా కొనుగోలుపై దృష్టి సారిస్తామని చంద్ర ఇది వరకే చెప్పారు. ఒకప్పుడు భారత విమానయాన రంగంలోకి అడుగుపెట్టాలని విఫలయత్నం చేసిన టాటా గ్రూప్ తన కలను నిజం చేసుకుంటుందేమో చూడాలి. అది కూడా చంద్ర నేతృత్వంలో.
- భూషణ్ స్టీల్: దాదాపు ఖాయమైన కొనుగోలు ఇది. రూ.36,000 కోట్లతో ఈ కంపెనీని టాటా స్టీల్ కొనుగోలు చేయనుంది. దిల్లీకి చెందిన ఈ కంపెనీ కోసం అత్యధిక బిడ్‌ను వేసిన సంస్థ టాటా స్టీల్‌యే.

**ఏవేవి ఎంత పెరిగాయంటే**

| కంపెనీ | మార్కెట్ విలువలో వృద్ధి(%లో) |
|---|---|
| టాటా స్టీల్ | 53 |
| టైటన్ | 76 |
| టాటా గ్లోబల్ బేవరేజెస్ | 89 |
| ఇండియన్ హోటల్స్ | 33 |
| వోల్టాస్ | 59 |
| ట్రెంట్ | 28 |
| టాటా ఎలెక్సీ | 32 |

### మార్కెట్ విలువ పరుగులు..

- చంద్ర నాయకత్వంలో చాలా వరకు టాటా కంపెనీలు మార్కెట్‌లోని ప్రామాణిక సూచీల కంటే మిన్నగా రాణించాయి.
- మొత్తం నమోదిత 27 టాటా కంపెనీల మార్కెట్ విలువ ఫిబ్రవరి 21, 2017 నుంచి 14 శాతం పెరిగి రూ.9.6 లక్షల కోట్లకు చేరింది. టీసీఎస్, టాటా మోటార్స్‌లను పరిగణనలోకి తీసుకోకపోతే గ్రూప్ మార్కెట్ విలువ 40.5 శాతం పెరిగినట్లవుతుంది.

## హైదరాబాద్‌లో డేటా సైన్స్ ఎక్సలెన్స్ కేంద్రం

**నాస్‌కామ్‌తో చేతులు కలిపిన తెలంగాణ ప్రభుత్వం**

**ఈనాడు, హైదరాబాద్:** డేటా సైన్స్, కృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞానాల కోసం తెలంగాణ ప్రభుత్వం ఎక్సలెన్స్ కేంద్రాన్ని (సీఓఈ) ఏర్పాటు చేస్తోంది. ఇందుకు నాస్‌కామ్‌తో చేతులు కలిపింది. ఈ మేరకు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ప్రారంభంలో ఈ కేంద్రాన్ని ట్రిపుల్ ఐటీలో ప్రారంభిస్తారు. అనంతరం హైదరాబాద్ సమీపంలోని బుద్వేల్ వద్ద అభివృద్ధి చేస్తున్న డేటా అనలిటిక్స్ పార్కులోకి తరలిస్తారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి వ్యవస్థ (ఎకో సిస్టమ్) అభివృద్ధిని కొనసాగించడానికి, బిగ్ డేటా, కృత్రిమ మేధ రంగాల్లో పటిష్ఠమైన పరిశోధన, వినూత్న సొల్యూషన్ల అభివృద్ధికి ఈ కేంద్రం దోహదం చేయగలదని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.టి.రామారావు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానంలో దాదాపు రూ.40 కోట్ల పెట్టుబడితో దీన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ రంగంలోని భాగస్వాముల మధ్య సాంకేతిక పరిజ్ఞానం ఇచ్చిపుచ్చుకోవడానికి ఇది ఒక వేదికగా పని చేస్తుంది. వాయిస్, టెక్స్ట్ తదితర రూపాల్లో రోజూ భారీ స్థాయిలో డేటా వస్తోందని, డేటా వృద్ధి కూడా అధికంగా ఉందన్నారు. 2025 నాటికి బిగ్ డేటా, కృత్రిమ మేధ రంగాల్లో 16 బిలియన్ డాలర్ల వ్యాపార అవకాశాలు లభించగలవని, 1.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు రాగలవని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. పొలంలో పంటకు తెగులు వస్తే.. దాన్ని ఫోటో తీసి పంపితే, అది ఎటువంటి తెగులో.. ఎటువంటి మందులు వాడాలో ఎస్ఎంఎస్ ద్వారా రాగలదని, ఇటువంటి ప్రయోజనాలన్నీ బిగ్ డేటా, కృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞానాలతో సాధ్యం అవుతున్నాయని మంత్రి వివరించారు. డేటా సైన్స్, కృత్రిమ మేధ రంగాలకు సంబంధించిన వ్యవస్థ దేశ వ్యాప్తంగా బలోపేతం కావడానికి ఈ ఎక్సలెన్స్ కేంద్రం దోహదం చేయగలదని నాస్‌కామ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ తెలిపారు.

## రిటర్న్‌ల సరళీకరణపై చర్చ

**1న జీఎస్‌టీ మండలి సమావేశం**

**దిల్లీ:** వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) విధానంలో రిటర్న్‌ల దాఖలు ప్రక్రియను సరళతరం చేసే అంశంపై చర్చించేందుకు మార్చి 1న జీఎస్‌టీ మండలి సమావేశం కానుంది. ఇ-వే బిల్లుల అమలు విధానంపైనా చర్చిస్తారని ఓ అధికారి వెల్లడించారు. ప్రధాన మంత్రి కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ఒకటే పత్రంలో రిటర్న్‌ల దాఖలు విధానాన్ని తీసుకొస్తే ఎలా ఉంటుందని గత భేటీలో చర్చించగా.. ఈసారి దీనికి సంబంధించి విధివిధానాలపై చర్చించే అవకాశం ఉందని వివరించారు.

# సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో 7-9 శాతం వృద్ధి

- రూ.8.9 లక్షల కోట్లకు చేరే వీలు
- కొత్తగా లక్షల మందికి ఉద్యోగాలు
- డిజిటల్ విభాగంలో 30% వృద్ధి
- 2018-19పై నాస్‌కామ్ అంచనాలు

**ఈనాడు - హైదరాబాద్**

వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2018-19) సమాచార సాంకేతిక పరిజ్ఞాన (ఐటీ) పరిశ్రమ ఎగుమతుల ఆదాయం 7-9 శాతం వృద్ధి చెందగలదని నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ (నాస్‌కామ్) అంచనా వేస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లలో మార్పు వస్తోందని, దేశీయ మార్కెట్ ఆకర్షణీయంగా మారుతోందని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఐటీ ఎగుమతులు 126 బిలియన్ డాలర్లు ఉండగలవని.. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఈ మొత్తం 135-137 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.8,90,500 కోట్లు) పెరగగలవని వెల్లడించింది. దేశంలో ఐటీ ఎగుమతులే అత్యధికంగా ఉన్నాయి. మొత్తం ఎగుమతుల్లో ఐటీ వాటా 24 శాతం. డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాల అండదండలతో వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఐటీ రంగంలో లక్ష మందికి నికరంగా ఉద్యోగాలు లభించగలవని నాస్‌కామ్ పేర్కొంది. ప్రస్తుతం పరిశ్రమలో దాదాపు 40 లక్షల మంది పని చేస్తున్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ప్రపంచ ఐటీ కాంగ్రెస్, నాస్‌కామ్ ఇండియన్ లీడర్‌షిప్ ఫోరమ్ సదస్సుల్లో వచ్చే ఏడాదికి అంచనాలను నాస్‌కామ్ విడుదల చేసింది. దేశీయ ఆదాయం మొదలైనవి పరిగణనలోకి తీసుకుంటే.. పరిశ్రమ మొత్తం ఆదాయం వచ్చే ఏడాదిలో 13 బిలియన్ డాలర్ల మేరకు పెరగనుందని, పరిశ్రమ ఆదాయ వృద్ధి, ఉద్యోగావకాశాల కల్పనకు మధ్య సంబంధం లేకుండా పోయే ధోరణి పెరుగుతోందని నాస్‌కామ్ ఛైర్మన్ రమణ్ రాయ్, ప్రెసిడెంట్ ఆర్.చంద్రశేఖర్‌లు తెలిపారు.




వివరాలు వెల్లడిస్తున్న నాస్‌కామ్ ప్రెసిడెంట్ ఆర్.చంద్రశేఖర్, ఛైర్మన్ రమణ్ రాయ్

**డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాలతో..:** వ్యాపారాలు, కంపెనీలు, ప్రభుత్వాలు, ప్రజల్లో డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాల వాడకం పెరిగిపోతోంది. ఐటీ రంగంలో డిజిటల్ విభాగం అత్యంత వేగంగా 30 శాతం చొప్పున వృద్ధి చెందుతోందని చంద్రశేఖర్ అన్నారు. 'డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాలు ఐటీ పరిశ్రమ పరిధులను తుడిచి వేస్తోంది. కంపెనీల వ్యాపార, ఉద్యోగుల మోడళ్లను మార్చి వేస్తున్నాయి. ప్రపంచానికి భారత్ 'డిజిటల్ భాగస్వామి' కావాలని నాస్‌కామ్ కోరుకుంటోంది. దేశీయ కంపెనీల డిజిటల్ సామర్థ్యాలు విస్తరిస్తున్నాయని' చంద్రశేఖర్ వివరించారు.

### ఆకర్షణీయంగా దేశీయ మార్కెట్..

కంపెనీలు చేపడుతున్న డిజిటలీకరణ చర్యలు దేశీయ మార్కెట్‌ను పెంచుతున్నాయి. దేశీయ మార్కెట్‌లో వృద్ధికి అపార అవకాశాలున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దేశీయ మార్కెట్ రెండంకెల్లో 10-12 శాతం వృద్ధి చెందే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు నాస్‌కామ్ వెల్లడించింది. 2017-18లో దేశీయ మార్కెట్ నుంచి లభించిన ఆదాయం 26 బిలియన్ డాలర్లు ఉండగలదని అంచనా వేస్తుండగా.. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఇది 28-29 బిలియన్ డాలర్లకు చేరగలదని నాస్‌కామ్ భావిస్తోంది. నియంత్రణ, మౌలిక సదుపాయాలు, విధాన పరమైన అడ్డంకులను ప్రభుత్వం తొలగిస్తే.. ఇక్కడ అవకాశాలను పరిశ్రమ అందిపుచ్చుకుంటుందని తెలిపింది.

### ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి

2017-18కి పరిశ్రమ మొత్తం ఆదాయం 154 బిలియన్ డాలర్లు చేరగలదని చంద్రశేఖర్ వెల్లడించారు. క్రితం ఏడాది ఇది 143 బిలియన్ డాలర్లు ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి పరిశ్రమ మొత్తం ఆదాయం 167 బిలియన్ డాలర్లకు చేరగలదని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కొత్తగా 1,30,000 ఉద్యోగాలను పరిశ్రమ కల్పించగలదని భావించినప్పటికీ.. లక్ష మందికి మాత్రమే ఉద్యోగాలు ఇవ్వగలిగింది.

## ఎస్ఎంఈలకు యెస్ బ్యాంక్ డిజిటల్ ఫైనాన్స్ సేవలు

**ఈనాడు, హైదరాబాద్:** చిన్న, మధ్య తరహా సంస్థలకు ఆర్థిక సహాయం చేసేందుకు యెస్ బ్యాంక్ ఎప్పుడూ సిద్ధంగానే ఉంటోందని బ్యాంక్ ప్రాంతీయ డైరెక్టర్ ఆర్.రవిచందర్ అన్నారు. అంకుర సంస్థలతో ఏదైనా సాధ్యమేనని చెప్పేందుకు యెస్ బ్యాంకు పెద్ద ఉదాహరణ అని తెలిపారు. ఎస్ఎంఈలు రుణాల కోసం బ్యాంకులకు నేరుగా రావాల్సిన అవసరం లేకుండా, డిజిటల్ సాంకేతికతోనే సంప్రదించేలా చూస్తున్నామన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో యెస్ బ్యాంకు, ఎఫ్‌ట్యాప్సీ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన 'డిజిటల్ ఫైనాన్స్, ఎంఎస్ఈలపై దాని ప్రభావం' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఎఫ్‌ట్యాప్సీతో కలిసి వృద్ధి దశలో ఉన్న చిన్న, మధ్య తరహా సంస్థలను గుర్తించి, ఆయా సంస్థలకు అవసరమైన సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఎఫ్‌ట్యాప్సీ ప్రెసిడెంట్ గౌర శ్రీనివాస్ మాట్లాడుతూ.. పెద్ద కార్పొరేట్లు రుణాలు తీసుకొని ఎగవేసే అవకాశం ఉంది కానీ.. చిన్న సంస్థలు బ్యాంకులను ఎప్పుడూ ముంచవని, వాటికి రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులు కాస్త ఉదారంగా వ్యవహరించాలన్నారు.

## హైదరాబాద్ సిర్క్ ఛైర్మన్ సునీల్ కుమార్

**ఈనాడు, హైదరాబాద్:** ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ)కి చెందిన దక్షిణాది ప్రాంతీయ మండలి (సిర్క్) హైదరాబాద్ శాఖ ఛైర్మన్‌గా సునీల్ కుమార్ మండవ బాధ్యతలు చేపట్టారు. కొత్త పాలక వర్గంలో వైస్ ఛైర్మన్‌గా వై.వి.భానునారాయణ రావు, కార్యదర్శిగా సి.వెంకట్‌రామ్, కోశాధికారిగా పంకజ్ కుమార్ త్రివేది ఉన్నారని ఐసీఏఐ ఒక ప్రకటనలో తెలిపింది. వీరు 2018-19కి ఈ హోదాల్లో పని చేస్తారు. హైదరాబాద్ సిర్క్‌లో దాదాపు 8,500 మందికి సభ్యత్వం ఉంది.

# ప్రయోజనం పరిపూర్ణమా?



**వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) విధానం వల్ల సామాన్యులకే కాదు వ్యాపారులు, పరిశ్రమ వర్గాలకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని ప్రభుత్వం చెబుతోంది. జీఎస్‌టీ అమల్లోకి వచ్చి ఇప్పటికి 235 రోజులు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో కొత్త పన్నుల విధానం ఎంత మేర ప్రయోజనాన్ని చేకూర్చిందో చూద్దాం.**

జీఎస్‌టీ



సతీష్ సరాఫ్
చార్టర్డ్ అకౌంటెంట్

జీఎస్‌టీ వల్ల సామాన్యులు, వ్యాపారులకు కలిగే ప్రయోజనాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓ జాబితా విడుదల చేశాయి. అందులో ప్రధానమైనవి..
(అ) సులభతర పన్నుల వ్యవస్థ (ఆ) పన్నుపై పన్ను కట్టే భారం తొలగి వస్తువులు, సేవల ధరలు దిగివస్తాయి
(ఇ) దేశమంతా ఏకరీతి పన్నుల విధానం (ఈ) పన్నుల విధానంలో పారదర్శకత
(ఉ) ఉద్యోగావకాశాలు పెరుగుతాయి
ఈ ప్రయోజనాల్లో ఏవేవీ ఎంతవరకు నెరవేరాయో విడివిడిగా విశ్లేషిద్దాం.

### సులభతర పన్నుల విధానం

జీఎస్‌టీకి పూర్తి రూపం గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్. మన ప్రధాని నరేంద్ర మోదీ మాటల్లో ఇది 'గుడ్ సింపుల్ ట్యాక్స్'. అంటే 'ఓ మంచి సులభతర పన్ను' అని అర్థం. జీఎస్‌టీలో 39 చట్టాలు (ఐజీఎస్‌టీ+ సీజీఎస్‌టీ+ 7 యూటీజీఎస్‌టీ+ 29 ఎస్‌జీఎస్‌టీ+ పరిహార సెస్సు చట్టం) ఉన్నాయి. కొన్ని నిబంధనల సమూహం కూడా ఉంది. జీఎస్‌టీకి సంబంధించి ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్లే 350 వరకు ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వాల నోటిఫికేషన్లు మరికొన్ని ఉన్నాయి.

జీఎస్‌టీలో 14 రకాల పన్ను చట్టాలను ప్రభుత్వం విలీనం చేసింది. ఈ 14 రకాల పన్ను చట్టాల బదులు ఒక్క జీఎస్‌టీ చట్టాన్ని అనుకరిస్తే సరిపోతుంది. ఏ వ్యాపారైనా ఒకేసారి 14 రకాల పన్నులు చెల్లించరు. మహా అయితే 3-4 రకాల పన్నులు చెల్లించేవారు. గతంలో వ్యాట్ (విలువ జతచేరిన పన్ను) ఒక్కటే చెల్లించే వ్యాపారికి జీఎస్‌టీ వల్ల పెద్దగా ఊరటేమీ లేదనే చెప్పాలి. ఎందుకంటే జీఎస్‌టీ అంత గందరగోళంగా వ్యాట్ విధానం ఉండదు.

ఈ అంశాలు పరిగణనలోకి తీసుకుంటే జీఎస్‌టీని నిజంగానే 'ఓ మంచి సులభతర పన్ను' అనుకోవాలా? లేదా? అనే విషయాన్ని పాఠకులే తేల్చాలి.

### ధరలు దిగివస్తాయ్

జీఎస్‌టీకి ముందు ఒకే వస్తువుపై పన్ను మీద పన్ను చెల్లించేవాళ్లం. ఇప్పుడు జీఎస్‌టీలో 14 రకాల పన్నులు విలీనం కావడంతో పన్ను మీద పన్ను కట్టే పరిస్థితి తప్పింది. ఈ పరిణామంతో ధరలు దిగిరావాల్సి ఉన్నప్పటికీ.. ప్రభుత్వం అనుకున్న స్థాయిలో ధరలు తగ్గలేదన్నది వాస్తవం. గరిష్ఠ విక్రయ ధర (ఎంఆర్‌పీ) ముద్రించని వస్తువులు, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తగ్గక పోగా కొన్ని పెరిగాయి. ఎంఆర్‌పీ ఉండే వస్తువుల విషయానికొస్తే.. మునుపటితో పోలిస్తే ధరలు తగ్గాయనే చెప్పాలి.

వస్తువులతో వ్యాపారాన్ని నిర్వహించే వర్తకులు చెల్లించే సేవా పన్నును ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ కింద తిరిగి పొందే వీలు పాత పన్ను వ్యవస్థలో లేదు. జీఎస్‌టీలో ఈ అవకాశం వచ్చింది. ఇందువల్ల ప్రభుత్వ ఆదాయం కాస్త తగ్గుతోంది.

ఇలా చూస్తే.. జీఎస్‌టీ అమల్లోకి రావడం వల్ల 'ధరలు తగ్గుతాయనే' ప్రయోజనం పాక్షికంగా నెరవేరిందని చెప్పొచ్చు. ఎంఆర్‌పీ ఉండని వస్తువులు, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తగ్గేందుకు ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టాలి.

### దేశమంతా ఏకరీతి పన్నుల విధానం

రాష్ట్రాల మధ్య పన్నుల వ్యత్యాసాల కారణంగా జీఎస్‌టీ అమల్లోకి రాకముందు వస్తువుల ధరలు ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉండేవి. జీఎస్‌టీ రాకతో ఇప్పుడు ప్రతి చోటా ఒకే ధరకు ఆ వస్తువు లభ్యమవుతుంది. అలాగే ధరలకు సంబంధించి రాష్ట్రాలు, వ్యాపారుల మధ్య వివాదాలకు కొత్త పన్నుల విధానం తెరదించింది.

వ్యాపార లావాదేవీలు సజావుగా ముందుకు వెళ్లేందుకు ఇ-వే బిల్లుల వ్యవస్థను పూర్తి సమర్థంగా అమలు చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. గతంలో ఈ విధానాన్ని సక్రమంగా అమలు చేయకపోవడం వల్ల సరకు రవాణాకు తాత్కాలిక అవరోధం ఏర్పడింది. ఈ పరిణామం కొంత సమయం పాటు వస్తువుల కొరతకు దారితీసింది. ఒక రోజులో ఎన్నెన్ని లావాదేవీలు జరుగుతాయో విశ్లేషించుకొని, తదనుగుణంగా ఇ-వేబిల్లుల సర్వర్ బ్యాండ్‌విడ్త్ పెంచుకోవాలి. ఇ-వేబిల్లు విధానం సమర్థంగా అమలు కాకుంటే ఒకే దేశం.. ఒకే విపణి అనే లక్ష్యాన్ని సాధించడం కష్టమవుతుంది.

### పారదర్శక పన్నుల విధానం

విక్రయ విలువ రూ.200కి మించితే ఇన్‌వాయిస్ ఇవ్వడాన్ని తప్పనిసరి చేయడం సహా పలు చర్యల ద్వారా జీఎస్‌టీ విధానంలో పారదర్శకతను ప్రభుత్వం తీసుకొచ్చింది. వస్తువులు లేదా సేవకు ఎంత ధర చెల్లిస్తున్నాం? పన్నులు ఎంత కడుతున్నాం? అనే విషయాన్ని వినియోగదారుడు తెలుసుకునేందుకే ఈ ఇన్‌వాయిస్ నిబంధనను ప్రభుత్వం తీసుకొచ్చింది. గత అనుభవాల దృష్ట్యా జీఎస్‌టీ రూపేణా చెల్లించే డబ్బులు నిజంగానే ప్రభుత్వానికి చేరుతున్నాయా అనే సందేహాలు ప్రజల్లో నెలకొన్నాయి. అందుకే ఖజానాకు పన్ను రూపంలో ఎంత చేరుతుందో అనే విషయంతో పాటు పన్ను ఎగవేతల కేసుల వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయడం ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని ప్రభుత్వం కల్పించాలి.

### ఉద్యోగావకాశాలు

జీఎస్‌టీ వల్ల ఉద్యోగావకాశాలు పెరుగుతాయనే విషయంలో ప్రభుత్వం చెప్పిన మాట నిజమైందని చెప్పొచ్చు. గతంలో కామర్స్ పట్టభద్రులకు సరైన అవకాశాలు ఉండేవి కావు. జీఎస్‌టీ వచ్చాక పన్ను కన్సల్టెంట్లు, సలహాదార్లు, అకౌంటెంట్లు సహా అనేక విభాగాల్లో వీళ్లకు ఉద్యోగావకాశాలు పెరిగాయి. జీఎస్‌టీకి సంబంధించి అప్లికేషన్లు, సాఫ్ట్‌వేర్లకు గిరాకీ పెరగడంతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు కూడా జీఎస్‌టీ అనేక ఉద్యోగాలు సృష్టించింది. అయితే తయారీ, వ్యవసాయ రంగాల్లో మాత్రం జీఎస్‌టీ వల్ల పెరిగిన ఉద్యోగాలు అంతంతే. ఎందుకంటే జీఎస్‌టీ గమ్యస్థాన ఆధారిత పన్నుల విధానం కావడంతో తయారీ రంగంలో ముందుండే మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్ సహా పలు రాష్ట్రాలకు పన్ను ఆదాయాలు తగ్గాయి. అందుకే వారి రాష్ట్రాల్లో కొత్తగా నెలకొల్పే తయారీ యూనిట్లకు ప్రోత్సాహకాలు అందించే విషయంలో ఇవి వెనుకడుగు వేస్తున్నాయి. ఈ ప్రభావం ఉద్యోగాలపై పడుతోంది.

**గమనిక: జీఎస్‌టీ ప్రయోజనాలు సామన్యులకు చేరుతున్నాయా? లేదా? అనే అంశాన్ని విశ్లేషించే ప్రయత్నంలో భాగంగా పై వివరాలు తెలియజేశాం. అంతే మినహా దీనివల్ల ప్రభుత్వానికి లేదా వ్యక్తుల ప్రతిష్ఠకు భంగం కలిగించాలనే ఉద్దేశం రచయితకు గాని పత్రికకు గాని లేదు.**

# బోర్డుల్లోనే ప్రబుద్ధులు!

- బాధ్యత విస్మరిస్తున్న బ్యాంకుల డైరెక్టర్లు
- అడ్డగోలు రుణాల్లో కొందరికి పాపం?



నీరవ్ మోదీ కుంభకోణంలో భాగమైన గీతాంజలి జెమ్స్ ప్రభుత్వ రంగ సంస్థ అయిన అలహాబాద్ బ్యాంకు నుంచి ఎన్నో ఏళ్ల నుంచి అప్పులు తీసుకుంటోంది. ఈ సంస్థకు చెందిన రూ.50 కోట్ల రుణ దరఖాస్తు 2013లో అలహాబాద్ బ్యాంకు డైరెక్టర్ల బోర్డు (పాలకమండలి) పరిశీలనకు వచ్చింది. బోర్డులోని అప్పటి ప్రభుత్వ నామినీ డైరెక్టర్ అయిన దినేష్ దూబే దీనిని వ్యతిరేకించారు. అప్పటికే ఈ బ్యాంకు గీతాంజలి జెమ్స్‌కు రూ.1500 కోట్ల అప్పు ఇచ్చింది. మళ్లీ కొత్తగా రుణమా.. ముందు ఇచ్చిన అప్పులను వసూలు చేయండి- అని ఆయన స్పష్టం చేశారు. కానీ ఆయన అభ్యంతరాన్ని ఎవరూ పట్టించుకోలేదు. దీంతో కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. కానీ ఆ రుణం మంజూరుని కాకుండా ఆపలేకపోయారు. పైగా ఆయన తన డైరెక్టర్ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ వ్యవహారంలో కనీసం ఒక డైరెక్టర్ అభ్యంతరాన్ని లేవనెత్తారు. కానీ ప్రభుత్వ బ్యాంకుల బోర్డుల్లోని డైరెక్టర్లలో ఎంతమంది ఇలా అడ్డు చెప్పేవారు ఉంటున్నారు? ఎంతమంది డైరెక్టర్లు తమ బాధ్యతను నెరవేరుస్తున్నారు? అనే ప్రశ్న తలెత్తుతోంది.

బ్యాంకు బోర్డుల్లోని డైరెక్టర్లు తమ పదవులకు న్యాయం చేయటం లేదు. మోసపూరిత రుణాల మంజూరును అడ్డుకునే అవకాశం ఉన్నప్పటికీ.. ఆ బాధ్యతను విస్మరిస్తున్నారు. పైగా కొందరు డైరెక్టర్లు స్వప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నామినీ డైరెక్టర్లు అయితే తమకు ఆ పదవి ఇప్పించిన వారి అవసరాల మేరకు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. భారీ రుణాలు బ్యాంకుల బోర్డు ముందుకు తుది అనుమతి కోసం వస్తాయి. అభ్యంతరకరంగా ఉన్న వాటిని అడ్డుకోవచ్చు. కానీ ఎన్నో సందర్భాల్లో ఇది జరగటం లేదు. ఫలానా వారు ఫోన్ చేశారు, లేక ఫలానా నాయకుడికి సంబంధించిన వ్యవహారం... వాటిని ఆమోదిస్తున్నారు. చివరికి అదే బ్యాంకులకు ముప్పు తెచ్చిపెడుతోంది.


## బోర్డుదే అత్యున్నత అధికారం

- బ్యాంకులో చిన్న రుణాలను బ్యాంకు మేనేజర్ స్థాయిలో మంజూరు చేయవచ్చు. రుణ మొత్తం పెద్దది అయ్యే కొద్దీ జోనల్ కార్యాలయం, కేంద్ర కార్యాలయం, మేనేజింగ్ కమిటీ, డైరెక్టర్ల బోర్డు వరకూ అనుమతి కోసం వెళ్లాల్సి ఉంటుంది.
- ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో అన్ని విషయాలపై తుది నిర్ణయం డైరెక్టర్ల బోర్డుదే.
- బోర్డు డైరెక్టర్ల ముందుకు పెద్ద రుణాలకు సంబంధించిన దరఖాస్తులు పరిశీలన కోసం వస్తాయి. వాటిని వారు పరిశీలించి అంతా సవ్యంగా ఉందని అనుకుంటేనే రుణ మంజూరుకు ఆమోదాన్ని తెలియజేయాలి. అభ్యంతరకరంగా ఉన్న దరఖాస్తులను డైరెక్టర్లు వ్యతిరేకించవచ్చు. కానీ అటువంటి సందర్భాలు చాలా తక్కువ అనేది బ్యాంకింగ్ వర్గాల కథనం.



- ఎవరైనా అభ్యంతరం లేవనెత్తినా ఫలానా వారి 'రిఫరెన్స్'తో వచ్చింది.., లేదా ఫలానా వారు సిఫారసు చేశారు.. అని చెప్పి, అభ్యంతరాలను పక్కన పెట్టి రుణ దరఖాస్తులను ఆమోదించటం సర్వసాధారణమనేది సంబంధిత వర్గాల విశ్లేషణ.

## బ్యాంకు డైరెక్టర్ కావటం ఎలా?




బ్యాంకు బోర్డుల్లో స్వతంత్ర డైరెక్టర్లు, ప్రభుత్వ/ ఆర్‌బీఐ నామినీ డైరెక్టర్ల నియామకాలకు ఎంతో పోటీ ఉంటుంది. కొందరు నిపుణులను నియమించినప్పటికీ, రాజకీయ అండదండలతో, ఇతర సిఫారసులతో బ్యాంకుల బోర్డుల్లో డైరెక్టర్ అయ్యేందుకు ఎంతో మంది ప్రయత్నిస్తారు. రాజకీయ నాయకుల వద్ద చార్టర్డ్ అకౌంటెంట్లుగా ఉన్నవారు, వారి అనుచరుల్లోని ముఖ్యులు పలువురు డైరెక్టర్ల పదవులను దక్కించుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇటువంటి వారు డైరెక్టర్లు అయిన నాటి నుంచి తమ స్వప్రయోజనాల కోసం లేదా డైరెక్టర్ పదవి వచ్చేందుకు సహకరించిన వారి ప్రయోజనాల కోసం పనిచేస్తారే తప్పించి.. బ్యాంకుకు మేలు చేసే ఆలోచన తక్కువగా ఉంటుందనేది సంబంధిత వర్గాల నుంచి వస్తున్న విమర్శ.

## అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం

ఈ బోర్డుల్లో ఎవరెవరిని డైరెక్టర్లుగా నియమించాలనే విషయంలో స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. ఎస్‌బీఐ బోర్డు డైరెక్టర్ల నియామకాలు ఎస్‌బీఐ చట్టం, 1955 ప్రకారం జరుగుతాయి. ఎస్‌బీఐ చట్టంలోని సెక్షన్- 19 లో ఎంతమంది డైరెక్టర్లను ఎలా ఎంపిక చేయాలనే విషయం ఉంది. ఇతర బ్యాంకులకు ఈ విషయంలో బ్యాంకింగ్ కంపెనీల చట్టం వర్తిస్తుంది. ప్రభుత్వ బ్యాంకులన్నింటికీ ఛైర్మన్, ఎండీ అండ్ సీఈఓ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లను కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది. వీరు కాకుండా బోర్డు డైరెక్టర్లలో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి, భారత రిజర్వు బ్యాంకు ప్రతినిధి ఉంటారు. ఇంకా బ్యాంకు షేర్‌హోల్డర్ల ప్రతినిధి ఒకరు, బ్యాంకు సిబ్బంది ప్రతినిధి ఇలా ఎంతోమందికి బోర్డులో స్థానం దక్కుతుంది. వీరే కాకుండా ఒక మహిళా డైరెక్టర్, స్వతంత్ర డైరెక్టర్లు ఉంటారు. సాధారణంగా చార్టర్డ్ అకౌంటెంట్లు, వ్యాపార వ్యవహారాల్లో నిష్ణాతులు, న్యాయకోవిదులను స్వతంత్ర డైరెక్టర్లుగా, ప్రభుత్వ నామినీ డైరెక్టర్లుగా నియమించటం సంప్రదాయం. కానీ పలు సందర్భాల్లో రాజకీయ సిఫారసులతో వచ్చే వారిని ప్రభుత్వ నామినీ డైరెక్టర్లుగా నియమించటం పరిపాటిగా మారింది. అలా వచ్చిన వారు తాము ఎలా బాగుపడాలా? అని ఆలోచించటమే కానీ బ్యాంకుల బాగు కోసం ఆలోచించే పరిస్థితి లేదని అంటున్నారు.

## మోసాలను అరికట్టవచ్చా?

- నీరవ్ మోదీ, రోటోమాక్ అధినేత కొఠారీ, ఏడాదిన్నర క్రితం విజయ్ మాల్యా... ఉదంతాల్లో సంబంధిత బ్యాంకుల బోర్డు డైరెక్టర్లు ఏం చేశారనే ప్రశ్న తలెత్తుతోంది.
- చిన్న రుణాల్లో కొన్ని వసూలు కాకపోయినా బ్యాంకులు తట్టుకోగలుగుతాయి. కానీ బోర్డు స్థాయిలో అనుమతి ఇచ్చే పెద్ద పెద్ద కార్పొరేట్ రుణ ఖాతాల్లో, ఒక ఖాతా తేడా వచ్చినా సంబంధిత బ్యాంకుకు ఇబ్బంది తప్పదు. అందువల్ల బోర్డు సభ్యులు అప్రమత్తంగా వ్యవహరించి పెద్ద రుణాల విషయంలో జాగ్రత్త వహిస్తే నీరవ్ మోదీ వంటి ఉదంతాలను పరిహరించవచ్చని బ్యాంకింగ్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.



- ఒకవేళ ఒత్తిళ్ల వల్ల ఇటువంటి రుణాలను అడ్డుకునే లేని పరిస్థితి ఏర్పడితే కనీసం అదే విషయాన్ని ఆర్‌బీఐ నామినీ డైరెక్టర్ ఆర్‌బీఐ దృష్టికి తీసుకువెళ్లవచ్చు. ప్రభుత్వ నామినీ డైరెక్టర్ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖలోని బ్యాంకింగ్ వ్యవహారాల శాఖకు వివరించవచ్చు.
- బ్యాంకులు ఇచ్చిన భారీ వ్యాపార రుణాలు వసూలు కాని పక్షంలో అందుకు బ్యాంకుల డైరెక్టర్లను బాధ్యులు చేసి ప్రశ్నిస్తే, కొంతవరకైనా వారికి బాధ్యత ఉంటుందని, వారు అప్రమత్తంగా వ్యవహరించే పరిస్థితి వస్తుందని అంటున్నారు.

## వ్యక్తిగత పూచీకత్తు ఏదీ?



బ్యాంకులు పెద్దపెద్ద వ్యాపార రుణాలు మంజూరు చేసేందుకు సంబంధిత కంపెనీల వ్యవస్థాపకుల నుంచి వ్యక్తిగత పూచీకత్తు (పర్సనల్ గ్యారెంటీ) తీసుకుంటే ఇటువంటి పరిస్థితి రాదని నిపుణులు కొందరు పేర్కొంటున్నారు. ప్రస్తుత విధానంలో మోసపూరితంగా అప్పు తీసుకొని తిరిగి చెల్లించకపోతే క్రిమినల్ కేసు అవుతోంది కానీ, బ్యాంకు సొమ్ము తిరిగి రావటం లేదు. ఈ లొసుగును అడ్డం పెట్టుకొని మోసపూరిత ఆలోచన ఉన్న వారు రుణ మంజూరు దరఖాస్తు దాఖలు చేసే స్థాయి నుంచే తగిన జాగ్రత్తలు పాటిస్తున్నారు. మూడో వ్యక్తి (థర్డ్ పార్టీ గ్యారెంటీ) నుంచి పూచీకత్తు ఇప్పించటం, రూ.10 లక్షల విలువైన ఆస్తికి రూ.50 లక్షలు విలువ కట్టించి, దాన్ని గ్యారెంటీగా ఇవ్వటం, అప్పు తీసుకున్న సంస్థ పేరు మీద ఎటువంటి ఆస్తులు లేకుండా చేయటం, తీసుకున్న అప్పును వ్యాపారాభివృద్ధికి వెచ్చించకుండా ఆ సొమ్ముతో బినామీ పేర్ల మీద ఆస్తులు కొనుగోలు చేసి భద్రపరచుకోవటం.. వంటి అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో తాను మోసపోయినట్లు బ్యాంకు కనిపెట్టినా ఇచ్చిన రుణాన్ని వసూలు చేసుకోలేకపోతోంది. చివరికి దాన్ని రానిబాకీ కింద పుస్తకాల్లో రాసి ఆ నష్టాన్ని భరించాల్సి వస్తోంది. అందుకే ప్రభుత్వ రంగ బ్యాంకులకు కేంద్ర ప్రభుత్వం రెండు మూడేళ్లకోసారి మూలధన నిధులు సమకూర్చాల్సి వస్తోంది. మోసగాళ్లు ఇష్టానుసారం బ్యాంకులను అప్పుల పేరుతో కొల్లగొడుతుంటే, ప్రభుత్వం ఏమో ప్రజల నుంచి వసూలు చేసి పన్నుల సొమ్ముతో బ్యాంకుల నష్టాలను భర్తీ చేయాల్సి వస్తోంది.

-ఈనాడు ప్రత్యేక విభాగం

## ఇది నిలబడే కేసు కాదండీ

### నీరవ్ తరఫు న్యాయవాది అగర్వాల్ వ్యాఖ్యలు

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)ను పెద్దఎత్తున మోసగించినట్లు తన క్లయింట్ నీరవ్ మోదీ గురించి కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) చెబుతున్నా ఈ కేసు కూడా 2జి, బోఫోర్స్ అంశాల మాదిరిగానే నీరుగారిపోతుందని అంటున్నారు అతని తరఫు న్యాయవాది విజయ్ అగర్వాల్. సీబీఐ మోపిన అభియోగాలన్నీ తప్పేననీ, ఆ ఆరోపణల్లో పస లేదనీ వ్యాఖ్యానించారు. నీరవ్ చేసిన బ్యాంకు లావాదేవీలన్నింటికీ పత్రాలు పక్కాగా ఉన్నాయని మంగళవారం వేర్వేరు వార్తా సంస్థలతో ఫోన్లో మాట్లాడుతూ స్పష్టం చేశారు. 'పత్రికల్లో, ప్రసార మాధ్యమాల్లో దర్యాప్తు సంస్థలు హడావుడి చేస్తున్నాయి. కేసు మొత్తాన్ని నేను పరిశీలించాను. ఈ అభియోగాలను న్యాయస్థానంలో రుజువు చేయలేరు. అందువల్ల నీరవ్‌ని దోషిగా నిలబెట్టలేరని నాకు విశ్వాసం ఉంది' అని చెప్పారు. ఆభరణాల సంస్థలతో నిర్వహించిన లావాదేవీలకు గానూ పీఎన్‌బీ ఎప్పటికప్పుడు రుసుములు వసూలు చేస్తూ వస్తోందని చెప్పారు. వివాదాన్ని న్యాయపరంగా ఎలా ఎదుర్కొంటారనే ప్రశ్నకు బదులిస్తూ అభియోగపత్రం లేనంత వరకు వ్యూహం ఉండదన్నారు. అది ఉంటేనే ఇదీ ఉంటుందని చెప్పారు. బాధ్యతల నుంచి తప్పించుకోవాలని చూస్తున్న కొంతమంది తన క్లయింట్‌పై లేనిపోని కల్పిత గాథల్ని అల్లుతున్నారని ఆరోపించారు. నిందితుడు ఎక్కడ ఉన్నదీ చెప్పడానికి అగర్వాల్ నిరాకరించారు. నీరవ్ మన దేశం విడిచి వెళ్లిపోయినట్లు జరుగుతున్న ప్రచారాన్ని ప్రస్తావిస్తూ... రూ.5000- 6000 కోట్లకు పైగా ఆస్తుల్ని ఈడీకి వదులుకుని ఎవరైనా ఎందుకు పారిపోవాలని ప్రశ్నించారు.

## మాల్యా, లలిత్‌లను రప్పించేందుకు పెట్టిన ఖర్చులను వెల్లడించలేం

### సహ దరఖాస్తుపై సీబీఐ స్పందన

దిల్లీ: విదేశాలకు పారిపోయిన నిందితులు విజయ్ మాల్యా, లలిత్ మోదీలను.. తిరిగి భారత్‌కు రప్పించడం కోసం చేసిన వ్యయాల వివరాలను వెల్లడించేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) నిరాకరించింది. సమాచార హక్కు చట్టం కింద పుణెకు చెందిన ఓ వ్యక్తి ఈ సమాచారం కోసం దరఖాస్తు చేశారు. రూ.9వేల కోట్ల మేర బ్యాంకులకు రుణాలు ఎగవేసిన మాల్యా, అక్రమ నగదు చలామణీ ఆరోపణలు ఎదుర్కొంటున్న లలిత్ మోదీ.. బ్రిటన్‌కు పారిపోయిన సంగతి తెలిసిందే. అయితే వీరిని రప్పించేందుకు.. న్యాయ ప్రక్రియలు, అధికారుల విదేశీ ప్రయాణాలు తదితరాలకు మొత్తం ఎంత ఖర్చు అయ్యిందో వెల్లడించాలని దరఖాస్తుదారుడు అభ్యర్థించారు. అయితే 2011లో ప్రభుత్వం ఇచ్చిన ఓ నోటిఫికేషన్.. ఈ వివరాలను వెల్లడించకుండా ఉండేందుకు తమకు వీలు కల్పిస్తోందని సీబీఐ బదులిచ్చింది. దరఖాస్తుదారుడు కోరిన సమాచారానికి సంబంధించి ఈ మినహాయింపును ఉపయోగించుకుంటున్నట్లు తెలిపింది. అయితే అవినీతి, మానవ హక్కుల ఉల్లంఘన వంటి ఆరోపణలకు సంబంధించిన సమాచారం వెల్లడించే విషయంలో.. సంస్థలు మినహాయింపు పొందకూడదని గతంలో దిల్లీ హైకోర్టు స్పష్టీకరించింది.

## 'సిట్' ఏర్పాటుపై సుప్రీం విచారణ నేడు

పీఎన్‌బీ కుంభకోణంపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటుచేయాలన్న ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. కేసు ప్రాధాన్యం దృష్ట్యా- బుధవారమే దీనిపై విచారణ చేపట్టాలని నిర్ణయించింది. ఈ కుంభకోణంపై సిట్‌ను వేయాలని సోమవారం సుప్రీంకోర్టులో రెండు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. న్యాయవాది జేపీ దాండా ద్వారా వినీత్ దాండా; మరో వకీలు ఎంఎల్ శర్మ వేర్వేరుగా వీటిని దాఖలుచేశారు. దాండా వేసిన దావాను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఎ.ఎం.ఖన్విల్కర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం పరిశీలించింది. బ్యాంకు కుంభకోణంపై దర్యాప్తుకు సిట్‌ను వేయడంతోపాటూ.. .. ఈ అక్రమాల్లో పీఎన్‌బీ ఉన్నతాధికారుల పాత్రపైనా విచారణ చేపట్టాలని పిటిషనర్ అభ్యర్థించారు. దీనిని పరిశీలించిన ధర్మాసనం- కేసు ప్రాధాన్యం దృష్ట్యా బుధవారమే దీనిపై సముచిత ధర్మాసనం విచారణ చేపడుతుందని పేర్కొంది. మరోవైపు- "పీఎన్‌బీ కుంభకోణం కారణంగా దేశ ఖజానాకూ, సాధారణ పౌరులకు అపార నష్టం వాటిల్లింది. రిజర్వ్ బ్యాంకు ఆర్థిక నిబంధనలను తుంగలో తొక్కి కోట్లాది రూపాయలను నీరవ్ మోదీకి ధారాదత్తం చేశారు. రాజకీయ సంస్థలు, వ్యక్తులకు సంబంధం లేకుండా... సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తులతో కూడిన సిట్‌ను ఏర్పాటుచేసి, దీనిపై విచారణ చేపట్టాలి" అని తన పిటిషన్‌లో న్యాయస్థానాన్ని ఎం.ఎల్.శర్మ అభ్యర్థించారు.

# ఏడాది క్రితమే నీరవ్ సంస్థలపై ఐటీ దాడులు!

- అప్పుడు నల్లధనంపై ఆరాకే పరిమితం
- భారీ మోసాన్ని పసిగట్టలేకపోయిన పన్ను అధికారులు

దిల్లీ

దేశంలోనే రెండో అతిపెద్ద బ్యాంకు పీఎన్‌బీకి భారీగా బురిడీ కొట్టిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ సంస్థలపై ఏడాది క్రితమే ఆదాయపు పన్ను శాఖ అధికారులు విస్తృతంగా దాడులు జరిపారు. 2017 జనవరిలో కొనసాగిన ఆ దాడుల్లో నల్లధనం వెలికితీతపైనే అధికారులు దృష్టి కేంద్రీకరించారని తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం రూ.500, రూ.వెయ్యి నోట్ల రద్దును ప్రకటించిన (2016, నవంబరు 8) తర్వాత వెనుకటి తేదీతో నీరవ్ మోదీ సంస్థలు వ్యాపార కార్యకలాపాలను నిర్వహించాయన్న ఆరోపణల నేపథ్యంలో ఈ దాడులు చేపట్టారు. రద్దు చేసిన రూ.వెయ్యి, రూ.500 నోట్లను నీరవ్ మోదీ సంస్థలు స్వీకరించాయని, దాదాపు రూ.250 కోట్ల మేర విక్రయాలు జరిపిందని ఐటీ వర్గాల సమాచారం. ఈ చెల్లింపులు జరిపిన వ్యక్తులకు తమ ఆదాయ మూలాలను వెల్లడించాలని కోరుతూ ఐటీ శాఖ ప్రశ్నావళిని పంపించింది. అంతటితో ఆ దాడుల కథ ముగిసింది. ఆ తర్వాత ఏమయ్యిందో తెలియదు.

ఇప్పుడు సుమారు రూ.20వేల కోట్ల కుంభకోణం బయటపడిన తర్వాత ఐటీ శాఖ మళ్లీ గతవారం నీరవ్ మోదీ సంస్థలపై దాడులు జరిపింది. ఖాతాలన్నిటినీ క్షుణ్ణంగా పరిశీలించింది. ఈ దఫా కేవలం ఆదాయపు పన్ను చట్టాలకే పరిమితం కాకుండా నల్లధనం చట్టం-2015లోని నిబంధనల కొరడానూ ఝుళిపించింది. ముంబయి, సూరత్, జైపుర్, దిల్లీ తదితర నగరాల్లోని నీరవ్‌కు, అతని కుటుంబసభ్యులకు చెందిన 29 ఆస్తులను, 105 బ్యాంకు ఖాతాలనూ జప్తు చేసింది. సూరత్‌లోని ప్రత్యేక ఆర్థిక మండలిలో ఉన్న నీరవ్ మోదీ వజ్రాల ప్రాసెసింగ్ కేంద్రాల గుట్టునూ ఛేదించింది. విలువైన ముడి వజ్రాలను దిగుమతి చేసుకున్న నీరవ్ సంస్థలు....సానబెట్టిన తర్వాత వాటిని విదేశాలకు ఎగుమతి చేయకుండా దేశీయంగానే దారిమళ్లించినట్లు ఐటీ అధికారులు తెలుసుకున్నారు. తక్కువ రకం వజ్రాలను ఎగుమతి చేసి...వాటికి అధిక ధరలు చూపి 100శాతం పన్ను రాయితీని పొందిన విషయాన్నీ గుర్తించారు. ఈ విధంగా రూ.1200 కోట్లకుపైగా అక్రమాలకు పాల్పడినట్లూ ఐటీ శాఖ దృష్టికి వచ్చింది.

## జెమ్స్ సెజ్‌లో కొనసాగుతున్న ఈడీ సోదాలు

ఈనాడు, హైదరాబాద్: పంజాబ్ నేషనల్ బ్యాంకును నిలువునా ముంచేసిన నీరవ్‌మోడీకి చెందిన సంస్థల్లో సరకు విలువ మదింపు క్రతువు కొనసాగుతోంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరుగుతోంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాలలోని జెమ్స్ సెజ్‌లో నీరవ్‌మోడీకి ఆభరణాల తయారీ యూనిట్లు ఉన్న సంగతి తెలిసిందే. బ్యాంకు కుంభకోణం వెలుగులోకి వచ్చిన తర్వాత ఈడీ అధికారులు ఆయా సంస్థల్లో తనిఖీలు నిర్వహించారు. అందులోని వజ్రాలు, ఆభరణాలు, ఇతరత్రా యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువను అంచనా వేసే పని సోమవారం మొదలుపెట్టారు. ముఖ్యంగా అందులోని వజ్రాలు, బంగారం, వెండి, ముత్యాల వంటి వాటి విలువను నిపుణుల పర్యవేక్షణలో క్యారెట్ల ఆధారంగా అంచనా వేస్తున్నారు. బిల్లుల్లో వాటి విలువ ఎంత చూపారు? వాస్తవ విలువ ఎంత? అనే వివరాలు వేరువేరుగా నమోదు చేస్తున్నారు. ఇదంతా పూర్తికావడానికి వారం రోజులు పడుతుందని అధికారులు భావిస్తున్నారు. మదింపు ప్రక్రియ పూర్తయిన తర్వాత స్వాధీన సరకుతోపాటు..దాని విలువకు సంబంధించి రూపొందించిన అంచనాలను ఈడీ అధికారులు న్యాయస్థానంలో సమర్పించనున్నారు.

## అవినీతిపరులను బ్యాంకులు రక్షిస్తున్నాయా?

దిల్లీ: దేశవ్యాప్తంగా అవినీతిపై ఫిర్యాదులు వస్తున్నా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటున్న సందర్భాలు అరుదుగానే ఉంటున్నాయి. అక్రమాలకు పాల్పడిన అధికారులపై నిర్దిష్ట ఆరోపణలతో విచారణకు సిద్ధమైన కేంద్ర నిఘా సంస్థ-సీవీసీకి బ్యాంకుల నుంచి, ప్రభుత్వ విభాగాల నుంచి అనుమతులు లభించటంలేదు. ఫలానా అధికారిని విచారించాల్సి ఉందంటూ సీవీసీ పంపించిన విజ్ఞప్తికి నిబంధనల ప్రకారం నాలుగు నెలల్లోనే అనుమతివ్వాలి. నెలలు గడుస్తున్నా బ్యాంకులు, పలు ప్రభుత్వ విభాగాలు ఆ అనుమతుల ఊసే ఎత్తటంలేదు. సీవీసీ సమాచారం ప్రకారం 23కేసుల్లో ప్రమేయమున్న 39 అధికారులపై విచారణ అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కేసుల్లో రెండు ఎస్‌బీఐ, ఒక్కోటి యూకో, పీఎన్‌బీలకు సంబంధించినవి. ఈ నాలుగు కేసుల్లో 9మంది సీబీఐకి దొరికిపోయిన వారే. వీరిలో 8 మంది (అయిదుగురు ఎస్‌బీఐ, ముగ్గురు యూకో బ్యాంకు సిబ్బంది)ని విచారించటానికి అనుమతుల కోసం 2017 జూన్ నుంచి సీవీసీ నిరీక్షిస్తోంది. ఇక కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ నుంచి నాలుగు కేసుల్లో నిందితులను విచారించటానికి కావాల్సిన అనుమతుల్లో కాలయాపన జరుగుతోంది.

## 'స్విఫ్ట్' దుర్వినియోగంపై ముందే హెచ్చరికలు చేశాం: ఆర్‌బీఐ

ముంబయి: దేశవిదేశాల్లోని బ్యాంకుల మధ్య లావాదేవీల సమాచార మార్పిడికి ఉపయోగించే 'స్విఫ్ట్' వ్యవస్థను.. దుర్వినియోగం చేసుకునే అవకాశమున్నట్లు గతంలోనే బ్యాంకులకు రహస్య హెచ్చరికలు జారీ చేశామని ఆర్‌బీఐ తెలిపింది. దీనికి సంబంధించిన ముప్పులపై 2016 ఆగస్టు తర్వాత కనీసం మూడుసార్లు హెచ్చరించామంది. పీఎన్‌బీ కుంభకోణంలో.. నిందితులు స్విఫ్ట్ వ్యవస్థను దుర్వినియోగం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరోసారి బ్యాంకులను ఆర్‌బీఐ అప్రమత్తం చేసింది. స్విఫ్ట్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు తాము చేసిన సూచనలను నిర్ణీత గడువుల్లోగా అమలు చేయాలని ఆదేశించింది.

# రోటామాక్ రాత మారింది అక్కడే!

- 1973లో కాన్పూర్‌కు వలస వచ్చిన విక్రమ్ కొఠారీ కుటుంబం
- ప్రారంభ వ్యాపారం కొబ్బరి నూనె సరఫరా
- పాన్ మసాలాతో తిరిగిన దశ
- రాత సామగ్రి తయారీ తదితర రంగాల్లోకి ప్రవేశం
- భారీ రుణ ఎగవేతలతో కలకలం
- రోటామాక్ అధినేత విక్రం కొఠారీ ప్రస్థానమిదీ...

కాన్పూర్



రోటామాక్ కంపెనీ అధినేత విక్రమ్ కొఠారీ.. బ్యాంకు రుణాల ఎగవేత వ్యవహారం ఇప్పుడు దేశ వ్యాప్తంగా ఓ సంచలనం. వ్యాపార ప్రపంచంలో తనకంటూ ఓ స్థానాన్ని సృష్టించుకున్న విక్రమ్ కొఠారీ కుటుంబ నేపథ్యం అతి సాధారణమైందే. గుజరాత్‌కు చెందిన విక్రమ్ తండ్రి మన్సుఖ్‌భాయ్ ఉదరపోషణ నిమిత్తం 1973లో కాన్పూర్ చేరుకున్నారు. తొలుత దుకాణాలకు కొబ్బరి నూనె సరఫరాదారుగా జీవితాన్ని ప్రారంభించిన ఆయన ఆ తర్వాత పాన్ మసాలా వ్యాపారిగా మారారు. పొట్లాల్లో పాన్ మసాలా విక్రయించటం ప్రారంభించింది అతనేనని కాన్పూర్ నగరవాసులు చెబుతారు. బాలీవుడ్ తారలు శమ్మీ కపూర్, అశోక్ కుమార్‌లతో రూపొందించిన పాన్ పరాగ్ వాణిజ్య ప్రకటన అప్పట్లో ఓ పెను సంచలనం. "భారతీయులను పాన్ పరాగ్‌తో స్వాగతించండి" అంటూ టీవీల్లో వచ్చిన ఆ ప్రకటన కాన్పూర్‌ను 'పాన్ మసాలా నగరం'గా నిలిపింది అంటారు స్థానికులు. పాన్ మసాలా వ్యాపార ప్రారంభ దినాల్లో మన్సుఖ్‌భాయ్ కుమారులు.... విక్రమ్, దీపక్ వ్యాపారంలో తండ్రికి చేదోడుగా నిలిచారు. నలుదిశలా వ్యాపారం విస్తరించటంతో 1992లో ఇతర రంగాలపైనా దృష్టి సారించారు. కలాలు తయారు చేసే రోటామాక్ కంపెనీతో పాటు 'యెస్' పేరుతో మినరల్ వాటర్ అమ్మకాలనూ ప్రారంభించారు. 1999లో సోదరులిద్దరూ విడిపోయారు. పెద్దవాడైన విక్రమ్ కొఠారీ రాత సామగ్రి(స్టేషనరీ), కలాల తయారీ పరిశ్రమను, చిన్నవాడైన దీపక్ కొఠారీ పాన్ మసాలా వ్యాపారాన్నీ తీసుకున్నారు. అనతికాలంలోనే రోటామాక్ దేశవ్యాప్తంగా విస్తరించింది. బాలీవుడ్ తారలు సల్మాన్ ఖాన్, రవీనా టాండన్‌లు ఈ బ్రాండ్‌కు ప్రచార కర్తలుగా వ్యవహరించారు. వ్యాపార విజయంతో పాటు సమాజంలో ప్రముఖుడిగా గుర్తింపు విక్రమ్ కోఠారీకి లభించింది. లయన్స్ క్లబ్ విక్రమ్‌ని తమ 'సుహృద్భావ ప్రచార కర్త' (గుడ్‌విల్ అంబాసిడర్)గా నియమించింది. రోటామాక్ ప్రైవేట్ లిమిటెడ్ ..రోటామాక్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మారింది. స్థిరాస్తి, ఉక్కు, మౌలికసదుపాయాల రంగాల్లోకి విక్రమ్ కోఠారి ప్రవేశించారు. 1999 నుంచి అప్రతిహతంగా సాగిన విక్రమ్ వ్యాపార ప్రస్థానంపై తాజా రుణ ఎగవేతల వ్యవహారంతో ఒక్కసారిగా నీలిమబ్బులు కమ్ముకున్నాయి. విక్రమ్ కొఠారీ రూ.వందల కోట్ల రుణాలను బ్యాంకులకు ఎగవేశారనే విషయం స్థానికులకు నమ్మశక్యం గాని విషయంగా ఉంది. కాన్పూర్‌లో ధనవంతుల నివాస ప్రాంతమైన తిలక్‌నగర్‌లోని 4వేల చదరపు గజాల సువిశాల స్థలంలో నిర్మించిన భవనం 'సంతుష్టి'లో విక్రమ్ కొఠారి కుటుంబం నివసిస్తోంది. విలాసవంతమైన వాహనాలు, తీర్చిదిద్దిన పూలతోటలున్న ఆ భవనం.. సీబీఐ, ఆదాయపుపన్ను శాఖ అధికారుల రాకపోకలు, మీడియా సిబ్బంది పరుగులతో ఇప్పుడు ప్రచార మాధ్యమాల్లో కేంద్ర బిందువైంది. విక్రమ్ కొఠారీకి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. కుమార్తెలిద్దరినీ వ్యాపార కుటుంబాలకే చెందిన వారికి ఇచ్చి వివాహం చేశారని స్థానికులు తెలిపారు.

## రోటామాక్ ఖాతాల జప్తు

దిల్లీ: బ్యాంకుల్ని రూ.3695 కోట్ల మేర మోసగించిన కేసులో రోటామాక్ కంపెనీపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)లు ఇంతవరకు దర్యాప్తు చేయగా- తాజాగా ఆదాయపు పన్నుశాఖ కొరడా ఝుళిపించింది. సంస్థకు, యజమానులకు ఉన్న 11 బ్యాంకు ఖాతాలను సోమవారం రాత్రి తాత్కాలికంగా జప్తు జేసింది. ఉత్తర్‌ప్రదేశ్‌లో వివిధ బ్యాంకుల శాఖల్లో ఈ ఖాతాలున్నాయి. మరో మూడు ఖాతాలపై గత నెలలోనే ఇలాంటి నిషేధ ఉత్తర్వులు విధించింది. రూ.85 కోట్ల మేర ఎగవేసిన పన్నును రాబట్టుకునేందుకు గానూ ఈ చర్య చేపట్టినట్లు అధికారులు తెలిపారు. రుణాల ఎగవేతకు సంబంధించి రోటామాక్ గ్లోబల్ ప్రై.లి. కంపెనీపైనా, డైరెక్టర్ విక్రమ్ కొఠారి, అతని కుటుంబీకులపైనా క్రిమినల్ కేసును సీబీఐ నమోదు చేసిన విషయం తెలిసిందే.

## పర్యాటక వీసాకు ప్రాయోజితం అవసరం లేదు..!




ఈనాడు, హైదరాబాద్: అమెరికా వీసాలకు సంబంధించి వివిధ అంశాలపై 'అమెరికాయానం' పేరిట పాఠకుల నుంచి 'ఈనాడు' ఆహ్వానించిన ప్రశ్నలకు హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ అధికారులు సమాధానాలిచ్చారు. అవి ఇలా ఉన్నాయి...

**మునుపటి కంపెనీ ద్వారా తీసుకున్న హెచ్1బి వీసా ఈ సంవత్సరం చివరి వరకు చెల్లుబాటవుతుంది. ఇటీవల మరో కంపెనీకి మారాను. నా వీసా బదలాయింపునకు ఆ కంపెనీ దాఖలు చేసిన పిటిషన్ ప్రస్తుతం అపరిష్కృతంగా ఉంది. ఈలోగానే మరో కంపెనీ నుంచి అవకాశం వచ్చింది. ఆ పిటిషన్ పెండింగులో ఉండగా నా వీసాను నూతన కంపెనీకి బదలాయించుకునేందుకు అవకాశం ఉందా? -రామకృష్ణ నేమాని**

హెచ్1-బి పిటిషన్, హెచ్1-బి వీసాలనేవి రెండు వేర్వేరు అంశాలు. హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ హెచ్1-బి వీసాల ప్రక్రియను మాత్రమే నిర్వహిస్తుంది. హెచ్1-బి పిటిషన్‌కు సంబంధించిన ప్రశ్నలకు uscis.gov ద్వారా లేదా దిల్లీ లోని యూఎస్‌సీఐఎస్ కార్యాలయం ద్వారా కానీ తెలుసుకోవచ్చు. మరింత సమాచారాన్ని ఈ లింకు ద్వారా తెలుసుకోవచ్చు. https://www.uscis.gov/about-us/find-uscis-office/internatinal-offices/india-uscis-new-delhi-field-office.

**నా వీసా 2018 డిసెంబరు వరకు చెల్లుబాటులో ఉంటుంది. ఈ ఏడాది అక్టోబరులో అమెరికా వెళ్దామనుకుంటున్నాను. సమస్యలు లేకుండా ప్రయాణం చేయవచ్చా? - కేవీ ప్రసాద్**

వీసా చెల్లుబాటులో ఉన్నంత కాలంలో ఎన్ని దఫాలైనా ప్రయాణం చేయవచ్చు. వీసాపై నమోదు చేసిన తేదీ వరకు మీరు అమెరికా ప్రవేశ ప్రాంతం వరకు వెళ్లేందుకు మాత్రమే అనుమతిస్తుంది. మిమ్ములను అమెరికాలోకి అనుమతించాలా? లేదా? ఎంత కాలం అనుమతించాలన్నది ప్రవేశ ప్రాంతంలోని ఇమిగ్రేషన్ అధికారులదే తుది నిర్ణయం.

**పర్యాటక వీసా కోసం దరఖాస్తు చేద్దామనుకుంటున్నాను. అక్కడి వారి నుంచి ప్రాయోజిత లేఖ అవసరమా? పర్యాటక వీసా దరఖాస్తుకు ఏయే ధ్రువపత్రాలు అవసరం? విధానం ఏమిటి? - నసీముద్దీన్ ఎమ్డీ**

బి1-బి2 పర్యాటక వీసా కోసం ప్రాయోజిత(స్పాన్సర్) ఆధారిత ధ్రువపత్రాలేవీ అవసరం లేదు. ఇంటర్వ్యూ సమయంలో దరఖాస్తుదారుడు సంబంధిత వీసా విభాగానికి అర్హుడా? కాదా? అన్నది స్థూలంగా పరిశీలిస్తారు. మీ పర్యటన అంశంపై కాన్సులర్ అధికారి కొన్ని రకాల సమాచారాన్ని పరిశీలించవచ్చు. వీసా కోసం ఎలా దరఖాస్తు చేయాలి? ఇంటర్వ్యూ షెడ్యూల్‌ను ఎంచుకోవటం? తదితర సమాచారం కోసం www.ustraveldocs.com/in ను పరిశీలించండి.

**రెండు సార్లు నా ఎఫ్-1 వీసాను తిరస్కరించారు. 214(బి) పత్రాన్ని ఇచ్చారు. దాని అర్థమేమిటి? వచ్చే విద్యా సంవత్సరానికి మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చా? - పి.కృష్ణకిషోర్‌రాజు**

మీకు చెల్లుబాటయ్యే ఐ-20, ఎస్ఈవిఐఎస్ ఫీజు చెల్లిస్తే మీరు ఎఫ్-1 వీసాకు ఎన్ని దఫాలైనా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసిన వీసా విభాగానికి దరఖాస్తుదారుడు అర్హుడా? కాదా? అన్నది ఇంటర్వ్యూ సమయంలో కాన్సులర్ అధికారి స్థూలంగా చూస్తారు. ఎఫ్-1 వీసా విషయంలో సంబంధిత కోర్సును పూర్తి చేసేందుకు ప్రణాళిక, చదువు పూర్తయ్యేందుకు అవసరమైన ఫీజుల చెల్లింపుల ఆర్థిక ప్రణాళిక, కోర్సు పూర్తి చేసిన తరవాత మాతృదేశానికి తిరివెళ్లిపోతామనే విశ్వసనీయ ప్రణాళికను కాన్సులర్ అధికారికి వివరించాల్సి ఉంటుంది.

- వీసాలకు సంబంధించిన నిర్దుష్టమైన అంశాలు, తిరస్కారాలపై సందేహాలను support-india@ustraveldocs.comకు ఈ-మెయిల్ చేయండి.
- సమాచారం కోసం హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ వెబ్‌సైట్ http://hyderabad.usconsulate.gov ను సంప్రదించవచ్చు.
- హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ కార్యాలయం అందించే వీసా తదితర సేవలకు సంబంధించిన ప్రశ్నలను usvisa@eenadu.net కు పంపగలరు.

# చాంపియన్

# ఆ ఇద్దరూ ఒక్కటై..

పెళ్లి తర్వాత విరాట్ కోహ్లి, అనుష్క శర్మ జంటగా కనిపించింది తక్కువ. పెళ్లయిన వెంటనే కోహ్లి దక్షిణాఫ్రికా పర్యటనకు బయల్దేరితే.. అతడి వెంట వెళ్లిన అనుష్క కొన్ని రోజులకే తిరిగొచ్చేసింది. తర్వాత వీళ్లిద్దరి కొత్త ఫొటోలేవీ బయటికి రాలేదు. ఐతే మంగళవారం విరాట్.. ఒక అమ్మాయి అబ్బాయి గాఢంగా కౌగిలించుకుని ఉన్న ఫొటో ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టి.. 'మై వన్ అండ్ ఓన్లీ..' అంటూ వ్యాఖ్య జోడించాడు. కోహ్లి చెప్పకపోయినా అక్కడ ప్రేమ మైకంలో మునిగిపోయి ఉన్నది విరుష్క జోడీనే అనే విషయంలో ఎవరికీ సందేహాలు కలగలేదు. అందుకే అభిమానులు విపరీతంగా స్పందించారు. 9 గంటల్లో 25 లక్షలు లైకులు వచ్చాయి.



## సర్దార్‌కు అజ్లాన్‌షా పగ్గాలు



**దిల్లీ:** రేపో మాపో అన్నట్లు ఉన్న సర్దార్ సింగ్ కెరీర్ మలుపు తిరిగింది. గత డిసెంబర్‌లో జరిగిన హాకీ ప్రపంచ లీగ్ ఫైనల్స్ టోర్నీకి, ఇటీవల ముగిసిన న్యూజిలాండ్ పర్యటనకు జట్టులో చోటే దక్కించుకోని ఈ వెటరన్ క్రీడాకారుడిని... అజ్లాన్‌షా హాకీ టోర్నీకి ఏకంగా భారత కెప్టెన్‌గా ఎంపిక చేసింది హాకీ ఇండియా. ప్రస్తుత సారథి మన్‌ప్రీత్ సింగ్‌కు విశ్రాంతినిచ్చింది. మార్చి 3 నుంచి 11 వరకు మలేసియాలో అజ్లాన్‌షా టోర్నీ జరుగుతుంది. ఆతిథ్య మలేసియా, భారత్‌తో పాటు ఆస్ట్రేలియా.. అర్జెంటీనా, ఇంగ్లాండ్ ఈ టోర్నీలో పోటీపడనున్నాయి.

## నా లక్ష్యం నంబర్‌వన్

**ముంబయి:** ఈ ఏడాది చివరికల్లా నంబర్‌వన్ ర్యాంకు సాధించడమే తన లక్ష్యమని భారత స్టార్ షట్లర్ పి.వి. సింధు తెలిపింది. "ఇది కీలకమైన ఏడాది. తర్వాతి టోర్నీ ఆల్ ఇంగ్లాండ్. అనంతరం కామన్వెల్త్ క్రీడలు, ఆసియా క్రీడలు ఉన్నాయి. ఒక్కో టోర్నీపైనే నా దృష్టంతా. ఏడాది చివరి కల్లా నన్ను నేను నంబర్‌వన్‌గా చూసుకోవాలన్నదే లక్ష్యం. బీడబ్ల్యూఎఫ్ 15 టోర్నీల నిబంధన నేపథ్యంలో ఆచితూచి ఈవెంట్లను ఎంచుకోవాలి. మానసికంగా, శారీరకంగా ఫిట్‌గా ఉండటం కీలకం" అని సింధు చెప్పింది. గత ఏడాది కాలంలో కొన్ని పెద్ద టోర్నీల్లో ఫైనల్ చేరడం సంతోషాన్నిచ్చినా.. తుది పోరులో ఓడిపోవడం నిరాశ కలిగించిందని, ఇకపై ఇది పునరావృతం కాకుండా చూసుకుంటానని సింధు అంది. రెండేళ్ల కిందట రియో ఒలింపిక్స్‌లో రజతం సాధించిన సింధు.. 2020లో టోక్యో వేదికగా జరిగే తర్వాతి ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధిస్తానని ధీమా వ్యక్తం చేసింది. "నా పతకం రంగు మార్చాలని అనుకుంటున్నా. రజతాన్ని స్వర్ణంగా మార్చడం నా కల. ఆ కలను ఛేదించేందుకు ప్రయత్నిస్తా. కచ్చితంగా అనుకున్నది సాధిస్తానని ఆశిస్తున్నా" అని సింధు చెప్పింది.



మంగళవారం ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో సింధు, లలితా బాబర్, శ్రీకాంత్, సాక్షి మాలిక్

# 11 వద్దు.. 21 ముద్దు!

**ముంబయి:** ప్రపంచ బ్యాడ్మింటన్‌లోకి కొత్తగా తేవాలని భావిస్తున్న 11 పాయింట్ల విధానంపై క్రీడాకారుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఈ మార్పు పట్ల సానుకూలంగా ఉండగా.. కొందరు ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నారు. ప్రస్తుతం ఒక్కో గేమ్ 21 పాయింట్ల చొప్పున గరిష్ఠంగా మూడు గేమ్‌లు నిర్వహిస్తున్నారు. ఐతే దీన్ని మార్చి 11 పాయింట్ల చొప్పున గరిష్ఠంగా 5 గేమ్‌లు ఆడించాలని ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య భావిస్తోంది. ఈ ప్రతిపాదన మే 19న బ్యాంకాక్‌లో జరిగే బీడబ్ల్యూఎఫ్ వార్షిక సమావేశంలో చర్చకు రానుంది. అక్కడ ఆమోదం పొందితే వెంటనే అమల్లోకి వస్తుంది. ఐతే దీని కంటే 21 పాయింట్ల పద్ధతే బాగుందని అభిప్రాయపడుతున్నారు భారత స్టార్ షట్లర్లు కిదాంబి శ్రీకాంత్, పి.వి.సింధు. "రెండు కొత్త మార్పుల గురించి కొంత కాలంగా వింటున్నా. వాటి గురించి అధికారిక సమాచారం లేదు. రియో ఒలింపిక్స్ కంటే ముందే ఈ మార్పుల గురించి అభిప్రాయం అడిగారు. నేను 11 పాయింట్ల విధానంలో ఆడలేదు. 21 పాయింట్ల పద్ధతే నాకు బాగా కలిసొచ్చింది. పాయింట్ల విధానం ఇప్పుడున్నట్లే కొనసాగాలని కోరుకుంటున్నా. ఇక సర్వీస్ చేసేటపుడు ఉపరితలం నుంచి 1.15 మీటర్లకు మించి ఎత్తులో షటిల్ ఉండొద్దన్న నిబంధనతో పొడవైన క్రీడాకారులకు ఇబ్బందే" అని శ్రీకాంత్ అన్నాడు. పాయింట్ల పద్ధతిలో మార్పుపై సింధు స్పందిస్తూ.. "11 పాయింట్ల విధానం భిన్నంగా ఉంటుంది. ఎప్పుడు ఏమైనా జరగొచ్చు. ప్రస్తుత పద్ధతిలో ప్రత్యర్థి 5-6 పాయింట్ల ఆధిక్యం సాధించినా.. ఇంకా పుంజుకోవడానికి 15 పాయింట్లుంటాయి. కానీ కొత్త పద్ధతిలో అంత ఆధిక్యం సాధిస్తే గేమ్ అయిపోయినట్లే. తొలి పాయింట్ నుంచి పూర్తి ఏకాగ్రతతో ఉండాలి. నేనైతే 11 పాయింట్ల కంటే 21 పాయింట్ల పద్ధతికే ఓటేస్తా. ఈ విషయంలో క్రీడాకారుల అభిప్రాయం కూడా తీసుకున్నారు. నేను ప్రస్తుత పద్ధతే బాగుందని చెప్పా" అని చెప్పింది.

## కామన్వెల్త్ బరిలో సింధు, శ్రీకాంత్

**దిల్లీ:** కామన్వెల్త్ క్రీడల్లో బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లో టాప్ సీడ్ భారత్ బలమైన జట్టును బరిలో దించనుంది. మేటి షట్లర్లు పి.వి. సింధు, సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్, హెచ్.ఎస్ ప్రణయ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో పసిడి కోసం పోరాడనున్నారు. భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) మంగళవారం జట్టును ప్రకటించింది. ఏప్రిల్ 5న ఆస్ట్రేలియాలో ఆరంభం కానున్న మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత్ గ్రూప్-ఎలో తలపడనుంది.

**భారత జట్టు: పురుషులు:** శ్రీకాంత్, ప్రణయ్, చిరాగ్ శెట్టి, సాత్విక్ సాయిరాజ్, ప్రణవ్ జెర్రీ చోప్రా; **మహిళలు:** పి.వి. సింధు, సైనా, అశ్విని, సిక్కిరెడ్డి, రుత్విక శివాని



## సైనాకు కఠిన డ్రా

- తొలి మ్యాచ్‌లో నం.1తో ఢీ
- ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్

**బర్మింగ్‌హమ్:** ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లకు కఠిన డ్రా ఎదురైంది. అందని ద్రాక్షలా ఊరిస్తున్న ఈ టైటిల్ కోసం స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ ఈసారి అసాధారణంగా పోరాడాల్సిందే. తొలి రౌండ్‌ను అధిగమించాలంటే ఆమె ప్రపంచ నం.1ను ఓడించాలి. సైనా తొలి పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ తై జు యింగ్ (చైనీస్ తైపీ)ను ఢీకొననుంది. ప్రపంచ నం.11 సైనా.. తైజుతో గత ఏడు మ్యాచ్‌ల్లో ఒక్క విజయమైనా సాధించలేదు. 2015లో సైనా ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ చేరింది. అదే ఆమె అత్యుత్తమ ప్రదర్శన. మరోవైపు తెలుగమ్మాయి పి.వి. సింధు తొలి రౌండ్లో సులభమైన ప్రత్యర్థితో తలపడనుంది. పోర్న్‌పవి చోచువాంగ్ (థాయ్‌లాండ్)తో ఆడనున్న నాలుగో సీడ్ సింధు.. రెండో రౌండ్లో ఇండియా ఓపెన్ విజేత బివెన్ జాంగ్ (చైనా)ను ఎదుర్కోవాల్సి రావొచ్చు. పురుషుల విభాగంలో మూడో సీడ్ కిదాంబి శ్రీకాంత్.. బ్రైస్ లెవెరెడ్జ్ (ఫ్రాన్స్)తో మ్యాచ్‌తో పోరాటాన్ని ఆరంభించనున్నాడు. ఐతే సాయి ప్రణీత్, హెచ్ ఎస్ ప్రణయ్ టోర్నీలో ముందంజ వేయాలంటే తమకంటే మెరుగైన ర్యాంకు క్రీడాకారులను ఓడించాల్సివుంటుంది. మార్చి 14న ఈ టోర్నీ ఆరంభంకానుంది.

# ఈ ఒక్కటి గెలిచేస్తే..

టెస్టు సిరీస్ వాళ్లు గెలిచారు. వన్డే సిరీస్ మనోళ్ల సొంతమైంది. లెక్క సమమైంది. ఇక రెండు జట్లలో ఎవరిది పైచేయో తేల్చేది టీ20 సిరీస్. తొలి టీ20లో ఘనవిజయంతో ఇప్పటికే ఆధిక్యంలో ఉంది భారత్. ఇంకో విజయం సాధిస్తే దక్షిణాఫ్రికా పర్యటన సంతృప్తిగా ముగించబోతున్నట్లే. మరి ఆ విజయం బుధవారం రెండో టీ20లోనే దక్కుతుందా? చివరి మ్యాచ్ వరకు ఎదురు చూడాల్సి వస్తుందా?

- మరో సిరీస్ విజయంపై భారత్ కన్ను
- దక్షిణాఫ్రికాతో రెండో టీ20 నేడు

రాత్రి 9.30 నుంచి సోనీ టెన్-1, 3లో




సెంచూరియన్


**తొ**లి టీ20లో భారత్ చెలరేగిన తీరు చూస్తే.. రెండో టీ20కి ఆతిథ్యమిస్తున్న సెంచూరియన్‌లోనే సిరీస్ విజయం పూర్తయిపోవాలి. ఆ మ్యాచ్‌లో భారత్‌కు ఏరకంగానూ పెద్దగా పోటీనే ఇవ్వలేదు దక్షిణాఫ్రికా. ఆ మ్యాచ్‌లో ఏ దశలోనూ ఆతిథ్య జట్టు గెలిచేలా కనిపించలేదు. బ్యాటింగ్, బౌలింగ్‌లో రెండు జట్ల మధ్య అంతరం స్పష్టంగా కనిపించింది. వన్డే సిరీస్‌లో పరాభవంతో డీలా పడ్డ సఫారీ జట్టు.. టీ20లకు వచ్చేసరికి సాదాసీదాగా మారింది. డివిలియర్స్ తొలి టీ20 ఆరంభానికి ముందు సిరీస్‌కు దూరం కావడం ఆ జట్టును మానసికంగా దెబ్బ తీసింది. డుప్లెసిస్, డికాక్ కూడా అందుబాటులో లేకపోవడం, చాలా వరకు కొత్త వాళ్లే జట్టులో ఉండటం దక్షిణాఫ్రికాకు ప్రతికూలంగా మారింది. అనుభవజ్ఞులు డుమిని, మిల్లర్ జొహానెస్‌బర్గ్‌లో నిరాశ పరిచారు. ఓపెనర్ హెండ్రిక్స్, మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ బెహార్డీన్ మాత్రమే మంచి ఇన్నింగ్స్ ఆడారు. వన్డే సిరీస్‌లో సత్తా చాటుకున్న కొత్త వికెట్ కీపర్ క్లాసన్‌పై ఆ జట్టు ఎక్కువ ఆశలు పెట్టుకుంది. మరి రెండో టీ20లో సఫారీ జట్టు బ్యాటింగ్ ఎలా సాగుతుందో చూడాలి. ఆ జట్టు బౌలింగ్ చాలా సాధారణంగా ఉంది. ఎవరికీ పెద్దగా అనుభవం లేదు. భారత జట్టులో మాత్రం అన్ని విభాగాల్లో స్టార్ ఆటగాళ్లున్నారు. బ్యాటింగ్‌లో కోహ్లి, ధావన్ మంచి ఫామ్‌లో ఉండటం కలిసొచ్చే అంశం. ఐతే మిడిలార్డర్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోతుండటమే భారత్‌కు ఉన్న ఇబ్బంది. మనీష్ పాండే, ధోని వేగంగా ఆడటంలో ఇబ్బంది పడుతున్నారు. ఏడాది తర్వాత తర్వాత జట్టులోకి వచ్చిన రైనా.. తొలి టీ20లో ఇన్నింగ్స్‌ను ధాటిగానే ఆరంభించినప్పటికీ.. ఎక్కువ సేపు క్రీజులో నిలవలేదు. ఓపెనర్ రోహిత్ శర్మ సైతం ఆరంభంలో మెరుపులు మెరిపించి.. వెంటనే ఔటైపోయాడు. వీళ్లిద్దరూ సెంచూరియన్‌లో ఎలా ఆడతారో చూడాలి. గత మ్యాచ్‌లో ఐదు వికెట్ల ప్రదర్శనతో అబ్బుర పరిచిన భువనేశ్వర్ మీద ఇప్పుడందరి కళ్లూ నిలిచి ఉన్నాయి. భువితో పాటు బుమ్రా, చాహల్, కుల్‌దీప్ రాణిస్తుండటంతో బౌలింగ్ బలంగా కనిపిస్తోంది. సెంచూరియన్ పిచ్ బ్యాట్స్‌మెన్, బౌలర్లకు సమానంగా అనుకూలిస్తుందని అంచనా. కొన్ని రోజుల కిందటే ఈ వేదికలో జరిగిన చివరి వన్డేలో భారత్ 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది.

# టెస్టుల్లో, వన్డేల్లో కోహ్లి 900+

- ర్యాంకింగ్స్‌లో అరుదైన రికార్డు సొంతం
- వన్డే బౌలర్లలో రషీద్, బుమ్రా నం.1



బుమ్రా



రషీద్

**దుబాయ్:** పరుగుల వరద పారిస్తున్న టీమ్ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి అరుదైన రికార్డును ఖాతాలో వేసుకున్నాడు. ఐసీసీ టెస్టు, వన్డే ర్యాంకింగ్స్‌లో ఒకే కాలంలో 900 అంతకంటే ఎక్కువ పాయింట్లతో ఉన్న బ్యాట్స్‌మన్‌గా రికార్డులకెక్కాడు. ఇప్పటికే టెస్టుల్లో ఈ మార్క్‌ను అధిగమించిన కోహ్లి.. తాజాగా వన్డేల్లోనూ ఆ మైలురాయిని చేరుకున్నాడు. క్రికెట్ చరిత్రలో ఈ ఘనత సాధించిన రెండో బ్యాట్స్‌మన్ అతడు. అతడి కంటే ముందు దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్ ఏబీ డివిలియర్స్ మాత్రమే ఈ రికార్డు అందుకున్నాడు. టెస్టు, వన్డే ర్యాంకింగ్స్‌లో 900 అంతకంటే కంటే ఎక్కువ పాయింట్లు నమోదు చేసిన తొలి భారత ఆటగాడు కోహ్లినే. మొత్తంమీద అతడు ఐదోవాడు. వన్డే క్రికెట్ ఆల్‌టైమ్ ర్యాంకింగ్ పాయింట్ల జాబితాలో కోహ్లి (909).. బ్రయాన్ లారా (908)ను వెనక్కి నెట్టి ఏడో స్థానానికి ఎగబాకాడు. ఈ విభాగంలో వెస్టిండీస్ దిగ్గజం వివియన్ రిచర్డ్స్ (935)దే నంబర్‌వన్ స్థానం. వన్డే కెరీర్‌లో సచిన్ అత్యధికంగా 887 పాయింట్లు సాధించాడు. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో 558 పరుగులు సాధించిన కోహ్లి.. వన్డేల్లో అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. డివిలియర్స్ (844) రెండో స్థానంలో ఉన్నాడు. శిఖర్ ధావన్ పదో స్థానం సాధించగా.. రోహిత్ ఆరో స్థానంలో నిలిచాడు. టెస్టు ర్యాంకింగ్స్‌లో స్టీవ్ స్మిత్ (947)దే అగ్రపీఠం. కోహ్లి (912) రెండో స్థానంలో ఉన్నాడు. వన్డేల్లో సంచలన ప్రదర్శన సాగిస్తున్న అఫ్గానిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ (787) బౌలర్ల ర్యాంకింగ్స్‌లో నం.1 స్థానాన్ని కొల్లగొట్టాడు. భారత పేసర్ బుమ్రా (787)తో కలిసి అతడు అగ్రస్థానాన్ని పంచుకున్నాడు. బౌలర్లలో నం.1 ర్యాంక్ సొంతం చేసుకున్న పిన్న వయస్కుడు రషీదే. అతడి వయసు 19 ఏళ్లు. వన్డే టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత్ 123 పాయింట్లతో అగ్రస్థానాన్ని పటిష్ఠం చేసుకుంది. అఫ్గాన్.. జింబాబ్వేను అధిగమించి వన్డేల్లో పదో స్థానం దక్కించుకుంది.

# మరో అవకాశం..!

- సిరీస్ విజయం ముంగిట అమ్మాయిలు
- దక్షిణాఫ్రికాతో నాలుగో టీ20 నేడు

సాయంత్రం 4.30 నుంచి సోనీ టెన్-1, 3లో



హర్మన్‌ప్రీత్

**సెంచూరియన్:** దక్షిణాఫ్రికా పర్యటనలో ఒకేసారి రెండు సిరీస్‌లు నెగ్గిన తొలి జట్టుగా రికార్డు సాధించేందుకు భారత అమ్మాయిలకు మరో అవకాశం. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా నాలుగో మ్యాచ్ బుధవారమే. ఈ మ్యాచ్ గెలిచి 3-1తో సిరీస్‌ను సొంతం చేసుకోవాలని హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం పట్టుదలగా ఉండగా.. సిరీస్‌ను సజీవంగా ఉంచుకోవాలని సఫారీ జట్టు భావిస్తోంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో నెగ్గిన టీమ్ఇండియా మూడో మ్యాచ్‌లో ఓడిన సంగతి తెలిసిందే. ఆ మ్యాచ్‌లో డకౌట్ అయిన మిథాలీ సత్తా చాటాలని కోరుకుంటోంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధానా ఫామ్‌లో ఉన్నారు. ఐతే మిడిలార్డర్ విఫలమవడం భారత్‌ను దెబ్బ తీస్తోంది. మూడో మ్యాచ్ నేర్పిన పాఠంతో బ్యాటర్లు చెలరేగుతారేమో చూడాలి. బ్యాటర్లు విఫలమైనా బౌలర్లు ఫర్వాలేదనిపించారు. వాళ్లు అదే జోరు కొనసాగించాల్సిన అవసరముంది. మరోవైపు గత మ్యాచ్‌లో విజయంతో దక్షిణాఫ్రికా విజృంభించి ఆడే అవకాశముంది. మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను భారత్ 2-1తో గెలుచుకున్న సంగతి తెలిసిందే. టీ20 సిరీస్ కూడా గెలిస్తే.. దక్షిణాఫ్రికా పర్యటనలో ఒకేసారి రెండు సిరీస్‌లు నెగ్గిన జట్టుగా భారత్ రికార్డు సాధిస్తుంది.

# తొలి పోరులో లంకతో భారత్ ఢీ

## ముక్కోణపు టోర్నీ షెడ్యూల్ విడుదల

**కొలంబో:** సుదీర్ఘ దక్షిణాఫ్రికా పర్యటనను ముగించుకోనున్న భారత్ కోసం మరో టోర్నీ ఎదురు చూస్తోంది. మార్చి 6న కొలంబో వేదికగా ఆరంభమయ్యే ముక్కోణపు టీ20 టోర్నీలో టీమ్ఇండియా ఆడనుంది. నిదహాస్ ట్రోఫీ కోసం భారత్‌తో పాటు శ్రీలంక, బంగ్లాదేశ్ పోటీపడనున్నాయి. తొలి మ్యాచ్‌లో కోహ్లి సేన.. ఆతిథ్య లంకను ఢీకొననుంది. లీగ్ దశలో ఒక్కో జట్టు ప్రత్యర్థులతో రెండేసి మ్యాచ్‌లు ఆడుతుంది. తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు.. మార్చి 18న ఫైనల్లో తలపడతాయి.

**షెడ్యూల్**

| | |
|---|---|
| మార్చి 6 | భారత్ × శ్రీలంక |
| 8 | బంగ్లాదేశ్ × భారత్ |
| 10 | శ్రీలంక × బంగ్లాదేశ్ |
| 12 | శ్రీలంక × భారత్ |
| 14 | భారత్ × బంగ్లాదేశ్ |
| 16 | శ్రీలంక × బంగ్లాదేశ్ |
| 18 | ఫైనల్ **(అన్ని మ్యాచ్‌లు కొలంబోలో)** |



# ప్రకటనతో సరి.. నజరానాలేవీ?

వెయిట్‌లిఫ్టర్ రాహుల్‌కు అందని ప్రభుత్వ సాయం



రాహుల్

**బాపట్ల, న్యూస్‌టుడే:** తన ప్రతిభను, ఆర్థిక పరిస్థితిని గుర్తించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన నజరానాలు అందేలా చూడాలని కోరుతున్నాడు యువ వెయిట్‌లిఫ్టర్ రాగాల వెంకట రాహుల్. పలు అంతర్జాతీయ టోర్నీల్లో సత్తా చాటినప్పటికీ రాహుల్‌కు సరైన ప్రోత్సాహం అందలేదు. వెయిట్‌లిఫ్టింగ్ కోసం ఇంటిని కూడా అమ్ముకున్న రాహుల్ కుటుంబం దీన స్థితిపై గత సెప్టెంబరులో 'ఈనాడు'లో వచ్చిన కథనం వచ్చింది. దీనిపై ముఖ్యమంత్రి స్పందించి రాహుల్‌ను అమరావతికి పిలిపించి రూ.25 లక్షల నజరానా ప్రకటించడంతో పాటు అతడిని సత్కరించారు. 4 ఎకరాల భూమిని కూడా అందజేయనున్నట్లు కూడా చంద్రబాబు ప్రకటించారు. ఐతే అధికారులు మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు. రాహుల్‌కు ఆర్థిక సాయం కానీ, భూమి కానీ అందలేదు. ప్రస్తుతం రాహుల్ ఏప్రిల్‌లో జరగబోయే ప్రతిష్ఠాత్మక కామన్వెల్త్ పోటీలకు సన్నద్ధమవుతున్నాడు. అయితే సాధన చేసేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. "ముఖ్యమంత్రి నన్ను అమరావతి పిలిపించి సత్కరించడం, నజరానా ప్రకటించడం ఎంతో సంతోషాన్నిచ్చింది. ఆ ఉత్సాహంతోనే ప్రపంచ వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు సిద్ధమయ్యా. అమెరికాలో నిర్వహించిన పోటీల్లో చివరి దశ వరకు వెళ్లగలిగా. కామన్వెల్త్ క్రీడల్లో పోటీ పడే అవకాశం వచ్చింది. ఆస్ట్రేలియా వాతావరణానికి అలవాటు పడటానికి నెల రోజులు ముందే అక్కడికి వెళ్తున్నా. ఈ క్రీడల్లో పతకం గెలుస్తానన్న నమ్మకముంది. అయితే మా కుటుంబం ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. సాధనకు కూడా కష్టమవుతోంది. ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నాం. నజరానా అందితే కామన్వెల్త్ క్రీడలకు మరింత మెరుగ్గా సన్నద్ధమయ్యేందుకు ఉపయోగపడుతుంది" అని రాహుల్ అన్నాడు.

## సంప్రదాయం వీడి..

**దిల్లీ:** మెగా క్రీడల ఆరంభోత్సవ వేడుకల్లో భారత మహిళా క్రీడాకారులు సంప్రదాయ దుస్తుల్లో మార్చ్‌పాస్ట్‌లో పాల్గొనడం ఆనవాయితీ. సాధారణంగా వారు చీరల్లో దర్శనమిస్తారు. గత కామన్వెల్త్ క్రీడలు, ఒలింపిక్స్ ప్రారంభ కార్యక్రమాల్లో చీరలే ధరించారు. ఐతే ఏప్రిల్‌లో ఆస్ట్రేలియా (గోల్డ్‌కోస్ట్)లో ఆరంభం కానున్న కామన్వెల్త్ క్రీడల్లో భారత మహిళా క్రీడాకారులు బ్లేజర్, ట్రౌజర్లు వేసుకుని మార్చ్‌పాస్ట్‌లో పాల్గొంటారు. అథ్లెట్ల ప్రతినిధులతో చర్చించాకే ఈ నిర్ణయం తీసుకున్నామని భారత ఒలింపిక్ సంఘం తెలిపింది.

## ఉగ్రవాదుల ఎంపిక కేంద్రంగా శ్రీనగర్ సెంట్రల్ జైలు

- అక్కడి నుంచి అంగీకారం వస్తేనే తీవ్రవాదిగా నియామకం
- జమ్మూకశ్మీరు సీఐడీ నివేదిక వెల్లడి

**శ్రీనగర్:** శ్రీనగర్ సెంట్రల్ జైలు తీవ్రవాదుల ఎంపిక కేంద్రంగా మారిపోయిందని, అక్కడ సమాంతర పరిపాలన సాగుతోందని జమ్మూకశ్మీరు సీఐడీ తయారుచేసిన నివేదిక వెల్లడించింది. జైలు అధికారులు వివరాలు వెల్లడిస్తున్నా స్థానిక పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొంది. కొత్తగా ఒక వ్యక్తిని ఉగ్రవాదిగా చేర్చుకోవాలో, వద్దో నిర్ణయించాలంటే సెంట్రల్ జైలు నుంచి అనుమతి ఉండాల్సిందేనని విశ్వసనీయవర్గాలను ఉటంకిస్తూ నివేదిక స్పష్టం చేసింది. ఆ అంగీకారం ఎవరి నుంచి వస్తుందో ఇంకా నిర్ధారించుకోవాల్సి ఉందని తెలిపింది. రాష్ట్ర నేరాల దర్యాప్తుశాఖ ఐజీ ఎ.జి.మిర్ రూపొందించిన ఈ నివేదికను డీజీపీ ఎస్.పి.వైద్ గత ఏడాది కేంద్ర హోంశాఖ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ గోయల్‌కు పంపించారు. జైలుపై గట్టి నిఘా ఉండాలని ఆయన సూచించారు. ఆరునెలలుగా తమను తాము 'షురా' అనే సంప్రదింపుల మండలిగా ప్రకటించుకున్న కొంతమంది ఖైదీలు 'అమీర్-ఇ-జిందాన్' అనే అధ్యక్షుడిని నియమించుకున్నారు. సమాంతర పరిపాలన వ్యవస్థను నడిపిస్తున్నారు.

### హోంశాఖ, డీజీపీలకు తెలిసినా పట్టించుకోవడం లేదు

జైల్లో వ్యవస్థ సవ్యంగా లేదని ఎంతోకాలంగా చెబుతున్నా పట్టించుకోలేదని జైళ్లశాఖ మాజీ సంచాలకుడు ఎస్.కె.మిశ్ర వాపోయారు. ప్రస్తుతం ఆయన ప్రస్తుతం జమ్మూకశ్మీరు పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ సీఎండీగా పనిచేస్తున్నారు. జైళ్లశాఖ సమస్యలేమిటో హోంశాఖ, డీజీపీలకు తెలుసన్నారు.

జైల్లో తనిఖీలు జరపాలని హోంశాఖతో పాటు కశ్మీరు మాజీ ఐజీ మునీర్ ఖాన్, డీఐజీలకు పలుమార్లు సూచించినా పెడచెవిన పెట్టారని ఆరోపించారు. ఖైదీలను వేర్వేరుగా ఉంచడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కూడా జైల్లో లేవని కేంద్ర హోంశాఖ ప్రధాన కార్యదర్శికి మిశ్ర తెలిపారు. కేవలం ఐదు నుంచి 20 మంది భద్రతాసిబ్బంది 300 మంది ఖైదీలను అణిచివేయగలరని ఆశించలేమన్నారు. సిబ్బందిని ఉగ్రవాదులు బెదిరిస్తున్నారని చెప్పారు.

## చిట్‌ఫండ్స్ చట్ట సవరణకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం

- అక్రమ డిపాజిట్ల నిషేధానికీ బిల్లు

**దిల్లీ:** చిట్‌ఫండ్స్ రంగంలో క్రమబద్ధమైన వృద్ధికి అవకాశం కల్పించేందుకు సంబంధిత చట్టంలో సవరణలకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. చిట్ ఫండ్స్ (సవరణ) బిల్లు- 2018ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్రమంత్రివర్గ సమావేశం సమ్మతించినట్లు ఒక అధికారిక ప్రకటన తెలియజేసింది. చిట్‌ఫండ్స్ పరిశ్రమ ఎదుర్కొంటున్న అవరోధాలను తొలగించేందుకు సవరణలు ఉపకరిస్తాయి. ఫలితంగా మదుపుదారులకు ఇతర ఆర్థిక ఉత్పత్తులు ఎక్కువగా అందుబాటులోకి రావడానికి వీలవుతుంది. చట్టంలో 'ఫ్రాటర్నటీ ఫండ్' అన్న పదాన్ని వాడడం సవరణల్లో ఒకటి. ఈ పేరును వాడడం వల్ల చిట్ వ్యాపార స్వభావం... 'ప్రైజ్ చిట్స్'కు భిన్నం అని స్పష్టం చేయడానికి వీలవుతుంది. 'ప్రైజ్ చిట్స్'ను మరో చట్టం ద్వారా నిషేధించారు. చిట్ చివరి దశలో చిట్ సభ్యులు స్వయంగా హాజరుకావడం తేలికకాదు కాబట్టి వారు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనడానికీ సవరణ బిల్లు అవకాశం కల్పిస్తోంది. ఇందుకు కనీసం ఇద్దరు సభ్యులుండాలి. ఫోర్‌మన్ సరిగా రికార్డు చేయాలి. ఫోర్‌మన్ కమీషన్ గరిష్ఠ పరిమితి ప్రస్తుతం 5శాతంగా ఉండగా దాన్ని 7శాతానికి పెంచాలని సవరణ బిల్లు ప్రతిపాదిస్తోంది. 1982 నాటి చట్టం ప్రకారం.. చిట్‌ఫండ్ సమష్టి మొత్తం విలువ రూ. 100, అంతకన్నా తక్కువ ఉంటే చట్టంలోని నిబంధనల నుంచి మినహాయింపు ఉంటుంది. ఈ పరిమితి ప్రస్తుత కాలానికి తగ్గట్లు లేకపోవడంతో తొలగించాలని ప్రతిపాదించారు. ఈ పరిమితిని నిర్ణయించేందుకు, ఎప్పటికప్పుడు పెంచేందుకు రాష్ట్రప్రభుత్వాలను అనుమతించాలని నిర్ణయించారు.

★ అక్రమ డిపాజిట్ పథకాలను నిషేధిస్తూ బిల్లు తీసుకురానున్నట్లు ప్రభుత్వం మంగళవారం వెల్లడించింది. సంబంధిత బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్రమంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది.

★ ప్రభుత్వ ప్రాధాన్య పథకమైన ప్రధాన మంత్రి ఆవాస్ యోజనకు బడ్జెట్ కేటాయింపులకన్నా అదనంగా ఆర్థిక మద్దతునిచ్చేందుకు ఆమోదం. 2018-19 బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.6,505 కోట్లు కేటాయించారు. వాటికి అదనంగా రూ.25వేల కోట్లు సమీకరించాలని ప్రతిపాదించారు.

★ ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, బిహార్, ఒడిశాలో రైల్వే కొత్త లైన్ల ఏర్పాటుకు, డబ్లింగ్ పనులకు, విద్యుద్దీకరణకు ఉద్దేశించిన ఆరు ప్రాజెక్టులకు ఆమోదం. ఇందుకు అయ్యే వ్యయం రూ.11,661 కోట్లు. ఇందులో ఒడిశాలోని నక్సల్స్ ప్రభావిత మల్కాన్‌గిరికి 2022 నాటికి తొలి రైల్వే లైన్ రానుంది. జేపోర్-మల్కానగిరి మధ్య 130 కి.మీ.పొడవున ఏర్పాటు చేయనున్న ప్రాజెక్టుకు రూ.2676.11 కోట్ల వ్యయం అవుతుంది.

### కామన్‌వెల్త్ యువ అవార్డుల జాబితాలో భారతీయులు

- ఏప్రిల్‌లో అంతిమ విజేతల ప్రకటన

**దిల్లీ:** కామన్‌వెల్త్ యువ అవార్డులు-2018 కోసం 20 మందితో రూపొందించిన అంతిమ జాబితాలో ఇద్దరు భారతీయులు చోటు దక్కించుకున్నారు. వీరిద్దరూ లింగ సమానత్వం కోసం పాటుపడుతున్నవారే కావడం విశేషం. ఆసియా, ఐరోపా, ఆఫ్రికా, కరీబియన్, అమెరికా, పసిఫిక్‌ప్రాంతాలతో పాటు కామన్‌వెల్త్ దేశాల నుంచి వచ్చిన 400 దరఖాస్తులను వడపోసి అంతిమంగా 20 మందిని ఎంపిక చేశారు. ఏప్రిల్‌లో లండన్‌లో జరిగే కార్యక్రమంలో అంతిమంగా విజేతలను ఎంపిక చేస్తారు. తమ సృజనాత్మక ప్రాజెక్టుల ద్వారా ఆయా జాతుల్లో చెప్పుకోదగ్గ ప్రభావవంతమైన మార్పునకు కారణమయ్యే 15 నుంచి 29 ఏళ్ల యువతకు ఈ అవార్డులను ప్రదానం చేస్తారు. మన దేశం నుంచి మృణాళిని దయాళ్, యోగేష్‌కుమార్ ఎంపికయ్యారు. దిల్లీ కేంద్రంగా 'హైయ్యా' పేరిట ప్రచార కార్యక్రమం చేపట్టే సంస్థను మృణాళిని స్థాపించారు. అవివాహితులైన మహిళలకు లైంగిక ఆరోగ్య సేవలందించడానికి కృషి చేస్తున్నారు. 'ఈవెన్ కార్గో' పేరిట యోగేశ్‌కుమార్ ఓ సామాజిక కంపెనీని స్థాపించారు.

### ఆర్టీజీ విప్లవాత్మకం: కేంద్ర బృందం ప్రశంస

**ఈనాడు డిజిటల్, అమరావతి:** ఏపీలో అమలు చేస్తున్న వాస్తవిక సమాచార పరిపాలన వ్యవస్థ (రియల్ టైం గవర్నెన్స్-ఆర్టీజీ) విప్లవాత్మకమైందని కేంద్ర మానవ వనరుల శిక్షణ అనుబంధ సంస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్రటేరియల్ ట్రెయినింగ్ అండ్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు ప్రశంసించారు. బాపట్ల మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న వీరు మంగళవారం సచివాలయంలోని ఆర్టీజీని సందర్శించారు. దాని ద్వారా పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని పర్యవేక్షించడం సుపరిపాలనకు నిదర్శనమన్నారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ) విప్లవంలో ఇదో అద్భుతమన్నారు. పరిపాలనలో పారదర్శకత ద్వారా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై 85శాతం సంతృప్తి సాధించడం తమ లక్ష్యమని, ఆర్టీజీ ద్వారా నిరంతర పర్యవేక్షణతో ఉత్తమ పరిపాలన అందిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

### ప్రముఖ హృద్రోగ నిపుణుడు బి.కె.గోయల్ కన్నుమూత

**ముంబయి:** ప్రఖ్యాత హృద్రోగ నిపుణుడు, పద్మ పురస్కారాల గ్రహీత డాక్టర్ బి.కె.గోయల్ (82) మంగళవారం ఉదయం గుండెపోటుతో కన్నుమూశారు. దక్షిణ ముంబయిలోని తన నివాసంలో ఆయన తీవ్ర అస్వస్థతకు గురికావడంతో హుటాహుటిన బ్రీంచ్‌కాండీ ఆసుపత్రికి తరలించగా.. అనంతరం మృతి చెందినట్లు ఆయన సహచర వైద్య నిపుణుడు డాక్టర్ అనిల్ శర్మ తెలిపారు. పద్మశ్రీ, పద్మ భూషణ్, పద్మ విభూషణ్ పురస్కారాలు అందుకున్న డాక్టర్ గోయల్ బాంబే వైద్య విజ్ఞాన సంస్థ చీఫ్ కార్డియాలజిస్టు, గౌరవ డీన్‌గా పనిచేశారు. అలాగే ముంబయిలోని గ్రాంట్ వైద్య కళాశాల, జేజే గ్రూప్ ఆసుపత్రుల్లో సేవలందించారు.

### ఉత్తరాదిలో తొలి మహిళా రైల్వేస్టేషన్

**జైపుర్:** రాజస్థాన్‌లోని ఓ రైల్వేస్టేషన్ నిర్వహణను పూర్తిగా మహిళా ఉద్యోగులకే రైల్వే అప్పగించింది. జైపుర్‌లోని గాంధీనగర్ రైల్వేస్టేషన్‌లో పోర్టర్ మొదలుకొని స్టేషన్ మాస్టర్ వరకు.. మొత్తం 40 మంది సిబ్బంది స్త్రీలే. దేశంలోనే పూర్తిగా మహిళా సిబ్బందితో నడుస్తున్న రెండో స్టేషన్‌గా.. ఇది ఘనత సాధించింది. సోమవారం నుంచే పూర్తిగా మహిళా ఉద్యోగులతో ఈ స్టేషన్ కార్యకలాపాలు ప్రారంభించింది. ముంబయిలోని మాటుంగా స్టేషన్.. దేశంలోనే తొలి మహిళా రైల్వేస్టేషన్.

### అగ్ని-2 పరీక్ష విజయవంతం

**బాలాసోర్:** అణ్వస్త్ర సామర్థ్యమున్న మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణి అగ్ని-2ను భారత్ మంగళవారం విజయవంతంగా పరీక్షించింది. 2వేల కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగల ఈ అస్త్రాన్ని ఒడిశా తీరానికి చేరువలోని అబ్దుల్ కలాం దీవిలోని సమీకృత పరీక్ష వేదిక (ఐటీఆర్) నుంచి ఉదయం 8.38 గంటలకు ప్రయోగించారు. ఈ క్షిపణి ఇప్పటికే సైన్యం అమ్ములపొదిలో చేరింది. సైన్యంలోని వ్యూహాత్మక దళాల విభాగం దీన్ని నిర్వహిస్తోంది. శిక్షణ అభ్యాసంలో భాగంగా తాజా పరీక్షను చేపట్టారు. అగ్ని-2లో అధునాతన దిక్సూచి వ్యవస్థ ఉంది.

# దిల్లీ సీఎస్‌పై ఆప్ ఎమ్మెల్యేల దాడి!

- సీఎం కేజ్రీవాల్ సమక్షంలోనే ఘటన
- నివేదిక కోరిన రాజ్‌నాథ్
- దాడి అవాస్తవమన్న ఆప్




లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్‌ను కలిసి వస్తున్న దిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్షుప్రకాశ్ ★ దాడిని వ్యతిరేకిస్తూ రాజ్‌ఘాట్‌లో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న ఐఏఎస్ అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు

**దిల్లీ:** ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) మరో వివాదంలో చిక్కుకుంది. ఆ పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు తనపై చేయిచేసుకున్నట్లు దిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) అన్షు ప్రకాశ్ ఆరోపించడంతో నగరంలో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. ఈ ఘటన స్వయంగా ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా సమక్షంలో సీఎం నివాసంలో చోటుచేసుకున్నట్లు చెప్పారు. దాడి ఆరోపణలు నిరాధారమని సీఎం కార్యాలయం ఖండించింది.

సీఎస్ ఫిర్యాదుపై దిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. ఆప్ ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్ తదితరులపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్.. దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్ నుంచి నివేదికను కోరారు. మంగళవారం రోజంతా ఆప్ ప్రభుత్వానికి, బ్యూరోక్రాట్ల మధ్య విమర్శలు, ప్రతి విమర్శల యుద్ధం సాగింది.

మంగళవారం ఐఏఎస్; దిల్లీ, అండమాన్ అండ్ నికోబార్ ఐలాండ్స్ సివిల్ సర్వీస్ (డీఏఎన్ఐసీఎస్), దిల్లీ సబార్డినేట్ సర్వీసు సంఘాల ప్రతినిధులు కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను, లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలిసి, ఈ ఘటనపై నిరసన తెలిపారు. నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై క్షమాపణ చెప్పేవరకూ కేజ్రీవాల్, ఆయన క్యాబినెట్ సహచరుల సమావేశాలను బహిష్కరిస్తామని మూడు సంఘాలు స్పష్టంచేశాయి.

**పిడిగుద్దులు..:** తనపై జరిగిన దాడికి సంబంధించి ఉత్తర మండలం డీసీపీకి సీఎస్ ఫిర్యాదు చేశారు. అందులోని అంశాల ప్రకారం.. "సోమవారం రాత్రి దిల్లీ ముఖ్యమంత్రి నివాసంలోని క్యాంప్ కార్యాలయానికి వెళ్లా. అక్కడ కేజ్రీవాల్, సిసోడియా, 11 మంది ఆప్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒక ఎమ్మెల్యే.. గది తలుపును మూసేశారు. సోఫాపై ఖాన్‌కు, మరో ఎమ్మెల్యేకు మధ్యలో నన్ను కూర్చోబెట్టారు. ఆప్ ప్రభుత్వం సాధించిన విజయాలపై టీవీ ప్రకటనలు విడుదల చేయకుంటే నన్ను తప్పుడు కేసుల్లో ఇరికిస్తామని ఎమ్మెల్యేలు బెదిరించారు. నా పక్కనే కూర్చున్న మరో ఎమ్మెల్యే.. ముఖంమీద పిడిగుద్దులు గుద్దారు. నా కళ్లద్దాలు కూడా కిందపడ్డాయి" అని పేర్కొన్నారు. ముందస్తు ప్రణాళికతోనే తనపై ఈ దాడి చేశారని ఆరోపించారు. సీఎస్ ఫిర్యాదుపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

**అది నిజం కాదు..:** అయితే రేషన్ సరకుల పంపిణీ అంశంపై చర్చించడానికే ప్రకాశ్‌ను ముఖ్యమంత్రి పిలిపించారని ఆమ్ ఆద్మీ పార్టీ పేర్కొంది. టీవీ ప్రకటనల అంశంపై ఈ సమావేశం జరిగిందనడం అవాస్తవమంది. ఆధార్ అమలులో లోపాల వల్ల గత నెలలో 2.5 లక్షల కుటుంబాలకు రేషన్ సరకులు దక్కలేదని తెలిపింది. ఈ అంశంపై పార్టీ ఎమ్మెల్యేలకు.. ప్రజల నుంచి తీవ్ర ఒత్తిడి ఎదురవుతోందని వివరించింది. "ఈ ప్రశ్నలకు బదులిచ్చేందుకు సీఎస్ నిరాకరించారు. ఎమ్మెల్యేలు, సీఎంకు తాను జవాబుదారును కానన్నారు. లెఫ్టినెంట్ గవర్నర్‌కే సమాధానం చెబుతానన్నారు. ఎమ్మెల్యేలను దుర్భాషలాడుతూ వెళ్లిపోయారు" అని ఆరోపించింది.

మరోవైపు సచివాలయంలో లిఫ్ట్ కోసం ఎదురుచూస్తున్న తనను ప్రభుత్వ ఉద్యోగులు అటకాయించారని దిల్లీ మంత్రి ఇమ్రాన్ హుస్సేన్ ఫిర్యాదు చేశారు. దీనిపై కూడా పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. రెండు కేసులపై దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యేల దురుసు చర్యకు బాధ్యత వహిస్తూ కేజ్రీవాల్ రాజీనామా చేయాలని భాజపా దిల్లీ విభాగం అధ్యక్షుడు మనోజ్ తివారీ డిమాండ్ చేశారు. ఇది 'పట్టణ ప్రాంత నక్సలిజం చర్య' అని ఆయన అభివర్ణించారు. ఇది పాలన, రాజ్యాంగపరమైన సంక్షోభమని దిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ మాకెన్ అభివర్ణించారు.

## రైతుల సాధికారతకు కృషి

- వ్యవసాయ రంగం తీరుతెన్నులు మారుస్తున్నాం: ప్రధాని మోదీ



మంగళవారం దిల్లీలో 'రైతుల ఆదాయం రెట్టింపు'పై జరిగిన సదస్సులో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

**దిల్లీ:** సంప్రదాయ సాగు విధానాల నుంచి బయటపడడానికి ప్రత్యేక కృషి జరగాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. రైతుల సాధికారతకు కృషి చేస్తున్నామని చెప్పారు. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ప్రత్యేక గోష్ఠులు నిర్వహించాలని సూచించారు. రైతుల ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేయడంపై నిర్వహించిన సదస్సును ఉద్దేశించి ప్రధాని మంగళవారం ప్రసంగించారు. రెండు రోజుల పాటు జరిగిన సదస్సు ద్వారా అందిన సూచనలను ప్రభుత్వం అమలు చేస్తుందని ప్రధాని చెప్పారు. వ్యవసాయ-మార్కెటింగ్‌ను ఉమ్మడి జాబితాలో చేర్చడం, భూమి రికార్డులను డిజిటలైజ్ చేయడం, వ్యవసాయ వ్యర్థాల నుంచి తయారు చేసే ఉత్పత్తులపై వస్తు, సేవల పన్నును తగ్గించడం, గ్రామీణ వ్యాపార కూడళ్లను ఏర్పాటు చేయడం, వ్యవసాయ-అంకురపరిశ్రమల ఏర్పాటు, అగ్రిటెక్ పార్కుల ఏర్పాటు తదితర సూచనలు వచ్చాయి.

వ్యవసాయ రంగం తీరుతెన్నులను ప్రభుత్వం మారుస్తోందని, రైతులకు సాధికారికత కల్పించేలా కొత్త సంస్కృతిని తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని ప్రధాని చెప్పారు. సాగు ఖర్చుల తగ్గింపు, వ్యవసాయోత్పత్తులకు సముచిత ధర, వృథా అరికట్టడం, ఆదాయానికి ప్రత్యామ్నాయ వనరులను సృష్టించడం- ఈ నాలుగు కీలక అంశాలపై దృష్టి పెడుతున్నట్లు తెలిపారు.

మొత్తం వ్యవసాయ రంగంలో మార్పులకు తీసుకున్న చర్యలను వివరించారు. వేప పూత పూసిన యూరియా వల్ల ఈ ఎరువు సామర్థ్యం పెరిగి, ఉత్పాదకత పెరిగిందన్నారు. భూసార పరీక్షా కార్డులతోనూ ఉత్పాదకత పెరిగిందని, ఈ పథకం వల్ల రసాయన ఎరువుల వాడకం తగ్గిందని తెలిపారు.

2-3దశాబ్దాలుగా నిలిచిపోయిన 99 సాగునీటి పథకాలను నిర్ధారిత గడువులోపు పూర్తి చేస్తామని, ఇందుకోసం రూ.80వేల కోట్లు కేటాయించామని ప్రధాని చెప్పారు. వీటిల్లో సగం పథకాలను ఈ ఏడాది చివరినాటికే పూర్తి చేస్తామన్నారు. మిగిలిన వాటిని వచ్చే ఏడాదిలో పూర్తి చేస్తామన్నారు. రైతుల సంక్షేమం కోసం ఇటీవల బడ్జెట్‌లో ప్రకటించిన పథకాలను ప్రధాని వివరించారు.

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్ సింగ్, ఆహార శాఖ మంత్రి రామ్‌విలాస్ పాసవాన్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఎంపీల వేతనాలకు స్వతంత్ర వ్యవస్థ ఏర్పాటుపై మీ వైఖరేంటి?

- కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీం కోర్టు

**దిల్లీ:** ఎంపీల వేతనాలు, భత్యాలను నిర్ణయించడానికి ఒక స్వతంత్ర వ్యవస్థను ఏర్పాటు చేసే అంశంపై ప్రభుత్వం తన వైఖరిని స్పష్టంచేయాలని సుప్రీం కోర్టు మంగళవారం ఆదేశించింది. ఈ అంశం పరిశీలనలో ఉందని, తన వైఖరిని స్పష్టంచేయడానికి మరికొంత సమయం కావాలని ప్రభుత్వం అడిగింది.

ప్రస్తుతం ఎంపీలు తమంతట తామే తమ వేతనాలను నిర్ణయించుకుంటున్నారు. దీన్ని ప్రశ్నిస్తూ లోక్ ప్రహరి అనే స్వచ్ఛంద సంస్థ ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ జాస్తి చలమేశ్వర్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఎంపీల పింఛను, ఇతర భత్యాలను రద్దు చేయాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశారు. పిటిషనర్ లేవనెత్తిన అంశాలను పరిశీలిస్తామని ధర్మాసనం స్పష్టంచేసింది. సర్కారు నుంచి నిర్దిష్ట సూచనలు పొందడానికి కొంత సమయం ఇవ్వాలని ప్రభుత్వం తరపు న్యాయవాది అజిత్ కుమార్ సిన్హా కోరారు. ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ నాయకులతోపాటు వారి జీవిత భాగస్వాములు, వారిపై ఆధారపడినవారు కూడా తమ ఆస్తుల వివరాలతోపాటు ఆదాయ వనరును ప్రకటించాలని ఈ నెల 16న సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పును ధర్మాసనం ప్రస్తావించింది. "కోర్టు ముందున్న విజ్ఞప్తి.. విధానానికి సంబంధించిందని, దానిపై నిర్ణయం తీసుకోవాల్సింది పార్లమెంటేనని, న్యాయస్థానాలు కాదని ప్రభుత్వం తన వైఖరిని వెల్లడించింది. అయితే ఆ తీర్పు వచ్చాక.. ఏ రాజకీయ పార్టీ కూడా దాన్ని వ్యతిరేకించినట్లు వార్తలు రాలేదు" అని జస్టిస్ చలమేశ్వర్ వ్యాఖ్యానించారు.

### మే 31కి జాతీయ పౌరుల జాబితా పూర్తవ్వాల్సిందే

మే 31నాటికి ఎట్టిపరిస్థితుల్లోనూ అసోంలోని జాతీయ పౌరుల జాబితా(ఎన్ఆర్సీ)ను ముద్రించాల్సిందేనని, ఒక్క రోజు ఎక్కువైనా అంగీకరించబోమని సుప్రీం కోర్టు పేర్కొంది. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు ఉన్నాయని, మరేదో కారణం చెప్పి జాప్యం చేస్తామంటే కుదరదని స్పష్టం చేసింది. కాలవ్యవధిని మీరు పెంచుకుంటూ పోతే, మేం తగ్గించుకుంటూ వస్తామని హెచ్చరించింది. గడువు తేదీని జులై 31కు పెంచాలన్న కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల వినతిని జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఆర్.ఎఫ్.నారిమన్‌తో కూడిన ధర్మాసనం మన్నించలేదు. అసోంలో ఉన్న కోట్ల మందికి సంబంధించిన జాబితాను రూపొందించి, అక్రమంగా వలస వచ్చినవారిని ఏరివేయడానికి ఎన్ఆర్సీని రూపొందిస్తున్నారు.

**ప్రియా వారియర్ వ్యాజ్యంపై నేడు విచారణ:** మలయాళ నటి ప్రియాప్రకాశ్ వారియర్ దాఖలు చేసిన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు బుధవారం విచారణ చేపట్టనుంది. తాను నటించిన 'ఒరు అదుర్ లవ్' చిత్రంలో ఓ పాటపై - తెలంగాణలో తనపైన, దర్శకుడిపైన దాఖలైన కేసును కొట్టివేయాలని.. ఇతర రాష్ట్రాల్లో క్రిమినల్ చర్యలు చేపట్టకుండా ఆదేశాలివ్వాలని కోరుతూ ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

## మానవ మృగాల రాక్షసత్వం!

- గిరిజన యువతిపై పాశవిక అత్యాచారం
- పశ్చిమబెంగాల్‌లో మరో నిర్భయ ఘటన

**కోల్‌కతా:** నిర్భయ ఘటనను తలపించే మరో దారుణం.. మతిస్థిమితం సరిగాలేని ఓ గిరిజన యువతి(27)పై మానవమృగాల రాక్షసత్వం.. కొందరు వ్యక్తులు ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడి, హింసించి.. ఆమె రహస్య భాగాలను ఛిద్రం చేశారు. పశ్చిమబెంగాల్‌లోని దక్షిణ దినాజ్‌పూర్ జిల్లాలో ఈ అకృత్యం వెలుగులోకి వచ్చింది. అత్యంత విషమ పరిస్థితుల్లో బాధితురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్పీ ప్రసూన్ బందోపాధ్యాయ్ తెలిపారు. బిహార్‌కు చెందిన ఆమె.. తన తల్లిదండ్రులు మృతిచెందగా, అత్తింటివారు గెంటివేయడంతో దక్షిణ దీనాజ్‌పూర్ జిల్లాలోని ఓ గ్రామానికి వచ్చి ఒంటరిగా నివాసం ఉంటోంది. మానసిక స్థితి సరిగా లేకపోవడంతో గ్రామస్థుల సహకారంతో ఆమె జీవనం సాగిస్తోంది. ఆదివారం సాయంత్రం సమీపంలోని ఓ గ్రామంలో ఉత్సవానికి వెళ్లిన ఆమెను కొందరు వ్యక్తులు బలవంతంగా తీసుకెళ్లి.. ఓ వంతెన కింద అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె రహస్య అవయవాల్లోకి ఇనుప కడ్డీ, చేతులు చొప్పించి అత్యంత పాశవికంగా ప్రవర్తించారు. అచేతన స్థితిలో పడివున్న ఆమెను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బాధితురాలిని తొలుత రాయ్‌గంజ్ ఆసుపత్రికి, అనంతరం మాల్డా వైద్య కళాశాలకు తరలించారు. ఆమెపై పలుమార్లు అత్యాచారం జరిగిందని.. ఆమె శరీరంలో లోహపు వస్తువులున్నట్లు వైద్యులు వెల్లడించారు. వెంటనే శస్త్రచికిత్స జరిపేందుకు ఆమె శారీరక పరిస్థితి అనుకూలంగా లేదని, ప్రస్తుతానికి ప్రాణాలు కాపాడే మందులు అందిస్తున్నట్లు మాల్డా వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తెలిపారు. కాగా అన్ని కోణాల్లో దర్యాప్తు జరుగుతోందని.. దోషులను ఎంతమాత్రం ఉపేక్షించేది లేదని ఎస్పీ స్పష్టం చేశారు.

**స్థానికుల ఆగ్రహం:** ముఖ్యమంత్రి మమత బెనర్జీ మంగళ, బుధవారాల్లో మాల్డా, రాయ్‌గంజ్ జిల్లాలో పర్యటిస్తున్నారు. దీంతో భద్రత ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు ఈ ఘటనను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీపీఎం సహా ప్రతిపక్షాలు ఈ ఘటనను ఖండించాయి. పోలీసులు ఈ ఘటనను కప్పిపుచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆదివాసీ కల్యాణ్ మంచ్‌కు చెందిన బుధాన్ హేమ్‌బ్రామ్ ఆరోపించారు.

### సిరియాలో కొనసాగుతున్న వైమానిక దాడులు

- మూడు రోజుల్లో 194 మంది పౌరులు బలి

**అర్బిన్:** పౌరుల ప్రాణాలను లెక్కచేయకుండా.. సిరియా ప్రభుత్వం వైమానిక దాడులను కొనసాగిస్తోంది. దేశంలోని తూర్పు ఘౌటా ప్రాంతంలో మంగళవారమూ బాంబుల వర్షం కురిపించింది. గత మూడు రోజులుగా జరుగుతున్న ఈ దాడుల్లో.. 57 మంది చిన్నారులు సహా 194 మంది పౌరులు మరణించినట్లు సిరియా మానవ హక్కుల సంస్థ తెలిపింది. సోమవారమే 127 మంది మృత్యువాతపడ్డారు. గత నాలుగేళ్లలోనే ఒకే రోజు తూర్పు ఘౌటాలో ఇంత ప్రాణ నష్టం ఎప్పుడూ జరగలేదు. మంగళవారం జరిగిన దాడుల్లో.. 13 మంది బాలలు సహా దాదాపు 50 మంది పౌరులు మృతి చెందారు. 2012 నుంచి తూర్పు ఘౌటా తిరుగుబాటుదారుల ఆధీనంలో ఉంది.



Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00